C

ఆదర్శాలు అనుమానాలు

1924
AD



894.827
Y41

లింగం వీరభద్రయ్య చౌదరి

Blank Page

ఆదర్శాలు -

అనుమానాలు



లింగం వీరభద్రయ్య చౌదరి

ప్రథమ ముద్రణ : మార్చి 1976

స్వామ్యములు గ్రంథకర్తవి

ముద్రణ : త్రివేణి ప్రెస్, మచిలీపట్నం - 1

మూల్యము : 6 రూపాయలు

Sole Distributors :

త్రివేణి పబ్లిషర్సు

మచిలీపట్టణము - 1

Blank Page

IV



శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు

కృతి భర్త

అంకితం

సహాధ్యాయి, ఆబాల్యమిత్రుడు, బహుగ్రంథకర్త,

సాధుస్వభావుడు, సజ్జనవర్తనుడు

పండిత

శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారికి

ఆప్యాయతతో

— లింగం వీరభద్రయ్య చౌదరి

1-3-1976

Blank Page



లింగం వీరభద్రయ్య చౌదరి

గ్రంథకర్త

(మార్చి 1975)

Blank Page

విషయసూచిక

		పుటలు
	ప్రస్తావన	
1.	కీ. శే. శ్రీమతి భారతీదేవిగారు	1 — 3
2.	సహధర్మచారిణి	3 — 5
3.	ఉత్తమ ఇల్లాలు	5 — 9
4.	వజ్రాల హారం	9 —13
5.	ఆ తండ్రి - ఈ కొడుకు	13—16
6.	పోరపాటు - తప్పిదము	16—18
7.	భార్యాభర్తలు	18—22
8.	వృద్ధాప్యం	23—27
9.	కృతజ్ఞత	27—31
10.	నా ఇంట్లో నేను దొంగనైపోయాను	31—35
11.	ఇట్టిది సంస్కారమా ?	35—36
12.	ప్రపంచ తెలుగు సభలు	37—43
13.	స్వేచ్ఛా స్వాతంత్ర్యాల మూల్యమెంత ?	43—51
14.	వర్ణాంతర వివాహం	51—54
15.	కవిరాజు సాహిత్య విహారం	55—58
16.	ఆర్యులు - అనార్యులు	58—59
17.	అబలకాదు, సబల	59—64
18.	జననీ జనకులు	64—65
19.	లలితకళలు	65—66
20.	దేవుడు	66—72
21.	కులం, వర్గం ఒక్కటేనా ?	72—75
22.	గతిలేక వ్యవసాయం	75—80
23.	పల్లెటూరి పితలాటం	80—82

Blank Page

ప్రస్తావన

ఈ చిన్న పుస్తకానికి ఉపోద్ఘాతం లేక పీఠిక అనవసర మనిపిస్తున్నది. 1974 మార్చిలో నేను 1250 పేజీలుగల నా "స్వవిషయం" మూడవభాగం పూర్తిచేసినప్పుడు, ఇంకను వ్రాయటాని కవకాశముంటుందని అనుకోలేదు. అప్పటికే నాకు 76 సంవత్సరాలు నిండవచ్చుచున్నవి. వృద్ధాప్యంవల్ల, అనారోగ్యం వల్ల నా జీవితం క్షీణదశలో పడింది. కాని ఈశ్వరేచ్ఛవల్ల, శ్రీ షిరిడీ సాయిబాబా కరుణవల్ల కొంతతగ్గు స్థాయిలోనైనా, జీవితం ఇప్పటికినీ కొనసాగుచున్నది. అవీ ఇవీ పుస్తకాలు కొంటున్నాను. వానిని కొంతవరకైనా చదువుచున్నాను. అయితే ఎక్కువసేపు చదువలేకపోవుచున్నాను. విసుగెత్తి, ఏదైనా వ్రాస్తే విసుగు తగ్గిపోతుందనే ఊహకులోనౌచున్నాను. పైగా, విశ్రాంతిగా కూర్చున్నప్పుడు, పడుకున్నప్పుడు, పుస్తకాల్లోని విషయాలు, రేడియోలో వినిన సంగతులు గుర్తుకు, మననానికి వస్తుంటవి. ఆలోచనలు రగుల్తుంటవి. ఊహలు రేకెత్తుచుంటవి. భావవికాసం కల్గుచుంటుంది. అందువల్ల ఏవో గిల్కటం జరిగింది. ఆ గిల్కినవే ఇందులోని రచనలు. గొప్పగా చెప్పుకోవలసినవికావు.

అయినా, సామాన్యపాఠకులు కొందరికైనా నచ్చవచ్చును. కథావస్తువులు చాలావరకు హెచ్చుస్థాయిలోనివి కాకపోయినా, భావపటిమ తక్కువైనా, ప్రబోధాలు, ధార్మికచింతనలు, సాంఘికప్రయోజనాలు లేకపోయినా, ఉబుసుపోకకు చదివే సామాన్యపాఠకులకు కొంతకాలక్షేపానికైనా ఉపకరించవచ్చని అభిప్రాయం కొంత, బొత్తిగా నీరసించిపోలేదని నాకు నేను ధైర్యం చెప్పుకొనుటకు ముఖ్యంగా, ఈ పుస్తకంలోని రచనలను, బహిర్గతం చేయించుచున్నాను.


పాఠకలోకం సానుభూతితో గ్రహించెదరు గాక!

దివితాలూకా, పెడపనగల్లు
కృష్ణాజిల్లా
1-3-1976

లింగం వీరభద్రయ్య చౌదరి

Blank Page

Blank Page



శ్రీమతి భారతీదేవి రంగాగారు

కీ. శే. శ్రీమతి భారతీదేవిగారు

శ్రీమతి భారతీదేవిగారిని మొదటిసారి 1924-వ సం. లో ఆక్స్‌ఫర్డ్‌లో చూచాను. రంగాగారు, శ్రీకృష్ణగారు, నేను 1920-'21 నుండి 1922 వరకు కలసి ఆక్స్‌ఫర్డ్ శివారు బాట్‌లేలో ఒక యింటిలో ఉండేవారం. 1923 లో రంగాగారు ఆర్థిక శాస్త్రంలో అత్యున్నతంగా పరీక్షలో నెగ్గి, పరిశోధన డిగ్రీ నిమిత్తం వస్తుసంచయం కొరకు ఇండియాకు వెళ్ళి, తిరిగి వస్తూ శ్రీమతి భారతీదేవిగారిని తీసుకొని వచ్చారు. ఆమెగారు కొంత కాలం ఆక్స్‌ఫర్డ్‌లోను, కొంతకాలం లండన్‌లోను ఉండేవారు. ఆకాలంలో వారి నప్పుడప్పుడు చూచుట తటస్థించింది. 1926 లో ఆచార్య సర్వేపల్లి రాధాకృష్ణగారు ఆక్స్‌ఫర్డ్‌లో అప్టన్ ఫౌండేషన్ ఉపన్యాసా లిచ్చినప్పుడు, అప్పు డాక్స్‌ఫర్డ్‌లో వున్న ఆంధ్ర విద్యార్థులం వారితో కలసి ఫోటో తీయించుకొన్నాం. ఆ ఫోటోలో శ్రీమతి భారతీదేవి ముఖ్యస్థానం అలంకరించారు. అప్పటి కింకను చిన్నవారైనా, అనుభవం తక్కువవారైనా ఆమె సహజ గంభీరం అందులో ప్రస్ఫుటమైనది. తర్వాత, 1927 ఫిబ్రవరిలో నేను స్వదేశానికి తిరిగి వచ్చినప్పుడు స్వాగత మివ్వటం, నేను వారి ఇంట 1928 లో మూడు మాసాలు అతిథిగా గడపటం జరిగాయి. తర్వాత అప్పుడప్పుడు కలుసు కోవటం, నా సంసారం చక్కబడటానికి నా భార్యకు సలహా లివ్వటం వంటి ఆత్మీయతలు పాటించారు. 1938 వేసవిలో నా పెద్ద కుమారుడు వారి మదనపల్లి వేసవి శైతుశిక్షణ కేంద్రంలో చేరినప్పుడు కన్నతల్లికంటె ఎక్కుడు ఆదరణతో, ప్రేమతో వానిని చూచి

వాని హృదయాన్ని చూరగొని మా కానందం కల్గించి మరింత దగ్గరైనారు. ఆ యువకుడు కొలది మాసములకే అకాలమృత్యువు వాత బడగా ఆమె కన్నతల్లివలె శోకవ్యథను పొంది మాకు కొంతకు గొంత ఊరట కల్గించారు. ఈవిధముగా శ్రీ రంగాయేగాక, శ్రీమతి భారతీదేవిగారు కూడా మాకు ఆప్తబాంధవులై మిక్కిలి దగ్గరకు వచ్చారు.

నేను ప్రభుత్వోద్యోగములో ప్రవేశించి ఆ రభసలో మున్గినాను ; వారు రాజకీయాలలో ప్రవేశించి తమ సర్వస్వమును ప్రజాసేవకు ఉపయోగించారు. అందువల్ల మేము తరుచు కలసి కొనలేదు. కాని, హృదయాలు కలసిన గాఢమిత్రుల మైనాము.

శ్రీమతి భారతీదేవిగారి విశిష్టత, ఆమె సమన్వయ సమపాళ్లో వ్యక్తిత్వం, ఆమె సహజ వివేకం ఆమె పాదాలు భూమిని విడిచి పైకెగర లేదు. ప్రపూర్ణదేశభక్తి, మానవసేవాపరత, కారుణ్య దృష్టి కలవారైనను, ఊహాజనిత ఆదర్శలోకంలో విహరించేవారు కాదు. ఇంగితజ్ఞత, లౌకికం, ఉచితానుచిత జ్ఞానం కలవారు. ఎవరితో నెట్లు మెలగవలెనో, ఎవరి నెట్లూదరించవలెనో, ఎవరి నెట్లు సముదాయించవలెనో బాగుగా ఎరిగి మెత్తగా, మర్యాదగా వ్యవహరించేవారు. అందుకనే వారి గ్రైతుశిక్షణ పాఠశాలలో తయారైన అసంఖ్యాక యువకులు వారిని మాతృమూర్తిగా పూజించేవారు. వారి దేశసేవ, ప్రజాసేవ జగమెరిగినవే.

ఈ కొద్దిపాటి ఆమె వ్యక్తిత్వ చిత్రణను ముగించేముందు ఒకటి రెండు విషయాలు చెప్పాలి. వారు ఆచార్య రంగాగారి సతీమణి కాకపోయినట్లయితే, తాను లండన్ స్లేడ్ చిత్రకళాశాలలో నేర్చుకొన్న చిత్రకళను అభివృద్ధి నొందించుకొని, ప్రఖ్యాత చిత్రకారిణి అయ్యేవారు. తన సహజ చాతుర్య వైదగ్ధ్య సంపదతో మంచి రచయిత్రిగా రూపొందేవారు. వారి కంఠధ్వని జిలుగు కల్గినది. మాధుర్యాన్ని వెదజల్లే గాయనిగా పేరుప్రతిష్ఠలు సంపాదించేవారు. రంగాగారి అదృష్టమంటూ వారి అర్ధాంగి

అయ్యారు. ఇంగ్లీషులో బెటర్ హాఫ్ అంటామే ఆ విధంగా పరిణమించారు, రంగాగారికి ధృవనక్షత్రమైనారు. వారి స్థాయికి పునాదులు గట్టిపరచారు, వారిని తీర్చి దిద్దే శేముషీధురంధరులైనారు.

వారు 64 సంవత్సరములు నిండుతూనే పరలోకప్రాప్తి చెందటం శ్రీ రంగాగారితోబాటు మన కందరికీ తీరరాని లోటు. వారు పుణ్యలోకంలో భగవత్సాన్నిధ్యం చేరుకొనియుందురు, వారి ఆత్మకు శాశ్వత శాంతి కల్లుగాక!

౨

సహధర్మచారిణి

శ్రీమతి భారతీదేవి రంగాగారు సిసలైన సహధర్మచారిణి. పల్లెటూరిపిల్లగా విద్యాగంధంలేని రైతు కుటుంబంలో పుట్టి, అప్పటి పద్ధతి ప్రకారం ఏదో కొద్దిగా చదివి, ఇంకను పిన్నవయస్సులోనే ఆచార్య రంగాగారి భార్య అయినారు. ఇతర కమ్మ కుటుంబాలలో వలెనే, తలిదండ్రులు ఏర్పాటుచేసిన దాంపత్యం వీరిది కూడా. అయినా, ఏదో విశిష్టత ఉండబట్టే, ఆ చిన్నతనంలో భర్త "నీవు నాతోకూడ ఇంగ్లండుకు రావలసిన" దనగా, వెంటనే బయలుదేరారు. "దూరదేశం, చలిదేశం, పైగా చదువు సరిగా రాదు, నే నెట్లు రాగలను?" అని సందేహంగాని, బెదురుగాని, భీతిగాని చూపలేదు. ఆయన తన భర్త, తన సర్వస్వం, ఆయన రమ్మంటున్నారు. అదే తన కర్తవ్యం, తన ధర్మం అనే నమ్మకంతో బయలుదేరారు. శ్రీమతి భారతీదేవిగారు సహజ ధీరులు. చురుకుదనం, ఇంగితజ్ఞత, విచక్షణ, విషయగ్రహణ, ఉత్సుకత గలవారే గాక, భర్తతోబాటే తనలోకం అనుకునేవారు. కాబట్టి మారు మాట్లాడక ఇంగ్లండుకు బయలుదేరారు. రంగాగారు ఆమె అలివేలు మంగమ్మ పేరును భారతీదేవిగా మార్చటంతోనే, ఆమె వ్యక్తిత్వం అకస్మాత్తుగా పెరిగిందేమో అన్నట్లు ఆమె నిజంగా రంగాగారి

జీవిత భాగస్వామిని అయినారు. శ్రీ రంగాగారి మాటలలో, చేతలలో తన కర్ధభాగం వున్నట్లు రూపొందారు. నిజమైన అర్ధాంగి అయినారు. వారి ధర్మాచరణలో సహధర్మచారిణి అయినారు.

నేను 1927 ఫిబ్రవరి 27-వ తేదీన స్వదేశానికి తిరిగివచ్చి మద్రాసు హార్బరులో కాలుపెట్టాను. అప్పుడు న న్నాహ్వానించిన కొలదిమందిలో శ్రీమతి భారతీదేవిగా రుండినారు. సోదరీ ప్రేమతో హాసవదనంతో, పూలగుచ్ఛముతో మొదట కుశలప్రశ్నలువేసి, స్వదేశానికి న న్నాహ్వానించారు. ఆ ఆప్యాయత, ఉత్సాహపూరిత స్వాగతం నా హృదయంలో హత్తుకొనిపోయినవి.

నాకు కొన్ని ఇబ్బందులు తటస్థించి, వారి అతిథిగా మూడు మాసాలైనా, వారి మద్రాసు నివాసగృహంలో గడిపాను. ఆకాలంలో వారు తల్లివలె న న్నాదరించి, నాకెట్టి లోటు లేకుండా కన్నబిడ్డను చూచుకొన్నట్లు జాగ్రత్తపడ్డారు. సహజంగా భోజన మజ్జనాదుల సమర్చటలో నేర్పుగలవారు. రంగాగారి పలువిధ వ్యాసంగాలపేర్లు చెప్పి, ఏదోనెపంగా వచ్చే అతిథి అభ్యాగతులకు మర్యాద మన్ననల చేయడం వారివిధిగా ఎంచుకునేవారు. వారి ఆర్ద్రహృదయం, సౌజన్యం, సహజ ఔదార్యం, వచ్చినవారికి తృప్తిగా భోజన మమర్చవలెననే సుస్వభావం, వారి కెట్టి శ్రమను కల్గించినా సరకుచేయనిచ్చేవి కావు.

ఆమె సంతరించుకొన్న వ్యక్తిత్వాన్ని, పెంపొందించుకొన్న ఔన్నత్యాన్ని మహామేధావి, తంత్రజ్ఞుడు, మూర్తీభవించిన లాకికుడు శ్రీ రాజాజీ, పాత్రికేయుడుగా, రచయితగా, విషయజ్ఞాన సంపన్నుడుగా, వ్యాఖ్యాన దక్షుడుగా పేరుప్రతిష్ఠలు సంపాదించుకొన్న శ్రీ నార్ల వెంకటేశ్వరరావు ఆమె పరలోకప్రాప్తి సందర్భంగా పంపిన సంతాప సందేశాలలోని ప్రశంసావాక్యాలు తెల్పుచున్నవి. శ్రీ రాజాజీ "భారతదేశంలో ప్రతిభాశాలిను లైన మహిళలలో శ్రీమతి భారతీదేవిగా రొక" రన్నారు. శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారు "ఆమె అసాధారణ ప్రతిభాశాలిని. ఆమె ఏమి చెప్పినా, ఏమి చేసినా దానిలో హుందాతనం ఉండేది,

Blank Page



శ్రీమతి చల్లగళ్ల రామాయమ్మగారు

దయ, సహకారం అందించేది. దూరదృష్టిగల సలహాలు నీయటం, మర్యాద మన్ననలతో మెలగటం ఆమెకు బాగా తెలుసు. మాధుర్యానికీ, కాంతికీ ఆధారంగా నిలిచిన మహిళ ఆమె" అని శ్లాఘించారు. శ్రీ నార్లవారి వాక్యాలు ఆమె ఇంగితజ్ఞతను, దక్షతను, ఔదార్యాన్ని, నూత్నమూర్తిత్వాన్ని ప్రస్ఫుటం చేస్తున్నవి.

శ్రీ రంగాజీకి భార్యగా నచ్చి, అర్ధాంగిగా మారి, వారి ధర్మానుచారిణిగా రూపొంది, వారితోబాటు దేశస్వాతంత్ర్య సమరంలో ప్రజాహితకార్యాల్లో పాల్గొని, కారాగారశిక్ష అనుభవించారు. ఈవిధంగా వారు నిజంగా సహధర్మచారిణి అయ్యారు.

వారి ఆత్మ భౌతిక దేహాన్ని విడిచి, ఈ నెల 27-వ తారీఖున కొక సంవత్సరం నిండుతుంది. పుణ్యవతియగు ఆమె ఆత్మ పుణ్యలోకంలో భగవత్సాన్నిధ్యాన్ని పొందివుంటుంది. ఆమె స్మృతికి అందరితోబాటు ఇవే నా జోహారులు.

(21-9-'73-వ తేదీనాటి 'వాహిని' పత్రిక సౌజన్యంతో)

3

ఉత్తమ ఇల్లాలు

ఆమెను మొదటిసారిగా 1933 లో చూచాను. నేను గంజాం జిల్లా (ఇప్పుడు ఒరిస్సా రాష్ట్రం) బరంపురంలో 1932 అక్టోబరు ఆఖరున ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసరు పదవిని స్వీకరించిన తర్వాత, శ్రీ సి. (చల్లగల్ల) నరసింహం మా యింటికి వచ్చి చూచి వెళ్లారు. వారప్పుడు గంజాం జిల్లా అధికార ముఖ్యపట్టణం ఛత్రపూర్‌లో జిల్లా పంచాయతి ఆఫీసరుగా ఉంటుండేవారు. నేను ఛత్రపూర్‌కు క్యాంపుకు వెళ్లినప్పు డొకరాత్రి విందుకు పిల్చారు. వంటచేసి వడ్డించినవారు శ్రీ నరసింహంగారి భార్య శ్రీమతి

రామాయమ్మగారు. ఆమె వంటకాల రుచిని గురించి నా 'స్వవిషయం' రెండో భాగంలో ప్రస్తావించాను. ఆమె కప్పటికే నలుగురు చిన్నపిల్లలు. అయినా ఏ తోడు లేకుండా, ఎన్నో రకాల వంటకాలు అమర్చారు. శ్రమించినా అలసట, విసుగు ఆమెకు కల్గినట్లులేదు. క్రొత్తవారి ఎదుట కమ్మవారి గృహిణుల కుండే సహజ బిడియంతో, చిరునవ్వుతో మర్యాద మన్ననలను చేసి నన్ను భుజింపజేశారు. ఆమె పాకాల రుచులేగాక, ఆమె సౌజన్యం నాపై చెరగని ముద్ర వేసింది.

తర్వాత కొలది కాలానికి (1934 సంవత్సరం) శ్రీ నరసింహం బరంపురం మ్యునిసిపాలిటీకి కమిషనర్‌గా వచ్చారు. అప్పుడు మా కుటుంబానికి, వారి కుటుంబానికి సన్నిహితత్వం ఏర్పడింది. తరుచు నేను, శ్రీ నరసింహం కలుసుకోవటం, నా భార్య వారింటికి వెళ్లటం, శ్రీమతి రామాయమ్మ మా యింటికి రావటం వంటి మర్యాదలు జరుపుకున్నాం. వారి 5-వ బిడ్డ అన్నపూర్ణకు ఉయ్యాలవేసి పేరుపెట్టినప్పుడు పేరంటానికి వెళ్లిన నా భార్య బిడ్డ ముద్దువస్తున్నదని సంతోషపడ్డది. నే నొకసారి వెళ్లి బిడ్డను చూచి ఆనందించాను.

1935 వేసవిలోనో, తర్వాత వెంటనో శ్రీ నరసింహం బదిలీయై వెళ్లిపోయారు. 1936 మధ్యలో నేను అనంతపూరు జిల్లా ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసరుగా అనంతపూరుకు బదిలీ అయ్యాను. నేను హిందూపురం మొదటి (1937) క్యాంపునకు వెళ్లినప్పుడక్కడ శ్రీ నరసింహం మ్యునిసిపల్ కమిషనర్‌గా వుండినారు. తిరిగి మా స్నేహం కొనసాగింది. శ్రీమతి రామాయమ్మగారి నల భీమ పాకం రుచి నన్ను తిరిగి సంతృప్తుణ్ణి జేసింది. నేను 1940 లో బెజవాడకు ఆఫీసరుగా వెళ్లి 1943 జూన్ వరకక్కడుండినాను. హిందూపురం తర్వాత శ్రీ నరసింహం నెల్లూరుకు మ్యునిసిపల్ కమిషనర్‌గా వెళ్లి, బెజవాడ మ్యునిసిపాలిటీకి స్పెషల్ ఆఫీసరుగా వచ్చారు. సరే, తిరిగి వారి కుటుంబానికి, మా కుటుంబానికి రాకపోకలు, మర్యాద మన్ననలు కొనసాగాయి. వారు బెజవాడలో నున్నప్పుడు వారి పెద్ద బిడ్డ సౌభాగ్యవతి సుభద్రమ్మకు

వివాహం జరిగింది. మా కుటుంబం ముఖ్య అతిథులలో ప్రముఖులం. ఆ వివాహానికి పెండ్లికొడుకు ఊరు ముదునూరుకు శ్రీ నరసింహం వగైరాతో నేను వెళ్లి వియ్యపువా రందించిన మర్యాదలను పొందాను. గృహిణి మనస్తత్వం కూతురు పెండ్లిలో కొంతవర కైనా బైట బడుతుంది. మొదటి వివాహమైనా, శ్రీమతి రామాయమ్మ అలజడి చెందటం గాని, తత్తరపడటం గాని నే నెరుగను.

బెజవాడ ఉద్యోగానంతరం శ్రీ నరసింహం మద్రాసు కార్పొరేషన్ ఉద్యోగిగా వెళ్లిపోయారు. నేను 1949 లో బదిలీ మీద మద్రాసుకు వెళ్లినప్పుడు మా ప్రాత సన్నిహితత్వం మరింత పెరిగి, దృఢపడింది. ఆదృఢ సంబంధం ఇప్పటికిని కొనసాగు చున్నది. దురదృష్టవశాత్తు శ్రీమతి రామాయమ్మగారు 1971 డిసెంబరులో దివంగతులైనారు.

ఆమెకు ఆరుగురు కుమార్లు, ఆరుగురు కుమార్తెలు — మొత్తం పండ్రెండుగురు సంతానం కల్గారు. ఈపండ్రెండుమందిని ఆమె మిక్కిలి సహనంతో, ఆదరణతో, ప్రేమతో తన ఒక్కచేతిమీద పెంచి పెద్దవారిని జేశారు. చాలాకాలం ఆమె వంటవాని సాయం కోరు కొనలేదు. క్రమేపీ మద్రాసులో భర్త కార్పొరేషన్ కమిషనర్ పదవి నధిష్ఠించిన తర్వాత వంటవానిని పెట్టుకొన్నా, ఆమె చేతి మీదుగానే వంటకాలకు పూర్ణత్వం వచ్చేది. పిల్లలకు, భర్తకు భోజన మమర్చటం జరిగేది. వీ రందరికి ఉదయం, సాయంత్రం ఉపాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఆమె తన చేతిమీదుగానే జరిపారు. చదువుకునే పిల్లలకు పాఠశాలల వేళ ఇంచుమించుగా ఒకటైనా భిన్న భిన్న పాఠశాలలు, కాలేజీలు వేరువేరు చోట్ల ఉండటంవల్ల, పైగా అవసరాలనుబట్టి పిల్లలు వెనుకాముందు బైలుదేరటంవల్ల, వాళ్లను సర్దటం, వాళ్ల అవసరాలను తీర్చటం కాలాన్ని హరించేవి. మరిన్ని భర్తకు మధ్యాహ్న భోజనం కార్పొరేషన్ రిప్పన్ బిల్డింగుకు క్రమం తప్పకుండా పంపాలి. భర్త యింటికి తిరిగి వచ్చినప్పుడు, ఏదైనా ఉపాహారం చేసి వుంచాలి. పిల్లలు సరే సరి,

ఎప్పుడూ ఏదో నెమరువేయాలని కోర్తారుకదా ! వాళ్లను తృప్తి పరచాలి. అందువల్ల ఆమె కెప్పుడూ తీరికఅనేది ఉండేది కాదు. కించిత్తైనా విసుక్కొనక ఓపికతో రోజంతా ఈ పనులన్నీ నెరవేర్చుకొనేవారు. పిల్లల బట్టల నుండి, భర్త దుస్తుల వరకు ఆమె ఎంచవలసిందే. దుకాణాలలో ఏరటమేగాక, కుట్టుపనివానికి పని అప్పగించి తయారు ఆమె చేయించవలసిందే. (శ్రీ) నరసింహం తన ఉద్యోగనిర్వహణలో తలమున్కలై ఇంటివిషయ మేమీ పట్టించుకొనేవారు కాదు. ఆ పెద్దసంసారం సాఫీగా జరిగిపోవటానికి కావలసిన హంగులన్నీ, సంభారాలు యావత్తూ ఆమె అధ్వర్యంక్రింద సమకూడవలసినవే, పర్యవేక్షణక్రింద అమలులోకి రావలసినవే. (శ్రీ) నరసింహం కుటుంబ యజమానిగా తలంచబడటం, సంసారం నడవటానికి ధన మందించటం—అంతటితో ఆయన ధర్మంసరి. ఇతర బాధ్యతలన్నీ (శ్రీమతి) రామాయమ్మే భరించేది.

నిజానికి (శ్రీ) నరసింహంగారికి అన్నివిధాలా చేదోడు వాదోడుగా వుండటమేగాక, ఆయన అలికినా, ఉలికినా, అర్ధరాత్రి యైనా ఈమె వెంటనే చేయూత నివ్వవలసిందే. నేను ప్రత్యేకించి తెలుసుకోలేదుగాని, (శ్రీ) నరసింహంగారికి మొదటిలో చీకటంటే భయంగా వుండేదని, నీరుడు విసర్జించటానికి బైటికి వెళ్లవలసివచ్చినప్పుడు, ఈమెగారు తోడుండేవారని విన్నాను. అంతగా (శ్రీ) నరసింహం రామాయమ్మగారిమీద ఆధారపడియుండేవారు.

(శ్రీమతి) రామాయమ్మ తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి తాలూకా కోటికేసవరం అనే చిన్నగ్రామంలో రైతుకుటుంబంలో ముండ్రు వెంకట్రామయ్య, అబ్బాయమ్మగార్లకు 1908 జనవరిలో జన్మించారు. తలిదండ్రు లంతగా చదువుకొన్నవారు కాదు. ఈమెగారి చదువు కూడా సామాన్యమే. అయితే సహజ సుగుణాలవల్ల ఆదర్శగృహిణిగా రూపొందారు. చూచినవారు, వినినవారు ఎంత ఆదర్శగృహిణి, ఎంత ఉత్తమ ఇల్లాలు అని ప్రశంసించకుండా ఉండలేకపోయేవారు. తెలిసినవారందరకూ కల్గిన పెద్ద విచారం, వారికను వయస్సుండగనే వెళ్లిపోయారే అని, పిల్లలు పెద్దవాళ్లైనా, వయస్సు మీరుచున్న (శ్రీ) నరసింహం

గారి కుడిచేయి పడిపోయినట్లయిందికదా అని, భగవంతు డిచ్చిన ఆయువును పొడిగించటాని కెవరికీ సాధ్యంకాదు. ఆమెకు ప్రాప్తించిన జీవితాన్ని మిక్కిలి సార్థకం చేసుకొన్నారు కదా అని కొంతకు గొంత ఊరట పొందాలి.

ఆమె ఉత్తమ సాధ్వియే గాక, సహధర్మచారిణియే గాక, ఉత్తమ ఇల్లాలు. ఆమె ప్రేమపూరిత దృష్టిలో భర్త, ఆమె ఆర్ద్రమాతృహృదయంనుండి పొంగి పొరలిన అమృత వీచికలలో బిడ్డలు దినదినాభివృద్ధిని పొందారు. ఆమె నిజంగా ధన్యురాలు. ఆమె 1971 డిసెంబరు రెండవ తారీఖున పుణ్యలోకప్రాప్తిని పొందారు. తన జీవిత సర్వస్వం భర్త కొరకు, బిడ్డల కొరకు ధారపోసిన ఆ ఉత్తమ ఇల్లాలు, పుణ్యమూర్తులు చేరే పుణ్యలోకం చేరుకొని శాశ్వత శాంతిని, అనిర్వచనీయానందమును పొందుచుంటారు.

ఆమె పూజ్య సంస్మృతి కివే నా జోహారులు.

4

వజ్రాలహారం

ఆమె అందమైన యువతి. సుందర వస్తువు లన్నా, చక్కని గృహ మన్నా, శోభాయమానమైన ప్రాంగణ మన్నా ప్రాణ మిస్తుంది. విశాలమైన గదులు, గదుల నిండా రత్నకంబళీలు, మెత్తని సోఫాలు, కుర్చీలు, నిగనిగలాడే మేజాబల్లలు, రంగు లీనే తెరలు, చూడగానే ఆకర్షించే చిత్రపటాలు ఆమె కోరుకుంటుంది. రకరకాల చిత్రాన్నాలు, గుబాళించే రుచికరమైన కూరలు, నోరూరించే ఉపాహారాలకు కలలు కంటుంది. పైగా సంగీతమంటే చెవికోసుకుంటుంది. నాట్యమంటే పరవశమైపోతుంది. స్వర్గ భోగా లనుభవించాలని ఉవ్విళ్లూరుతుంది. అయితే ఏమి లాభం? భర్త సామాన్య గుమాస్తా, వచ్చే జీతం స్వల్పం. తన తండ్రి ఇచ్చింది కొద్ది నగదున్నా, ఏ కష్టకాలంలోనైనా ఆదు

కొనటానికి దానిని కదపకూడదు. కాబట్టి, ఆమె వాంఛలు ఎండమావులుగా ఉండిపోయాయి. ఒక సాయంత్రం భర్త సంతోషంతో ఇంటిలో అడుగు పెట్టాడు. "ఎక్కడున్నావ్, వసుంధరా, ఒక శుభవార్త తెచ్చా" నన్నాడు, "ఏమి"టని భర్త షేమేంద్రు నడిగింది. "ఇదిగో చూడు, ఫలానా రోజు రాత్రి మా మంత్రిగారు గొప్ప విందు చేస్తున్నారు, పెద్దపెద్దవాళ్లు వస్తారు. సామాన్యంగా గుమాస్తాలకు ఆహ్వాన ముండదు. ఎంతో శ్రమపడి ఈ రెండు ఆహ్వానాలు తెచ్చాను. నీకు సంతోషంగా లేదా ?" అన్నాడు. "లేదు, నేను రాను" అన్నది. "ఏం ఎందుకు?" అన్నాడు. "నాకు సరియైన దుస్తులు లేవు. ఎట్లా వెళ్లేది ? భార్యకు తగిన దుస్తులున్న ఏ స్నేహితునికో ఇవ్వం" డన్నది. " దేనికో అని మిగుల్చుకొన్నవి 200 రూపాయ లున్నవి, ఇస్తాను. నీ కిష్టమైన చీర వగైరా కొనుక్కో" అన్నాడు. కొనుక్కొన్నది. కాని మెడ బోసి అనిపించింది. ఈ బోసిమెడతో ఎలా వెళ్లే దని గునిసింది. షేమేంద్రుడు కొంచె మాలోచించి, "నీ స్నేహితురాలు భాగ్యలక్ష్మి ఉన్నదికదా, ఆమె మిక్కిలి సంపన్నురాలుకదా, నీ వడిగితే ఏదైనా హారం ఇవ్వకపోతుందా" అన్నాడు. "అవును నిజమే, మంచి జ్ఞాపక మే చేశారు" అని వెళ్ళి, భాగ్యలక్ష్మినుండి ఒక వజ్రాల హారాన్ని తెచ్చుకొంది. ఆ మంత్రిగారి గొప్ప విందుకు వెళ్లారు. ఎందరో పెద్దలు వచ్చారు. విలువైన దుస్తులతో, కన్నులు మిరుమిట్లు గొలిపే ఆభరణాలతో అందకత్తెలు, విలాసవతులు వచ్చారు. మృష్టాన్నాలతో విందు గొప్పగా జరిగింది. పైగా హృదయాన్ని రంజింపజేసే సంగీతవాద్యాలు, శరీరాన్ని పులకరింపజేసే నృత్యాలు. వసుంధర ఉప్పొంగి పోయింది. స్వర్గలోకంలో వలె స్వేచ్ఛావిహారిణి అయింది. గొప్ప అంతస్తువారు, నవయౌవనులు, మన్మథరూపులు ఈమె హావభావాలకు, చమత్కారాలకు పరవశులైనారు. తోటి సుందరాంగులు అసూయాపరులైనారు. వసుంధ రారాత్రి తెల్లవారుఝామువరకు స్వప్నలోకములో కడుపార బంగారు ఆనందాన్ని జుర్రుకొన్నది. భర్తతో బైలుదేరి, అద్దె జట్కాబండ ఇంటికి చేరుకున్నది. గదిలోకి వెళ్ళి అద్దంలో తన ప్రతిబింబం చూచుకోగా, మెడలోని

వజ్రాలహారం కన్పడలేదు. గగ్గోలుపడి దుస్తులు వగైరా విడదీసి చూచారు. కన్పడలేదు. త్రోవలో పడిపోయిందేమో అని వచ్చిన త్రోవంతా వెదుక్కుంటూ డ్రైవరు తెల్లవారిందాకా గడిపాడు. ఎక్కి వచ్చిన జట్కా జాడలేదు. అన్ని జట్కాలను విచారించాడు. పోలీసుకు రిపోర్టిచ్చాడు. ఎంత వెదికినా, ఎన్ని చోట్ల విచారించినా, ఎవరికి చెప్పినా, లాభంలేకపోయింది. భాగ్యలక్ష్మి హారం భాగ్యలక్ష్మి కందజేయాలి. ఏమి గత్యంతరం? చీల ఊడిందని వ్యవధిని కోరి, తన తండ్రి ఇచ్చిన పదివేల రూపాయలు, తన భర్త వారి వద్ద వీరి వద్ద ప్రోనోట్లుబ్రాసి తెచ్చిన పదివేల రూపాయలు, రొక్కంపెట్టి పోయినదాని వంటి వజ్రాల హారం కొని, వసుంధర పట్టుకొనివెళ్ళి భాగ్యలక్ష్మి కిచ్చి వచ్చింది. పది పండ్రెండు సంవత్సరాలు, భార్యా భర్తలు నికృష్టజీవనం గడిపి, ఎట్టకేలకు అప్పులభారంనుండి విముక్తి అయ్యారు. ఈ పది పండ్రెండు ఏళ్లు అన్ని వెట్టిచాకిరీలు వసుంధర జేసుకుని, దమ్మిడి రూపాయిగా వాడుకునే టప్పటికి అందమైన, నాజూకైన వసుంధర చింపిరి జుట్టుతో, చినిగిన బట్టలతో, మోటైన ముఖం, ప్రేళ్లతో శుద్ధ పల్లెటూరు స్త్రీగా తయారైంది. ఒకనాడు బజారువెంట వెళ్లుచుండగా, భాగ్యలక్ష్మి ఎదురుగుండా వచ్చింది. పలకరిస్తేగాని, భాగ్యలక్ష్మి గుర్తుపట్టలేకపోయింది. 'నేను ఫలానా' అని చెప్పగా, నివ్వెరపోయి, "ఎందు కిలా అయ్యావు?" అని అడిగింది. వసుంధర సంగతి చెప్పగా, భాగ్యలక్ష్మి నిర్ఘాంతపోయి వసుంధర రెండుచేతులు పట్టుకుని, "అయ్యో పాపం, ఎంతపని జరిగింది! నా హారం నిజమైన వజ్రాలహారం కాదు. నకిలీ (పేస్టు) వజ్రాలు. దాని ఖరీదు తరిమి కట్టితే 300 రూపాయల కంటె ఎక్కువ ఉండదు" అని చెప్పింది.

పాపం వసుంధరకు ఎక్కడలేని దుఃఖం పొంగి వచ్చింది. పది పండ్రెండు సంవత్సరాలు అనవసరంగా నికృష్టజీవనం గడిపి, ఇలా అయిపోయానే, ఎంత దురదృష్టరాలినని వాపోయింది. భాగ్యలక్ష్మి ధైర్యంచెప్పి ఊరడించి, తన యింటికి తీసుకొనివెళ్లి వజ్రాల హారాన్నిచ్చి, "దీనిని అమ్మి సొమ్ముజేసుకొని, ఇకనైనా సుఖజీవనం

చెయ్యండి. నా పోయిన నకిలీ హారాన్ని కొని తెచ్చి యివ్వవలసిన అవసరం లేదు. మీరు పడిన కష్టాలకు ఈపరిహారం మిక్కిలిస్వల్పం. నేను మొదటిలోనే చెప్పియుంటే మీ కీ కష్టం రాకపోయివుండే'' దని చెప్పి పంపివేసింది. వజ్రాల ధర పెరగటంవల్ల ఆ హారాన్ని అమ్మగా నలభై వేల రూపాయలు వచ్చాయి. పెద్ద వడ్డీ లివ్వటం చేత, చేతికి వచ్చి నట్లున్నది ఇరవై అయిదువేలు మాత్రమే. అయినా, అసలు పొదుపు చేయవలసిన అవసరం లేకపోతే, తన మూలధనం పోను ఏపది హేనువేలో మిగిలిం దనిపిస్తున్నది. కాబట్టి గ్రుడ్డిలో మెల్లన్నట్లు ప్రస్తుతం చేతి కందిన పెద్దమొత్తం కొంత సంతోషకారకమే. అయితే, స్త్రీ అందానికి, నాజూకుతనానికి, యౌవనాతిశయానికి విలువకట్టగలమా ? మోటుబారి, అనాకారి అయి, ముసలి రూపు, మనస్సు ఏర్పడినప్పుడు, నలభై వేల రూపాయలు కాదుకదా నలభైలక్షలైనా నష్టపరిహార మౌతవా ? యౌవనదశలోని పది పండ్రెండేళ్లు నష్టానికి పది పండ్రెండు లక్షల రూపాయలైనా చాలుతవా ? అసలు స్త్రీ అందానికి డబ్బు బదులా ? ఇక షేమేంద్రుడు చివికి, చివికి దిగులుతో వృద్ధుడైనాడు. మనిషి జీవితంలో మామూలుగా గడిపే జీవితంలో పది పండ్రెండేళ్లు లెక్కలోనివికావు. అయితే, దిగులుతో నిరాశతో, పెద్దబండ నెత్తిమీదనున్న భారంతో చావలేని బ్రదుకు బ్రతికేవానికి పది పండ్రెండేళ్లు పది పండ్రెండు యుగాలుగా వుండవా? డబ్బు వచ్చిందని ఎంత దిలాసా తెచ్చుకొన్నా, పూర్వంవలె హుషారుగా, స్వేచ్ఛాపరుడుగా సుఖజీవనం చేయగలడా ?

అయితే, వెధవ గుమాస్తాగిరికి స్వస్తి చెప్పి, పూర్తి విశ్రాంతి తీసుకొనవచ్చును. తన కిష్టమైనపనిని, తన కిష్టమైనప్పుడు చేసుకొన వచ్చును. నిర్భీతిగా, శిరస్సు ఎత్తి ప్రవర్తించవచ్చును. ఎవరి కెట్టి సలాములు చేయ నక్కరలేదు. మరిన్ని, సుఖజీవనం చేయ వచ్చును. క్రీడలకు, వినోదాలకు, క్లబ్బులకు పోవచ్చును.

ఇక వసుంధర, అడ్డమైన చాకిరి చేయవలసిన పనిలేదు. స్వయంగా మార్కెట్టుకు వెళ్లి కాసుకు, దమ్మిడీకి బేరమాడటం, సామానును స్వయంగా మోసుకొని తెచ్చుకోవటం ఇక అవసరం

లేదు. చీకటి కోణాల చింపిరి ఇల్లు, కుక్కి-మంచం, చినిగిన బట్టలు, చాలీ చాలని కూడు, కటికిబీద స్థితి ఇక అవసరం లేదు. మంచి ఇల్లు, తగిన సామానులు, నౌకరు, వంటకత్తె, మంచి దుస్తులు, మంచి భోజనం, విశ్రాంతి, షికారు వగైరాలు లభిస్తవి. అందం, నాజూకు పోయినా, వయస్సు కొంత మళ్లినా, మిగిలిన జీవితం సుఖంగా గడచి పోతుంది. ఎంత గొప్పగా పుట్టినా, ఎంత భోగ భాగ్యాలనుభవించినా, ఎంత అంద చందాలున్నా మానవ దేహానికి ముసలితనం రాకపోదు. ఇవి సంభవించేటప్పుడు భాగ్యవంతులు, అదృష్టవంతులు, గొప్ప హోదాగలవారు పేదవారితో, నికృష్ట జీవులతో, అనాకారులతో సమానమై పోతారు. ఇక చింత ఎందుకు? వజ్రాల హారాన్ని నిందించట మెందుకు? భాగ్యలక్ష్మిని దూషించట మెందుకు?

ఖేంచి సుప్రసిద్ధ కథానికుడు మొపాసా "హారం" అనే ప్రఖ్యాత విషాదాంత కథానిక వ్రాశాడు. నా కా కథానిక కల్గించిన భావాల నిందు పొందుపరచుచున్నాను. పాఠకులు చదివి సమ్మతినో, అసమ్మతినో పొందుదురుగాక!

ఆతండ్రి-ఈకొడుకు

బైబిల్‌లో ఒక కథ ఉన్నది. పూర్వకాలంలో ఒక సంపన్న గృహస్థునకు కుమారులు, కుమార్తెలు పెద్ద సంతానం ఉండినది. వారిలో చిన్నకొడుకు, తండ్రితో తగవులాడి తన వాటాను తీసుకొని దేశాంతరం వెళ్లిపోయాడు. కొన్ని సంవత్సరాలక్కడక్కడ తిరిగి, చేతనున్న డబ్బంతా పోగొట్టుకొని, దీనుడై ఒకరి వద్ద సేవకు కుదిరి, ఆ సేవాభారాన్ని భరించలేక, దుఃఖితుడై "నా తండ్రి వద్ద ఎందరో నౌకరులున్నారు. వారు సుఖజీవనం చేయుచున్నారు. నే నీ యజమానివద్ద బానిసవలె బాధ లనుభవించుచున్నాను. నా తండ్రి వద్ద నౌకరీ చేసుకొంటే, ఇంతకంటె మెరు"గని

బైలుదేరి ఇంటికి చేరుకొన్నాడు. దూరాన్నుండి తన కొడుకును గుర్తుపట్టిన తండ్రి, పరుగు పరుగున వచ్చి అతనిని కౌగిలించుకొని, ముద్దాడి ఆనందబాష్పనయనాలతో ఇంట్లోకి తీసుకొనివెళ్లి, సద్యోపచారాలను చేయించి, మంచి దుస్తుల నిచ్చి, కడుపునిండా భోజనం చేయించాడు. అంతేకాదు, తన బంధువులకు, స్నేహితులకు క్రొవ్వుపట్టిన గొఱ్ఱెపోతుల మాంసంతో పెద్ద విందు చేశాడు. ఒక స్నేహితుడు, "నీ మాటలు వినక, నీతో తగాదాపడి, తన వాటాను తీసుకొనిపోయి, పాడుచేసి, బికారియై వచ్చిన కొడుకు కింత అట్టహాసం చేస్తున్నావేమి?" అని అడిగాడు. తండ్రి ఈ విధంగా జవాబు చెప్పాడు. "మందల గొఱ్ఱెలను కాచుచున్న గొఱ్ఱెల కాపరి, ఏదైనా ఒక గొఱ్ఱె తప్పిపోతే, మందను విడిచిపెట్టి ఆ తప్పిపోయిన గొఱ్ఱెకోరకే తపిస్తూ, అన్వేషించడా? నాకు కాకుండా పోయిన నా బిడ్డ, నాకు తిరిగి దక్కినందుకు నేను గొప్పగా ఆనందించుచున్నాను. ఇందులో వింతేమున్న" దని సమాధానం చెప్పాడు.

ఫ్రెంచి రచయిత బర్నియేర్ "సగభాగం చేసిన గుర్రం మీద గుడ్డి" అనే కథానికను రచించాడు. ఇది తండ్రికి కొడుకు తలపెట్టిన ద్రోహం, దానిని మనుమడెట్లు మాపు చేయించింది తెలిపే, హృదయాన్ని కదిలించే కథ.

పారిస్ నగరంలో కష్టపడి సంపాదించిన ధనికవర్తకుడొకడుండేవాడు. అతని కొకే పుత్రుడు. పుత్రునకు వివాహం చేయదగు వయస్సు వచ్చింది. దగ్గరలో ఒక జమీందారు కూతురుండింది. ఆమె అందగత్తెయే గాక, జమీందారు కూతురాయె. అందువల్ల ఆ యువతిని తన కొడుకుకు చేసుకోవాలని ఉద్దేశించాడా వర్తకుడు. రాయబారాలలో పిల్లతండ్రి, "నీకొడుకు కేమిస్తా"వని అడుగగా, "నా సంపదలో సగభాగమిస్తా"నన్నాడు. 'కాదుకూడదు, నీ ఆస్తి నంతా నీ కొడుకుకు వ్రాసియిస్తేనే, సంబంధం కుదురుతుం'దని గట్టిగా చెప్పాడు. ఈ గొప్ప సంబంధాన్ని వదులుకోవటాని కిష్టంలేక, తన సంతాన మంతా ఈ ఒక్కకొడుకే కదా, తన జీవితాని కే లోటుండదని తలంచి, సంబంధాని కొప్పుకొని తన యావదాస్తిని

కొడుకుకు వ్రాసియిచ్చి, పెండ్లి జరిపించాడు. కొన్ని సంవత్సరాలకు వయస్సు మళ్లినందునను, చిన్నప్పటినుండి కష్టపడి యుండినందు వల్లను, ఓపిక ఉత్సాహం తగ్గినందువల్లను, ఆయన తన కొడుకు అండను విశ్రాంతిగా సుఖజీవనం చేయటానికి తలపెట్టాడు. కొంత కాలం సుఖంగానే జరిగింది. కోడలు ముసలాయన పనిపాటలు లేక, హాయిగా తిని ఇంట్లో కూర్చొనటం సహించలేదు. తండ్రిని పంపివేయండని భర్తను వేధించటం మొదలుపెట్టింది. భార్యపోరు పడలేక, కొడుకు తండ్రి నింట్లోనుండి వెళ్ళిపొమ్మన్నాడు. "ఈ వృద్ధాప్యంలో ఎక్కడకు వెళ్లేలే"దనగా, "ఎక్కడికైనా వెళ్లు, ఏ స్నేహితుని పంచనైనా చేరు, ఇక్కడుండటానికి వీల్లేలే"దని చెప్పి వేశాడు. తండ్రి దిగాలుపడి, "నా ఆస్తి నంతను నీ కిచ్చానుకదా నా ఆస్తినంతా తీసుకొన్న కొడుకువు నీవే కాదంటే, పరాయివాళ్లు ఆదరిస్తారా?" అని మొత్తుకున్నాడు. 'అదంతా నాకు తెలియదు. నీ వేమిచేస్తావో నా కెందుకు? నీవు ఇక్కడనుండి కదలవలసిందే 'అని నిష్కర్షగా చెప్పాడు. ఇక లాభంలేదని, ఏదైనా భత్యాని కిమ్మంటే లేదన్నాడు. "బాబూ, నీ గుర్రాలమీద కప్పే గుడ్డోకటైనా ఇప్పిస్తే చలిలో బిగుసుకుపోయి చావకుండా ఉంటా"నని బ్రతిమాలాడు. సరే అని, తన 12 ఏండ్ల కొడుకును పిలిచి గుర్రాల సాలలో ఒకగుర్రంమీద కప్పిన గుడ్డ నివ్వవలసిందని ఆజ్ఞాపించాడు. కుర్రవాడు సరే అని, తాతను గుర్రాల సాలకు తీసుకొనివెళ్ళి, ఒక మంచిగుడ్డను గుర్రంనుండి తీసి, దానిని పర్రున రెండుగా చీల్చి, ఒకముక్కను తాత కిచ్చాడు. 'ఇదేమిటి, నీ తండ్రి గుడ్డనంతా ఇవ్వమంటే, నీవు సగమే ఇచ్చావేమి'టని అడుగగా 'నేనిచ్చే దింతే' అని మొండి సమాధానం చెప్పాడు. ముసలితండ్రి తనకొడుకు వద్దకు వెళ్ళి, "చూచావా, నీ కొడుకు నీ మాటను అవిధేయతతో వ్రాసి వేసి, నాకు సగం గుడ్డే ఇచ్చా"డని చెప్పుకొన్నాడు. కుర్రవాని తండ్రి కొడుకును ప్రశ్నించగా 'అంతా ఇస్తే ఎట్లా? సగం నీకోసం ఉంచాను. ముసలివాని ఆస్తి నంతను తీసుకొని ఇంటినుండి వెడలదోలినట్లే, నేను పెద్దవాడనయిన తర్వాత, నీ ఆస్తినంతా నేను లాక్కొని, నిన్ను ఇంటినుండి వెడలగొడ్తాను. అప్పుడు ఈ సగం ముక్క

నీ కిస్తాను. ముసలాయన దీనావస్థలో చనిపోయేటట్లు నీవు చేస్తే, ఆవిధంగానే నీవు చనిపోవటానికి నే నెదురు చూస్తాను' అని సమాధాన మిచ్చాడు. అంతటితో ముసలాయన కొడుకుకు జ్ఞానోదయమై, పశ్చాత్తాపపడి, తండ్రిని ప్రాధేయపడి, ఇంట్లోకి తీసుకొనివెళ్ళి, సకలసౌఖ్యాల నమర్చాడు.

బైబిలులోని తండ్రి, తనను ఎదిరించి విడిచి వెళ్ళిపోయిన కొడుకు దీనావస్థలో తనదగ్గరకు చేరగా, హృదయానికి హత్తుకొని, ఆదరించి దగ్గరకు తీసుకొన్నాడు. బర్నియేర్ కథలోనికొడుకు, తనయందు గాఢప్రేమతో తండ్రి తన యావదాస్తిని తనకు సంక్రమింప జేయగా, అసహాయ జీర్ణస్థితిలోవున్న తండ్రిని బైటకు వెళ్ళగొట్టటానికి సిద్ధమైనాడు. దీనినిబట్టి, తండ్రిది సహజమైన అవ్యాజ ప్రేమ, కొడుకుది స్వంతపెత్తనం వెలిగించుకొనాలనే అధికారదాహం. దీనిని పురుషసోటీ లేక స్పర్ధ (మేల్ రైవల్రీ) అనవచ్చును. కోతుల తండాలో యువక మగకోతి, వృద్ధాప్యం వచ్చిన నాయక కోతిని తరిమివేసి, తండాకు తాను నాయకత్వం వహించినట్లు.

మనుమని పాత్ర వంశానుగతమైన అభిమానం, ముసలి తనంలో నిస్సహాయుడైనాడనే సానుభూతి, ఆయన ఆస్తి నంతను తీసుకొని ఆయనను ఆకలితో, చలితో చావమనటం అధర్మం అనే భావం, ఇవన్నీ కలసి ఆ పిన్నవానిని ఉత్తేజితం చేసి, అంత చక్కటి ఉపాయాన్ని తోపింపజేశాయి. నిజంగా ఈ బాలుడు ధన్యుడు, ఆదర్శపాత్రుడు.

౬

పొరపాటు - తప్పిదము

పొరపాటు, అనాలోచితం; తప్పిదం, కావాలని చేసింది. మొదటిది భ్రమ పూర్వకం, రెండోది వాంఛించేది. పొరపాటు బాహ్య లేక దేహ సంబంధమైతే, తప్పిదం మనస్సు, బుద్ధి

సంజాతం. మొదటిది తలవనితలంపుగా జరిగే దైతే, రెండోది దీక్షతో ఆచరణపూర్వకమైనది.

తలవనితలంపుగా అకస్మాత్తుగా జరిగిపోయే సంఘటనలు, ఒకప్పుడు ప్రమాదానికి దారితీసినా, అవి పొరపాట్లే. నే నొకప్పు డొక కథ చదివాను. ఇద్దరు నూత్నదంపతులు ఒకే కాలమందు తమ ప్రథమ సమాగమానికి (హనీమూన్) ఒక హోటల్‌లో చెరియొక గది నద్దెకు తీసుకొన్నారట. మొదటి సంగమం, కునుకు అయినతర్వాత, భర్త లిరువురు మూత్రవిసర్జనకు బైటికివచ్చి, తిరిగి వెళ్లేటప్పుడు పొరపాటున ఒకరిగదిలోకి ఇంకొకరు ప్రవేశించారట. దీపాలు లేనందున, మంచాలుచేరి, అందులో మగత నిద్రలో వున్న యువతులను తమ భార్యలే అనుకొన్నారట. కామేచ్ఛ వలన వాళ్లను కౌగిలించుకొని రతోన్ముఖులవగా, ఆ యువతులు తమ భర్తలే అనుకొని మగత పూర్తిగా పోకున్నా సంభోగించనిచ్చారట. సంగమ బడలికతో భర్తలు మైమరచి నిద్రించుచుండగా తెల్లవారగట్ల యువతులు లేచి తమ ప్రక్కనున్నవారిని తమ భర్తలుగారని తెలిసికొని, ఒకరి గదినుండి మరొకరి గదికి, తెచ్చుకొన్న కొలది సామానును జేరవేసి, ఎవరి భర్త వద్ద వారు చేరుకొన్నారట. మనం చేరిన గదిది గానట్లున్నదే అని భర్తలనగా, ఇదేనని బుకాయించి బైటబడ్డారట. ఈ పరపురుష లేక పరస్త్రీ సంగమం కావాలని చేసిందికాదు. ప్రక్కప్రక్కనున్న గదులు, చీకటిరాత్రి, పురుషులిద్ద రేక కాలమందు బైటికి వెళ్లివలసి రావటం—ఈ పొరపాటుకు కారణమైనది.

ఇంకొక కథ. ఇద్దరు కవల యువకులలో ఒకనికి పెండ్లి అయింది. రెండోవానికి, పెండ్లి అయిన మొదటివాని భార్యమీద గాఢవాంఛ ఏర్పడియుండింది. తానే ఆ యువతిని చేసుకోవాలనుకొన్నాడటగాని, ఆమె రెండోవాననే వరించి వివాహమాడింది. వాళ్లిద్దరు సమాన రూపురేఖలు, ఒడ్డుపొడుగులు, నడక, మాటతీరు కలవారు. అలవాట్ల భేదం వల్ల కల్గిన కించిత్తు మార్పును కామోద్రేకుడు సమపరచుకొని అచ్చం రెండోవానివలె తయారై,

అప్పుడు తలిదండ్రుల వద్ద నున్న ఆ యువతి వద్దకు వెళ్లాడు. ఆ యువ తేగాక, ఆమె తలిదండ్రులు కూడా ఆ పిల్ల భర్తే అనుకొని సకల మర్యాద మన్ననలు చేశారు. రాత్రంతా తన ఇచ్చ వచ్చినట్లు ఆ యువతితో భోగించి, తెల్లవారిన తర్వాత పని ఉన్నదని వెళ్లిపోయాడు. కొన్నిరోజులకు భర్త రాగా మాటల సందర్భంలో, తనతో ఆ రాత్రి సంభోగించినవాడు తనభర్త కాదని తెలుసుకొని ఆయువతి ఆత్మహత్య చేసుకొన్నదట! తాను తెలిసి ఏ తప్పు చేయలేదు. నిజంగా తన భర్తయే అని నమ్మింది. తన తలిదండ్రులుకూడా అల్లుడే అని నమ్మారు. మరి ఎందుకీవనిత తనను తాను చంపుకొన్నది? వట్టి మూర్ఖత్వం, అవివేకం, పాతివ్రత్యం అనే భ్రమ, లైంగికానికి అనవసర ప్రాముఖ్య మివ్వటం అనుకోవాలి.

మనస్సు, బుద్ధి, జ్ఞానం, ఆత్మ లేనిదే శరీరం వట్టి కట్టె. ప్రాణం ఉండినా ప్రాణ మున్న కట్టె మాత్రమే. శరీరానికి మాలిన్యం, మనస్సు, బుద్ధిమీద ఆధారపడి యుంటుంది. వాని ప్రభావం లేనప్పుడు, ఏ క్రియకాని, ప్రక్రియకాని, లైంగికంకాని శరీరాని కంటవు. పైగా, స్త్రీ నెల నెలా పరిశుద్ధ మౌతుంది, నూత్న జీవిత అవుతుంది, పునర్జన్మ నొందుతుంది. తనకు తెలియకుండా తన శరీరాన్ని ఎవరో ఉపయోగించుకున్నారని, ప్రాణత్యాగం చేయటం శుద్ధ వెర్రితనం, దురహంకారం. శరీరానికి, దానికి సంబంధించిన లైంగికానికి అనవసర ఆధిక్య మివ్వటం.

8

భార్యాభర్తలు

స్త్రీ వేరు, భార్యవేరు. పురుషుడు వేరు, భర్తవేరు. స్త్రీ, భార్య ఒకజాతి (సెక్సు) వారైనా, ప్రవర్తనలో భిన్నమైనవారు. స్త్రీ, స్త్రీగా, వంట వార్పు చేసేది, లైంగికంగా మగవాని

కుపయోగపడేది. బిడ్డలను కనేది. ఆదిలో, సంఘం ఏర్పడనప్పుడు సంఘ నియమాలు రాకముందు, స్త్రీ ఒకరిసొత్తు కానప్పుడు, ఆమె సార్థకమే అంత. వివాహ విధి స్థిరస్థాయి అయినప్పుడు, స్త్రీ భార్యగా రూపొందింది. గృహిణి అయింది. భర్త సహచరిణి, సహధర్మచారిణి అయింది. అతని వంశం కొనసాగటానికి కారణమైంది. మరిన్ని లైంగికంగా, అతనిసొత్తు అయింది. పురుషుడు పురుషుడుగా బైటబడినప్పుడు, ఏ సంసార బాధ్యతను వహించలేదు. ఏ వావి వరసలు పాటించి యుండలేదు. ఆహారం సేకరించటం, లైంగికపొంగును తీర్చుకొనటం, ఏ చెట్టుక్రిందో, ఏ పుట్టక్రిందో నిద్రించటం వాని జీవితాచరణ. పురుషుడు భర్తగా మారినప్పుడు, తన భార్య, తన బిడ్డలు, తన గృహం, తమ సుఖ జీవనం అతని ధ్యేయమైనవి. తాను జీవనోపాధికి సంపాదించటం, భార్యతో లైంగిక బాధను తీర్చుకొనటం, బిడ్డలను పోషించటం, వారి అభివృద్ధికి పాటుబడటం అతని ధర్మమైనది. భార్య తన వంశాభివృద్ధికి మూలస్తంభం. ఆమె తనవీర్యాన్నే ధరించి, తన రక్తాన్నే ప్రసరింపజేసి, తన ప్రతిబింబాలనే పెంపొందించటం అతని ఆశయం. ఆమె ఇతర పురుషులను దరిచేరనీయకూడ దనేది అతని సిద్ధాంతం.

నాగరికతను పొందిన పురుషుడు భార్యతో దప్ప ఇతర స్త్రీలతో సంగమించ కూడదు. స్త్రీ భర్తను తప్ప ఇతరపురుషులతో సంపర్కంలేని పతివ్రత అయియుండాలి. ఇదీ ధర్మం. అయితే, ఏకపతివ్రతం స్త్రీకి విధిగా ఎంచబడినా, ఏకపత్నీత్వం పురుషుని కట్టివేయలేదు. వివాహవిధి ప్రకారం 'నాతిచరామి' మొదలైన ప్రమాణా లతడు చేసినా, అతని సహజస్వభావాని కవి లోబడలేదు. పురుషుడు లైంగికంగా చంచల స్వభావుడు. భిన్న భిన్న లైంగికానుభవాలను కోరుకుంటాడు. స్త్రీ సహజంగా ఏక పురుషారాధకురాలు. పురుషులలో ఒక స్త్రీతోనే సరిపెట్టుకొనేవారున్నారు. స్త్రీలలో బహు పురుష సంగమంకోరేవారున్నారు. అయితే, స్త్రీ లైంగికస్వేచ్ఛ పురుషలైంగికస్వేచ్ఛ వంటిదగునా? స్త్రీ, బిడ్డలను కనేది. వంశాన్నికొనసాగించేది. పురుషుడు కుటుంబ

యజమాని. దాని మూల స్తంభం. సంఘ వ్యవస్థలో కుటుంబం ఒక అంగం (యూనిట్). ఆ వ్యవస్థను ప్రతిబింబించటం, దానికి ప్రాతినిధ్యం వహించటం కుటుంబ యజమానిగా అతని ప్రత్యేకత.

అందువలన పురుషుడు భర్తగా వ్యభిచరించడం వేరు, స్త్రీ భార్యగా వ్యభిచరించటం వేరు. భర్త వ్యభిచరించినా, తన బిడ్డలకు, తన సంసారానికి ఇబ్బంది వుండదు. భార్య వ్యభిచరిస్తే వంశం కల్తీ అవటమే గాకుండా గృహం దెబ్బతింటుంది, సంసారం చెడిపోతుంది. బిడ్డలు దిక్కు-లేనివారవుతారు. భర్త పరస్త్రీని కామించి, ఆమెతో సాంగత్యం పెట్టుకొన్నా, తనకు భార్య వున్నదని, ఆమె తన సంసారాన్ని ఈదుకొనివస్తున్న దని, తన బిడ్డలను పెంచుతున్నదని, సంసారం గడవటానికి, బిడ్డల పోషణ, విద్య నిమిత్తం, తన సంపాదనలో చాలా భాగాన్నైనా వాళ్లకు చెందచేయాలని కోరుకుంటాడు, ఆచరణలో పెడ్తాడు. కాబట్టి లైంగికంగా, ప్రేమపూర్వకంగా భార్యకు తగిన సహకార మివ్వక పోయినా, తన గృహాన్ని, సంసారాన్ని, బిడ్డలను కనిపెట్టుకొనే యుంటాడు. భార్య విషయ మట్లు కాదు. తాను వ్యభిచరించటం తన సహజ స్వభావాన్ని, సంఘ ధర్మాలు, నియమాలను బట్టి, ఒక పాతకంగా ఆమెకు తెలుసును. దానిని లెక్క-పెట్టకుండా పర పురుష సాంగత్యానికి లోనైతే, బరితెగించిందన్నమాట. అప్పుడు తనగృహ మెట్లు క్షీణించినా, తన సంసార మెట్లు ఛిన్నాభిన్నమైనా, తన బిడ్డ లెట్లు దిక్కు-లేనివాళ్లైనా లక్ష్యపెట్టదు. తన కామతృప్తే ఆమెకు కావలసింది. అందువల్ల భర్త వ్యభిచరించటం, కుటుంబాని కంత చెరుపు కలగచేయకపోవచ్చును కాని, భార్య వ్యభిచరిస్తే కుటుంబం సర్వనాశన మౌతుంది. పరపురుషుడు జ్ఞాతివర్గంలోని వాడు కాకపోతే అతని వలన బిడ్డలను కని మందలో కలిపితే, వ్యక్తిగత రక్తపారంపర్యం లేకపోవు టటుంచి, భర్తవంశం సంకర మౌతుంది. ఇది వివాహ వ్యవస్థకే గొడ్డలిపెట్టు. సర్వసామాన్యంగా స్త్రీ వ్యభిచరించేది, జ్ఞాతివర్గంలోనివాడు కానివానితోనే. చాలా వరకు ఇతరకులంవానితోనే.

అపరిమితంగా ప్రాగి, ఖాదంలో డబ్బంతా తగులబెట్టి, ఇల్లు వాకిలి పట్టించుకొనకుండా, భార్యను చావగొట్టి, బిడ్డలు ఆకలితో మాడుతున్నా పట్టించుకొనక, ఏ లంజతోనో కాలంగడిపే భర్తలున్నారు. అట్టి వారిని మనం గర్హించేది, వారి వ్యభిచారానికి కాదు. స్త్రీలలో కూడా మితిమీరి ప్రాగేవారున్నారు. అట్టివారు గృహాన్ని చిందర వందర చేయటం, బిడ్డలను సరిగా చూడక పోవటం, ఏదీ పట్టించుకొనక పోవటం మన మంతగా తెక్కపెట్టం. మనం గమనించే దల్లా వారు వ్యభిచరిస్తున్నారా అని. వ్యభిచరించకపోతే, భర్తవంశం సంకరంకాదు. కాబట్టి, మనకు సహజంగా తోచేది, భర్తవ్యభిచారం సహింప దగినది. భార్య వ్యభిచారం వ్యతిరేకించ వలసినది అని. అయితే, మన భారతీయ దృక్పథానికి, మన స్వాతంత్ర్యానికి పాశ్చాత్యుల మన స్తత్వానికి, దృక్పథానికి స్త్రీ పురుష సంబంధంలో కొంత వ్యత్యాస మున్నది. ఈ వ్యత్యాసం భార్యాభర్తల సంబంధంలో కూడా ప్రతిఫలిస్తుంది. మనశాస్త్రాలు, ధర్మాలు భార్య ఒకే పురుషునికి యావజ్జీవం కట్టుబడి యుండా లంటవి. ఈ ధర్మాలను జీర్ణించుకొన్న మనభార్యలు, పతివ్రతలుగా కీర్తిగడించాలని తహ తహ లాడుతారు. పాశ్చాత్య స్త్రీ వివాహ బంధం యావజ్జీవం కాదు. అది తెగిపోవచ్చును. ఆమె ఇం కొక పురుషుని భర్తగా సాంగత్యం పొందవచ్చును. అందువల్ల పతివ్రత ధర్మానికి పాశ్చాత్యుడు అంత విలువ నివ్వ నవసరంలేదు.

సుప్రసిద్ధ కథానికుడు, నవలా రచయిత, నాటక కర్త సోమర్ సెట్‌మామ్ "శాశ్వతమైన భార్య" అనే నాటకాన్ని ప్రాశాడు. దానిలో భర్త, ఒక ప్రియురాలితో ప్రేమకలాపం పెట్టుకుంటాడు. భార్యకు తెలిసినా గృహసామరస్యం కోసం, ఏమీ ఎరగనట్లు వ్యవహరిస్తుంది. భర్త సంపర్కం లేకపోయినా, సహించి యథాప్రకారం భర్తయం దాదరణతో నడుచుకుంటుంది. ఇట్లుండగా, చాలా సంవత్సరాలకు పూర్వం పరదేశానికేగి అక్కడ స్థిరపడిపోయిన ప్రియబాల్యస్నేహితుడు తనింటికి వస్తాడు. ఆదరిస్తుంది. అతడు కొన్నాళ్లామె ఇంట్లో గడిపి ఆ పట్టణంలోనే నివాస

మేర్పరచుకుంటాడు. వాళ్ళిద్దరు తరుచు కలుసుకోవటం, వినోదాలకు, ఆటపాటలకు కలసి తిరగటం జరుగుతుంది. అతడు ఆరు వారాలలో తిరిగి తన స్థిరనివాస దేశానికి వెళ్లిపోతాడు. తనను ప్రేమించి, ఆరాధిస్తున్న అతనితో ఈ ఆరు వారాలైనా సుఖ సంతోషాలతో, కామలీలా పరవశత్వంతో గడపాలని ఆమెకు బుద్ధిపుట్టి అతని అభ్యర్థన నంగీకరించి, భర్తతో "నేను, అతడు ఈ ఆరు వారాలు ప్రేమికులంగా గడుపుతాం. ఎండుబారియుండిన నా జీవితంలో నవవసంతం ప్రవేశించి, నా జీవితాన్ని చిగురింపజేసి, నన్ను సౌఖ్యంలో ఓలలాడిస్తుంది. వెళ్లివస్తా" నంటుంది. పిడుగుపడిన చందమైనభర్త, వెళ్లవద్దని ప్రాధేయపడతాడు. "నీ విప్పుడు వెళ్లితే తిరిగి ఈ ఇంటికి రానీయను. ఇక నీకు నాకు తెగతెంపులే" అని బెదిరిస్తాడు. "నీవు నీ ప్రియురాలితో పది సంవత్సరాల నుండి కులుకుతున్నావు, నే నొక్క ఆరు వారాల సౌఖ్య మనుభవించ కూడదా? ఆరు వారాలైన తర్వాత అత డెట్లును వెళ్లిపోతాడు. నేను మామూలు భార్యగానే ఉంటాను. ఇంటికి తిరిగి వచ్చి యథాప్రకారం, గృహం నడుపుతాను. నీ కిష్టమైతే సంసారం కొనసాగిద్దాం మామూలుగా. నేను వెళ్లకతప్ప" దంటుంది. భర్త ఆలోచించాడు. విడాకులిచ్చిన స్త్రీని, పురుషుడు భార్యనుగా చేసుకొనటం లేదా! ఒకసారి విడిపోయి ఇతరులను చేసుకొన్నవాళ్లు, వాళ్లనుండి విడిపోయి తిరిగి భార్యా భర్తలు కానటం లేదా! కాబట్టి ఆరు వారాలు పరపురుషునితో లైంగిక మాచరించిందని తప్పుపట్టట మేమిటని నిశ్చయించుకొని, "వెళ్లిరా, నీవంటి సొగసుకత్తెను, ఉల్లాసపరచేదాన్ని, మోహపరచేదాన్ని ఎలా వద్దంటా" నన్నాడు. ఈ దృక్పథం సముచిత మనే నాకు తోస్తున్నది. మన భారతీయుల్లో కూడా పతివ్రతా ధర్మం సన్నగిల్లుచున్నది. భార్యా భర్తల అనుబంధం, ఒకరి నొక రవగాహన చేసుకొనటం, స్నేహ పూర్వకంగా మెలగటం, సామరస్యం పెంపొందించుకొని సుఖ సంసారం గడుపుకొనటం ముఖ్యంగా ఎంచుకొంటున్నారు. ఇది చాలా మంచి పరిణామం.

వృద్ధాప్యం

మానవులే కాదు, సమస్త జంతుజాలం కూడా పుట్టినది గిట్టుట కొరకే. పుట్టిన క్షణం నుండి జీవి మృత్యుముఖమునకు ప్రయాణించుతాడు. నెలరోజుల పసికందు ఆయువులో, ఆ నెల రోజులు క్షీణించినవన్నమాట. అలాగే అన్నిజీవులకు తా మెదుగు చున్న రోజులు, జీవించుచున్న సంవత్సరాలు తమకు నిర్ణయించిన (భగవంతుడుగాని మరేదేని మహత్తరశక్తిగాని) ఆయువునుండి తరిగిపోతవి. ఇది ప్రకృతి సహజం.

అయితే, బాల మరణాలు, యువ మరణాలు, మధ్యవయస్సు మరణాలు మనోవేదనను కలిగిస్తవి. బంధువులు, ఆత్మీయులు లబో దిబో అని గోలపెట్టగా, ఇతరులు అయ్యోపాపం అని విచారిస్తారు. వయస్సుమళ్లిన వారి విషయంలో విచారాలు, మనోభావాలు కొంతవరకైనా మిశ్రమంగా వుంటవి. వృద్ధులు అనగా 80 ఏళ్లు నిండిన వారంటారు గాని, నిజానికి 70 ఏళ్లు దాటిన వా రందరు వృద్ధులే. అట్టివారి మరణం విషయంలో వ్యక్తుల అంతస్తులనుబట్టి భేదాలున్నా, మొత్తంమీద మొగ మాటానికో బులపాటానికో కొంతసానుభూతి వెలువరించటం తప్ప, విచార ముండదు.

నవయౌవనుడు గాని, మధ్యవయస్కుడు గాని, వయస్సు మళ్లినవాడు గాని, విశిష్ట వ్యక్తిత్వం కలిగియుండి, తనకుటుంబాన్ని గాని, సంఘాన్ని గాని, రాష్ట్రాన్ని గాని, దేశాన్ని గాని ఏదో ఒకవిధంగా ప్రభావితంజేసి తన జీవితం ఉపయోగ పడునట్లు వ్యవహరిస్తే, అయ్యో చనిపోయాడే అని వాపోవటం, సంతాపం చెందటం జరుగుతుంది. ఎవరికీ ఏవిధంగానూ ఉపయోగపడని వ్యర్థ జీవి చావు భార్యా బిడ్డలకు, రక్త బంధువులకు తప్ప ఇతరు లెవ్వరికి ఎట్టి చలనం, విచార భావం కలుగజేయదు. పైగా మరణించినజీవి దుష్టుడైతే, "పీడవదిలింది, ఇంకా దుర్మార్గాలు

చేయకుండా చచ్చా''డని నిందిస్తారు. నవయౌవన యోధులు అభిమన్యుని, బాలచంద్రుని అకాలమరణం ఇప్పటికి మనకు మనస్తాపం కల్గిస్తుంది. వారు బ్రతికియుంటే, ఎట్టి సాహసాలు చేసేవారో, ఘనకార్యాలు ఆచరించేవారో అని పరితపిస్తాం. ఝాన్సీలక్ష్మీబాయి శౌర్యప్రతాపాలు, మనకళ్లెదుట పొడగట్టి ఆమె యౌవనమందలి మరణానికి మనస్సు వేధిస్తుంది. కవిబ్రహ్మ ఏటుకూరి నరసయ్య, కవయిత్రి తొమ్మిదవతరగతి యౌవనదశ మరణం మనలను విచారగ్రస్తులను చేస్తుంది. కవికోకిల దువ్వూరి రామిరెడ్డి, కవిరాజు త్రిపురనేని రామస్వామిచౌదరి మధ్య నయస్సు మరణాలు మనలను సంతప్త హృదయులను చేస్తవి. ఆవిధంగానే మహామహుడు రాజా రామమోహనరాయి పరలోకప్రాప్తికూడా. మహాశయుడగు సుభాష్‌చంద్రబోసు అకాలమరణం దేశ వ్యాప్తంగా సంతాపాన్ని కలుగచేస్తున్నది. దుష్టుల మరణాలు సంతోషదాయకంకాగా,నిరంకుశులు,మానవతాహీనులు, దేశాలను ప్రజలను మారణహోమంచేసిన మానవరూపపిశాచులు హిట్లర్, ముసోలిని దిక్కులేని చావులకు ప్రపంచం హర్షించి సంతోషంతో ఊగిపోయింది. స్టాలిన్‌కూడా ఇంచు మించు ఈ కోవకు చెందిన వాడే. ప్రజాబాహుళ్యం అతని చావుకు చింతింపలేదు.

పోతే పూర్తివృద్ధులు కాకపోయినా, వయస్సుమళ్లిన తర్వాత పరమేశ్వరుని సాన్నిధ్యం చేరిన మహాత్మాగాంధీ, సర్దార్ పటేల్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మరణాలు మనకెప్పుడూ సంతాప కారణాలే. వారి స్మృతి మనకెల్లప్పుడూ స్మరణీయమే. బ్రహ్మర్షి వెంకటరత్నంనాయుడు, కందుకూరి వీరేశలింగం పంతులు మన కెప్పుడూ ఆరాధ్యులే. వారింకా కొన్ని సంవత్సరాలు బ్రతికి ఉంటే బాగుండేది అనుకుంటాం.

ఇక పూర్ణవృద్ధుల విషయంలో విశ్వేశ్వరయ్య, రాజగోపాలా చారి, సర్వేపల్లి రాధాకృష్ణ, మొదలైన మహాభాగులు, మహా మహులు మనను విడిచిపోవటం మనకు కొంతవరకైనా విచారాన్ని కల్గిస్తుంది. అయితే, వారు పూర్ణజీవులు. మొత్తం దేశానికి అఖండసేవజేసి, అంతర్జాతీయంగా మనదేశానికి పేరు ప్రతిష్ఠలు

కల్గజేసినవారు కాబట్టి, ప్రకృతి సహజమైన వారి మరణం మన కంతగా బాధ కల్గించదు.

బాలురు, యువకులు, మధ్యవయస్కులు మంచిగా జీవించినా, చెడుగా జీవించినా వారు శారీరకంగా శక్తిహీనులు కారు. తమ పనులను తాము చేసుకొనుటకు జవసత్వాలను కల్గియుంటారు. వారి బుద్ధి, మనస్సు సక్రమంగా నడిస్తే పదిమందీ సంతోషిస్తారు, చెడు నడవడుల కలవాలై దుష్టులైతే నిరసిస్తారు. వృద్ధుల విషయం వేరు.

వృద్ధాప్యంవల్ల కొన్ని లాభా లున్నాయి. ఇంట్లోవారు, కొడుకులు కోడళ్లు గాని, మనుమలు మనుమరాండ్రు గాని పెద్ద వాడనే గౌరవభావ మేగాక, ముసలివాడయ్యాడు, అశక్తుడయ్యాడని తలచి, అవి, ఇవి అందించి తోడుపడతారు. భోజన మజ్జనాదులలో ఏమి అనుకూలమో, ఆవిధంగా నడుచుకుంటారు. బైటకు వెళ్తే తెలియనివారైనా బస్సుగాని, రైలుగాని ఎక్కటానికి, దిగటానికి చేయూత నిస్తారు. దారి క్లిష్టంగావున్నా, జనం రద్దీగావున్నా చేయి బట్టుకొని నడిపించుకొని తీసుకువెళ్తారు. ఏదైనా అవసరం వస్తే సాయపడతారు. సానుభూతి చూపుతారు. ఎందుకు మీ కీ శ్రమ అంటే, " పెద్దవారు, మీకు సరిగా కనబడటం లేనట్లున్నది, మీ కొంచెం సాయపడలేమా " అంటారు. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ తెలుగు సభలకు వెళ్లినప్పుడు నా వృద్ధాప్యం, నాకు రెండు సార్లు సాయం నిప్పించింది. మొదటి రోజున ఎక్కువసేపు కాకతీయనగరంలో ఉండలేక, జనసందోహం నుండి బైటపడాలని క్రిక్కిరిసిన గేటునుండి ప్రయత్నించగా వెనుక, ముందు త్రోపుడువల్ల ఉక్కిరిబిక్కిరై పడటానికి సిద్ధంగావుండగా, అక్కడున్న జవానొకడు నన్నాదుకొని వాటువేసుకొని బైటికి లాగి కొంతదూరం సాగనంపాడు. రెండోసారి, లోపలికి పోవాలని ప్రయత్నిస్తుండగా లాఠీఛార్జి తోపుడులో చెప్పాకటి పోగొట్టుకొని కుంటుకుంటూ బైటపడి మూకల మధ్యనుండి ఎట్లు ఆవరణ దాట గలనా అని సందేహించుచుండగా, నా ఆందోళన చూచిన యువకు డొకడు రెక్క బట్టుకొని గుంపుల గుండా నెమ్మదిగా

నడిపించుకొని వెళ్లి రిక్షా ఎక్కించి నా హోటల్‌కు సాగనంపాడు. ఇంకొక విశేషం. నేనొక వేళ తీవ్రంగా, అసమంజసంగా మాట్లాడినా వృద్ధుడ నని సహించి ఊరుకొంటారు. రసికత్వం పూర్తిగా వడిలి పోక, ఏ బంధువుల పడుచుపిల్లనైనా, ఏ పరిచితుల యువతినైనా కొంచెం కొంటెగా పలుకరించినా, వేళాకోళంగా మాట్లాడినా, అందచందాలు వర్ణించినా ముసలిపాడనే భావంతో తప్పుపట్టరు. రెండు మూడు సంవత్సరాల క్రితం నేను ఒక స్నేహితుని బంధువుల పెండ్లికి హాజరయ్యాను. ఆ వధువు చాలా అందంగా కన్పడింది. నేను పెళ్లిపందిరినుండి ఇతరులతో బైటికి వెళ్లుచూ, వెనుకకు తిరిగి తిరిగి ఆ పెండ్లికూతురును చూచాను. మరిన్ని బైటకు వచ్చిన తర్వాత ఆమె మిక్కిలి చక్కనిది వగైరా అని మెచ్చులు పలాక్కును. అక్కడున్న మిత్రులు వగైరా ఆయన వృద్ధుడు గనుక, ఆవిధంగా ధైర్యంగా అంటున్నాడు. తప్పు పట్టవలసినది కాదను కొన్నారు. ఈవిధంగా ముసిలితనం కొన్ని సదుపాయాలను, స్వేచ్ఛను, సానుభూతిని, గౌరవాన్ని సమకూరుస్తుంది.

అయితే వృద్ధత్వం లాభాలకంటె అనర్థాలనే ఎక్కువ తెస్తుంది. ముఖ్యంగా వృద్ధుడు అవయవాలు, ఇంద్రియాలు సరిగా పనిచేయక నిస్సహాయుడవుతాడు. శక్తిహీనుడవుతాడు. కాళ్లు చేతులు సవ్యంగా పనిచేయక వడిగా నడువలేడు. బరువు ఎత్తలేడు, దింపలేడు. నడుము పట్టుతుంది. మోకాళ్లు వంగవు, కీళ్లనొప్పులు రావచ్చును. కళ్లు సరిగా కనపడక పోవచ్చును. వ్రాయుటకుగాని చదువుటకుగాని ఓపిక యుండదు. అలసట ఎక్కువౌతుంది. పురుషత్వం పూర్తిగా దిగజారిపోయి, జీవనసారస్యం నశించిపోతుంది. ఇక జీవించటం వ్యర్థ మనిపిస్తుంది.

మంచి బుద్ధి, అభిమానం, ఆప్యాయతగల కోడలు లేక మనుమరాలు భోజనం వగైరాలలో తగినట్లు, తృప్తికలుగునట్లు వర్తిస్తుంది. పై సుగుణాలు తక్కువైతే విసుక్కోవటం, ఏదో ఒకటి ముఖాన పారవేయటం, ఎందుకు వచ్చిన పీడరా అని గొణుక్కోవటం వగైరాతో ముసలివాని జీవితం దుర్భరం చేస్తుంది. కొడుకులు గాని, మనుమలు గాని నిరత్యం చేయటం, పడివుండనీ ముసలి

వాడిని అని అనుకోవటం, గగ్గోలు పెట్టినా మందు మాకు సరిగాగాని, సకాలంలోగాని తెచ్చి ఇవ్వకపోవటం, తగిన వైద్యం చేయించక పోవటం, తండ్రి అని గాని తాత అని గాని అభిమానించక, ఏ ఇంటి వ్యవహారంలోను లేనట్లే వ్యవహరించటం వంటివి జరిగి వృద్ధుడు మరణాని కెదురుచూచునట్లు చేస్తవి.

బంధువులు అతనిని చచ్చినవానిక్రిందే జమకడ్తారు. కూతుళ్లు స్వార్థపరులైతే, ఈయనవల్ల మనకికలాభించే దేమున్నదని, అజా పజా కనుక్కోరు. ఇంటిపెత్తనం పూర్తిగాపోయి, ఇంటిలో కించిత్తైనా పలుకుబడిలేని ముసలివానిని, బైటవాళ్లు ఎందుకు ఖాతరుచేస్తారు? పలుకరింపుకూడా వుండదు. ఏదైనా ముసలి వాడు అడిగితే ఇంట్లోవారినుండికూడా సమాధానం రాదు. రెండో సారి అడిగితే, "అన్నివూసులు నీకే కావాలా" అని కసురుకుంటారు.

పై విధంగా జీవితం నిస్సారం, నిరర్థకమైనదై వృద్ధాప్యాన్ని నరకప్రాయం చేస్తుంది. ఈమధ్యనే ఒకదానిలో చదివాను. ఒక బాలుడు నోడ్డు అంచుమీద కూర్చుండి ఏడుస్తున్నాడట. దారిని పోయే ముసలివా డొకడు జాలిగొని, "కుర్రవాడా, ఎందుకు ఏడుస్తున్నా"వని అడిగాడట. వాడు "నేను పెద్దకుర్రవాళ్లు చేసే పనులను చేయలేకపోతున్నాను, అందువలన ఏడుస్తున్నా" నన్నాడట. చప్పున ముసలివాడు ఆబాలుని ప్రక్కన చదికిలబడి, తానుకూడా ఏడ్వటం ఆరంభించాడట. ఆ చిన్నపిల్లవాని నిస్సహాయత ఈ ముసలివానికి తన అశక్తిని, అసహాయతను జ్ఞప్తికి తెచ్చాయి.

కృతజ్ఞత

రామచంద్రరావు బజారువెంట వెళ్లుతున్నాడు. ఎవరో పిల్చినట్లు వినబడి, ఎవరా అని వెనక్కు తిరిగి చూస్తే, బాల్య మిత్రుడు జోగారావు వడిగా నడచి వస్తున్నాడు. వీ డెప్పుడు

వచ్చాడురా, ఎందుకు వచ్చాడో అనుకొనుచుండగా జోగారావు రానే వచ్చాడు. రావటంతోనే "నీ వెప్పుడు వచ్చావురా? ఇంటి వద్ద అంతాక్షేమంగా వున్నారా?" అని అడిగాడు. "మే మందరం కులాసాగానే వున్నాం. నీ వెప్పు డూడిపడ్డావు? ఏం పనిమీదవచ్చావు? మీవాళ్లంతా కులాసాగా వున్నారా?" అని ఎదురడిగాడు. "ఆ, మేం ఫరవాలేదులే, యథాప్రకారం. మా కొక చిన్నదావా వచ్చింది. మా వకీలుతో మాట్లాడిపోదామని వచ్చాను, నీవో" అన్నాడు. "ఆ కమిషన్ వర్తకుడు సరుకులు పంపిస్తే, సరిగా జవాబు చెప్పడు. అదేదో కనుక్కొందామని వచ్చా"ననాడు రామచంద్రరావు. "దగ్గిరలోనే మంచి చల్లని పానీయాల దుకాణం వున్నది. కోకోకోలా ఐనా తీసుకుందాం, ఎండలప్పుడేముదిరాయి"అని రామచంద్రరావు దారితీశాడు. లోపలికివెళ్ళి, రెండు కోకోకోలాలకు ఆర్డ రిచ్చారు. చప్పున జ్ఞాపకం వచ్చినట్లు జోగారావు, "ఒరే రామూ, నీ వా రెండు పుస్తకాలు పంపినందుకు చాలా సంతోషం, కృతజ్ఞుణ్ణి" అన్నాడు. రామచంద్రరావు నవ్వి, "ఏడ్చావులే, నీ పుస్తకాలు నీకు పంపినందుకే కృతజ్ఞతా"అన్నాడు. జోగారావు ముసిముసినవ్వు నవ్వుచూ, "పూర్వం ఒకాయన చెప్పలేదటరా 'పుస్తకం, వనితా, విత్తం పరహస్తం గతం గతం' అని. నీవు స్నేహితుడవే అనుకో. నీకు మతిమరుపు ఎక్కువ. ఎక్కడైనా పెట్టి మరచిపోయావేమో, లేదా, ఎవరైనా పట్టుకొనిపోయి ఎక్కడైనా పారవేశా నన్నారేమో అని దిగులుపడ్డాను మొన్నటివర కవి తిరిగి రాక పోతే. వస్తే, కొత్తపెళ్లాం వచ్చినట్లు సంబరపడ్డాను. ఇక రావని నిశ్చయించుకొంటే, తలవని తలంపుగా నాకు మిక్కిలి ఇష్టమైన ఆరెండు పుస్తకాలు వస్తే కృతజ్ఞత వుండదూ?" అని వెకిలి నవ్వు నవ్వాడు. రామచంద్రరావుకు నవ్వొచ్చింది. "ఒరే, ఈ కృతజ్ఞత మిక్కిలి గడుసుదిరా. అనేక రకాల పోకడలు పోతుంది. రకరకాల రూపాల్లో బహిర్గత మౌతుంది. దీని స్వభావం అతి చతురత కలది. చూడు, నీవు నీ పుస్తకాలు నీకు తిరిగి పంపితే కృతజ్ఞత చెప్తున్నావు. ఈమధ్య ఒక బంధువుతో, 'నీవు మంచిపని చేశా' వంటే, కృతజ్ఞత తెల్పాడు. తెలిసిన గ్రంథకర్తకు, 'మీ పుస్తకం

చదివాను, బాగున్న' దంటే, కృతజ్ఞతాపూర్వకవందనాలని వ్రాశాడు. ఇంకొకరికి ఏదో పనుండి వ్రాస్తూ, 'మీ భార్యా పిల్లలు క్షేమంగా వున్నారా? మీ ఆరోగ్యం బాగున్నదా' అని మామూలు కుశలప్రశ్నలు వేస్తే, మీరు మా క్షేమాన్ని తెలుసుకోవాలని శ్రద్ధ వహించినందులకు మా కృతజ్ఞతాభివందనా లని జవాబిచ్చాడు. ఈవిధంగా రకరకాల వ్యక్తులనుండి వివిధ పరిస్థితుల్లో కృతజ్ఞత ప్రత్యక్ష మౌతుంది. మన తాతల తండ్రుల హయాంలో ఈ విధంగా కృతజ్ఞతలు ప్రకటించేవారు కాదు. ఏదైనా, ఎవరివల్ల నైనా, ఉపకారమో, సహకారమో జరిగితే మనస్సులో వుంచుకొనేవారు. అవతలివారి కవసరం వచ్చినప్పుడు తగిన తోడందించేవారు" అన్నాడు తాపీగా. జోగారా వందుకొని, "అది సరే లేరా, ఒకప్పుడుమాత్రం కృతజ్ఞత అనేది లేకుండా పోయిం దంటావా? పొందిన సహాయానికి సంతోషం వెలిబుచ్చటమో, ప్రతిగా ఉపకారం చేయటమో పూర్వకాలంలోనూ ఉండేది పైకి చెప్పకపోయినా. భారతం తీసుకో, కర్ణుడు దుర్యోధనుణ్ణి అంటకాగి చచ్చేవర కుండటం, సూతకులస్థుడైన తనను అంగదేశానికి రాజునుగా చేసి ఆదరించా డనే కృతజ్ఞతవల్ల కాదా? అం తెందుకు, అశ్వత్థామ దుర్యోధనునికి జరిగిన అపచారానికి ప్రతిచేయటం, చిన్నప్పటినుండి ఆదరించి స్నేహం నెరపాడని కృతజ్ఞతచేతనేకదా? రామాయ ణంలో సుగ్రీవుడు రాముని కిచ్చిన యుద్ధసహాయం, కొంతకు గొంతైనా, తనకు కిష్కింధారాజ్య మబ్బజేసినందులకు కృతజ్ఞతా పూర్వకమైనదే. సాయం చేయకపోతే వాలిని చంపినట్లు తనను కూడా ఎక్కడ చంపుతాడో అని భయం సుగ్రీవుని కుండి యుంటుం దనుకొందాం. అయినా, కొంతవరకైనా కృతజ్ఞత ఉండకపోలేదు. విభీషణుని విషయంలో అట్లు కాదనుకొనవచ్చునేమో. తన అన్న రావణుని రహస్యాలన్నీ చెప్పి అతని అంతానికి తోడ్పడటం పూర్తిగా రాజ్యకాంక్షతో చేసివుంటాడని తోచవచ్చును. అయితే, రామునకు విభీషణుని సహాయానికి కృతజ్ఞత ఉండాలికదా! లంకకు పట్టం గట్టాడని అనవచ్చును. తా నెట్లును కోసలదేశం రాజౌ

తాడు. ఎక్కడో దక్షిణాన సముద్రం అవతలనున్న లంకారాజ్యం తా నెట్లు పాలించగలడు? లక్ష్మణుడు తనను విడిచి వుండడాయె. భరతునికి రాజ్యకాంక్ష లేదు. తన తండ్రి భరతుని తాత కేకయ రాజు కిచ్చిన వాగ్దానం ప్రకారం కోసలదేశానికి భరతుడే రాజై వుండవలసి వుండగా, 'నాకు వద్దు మొర్రో' అని తన చెప్పులను సింహాసనంమీద పెట్టి, తన ప్రతినిధిగా వుంటున్నాడాయె. శత్రుఘ్ను డేదీ పట్టించుకోవటం లేదు. భరతుని చాటున కాలక్షేపం చేస్తున్నట్లున్నాడు. తనకు, తన తమ్ములకు పనికిరాని రాజ్యాన్ని, అందులో హనుమంతుడు దహించడంతో, యుద్ధంతో సర్వనాశనమైన ఆ లంకారాజ్యాన్ని, ఏడ్పు మొత్తుకోళ్ల పరిస్థితుల్లో విభీషణున్నే ఏలుకోనిద్దాం, అతడు నాకు సామంతుడుగా వుంటాడు. అంగబలం, ధనబలం ఉండి, మొక్కవోని కిష్కింధారాజ్యాన్ని ఏలుకొనుచున్న సుగ్రీవుడే చచ్చినట్లు తనకు లోబడి సామాంతుడుగా వున్నప్పుడు, విభీషణు డెట్లునూ తనకు లోబడి తన అదుపాజ్ఞల్లోనే వుంటాడు. సుగ్రీవుని ముఖ్యమంత్రి హనుమంతుడు తన బానిసై పోయాడు. హనుమంతు డంటే సుగ్రీవునకు అభిమానమే గాక, ఆ మహాబలశాలి, ఉపాయశాలి ఎక్కడెదురు తిరుగు తాడో అని భయం కూడా. కాబట్టి సుగ్రీవు డెట్లును తన వాడే. వాలిని చంపి సుగ్రీవునకు కిష్కింధరాజ్య మిచ్చినట్లు, రావణుని జంపి, విభీషణుని లంక ఏలుకోనివ్వటం సబబే. రాజ్యం తనకు దక్కించానని విభీషణు డెప్పుడూ కృతజ్ఞుడుగానే వుంటాడు. ఈ దూరాలోచనతోనే, విభీషణునకు లంకారాజ్యం పట్టం గట్టాడు గాని, రాముడు కృతజ్ఞతతో చేయలేదు. కాని, విభీషణునకు కొంచెమో గొప్పో ఉండియుండకపోదు. ఐతే, రామాయణంలో కృతజ్ఞతను తెల్పే ఇతర ఘట్టాలు లేకపోలేదు. ఉదాహరణకు, ఆటవికుడైన జటాయువు తన నాదరిస్తూవచ్చాడని సీతను రావణు డెత్తుకు పోవుచున్నప్పుడు విడిపించాలని, అడ్డగించి మరణం పొందాడు. ఇటువంటివి మన పురాణాల్లో అక్కడక్కడ కనబడతవి. కాబట్టి కృతజ్ఞతనేది ఇప్పుడు కొత్తగా మొలిచింది కాదు" అని జోగారావు ఉద్ఘాటించాడు. "సరే, నీవు చెప్పింది బాగానే

వున్నది. ఇక మన పనులమీద మనం వెళ్దాం'' అని రామచంద్ర రావు లేచాడు. ''మళ్లీ ఎన్నాళ్లకు కలసికొంటామో'' అని జోగా రావుకూడా లేచాడు. బైటకు వచ్చి ఎవరిదారిని వారు వెళ్ళి పోయారు.

౧౦

నా ఇంట్లో నేను దొంగనైపోయాను

నా ఇంట్లో నేను దొంగనైపోయా నంటే, నా ఇంట్లోవాళ్ల డబ్బు నేను దొంగిలించానని కాదు. నా చిన్నతనంలో మా అమ్మ దాచుకొన్న చిల్లరడబ్బు లెత్తుకొనిపోయి శనగపప్పు, బఠాణీలు కొనుక్కొన్న మాట నిజమే. అయితే, చిన్నపిల్లవాణ్ణి కాబట్టి దానిని దొంగతనంగా ఎంచుకోకూడదు. పైగా మా అమ్మ డబ్బు మా పిల్లలకు కాకపోతే మరెవరికి? మా అమ్మకు చెప్పకపోయినా, తల్లి ఎక్కడైనా తన చిన్నబిడ్డలకు దొంగరికం కట్టుతుందా? ఏ తల్లి అయినా మరీ చిన్నవాళ్లు కాకపోతే, ''దొంగచచ్చినాడా'' అని తిట్టవచ్చును గాని, ''నా బిడ్డలు దొంగ''లని ఇతరులతో చెప్పుకుంటుందా? అయితే, చిన్నతనంలో చిల్లరడబ్బులు చెప్పకుండా తీసుకొని పోయేవాళ్లు, ఆ అలవాటును పెద్దవాళ్లైన తర్వాతకూడా కొనసాగిస్తే, ఇంట్లో అమ్మ నాన్న డబ్బులు, అన్న అక్క దాచుకొన్నవి గాక, బైటవాళ్ల డబ్బులుకూడా సంగ్రహిస్తే, ఏ మంచి నీళ్లకో అని పొరుగింటికి వెళ్లి, వాళ్లు చూడకుండా చేతికి దొరికింది ఎత్తుకొనిపోతే దొంగతన మనాలి. బైటవాళ్ల డబ్బుల సంగతటుంచి, ఏ అవసరం కలిగో, సమయానికి భార్య చేతిసంచిలో డబ్బు కనబడి, ఆమెతో చెప్పకుండా తీసుకొనిపోతే, దొంగతనం చేశాడని అనవచ్చునా? ఈమధ్య నేనొక కథ చదివాను. ఒకాయన, బాగా చదువుకొన్నవాడు ఉద్యోగం చేస్తున్నవాడే, ఏదో అవసరంవచ్చి తన జేబుసంచిలో (పర్సు) డబ్బు లేకపోగా, తల దువ్వుకొనే మేజాబల్లమీద భార్య చేతిసంచి కనపడగా,

దానిలో వున్న డబ్బులో కొంత తీసి, పట్టుకుపోయాడు. వంట యింటిలోనే వున్న భార్యకు చెప్పనేలేదు. తర్వాత భార్య, డబ్బవసరం వుండి, చేతిసంచిని తెరవగా, డబ్బంతా కన్పడలేదు. ఏమైనదా అనుకొని, సాయంత్రం తిరిగి వచ్చిన భర్తను ''డబ్బు తీశారా?'' అని అడిగింది. భర్త తెల్లబోయి, గుటకలు మ్రింగుతూ, ''తీశా'' నన్నాడు. భార్య నవ్వుతూ, పరిహాసంగా, '' అట్లయితే మీరు దొంగ'' అన్నది. అతనికి తలపైన పిడుగుపడిన ట్లయింది. తత్తరపాటుతో వివర్ణుడైనాడు. చాలా సిగ్గుపడిపోయాడు. భార్య అతని దురవస్థను చూచి, '' అయ్యో, మీ రట్లా అయిపోయా రేమిటి? నేను సరదాగా అపహాస్యంచేశాను, అంతే. నా డబ్బుకు మీ రెలా దొంగ అవుతారు? మీ డబ్బన్నా, నా డబ్బన్నా మన డబ్బే కదా!'' అని అనునయం మాటలతో దగ్గరకు చేరి లాలించి, అతడు తేరుకొనేటట్లు చేసింది. తేరుకొని, భర్త '' నేను చిన్నప్పుడు మా అమ్మ డబ్బు లెత్తుకొనిపోయి చిరుతిండ్లు కొను క్కొనే వాడను. ఆ అలవాటో, ఆ బుద్ధో, నాలో జీర్ణించి, ఇంకా వున్నది కాబోలు. నీవద్ద వున్న డబ్బును నీకు చెప్పకుండా తీయవలసింది కాదు. దొంగతనం కాకపోయినా, తప్పే. నన్ను క్షమించు'' అన్నాడు.

నేను చెప్పే 'నా ఇంట్లో నేను దొంగనైపోయా'నన్న దిట్టిది కాదు. అస లది నా దొంగతనం కానేకాదు. ధాన్యం, లేక అపరాలు అమ్మినపాపతు పెద్దమొత్తాలు వస్తే, వానిని క్రింది ఇనుపపెట్టెలో భద్రపరుస్తాను. దానిలోనుండికాని, ఇతర్త్రా చిల్లర మొత్తాలు వస్తే వానినికాని, నిత్యవాడకానికి మేడపైని నేను వ్రాసుకొనే మేజాబల్ల సొరుగులో పెడ్తాను. నే నేదో వ్రాస్తు న్నప్పుడో, చదువుకుంటున్నప్పుడో ఇంట్లో నౌకరు వచ్చి, '' కూలి వాడు డబ్బుకు వచ్చాడు, కాపలావాడు జీతానికి వచ్చాడు, నౌకరు కవసరం అట, 10 రూపాయలు కావా లంటున్నాడు''అని చెప్పితే, చప్పున ప్రక్కనున్న సొరుగు తీసి డబ్బుంచిన కవరుతీసి వాని చేతి కిచ్చి పంపటం మామూలు. ఎక్కడనుండి, ఎందులోనుండి డబ్బు తీసింది, ప్రక్కనున్న నౌకరుకి తెలుసును. డబ్బిచ్చినవెంటనే లెక్క-

పుస్తకంలో వ్రాస్తాను. కాని, లెక్క పుస్తకంలో జమా ఖర్చు తేల్చను. సొరుగులో ఎం తుండవలసింది తెలుసుకోను. ఇట్లు జరుగు చుండగా, సొరుగులో మిగిలిన డబ్బు ఒకనా డెవరికో ఇచ్చివేశాను. ఇక ఇనుపపెట్టెలోనుండి తీయా లనుకొనుచుండగా, ఎవరో 30 రూపాయలు తెచ్చి యిచ్చారు. దానిని మామూలు కవరులో పెట్టాను. మూడోనా డెవరికో ఇవ్వవలసి కవరు తెరవగా అందులో 20 రూపాయలే ఉండినవి. ఎవరి కన్నా ఇచ్చి మరచిపోయానేమో అనుకొన్నాను. ఇట్లాగే ఇం కొకసారి గమ నించి, ఇక జాగ్రత్తపడాలనుకొని నౌకరు ముందు కవరుతీసిడబ్బు తీయటం మానానుగాని, సొరుగు మార్చలేదు. పెట్టేచోటు మార్చలేదు. తిరిగి, డబ్బు తక్కువ కనపడటం గమనించి, ఇం కొక సొరుగులోకి మార్చి మామూలు కవరుగా కనబడే కవరులో డబ్బును పెట్టి చప్పున కనపడని మారుమూల పెట్టుతున్నాను. ఇంతవరకు ఎవరైనా డబ్బుతీసుకొన్నట్లు కనపడదు. సామాన్యంగా నౌకరు నడిగా ననుకోండి. వాడు తీసినా ఒప్పుకుంటాడా? చూడనిదే "నీవే తీశా" వని ఎట్లు అనగలను? అనే నోజు లేనా? పూర్వమైతే అనుమానముంటే చావదన్నేవాళ్లం. ఈనోజుల్లో చేస్తుండగా చూచినా సాహసించి దండించలేకున్నాం. "దొంగ తనం చేస్తే పోలీసుకు రిపోర్టివ్వాలిగాని నీవే న్యాయాధికారివలె, దండిస్తావా" అని వాళ్లూ వీళ్లూ జగడానికి వస్తారు. ఒక సందర్భ ములో పట్టుకొన్న దొంగ కొన్ని నోజులు గడచిన తర్వాత "నేను దొంగతనం చేయలేదు, నీవు పట్టుకొనలే" దని డబాయించాడు. మా దొడ్లో నౌక రొకడు పిండిన పాలు, పాలలోటానుండి వ్రాగు చుండగా, మా వాడు చూచాడు. "తప్పైంది, క్షమించండి. కుదుర్చుకొన్న సంవత్సరం ఇంకా రెండునెలల్లో నిండుతుందికదా, అంతవరకు దయతలచం" డని ప్రాధేయపడగా, గట్టిగా చివాట్లు పెట్టి ఊరుకొన్నాం. కొన్నినోజులు గడచిన తర్వాత, వాడు పని సరిగా చేయకపోవటం, నాగాలుండటం మొదలుపెట్టాడు. "ఇదేమిటిరా, చేసినతప్పు క్షమించి, పోనిలే ఈ రెండునెలలు ఉంచుకొందాం అని సమాధానపరుచుకొంటే ఈ నాగా లేమిటి,

పని సరిగా చేయకపోవట మేమి '' టని అడిగాను. వా డెదురు తిరిగి '' నేను పాలు త్రాగానా, మీరు చూచారా, పట్టుకొన్నారా '' అని గద్దించాడు. నేను నిర్ఘాంతపోవటంలో ఆశ్చర్య మేముంటుంది? ఈ విషమించిన పరిస్థితుల్లో, దొంగిలించిన వారిని దొంగలనటానికి వీల్లేదు కాబట్టి ఎత్తుకుపోతారేమో అని నేనే జాగ్రత్తపడుతున్నాను. నౌకరు పైకివచ్చి చెప్పితే ఇస్తాలే అని చెప్పి, వానిని క్రిందకి పంపించి, వా డింకా ఇక్కడే వున్నాడేమో అని ప్రక్కచూపులు చూచి, దొంగచాటుగా డబ్బు తీసి, వానిని పైకి రమ్మని పిల్చి, లేక నేనే క్రిందకి దిగివెళ్లి అడిగిన వాళ్లకిస్తున్నాను. ఇది, నేను దొంగనైనా నని తెలపటం లేదా?

మనుష్యులే కాదు, పిచ్చుకలు, ఎలుకలు, ఉడుతలు నన్ను దొంగను చేస్తున్నవి. కిటికీలనుండి, ద్వారాలనుండి పిచ్చుకలు నా పడకగదిలోకి వచ్చి, సీలింగుఫాను అరలో గూడు పెట్టుకొని, డ్రెస్సింగు టేబుల్ పెద్దనిలువుటద్దం మీద, దానిమీది చిన్న అద్దంమీద ముక్కులతో పొడిచి, చికాకుచేస్తుండేవి. కొంతకాలం కిటికీ తలుపులను మూసి వుంచాను. తర్వాత, కిటికీలకు జల్లెడ తడికల నమర్చాను. కిటికీచువ్వల ద్వారా రావటానికి వీలులేక ద్వారాలగుండా రానటం మొదలుపెట్టాయి. ఇక, ద్వారాల తలుపులను నేను గదినుండి బైటికి వచ్చినపుడు వేసుకొని రావలసి వస్తున్నది. లోపలికి వెళ్లేటప్పుడు తలుపులు తీసి, వెంటనే తలుపులు వేసుకొని, తిరిగి బైటికి అడుగిడిన వెంటనే వానిని మూయవలసివస్తున్నది. ఎవరు దొంగైనట్లు? నేనా, పిచ్చుకలా?

రాత్రిళ్లు ఎలుకలు నా పడకగదిలోకి వచ్చి గందరగోళం చేస్తుంటాయి. అందుకని, పడుకోబోయేటప్పుడు ద్వారం తలుపులు గట్టిగా బిగించుకోవలసి వస్తున్నది. నేను పుస్తకాలు పెట్టుకొనటానికి గార్డెజ్ ఇనుప రాక్ను కొన్నాను. ఉడుతలు, పుస్తకాల వెనుకసందులో గూళ్లుపెట్టుకొని పిల్లలను కనటం మొదలుపెట్టాయి; బాగా సందుచేసుకొనటానికి పుస్తకాలను కొంత కొరికివేశాయి. చచ్చినట్లు వానికి కొయ్యరెక్క లమర్చి తాళాలు వేయవలసివచ్చింది. నా పుస్తకాల కొయ్యబీరువాపై

దొన్నెవంటి పైభాగంలో ఏవో అట్ట లవి వుంచగా వానిని పాడు చేసి గూడుపెట్టుకొని పిల్లలను కన్నాయి. అట్టలు వగైరాను తీసివేసి పై దొన్నెను ఖాళీగా వుంచవలసివచ్చింది. ఇంతకంటె ఎక్కువ బాధ, నారెండు పెద్ద తైలవర్ణచిత్రాల వెనుకభాగంలో గోడ మధ్య ఖాళీలో గూళ్లు కట్టుకొన్నాయి. వాని ఆదుర్దాలో, చిత్రాల క్రిందిభాగాన్ని పెద్ద తూట్లుపరచాయి. చిత్రపటాలను హాలులోనుండి తీసి, నా పడకగదిలో గోడకంటేటట్లు అమర్చవలసి వచ్చింది. ఎలుకలు, ఉడుతలు దొరలు కాగా, నేను దొంగనై పోలేదా ? నా ఇంట్లో నేను దొంగనైనాసని చెప్పటం సబబుగా లేదా ?

ఇట్టిది సంస్కారమా ?

ఎక్కడో ఒక కథ చదివాను. కాలేజి లెక్చరరొకరు డబ్బివ్వని విద్యార్థులను తప్పించేవాడు. ఫస్టుక్లాసు రావలసిన వాళ్లకు థర్డుక్లాసు మార్కులు వేసేవాడు. అందువల్ల ఉద్యోగస్థులు కావలసినవాళ్లు గుమాస్తాలుగా నౌకరి చేస్తుండేవారు. మరిన్ని, అందమైన ఆడపిల్లల కన్యాత్వాన్ని బలవంతంగా హరించే వాడు. ఈ రెండు బాధలకు గురియైన వ్యక్తి, తరువాతికాలంలో పెద్ద హోదాగలకంపెని మానేజింగు డైరెక్టరయ్యాడు. ఈ లెక్చరర్ కొడుకు, ఆ కంపెని ఉద్యోగానికి దరఖాస్తు పెట్టు కొన్నాడు. కొడుకు తెలివితేటలు, మంచితనం కలవాడు. ఫస్టుక్లాసులో ఉత్తీర్ణుడైనవాడు. ఇంటర్వ్యూకిరాగా, కొడుకు పోలికలను బట్టి మానేజింగ్ డైరెక్టరు అనుమానపడి, అడిగి, ఆ లెక్చరర్ కొడుకని తెలుసుకొన్నాడు. "నీ తండ్రిని వచ్చి నా యింటివద్ద నన్ను కలసికొమ్మని చెప్పు"మని కొడుక్కు చెప్పాడు. తండ్రి మానేజింగ్ డైరెక్టర్ ఇంటికి వెళ్ళగా, టిఫిన్ వగైరా ఇచ్చి

లెక్చరర్‌తో, ఆయనను తాను గుర్తు పట్టానని, తనను పరీక్షలో తప్పించి, అపకారం చేసినాడని జ్ఞాపివున్నదని, తన పినతల్లి కూతురు కన్యాత్వాన్ని బలవంతంగా అపహరించిన సంగతి మరచి పోలేదని మానేజింగ్ డైరెక్టరు మొదట నిష్ఠూరా లాడాడు. అయినా, ఆ మాటలను మెత్తగా మాట్లాడి, ఆయన మనస్సును తాను నొప్పించానేమో, దానికి పరిహారం చేద్దామన్నట్లు, తన కాడిలాక్ కారులో ఆయనను ఇంటికి పంపిస్తూ "మీ రప్పుడప్పుడు వస్తుండం"డని ఆహ్వానించాడు. ఆ తెలివిగల లెక్చరర్, "నా కొడుకు అమాయకుడు. నా రూపు రేఖలున్నా నా దుర్గుణా లతనికి రాలేదు. సద్గుణవంతురాలగు వాని తల్లి సుగుణాలు అతని కబ్బినవి. కాబట్టి మీ క్రోధం నామీద చూపాలిగాని, అతని కన్యాయం చేయకూడ" దని విజ్ఞప్తి చేసుకొన్నాడు. మానేజింగ్ డైరెక్టరుకు ఇది సమంజసమేనని తోచింది. ఆ యువకునికి ఉద్యోగ మిచ్చాడు.

అయితే, ఆ దుష్టుడు, తనను పరీక్షలో అన్యాయంగా తప్పించటమేగాక, తన చెల్లెలిని మానభంగం చేసి ఆమె ఆత్మహత్యకు కారకుడైన నీచుడు, హంతకుడు కదా! అతనికి మర్యాద చేయటం, టిఫిన్ వగైరా ఇవ్వటమేగాక, తన గొప్ప కారులో పంపటం, పైగా, అప్పుడప్పుడు వస్తుండమని ఆహ్వా నించటం, సంస్కారమా? ఇది మానవ సహజమా? అసహజం, అనుచితంకాదా? ఈవిధంగా ప్రవర్తించేవాడు మూర్ఖుడు, దురహంకారి, స్వోత్కర్షకలిగినవాడు అయియుంటాడు. తానేమో ఘనకార్యాన్ని చేసినట్లు, తనను తాను మెచ్చుకొనే వాడయివుంటాడు. కన్నుకు బదులు కన్నూడగొట్టమని కాదు గాని, ఒక చెంప ఛెళ్లు మనిపిస్తే, చిరునవ్వుతో రెండో చెంప అందించటం మిక్కిలి తెలివితక్కువపని. అంతేకాదు, చెంప పగుల గొట్టినవానిని ప్రోత్సహించట మౌతుంది. అందుకే, కృష్ణభగ వానుడు "వినాశాయచ దుష్కృతాం" అని చాటాడు.

ప్రపంచ తెలుగుసభలు

అరవై ఏళ్ళ బసవయ్య తన యింటి వీధి అరుగుమీద కూర్చుని, చుట్టకాల్చుకొనుచున్నాడు. దారిని పోతున్న 25 ఏండ్ల సుబ్బారావును చూచి, "ఏరా సుబ్బారావూ, ఎప్పుడు వచ్చావు? హైదరాబాదుకు ప్రపంచ తెలుగుసభలకని వెళ్లావటగా" అన్నాడు. సుబ్బారావు " ఈ ఉదయమే వచ్చాను, పెద్దయ్యా " అంటూ దగ్గరకు వచ్చాడు. "కూర్చో, సభల వింతలు, విశేషా లేమిటి? రేడియోలో వింటున్నాను, పత్రికల్లో చదువుచున్నాను. కాని, ప్రత్యక్షంగా నీవన్నీ చూచివచ్చావు కదా! నీ అనుభవం నా కెందుకు కల్లుతుంది? వినాలని వుంది " అన్నాడు. " ఏమి అనుభవమో, ఏమో. చచ్చి చాయంగల విన్నపాలైంది. చావు దప్పి కన్ను లొట్టపోయినట్లుగా ఇంటికి చేరుకొన్నా " నన్నాడు సుబ్బారావు. " అదేమిటి! పత్రికలవాళ్ళు, రేడియోవాళ్లు దిగ్విజయంగా జరిగాయి, ముఖ్యమంత్రిగారికి, రెండోపక్షంలో విద్యామంత్రిగారికి జేజేలు కొట్టాలి, బిరుదు లివ్వాలి, ఘనంగా సన్మానించా లంటుంటే, నీ వేమో చప్పరిస్తా వేమిటి?" అని అడిగాడు బసవయ్య. సుబ్బారావు కొంత ఊపిరి తీసుకొని, " కాదు పెద్దయ్యా, సభలు బొత్తిగా నీరసంగా జరిగాయనికాదు నా గోడు. నావంటి యువకులుకూడా సరిగా చూడటానికి, వినటా నికి పూర్తి అవకాశం కలగలేదు. సభలు, సన్మానాలు, నృత్య ప్రదర్శనాలు, నాటకాలు వగైరా, ఆ పెద్ద మైదానంవంటి లాల్ బహదూర్ అనే క్రొత్త పేరుగల ఫతే మైదాన్ స్టేడియంలో 'కాకతీయనగర్' అని సభలకోసం నామకరణం చేసి, జరిపారు. ఉపన్యాసాలు, సన్మానాలు, సాంస్కృతిక కలాపాలు జరిపే వేదిక ఒక మూల ఏర్పరచబడింది. 'ముఖ్యమంత్రిగారు మిమ్మలను ఆహ్వాన సంఘంలో చేర్చారు, 25 రూపాయలు రుసుం మాత్రం కట్టి, డెలిగేట్ గా మీరు రండహో, అన్ని సదుపాయాలు ఏర్పాటు

చేస్తాం' అని విద్యామంత్రిగారుచ్చారా స్తే ఉబలాటపడి వెళ్ళానుకదా! వ్యయప్రయాసల కోర్చి వెళ్లిన నావంటి డెలిగేట్లు నందరిని వేదికకు 100 గజాల పైచిలుకు దూరంలో కటికనేలమీద కూర్చోబెట్టి మన్నారు. మైకుల పుణ్యమా అని మా కేదో కొంత వినబడిందిగాని, వేదికమీది మనుష్యులు, చర్యలు మాకు కనబడనేలేదు. పైగా బ్రహ్మాండమైన చుట్టుగాలరీలకు ప్రవేశం ఎవరికైనా ఉచితం. ఇక చూచుకో, హైదరాబాదీయులు, చుట్టుప్రక్కలవాళ్ళు తండాలు తండాలుగా, వేలమీద వేలు, లక్షకుమించి, అన్నిరకాలవాళ్ళు, ఎగబడి త్రోసుకొని వచ్చి గాలరీల నన్నిటిని ఒకరిమీద ఒకరు పడి ఆక్రమించుకొనటమే గాక, ఇంకా చోటు చాలక, ద్వారాల మీద పడ్డారు. పోలీసులు లాఠీలతో త్రోసివేయవలసి వచ్చింది. టేర్ గాస్ బాంబు లుపయోగిద్దామా అనుకొని, బాగుండదని మానివేశారని కూడా విన్నాను. ఈ స్థితిలో నావంటి పడుచువాళ్ళకే ప్రాణం ఉక్కిరి బిక్కిరయింది. మరిన్నీ, సంగీతాలు, నృత్యాలు, నాటకాలు, ఆటలు, పాటలు ఒకదానిమీద ఒకటి ఏర్పాటు చేశారు. తెల్లవార్లూ జరుగుతూనే వున్నాయట. తీరా వెళ్లాను కదా సన్మానాలన్నా చూద్దామనుకొన్నాను. అవీ సరిగా చూడనేలేదు. సన్మానాలతోనే రాత్రి భోజనంవేళ అయితే ఇక ఇతర సాంస్కృతిక కలాపాలన్నవానికి ఎక్కడ అవకాశముంటుంది? ఒకవేళ భోజనం మాని కూర్చుందామా అనుకొంటే, సరిగా కనపడకపోవటమేగాక, మంచినీళ్లకుకూడా గతిలేకపోయె. అధికాచమటుంచి అల్పాచమానానికి వసతిలేకపోయె. ఇక సుఖమెట్లు ఉంటుంది" అని వాపోయినట్లు చెప్పుకుపోయాడు.

ఇంతలో అటుప్రక్కనుండి 75 ఏళ్ల రామారావు దారిని వెళ్లుచూ, ఈ మాటలు విని ఆయనా దగ్గరకువచ్చాడు. "రా, అన్నా" అని బసవయ్య తనప్రక్క చోటు చూపించాడు. "నీవు కూడా హైదరాబాదుకు ప్రపంచ తెలుగు సభలకని వెళ్లావని విన్నాను. నే నేదో గొప్పగా జరిగింది, వెళ్లి చూచినవాళ్ళు అదృష్టవంతు లనుకొనుచుండగా, ఈ సుబ్బారావు ఏదో గొడవ

చెప్పుకొని వస్తున్నాడు. నీవు పెద్దవాడవు, ఎక్కువ అనుభవం కలవాడవు, కొంత హెచ్చుచ్థాయి కలవాడవు కదా, నీ నోటినుండి వినాలని వున్నది చెప్పుతావా" అన్నాడు. రామారావు నవ్వి, "కుర్రవాళ్ళకేం, ఎట్లైనా నెగ్గుకువస్తారు. నావంటి వయస్సు మళ్ళిన వారికే ఇట్టి తిరునాళ్ళు, జాతరలు ప్రాణసంకటం. సభలుబొత్తిగా విఫలమైన వనలేనుగాని, పూర్తిగా జయప్రదమైన వని, పత్రికల్లో, రేడియోలో డబ్బావాయించుచున్నట్లు, చెప్పలేను. నా స్వంత అనుభవం చెప్పాలంటే, కొంత నిరుత్సాహమే కలిగింది. మొదటిది, జిల్లాలనుండి ప్రతినిధులుగా వెళ్లినవారికి, జరిగే కార్యకలాపాలలో పాల్గొనటానికిగాని, చూచిసంతోషించటానికిగాని తగిన వసతులు, అవకాశాలు లేకుండాపోయాయి. వారికి కార్యకలాపాలు జరిగే వేదికకు సమీపాన ఏర్పాటుచేసేదానికిబదులు, దూరంగా కనబడటానికి వీలులేనట్లుగా, కటిక నేలమీద కూర్చోమన్నారు. మోకాళ్లు వంగక క్రిందకూర్చోలేని నావంటివాళ్లు, కొంచెంసేపు నిలబడి వెళ్లిపోవలసివచ్చింది. వేలకువేలు పట్టే చుట్టుగాలరీలకు ఉచిత ప్రవేశం అనుమతించటంవల్ల, రెండోరోజున ఎంత తన్నుకొన్నా నావంటి ఇతర ప్రదేశాలనుండి వచ్చిన ప్రతినిధులకు స్టేడియంలోకి ప్రవేశమే దొరకలేదు. పైగా ఒక గేటువద్ద త్రోపుడులో నా చెప్పుపోయింది. ఇంకా నయం నేను క్రిందపడి పచ్చడి పచ్చడి కాలేదు. 'బ్రతుకుదేవుడా' అంటూ గుంపునుండి బైటపడ్డాను. నా దురవస్థనుచూచిన యువకుడొకడు పల్చబడిన జనంనుండి నెమ్మదిగా నడిపించుకొనివెళ్లి రిక్షా ఎక్కించాడు, ప్రాణం కుదుటబడి హోటల్‌కు చేరుకొన్నాను. మొదటి రోజునకూడా డెలిగేట్సుకు నియమించిన ప్రదేశంలో నేలమీద కూర్చోలేక బైటికి వెళ్ళాలని ప్రయత్నిస్తే గేటుముందు వందలుండి వెనక్కు నెట్టగా పడిపోయే స్థితిలో ఒక ముస్లిమ్ పోలీసు ఆదుకొని ఎట్లో బైటికి చేర్చాడు. మొదటిరోజునైనా ఎంతో అవస్థపడితేనేగాని నాకు పాస్ దొరకలేదు. నా డెలిగేటు రుసుము రశీదు చూపిస్తే చాలదు, పాస్‌బుక్ ఇస్తారు తెచ్చుకోండన్నారు. ఎక్కడిస్తారని అడిగితే, ఒకరు ఆప్రక్క, ఇంకొకరు ఈప్రక్క, మరొకరు స్టేడియం వెనుకప్రక్క

అన్నారు. ఆప్రక్క, ఈప్రక్క తిరిగి వెనుకప్రక్కకు వెళ్ళి కొంత శ్రమతో ఇచ్చేచోటుకు చేరుకొంటే అక్కడ పెద్దగుంపు ఉండింది. ఎవరినో బ్రతిమాలి, ఎలాగో పాసుబుక్కు సంపాదించాను. ఒకరోజు ఆలస్యంగా వచ్చిన భీమవరంవారికి తన్నుకు చచ్చినా, పాస్‌లు దొరకలేదు. నేను వారితోనే వెళ్ళి చూస్తే మొదటి రోజున ఇచ్చినగదికి తాళం వేసి వున్నది. ఎవరి నడిగినా, సానుభూతి చూపించిన ఒక పోలీసు ఇన్‌స్పెక్టరు సాయంకూడా, ఉపయోగం లేకపోయింది. భీమవరంవారు ఆరోజుకు ఆశ వదులుకొని, 'శాతవాహన నగరం' అని పేరుపెట్టిన ఎగ్జిబిషన్ గ్రౌండ్సుకు పోవలసివచ్చింది.

"వచ్చిన చిక్కల్లా, ఏర్పాటులు సకాలంలో మొదలు పెట్టలేదు, సకాలంలో జరుపలేదు. వయస్సు మళ్ళినవాడ ననటం చేతను, హోటల్ వాళ్లు నాకవసరమైన వసతులతో గది నిస్తారనే నమ్మకం లేకపోవటం చేతను, ఎందుకైనా మంచిదని 4 రోజులు ముందుగానే హైదరాబాద్ చేరాను. మొదటిరోజునే స్టేడియంకు వెళ్లాను. అప్పటికి వేదికతోసహా అన్ని పనులు ప్రారంభదశలోనే వున్నవి. మర్నాడు ఆ కార్యకలాపాలలో ముఖ్యపాత్ర వహించుచున్న వారిలో నొకరైన మిత్రుడొకరు తన కారులో అక్కడకు తీసుకొనివెళ్లారు. ఎక్కడి గోతులక్కడే, ఎక్కడి కుప్పలక్కడే, దూలాలు, వాసాలు వగైరా చిందర వందరగా పడవేసి వున్నాయి. వేదికకు తగురూపం అప్పుడే ఇస్తున్నారు. ఎర్రఇటుక, ఎర్ర మట్టితో వేదిక నొక ప్రక్కన అప్పుడే కట్టిన మెట్లు, అప్పుడే తగిలిన గాయాల పుండ్లను గుర్తుచేస్తూ ఎంతో రోతగా వుండినవి. చివరకు సభాప్రారంభదినం ఉదయానికికూడా పనులు జరుగుచునే వున్నవి. ఆ ఉదయం 9-30 గంటలకు ముఖ్యమంత్రిగారు జాతీయ పతాకావిష్కరణ చేయవలసివున్నది. నేనా రోజు 9 గంటలకు ముందే పతాక వేదికను చూడటానికి వెళ్లగా, దాని కింకను సిమెంటు ఎర్రరంగు పూస్తూనే వున్నారు. ఇంత అధ్వాన్నంగా పనులు జరిగాయి. ఏవో కారణాలవల్ల పనులు వారం రోజులు మాత్రమే ముందుగా మొదలుపెట్టారట. నెలల క్రితమే పత్రికల్లోను, రేడియోలోను ప్రచారం మొదలుపెట్టిన వాళ్ళు ఎంత

తొందరపను లితరాలున్నా, బాధ్యత కలవారిని కొద్దిమందినైనా ముందుగా ఏర్పాటుచేసి సభాప్రారంభానికి రెండు రోజులైనా ముందుగా అన్నిపనులూ పూర్తిచేయించవలసింది.

"జరిగిన గందరగోళానికి ముఖ్యకారణం సినిమా నటుకుల, గాయకుల సన్మానం, వారి కార్యకలాపాలు. వారిని చూడాలని ప్రజాసందోహాలు రెండో రోజున, తర్వాత గాలరీలకు ఎగబడి, నేల ఖాళీలంతా నిండి త్రొక్కిసలాడారు. మూసివున్న గేట్లమీద విరుచుకుబడ్డారు. అందువల్ల రభసైంది.

"అయితే, వివిధ అంశాలమీద జరిగిన గోష్ఠులకు స్టేడియం వెనుక ప్రక్కన అమర్చిన పెద్ద డేరాలో, 'నాగార్జునపీఠం' అను పేరుతో వేదికనమర్చారు. అక్కడ ఈ త్రొక్కిసలాట లేదు. సావకాశంగా ఉపన్యాసాలు వినటాని కనుకూలంగా వుండినది. నావంటి మోకాళ్లు వంగని కొలదిమందికి కుర్చీలు దొరికాయి. ఈ ప్రసంగాలు ఉదయం కనుక ఊరిజనం పైబడటాని కవకాశం లేకపోయింది. పైగా సాంస్కృతిక సంబంధంగా వుండిన ఈ ఉపన్యాసాలకు ప్రజాసామాన్యం ఎగబడరు కదా! ఇందులో ముఖ్యవిశేషం, ఇతర రాష్ట్రాలు, దేశాలనుండి వచ్చిన పెద్దలు, ప్రతినిధులు తమ ఉత్సాహాన్ని, అభిమానాన్ని, అభిప్రాయాలను చక్కగా తెల్పగలిగారు. కాకతీయనగరంలో వేదికవద్ద వారికి కొన్ని కుర్చీల నమర్చినా, అక్కడి గందరగోళంకంటె ఇక్కడనే వారికి సావకాశం కలిగిందని నా అభిప్రాయం.

"రెండోది శాతవాహన నగరం. ఇది ఎగ్జిబిషన్ గ్రౌండ్సులో ఏర్పాటుచేసిన మన ఆంధ్ర విజ్ఞాన, సాంస్కృతిక, వస్తుసంపదల ప్రదర్శనం. ఇక్కడ మన లలితకళలు, చేతిపనులు, పుస్తకాలు, ఖనిజాలు, అటవీసంపద వగైరా ప్రదర్శింపబడ్డవి. దీనిలో జనసందోహాల త్రోపుడులు లేవనే చెప్పాలి. ప్రదర్శనం మొత్తంమీద బాగున్నా, ముఖ్యంగా చిత్రలేఖనాలు కొన్ని అయినా హెచ్చుస్థాయి కలవి కావు. కొన్ని మరీ అధ్వాన్నంగా వున్నవి. చిత్రలేఖకులు ప్రతిమాలో, బామాలో వానిని

పెట్టించుకొన్నట్లున్నది. నన్నయవంటి ప్రముఖుల చిత్రపటాలు లేవు. ఖనిజాలు, కొయ్యరకాలు మామూలేగాని, ఒకచోట శిల్పసంపదను చూచాను. దానిలో ప్రదర్శించిన గరుడాళ్వారు మొదలైన విగ్రహాలు గొప్పగా నుండినవి. పుస్తకాలు కొంత విరివిగానే వుండినవిగాని, కొందరు ప్రచురణకర్తలు పాల్గొననే లేదు. మొత్తంమీద నాకు కాకతీయ నగరంలోని గలాభాకంటె, శాతవాహన నగరంలోని సావకాశమే ఎక్కువగా తృప్తినిచ్చింది.

"ప్రభుత్వం, సభలను జయప్రదంచేయాలని గట్టిగా సంకల్పించింది. శాయశక్తులా ప్రయత్నించింది. అయితే, సరియైన వ్యవధిలేకుండా కార్యకలాపాలను ప్రారంభించటంచేత, కొందరు పెద్ద స్థాయిగల పెద్దలనే మొదట ఆహ్వానించలేదట. ఒకప్రముఖ హైదరాబాదీయుని మాటసందర్భంలో 'మీరు గొప్పగా పాల్గొనియుంటా'రనగా, 'అబ్బే, అసలు నా కాహ్వానమే లేనిదే' అన్నారు. నేను ఆశ్చర్యచకితుడనైనాను. ఆయనకంటె హెచ్చుస్థాయిగల హైదరాబాద్ ప్రముఖునికి కూడా మొదట ఆహ్వానం లేదట. రోజులు గడుస్తుండగా గుర్తుకు వచ్చో, ఇతరులు చెప్పటంచేతనో కొందరి పెద్దల కప్పటి కప్పుడు ఆహ్వానాలు వెళ్లినవట. పత్రికల్లో కొంత చలనం కల్గించిన ఒక పెద్దమనిషికి చివరిదశలో ఆహ్వానం రాగా తిరస్కరించాడట. ఆయన 'ఇది దొడ్డి సంభావనా' అని అభిప్రాయపడినట్లు తెలిసింది. పండితసన్మానాల విషయంలో తమంతట తాము జ్ఞాపకంచేసుకొన్నవారికి చివరిక్షణంలో ఓదార్పు సన్మానాలు జరిగాయి. ఒక విజయవాడ పండిత కవి, శతావధానిగారిని 'మీ కెప్పు'డని ప్రశ్నించగా, 'నా కిక్కడ గాదు, విజయవాడలో' నన్నారు. అడిగిన మూడోనాడు ఆయన సన్మాన వేదికమీదకు రాగా, ముఖ్యమంత్రిగారు ఒక పైపంచె మెడలో వేశారు. ఇంకొకాయన 'ఇంతకు ముందు పాడిన గీతం వ్రాసింది నేనే' అని చెప్పుకోగా ఆయన కొక పైపంచె సత్కారం. ఆ విధంగానే ఇంకొక గీతం వ్రాసినవారికి అదేవిధమైన సత్కారం. సత్కరించాలని మొదటను వ్రాసుకొన్న పేర్లవారిని ఘనంగానే, చక్కని పెట్టెలో పెట్టిన వెండి షీల్డు, శాలువా, విలువైన

బట్టలతో సత్కరించారు. తర్వాత వారిని పోనీలే అన్నట్లు కక్కుర్తి తీర్చారు.

"పైగా, కోస్తా జిల్లాల పండితులను, కవులను, సాహితీ పరులను, కళాకారులను కొంతవరకైనా విస్మరించారు. ప్రభుత్వోద్యోగులు, పోలీసు ఆఫీసర్లు, సభలు ఏర్పాటుచేసిన కార్యకర్తలు, అభిమానించినవారికి సన్మానాలు, పారితోషికాలు, బహుమతులు జరిగినవని, ఎదుట కన్పడనివారిని విడిచిపెట్టటం జరిగిందని నాకు తట్టింది. నేను పోరపాటుపడి యుండవచ్చునుకాని, నాతోబాటు కొంతమందైనా ఈ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ముఖ్యమంత్రి, విద్యామంత్రి వగైరా నిష్పక్షపాతంగా, సర్వసమానత్వభావంతో, నిజాయతీగా, సభలు పూర్తి జయప్రదంకావాలనే దీక్షతో, కార్యం జరిపారనే అనుకోవాలి. అయితే పై లోపాలు సంభవించినవి. ఇవి దురదృష్టం." అన్నారు.

స్వేచ్ఛా స్వాతంత్ర్యాల మూల్యమెంత ?

పరతంత్రరాజ్యం పోయి మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ప్రజాస్వామ్యం వచ్చింది. వ్యక్తిగత స్వేచ్ఛలు వచ్చాయి. ఇరవయ్యో శతాబ్దంలో విజ్ఞానశాస్త్రజ్ఞానం, సాంకేతికజ్ఞానం చాలా విస్తృతాన్ని పొందిన పాశ్చాత్య దేశాలతోబాటు మనం కొంతకుకొంత పురోభివృద్ధి చెందాం. ఆ దేశాల ప్రజలు నాగరికతలో పురోగమించినట్లే మనం కొంత వరకైనా పురోగమించాం. మన ప్రాచీన నాగరికతను తిరిగి తోడుకొనుచున్నాం. మనకూ, బలమైన త్రివిధ యుద్ధనిపుణులు, సేనావాహినులు, ఆయుధా లున్నాయి. మనప్రతినిధులే, మన రాజ్యాంగాన్ని నిర్మించుకొన్నారు. మనమే శాసననిర్మాతలను ఎన్నుకొన్నాం, వారు మన ప్రతినిధులుగా పరిపాలకులను ఎన్నుకొన్నారు. ప్రజలందరు ఏకజాతైనారు. దేశం బలపడింది,

సామర్థ్యాన్ని పెంచుకొన్నది. ఇతర దేశాలలో మన ప్రతినిధులుగా రాయబారు లున్నారు. నానాజాతులసంస్థలో మనకు తగిన ప్రాతినిధ్యమున్నది. మనకు మౌలిక హక్కు లున్నాయి. ఆలోచనా స్వాతంత్ర్యం, వాక్స్వాతంత్ర్యం, వ్రాతస్వాతంత్ర్యం, మత స్వాతంత్ర్యం, నడవడిస్వాతంత్ర్యం వున్నది. కాబట్టి సలక్షణమైన దేశ జాతి, వ్యక్తులముగా మనం రూపొందాం. మన ఆత్మతృప్తి ప్రపూర్ణమైంది.

అయితే, వీనిని మనం చక్కగా, సవ్యంగా ఉపయోగించుకుంటున్నామా? మన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు తగిన పంథాలలో ఉచితరీతిని కొనసాగుచున్నవా? కొనసాగకపోతే, ఆచరణలోకి రాకపోతే, వాని లాభం మనం పొందకపోతే వానివలన మనకేం ఉపయోగం కల్గుచున్నది? వాని మూల్య మెంతనుకోవాలి?

స్వేచ్ఛ వ్యక్తిగతం, సంఘపరం. దేశవ్యాప్తం. వ్యక్తిగా తాను చెప్పగలుగునది చెప్పటం, చేయగలిగినది చేయటం, అనుభవించగలది అనుభవించటం. భావస్వాతంత్రత, కార్యాచరణ స్వేచ్ఛ, జీవనస్వాతంత్ర్యం, తాను నమ్మిన దేవుని కొల్చుట, తానాచరించదలచుకొన్న ధర్మాన్ని నెరవేర్చటం, తన జీవితాన్ని తన కిష్టం వచ్చినట్లు మలచుకొనటం, తనకు తోచింది బహిరంగ పరచటం, తన కిష్టమైన పనిని తన కిష్టమైనచోట ఆచరించటం, తన బ్రతుకును వివిధరంగాలలో, రకరకాలుగా నడిపించుకొనటం ఇవన్నీ వ్యక్తిస్వేచ్ఛను వ్యక్తీకరిస్తవి. బాగానే వున్నది. అయితే, ఈ వ్యక్తిగతస్వేచ్ఛలను మనం సరిగా ఉపయోగించుకుంటున్నామా? వీనిని మనం కొంత తరచిచూద్దాం. మొదట భావస్వాతంత్ర్యాన్ని తీసుకుందాం. దీని నిప్పుడు వికృతపరచటం లేదా? చూడండి, దేవుడు లేడనటం నుంచి, లైంగికాన్ని ప్రేరేపించు వరకు, తలిదండ్రులకు తమ బిడ్డలందుండు ప్రేమ బిడ్డల కొరకు కాదు, తలి దండ్రుల తృప్తి కొరకే, బిడ్డలను కన్నది, తమ స్వార్థానికే యనువరకు; పిన్నలు పూజ్యులైన పెద్దలకే కాదు, తలిదండ్రుల కేమాత్రం భయభక్తులుగాని, విధేయతలను గాని చూపించ నవసరం లేదనటంవరకు; ఇతరుల అభి

ప్రాయాలు మా కనవసరం, మా కిష్టమైనట్లు, అప్పటి కప్పుడు తోచినట్లు మాట్లాడుతాం, మమ్మెవ్వ రడ్డగించగలరనడంనుంచి, ఇతరులను దుమ్మె త్తిపోయువరకు; అధ్యాపకులనేవారు విద్యార్థుల ఇష్టప్రకారం బోధించాలి, నడవాలనటంనుంచి, మేము పాఠాలు చదువకపోయినా, విషయాలు నేర్చుకొనకపోయినా, పరీక్షల్లో కాపీకొట్టినా, అసలు పరీక్షపత్రాలను వ్రాయకపోయినా, మేము పాసైనట్లు ఎంచాలనేవరకు ఈ భావస్వాతంత్ర్యం వెళ్ళింది.

ఇక కార్యాచరణస్వేచ్ఛ విషయం. మే మేమి చేసినా ఒప్పుకోవాలి. మొండిమొలతో తిరిగితేనేం, జుట్టు పెంచుకొంటే ఏం, గడ్డం పెరిగితేనేం, మూబట్ట లవకతవకలుగా ఉంటే ఏం, మీ కేం నష్టం? మేము బహిరంగ పార్కుల్లో, స్నానఘట్టాల్లో లైంగికాల్ని సాగిస్తే మీకు వచ్చిన ఇబ్బం దేమి? మేము ఆసనాలే వేస్తామో, ఒంటినిండా బూడిద పూసుకొని, గోచీలు పెట్టుకొని తిరుగుతామో మీ కెందుకు? పంతుళ్లను కొట్తామో, స్త్రీలను హింసిస్తామో, తలిదండ్రులను వాళ్లగతికి వాళ్లను విడిచిపెట్తామో, భార్యా బిడ్డలను విసర్జిస్తామో మీ కే విధంగా సంబంధం? దొంగ తనాలు, దోపిళ్లు చేస్తామో, వాళ్లని వీళ్లని చంపుతామో మీ కనవసరం అంటున్న దీ కార్యాచరణస్వేచ్ఛ.

మిగిలింది జీవనస్వేచ్ఛ. మే మెక్కడనో, ఏ విధంగానో జీవనం గడుపుకొంటుంటే మీ కేవిధంగా ఇబ్బంది కల్గుతుంది? కొండగుహల్లోనో, కొండజాతులతోనో నివసిస్తాం. ఏ స్త్రీతోనో, ఏ జంతువుతోనో కాలంగడుపుకొంటాం. మే మేవిధంగా జీవిస్తే మీ కేం? జుట్టు విరబోసుకొని, ఏ సారంగమో చేత బుచ్చుకొని, పాటలు పాడుచూ, గంతులేస్తూ, భిక్షం అడుక్కుంటే మీ పుట్టేమి మునిగింది? గడ్డాలు పెంచుకొని, చింపిరిబట్టలు వేసుకొని, లేక దిగంబరులమై, ఆడ మగ భేదం లేక, సామూహికంగా లైంగిక వ్యాసంగం కొనసాగించుకొంటూం, బ్రతాగి తందనాలాడతాం, జట్టుగా స్త్రీ పురుషులం క్రింద మీద పడుతూ నాట్యాం చేసుకొంటాం మీ రెందుకు పట్టించుకోవాలి? అవసరంవస్తే,

వీరిది వారి దనే భేదంలేక వస్తువులను, డబ్బును వాడుకొంటాం, మోసంచేసో, దొంగతనంచేసో డబ్బు సంపాదించుకొంటాం, వీలు లేకపోతే ఎక్కడకైనా ఉడాయిస్తాం మీ రెందుకు బాధపడాలి? మమ్మల్ని బీట్‌నిక్కులని, హిప్పీలని ఎందుకు నిరసించాలి? మా శరీరానికి మేము యజమానులం, దాని నిష్టం వచ్చినట్లు తినిపిస్తాం, వాడుకొంటాం, ఇష్టమైనవాళ్లతో సంఘంగా ఏర్పడతాం, సంఘంగా జీవితం కొనసాగిస్తాం. మీరు జోక్యం పెట్టుకో కూడదు. ఇట్టి ధోరణులతో ఈకాలంవారు వ్యక్తిగతస్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్నారు కదా!

ఇక సంఘస్వేచ్ఛ. అవును, మా దేవుని మే మిష్టం వచ్చిన రీతిని పూజించుకుంటాం, ఊరేగించుకుంటాం. మీ రెవరు అడ్డం చెప్పటానికి? తెలివితక్కువవల్ల మీ దేవుడే మీకిష్టమైతే, మా కేమీ అభ్యంతరంలేదు. కిమ్మనకుండా, మీ కిష్టంవచ్చినట్లు మీ ప్రార్థనలు, పూజలు సల్పుకోండి. అంతేగాని మీ రవి చేయ గూడదు, ఇవి చేయగూడదనే హక్కు మీ కెక్కడున్నది? ఇక, ఆచార వ్యవహారాల్లో, మా స్వంతపద్ధతులప్రకారం మేము నడుచుకుంటాం. మీ రెవరు, అన్నిమతాలవారు సమానపద్ధతుల్లో వ్యవహరించాలని చెప్పటానికి? మీ సంఘజీవన మిట్లుండాలి, మీ స్త్రీల నిట్లు చూడాలి, పరస్త్రీలతో వ్యభిచరించకూడదు అని నీతులు చెప్పటానికి హక్కు మీ కెవరిచ్చారు? సాంఘిక వ్యవ హారాల్లో అగ్రకులం, శూద్రకులం, అంటరానికులం భేదాలు సమసిపోయాయా? గాంధిమహాత్ముని పుణ్యమా అంటూ, కాలమార్పుల ప్రభావంవల్ల, ఓటు రాజకీయనీతిగా, వ్యక్తుల దీక్షాఫలితంగా అన్ని కులాలు సమానమే అని చట్టాలు కూడా వచ్చాయికదా! నేను భూదేవుణ్ణి, నేను ఆర్యవైశ్యుణ్ణి, మేము చాలా గొప్పవాళ్లం, మీరు శూద్రులు, మాకిందివాళ్లు, మీరు అంటరానివాళ్లు, మీరు దూరంగా వుండాలి అని బహిరంగంగా చెప్పకపోయినా, శాసనభయంవల్ల అభిప్రాయాలను బైటబెట్టక పోయినా, ఇదంతా గూడుపుఠాణికాదా? సందుదొరికినప్పుడల్లా ఒక అగ్రజాతివాడు ఇంకొక కులంవానికి ఉద్యోగాల్లోగాని,

పరిశ్రమల్లోగాని, రాజకీయాల్లోగాని సమానావకాశం ఇస్తున్నాడా? సచ్ఛూద్రులమో, వర్ణాలమో అని బడాయిపోయేవాళ్లు కూలి నాలి జనాన్ని, పంచములనే వారినే కాదు, ఇతర వెనుకబడిన సంఘాలవారిని సమానంగా చూస్తున్నారా? దేవుని విషయంలో కూడా కులవ్యత్యాస ముండుచున్నదికదా! గర్భగుడిలోకి జొరబడటానికి అగ్రజాతివాడు తన హక్కుగా ఎంచుకుంటూ, ఇతరులను బైట వుంచటంలేదా! మఠాలలోకూడా ఈ వ్యత్యాస మున్నది కదా! పెండ్లి పేరంటాలలో, భోజనమజ్జనాదులలో ఈ వ్యత్యాసం మనం చూడటంలేదా? ఇది సంఘ మోసం, ద్రోహం కాదా? ఇతర దేశాల్లో నల్లరంగు, తెల్లరంగు అని భేదం లేదా? తెల్లరంగువాళ్లు నల్లరంగువాళ్లని హీనంగా చూడటంలేదా? వాళ్లకు తగిన అవకాశాలు, వసతులు లేకుండా చేయడంలేదా? మరిన్నో, జీతం ఎక్కువచెయ్యండనో, బోనస్ ఎక్కువియ్యండనో, లాభాలు పంచిపెట్టండనో, మాటిమాటికి సమ్మెలు చేయటం, లైట్లార్పటం, పట్టాలు వగైరా తప్పించి, రైళ్లు పడిపోయేటట్లుచేసి, పదులకొద్ది మానవ జీవితాంతాలకు కారకులు కావటం, మన సాంఘిక పురోభివృద్ధికి చిహ్నమంటారా? యజమాని, పెద్ద కార్యకర్తలు పెద్దపెద్ద జీతాలు తీసుకుంటున్నారు. మంచిభవంతుల్లో నివసిస్తున్నారు. మోటారుకార్లలో తిరుగుచున్నారు. మాకుకూడా సమాన జీతాలు, సౌఖ్యాలు కావాలని సామాన్య కార్మికులు, తాత్కాలికంగా పనికివచ్చిన కూలీలు కోరటం, తగాదాపెట్టటం, సాధ్యంకాదంటే సమ్మె చేయటం, లేక రూల్సుప్రకారం పనిచేస్తామని వంకబెట్టి రూల్సు ప్రకారం నిండుపని చేయకుండా సగం పని చేయటం, దానినికూడా సవ్యంగా చేయకపోవటం, ఈ పనులవల్ల కంపెనీకి నష్టంరాగా, వచ్చిందోచచ్చిందో, అదంతా మాకెందుకు, మాజీతం పెంచాలి, బోనసు పెంచాలి, మావసతులు, సౌఖ్యాలు పెంచాలని కుమ్మ్లాడటం పరిపాటైపోవటంలేదా? పని సరిగా చేయక, కాలం అటూఇటూ వృథాపుచ్చి, అయ్యో పని పూర్తి కావాలికదా, ఇంకా చాలా పని మిగిలిపోయిందని దిగులుపడే

యాజమాన్యం, సరే, మీరు ప్రొద్దుపోయినా పని కొనసాగించండి, అధిక కాలానికి రెట్టిం పిస్తాం అనేటట్లు చేయటానికి కాదా వీళ్ల ప్రయత్నం? ఈ అధిక కాలం పేరు చెప్పుకొని జేబులు నింపు కొనటానికి కాదా, తాము న్యాయంగా రూల్సు ప్రకారం చేయ వలసిన పనిని మందకొడిగా సాగించి, కాలం వృథాచేయటం? పైగా కార్మికసంఘాలని ముఠాల నేర్పరిచిన కార్మికనాయకు లనేవారు, తాము దమ్మిడీ పనిచేయకుండా నోటి బోంకరింపుతో, మొసలి కన్నీళ్ల సానుభూతితో కార్మికులను మోసంచేస్తూ, సంఘ సభ్యుల జీతాలనుండి తీసుకొన్న డబ్బు, కక్కుర్తిపడి యజమానులు చాటుగా లంచాలిచ్చిన ఫాక్టరి సొమ్ముతో, తాము నిరసిస్తున్న ధనికులకంటే భోగభాగ్యా లనుభవించటం, ప్రజాసముదాయాల అభివృద్ధికి తోడ్పడుతుందా? వర్తకులు, వ్యాపారస్తులు అవసరాలు వచ్చాయని, అవసరాలను సృష్టించి, వస్తువుల ధరలను, జీవిత వ్యయాన్ని అపరిమితంగా పెంచివేయటం, నల్లబజారులో వేలు, లక్షలు సంపాదించటం ప్రజాసంక్షేమానికేనా?

ప్రజాభ్యుదయంకోసం, ముఖ్యంగా గ్రామీణులకోసం, అమలులోనికి వచ్చిన పంచాయతి పరిపాలన, బీద బిక్కి మీ టటుంచి, మామూలు జీవితం గడిపే సామాన్యప్రజలకైనా వసతులు, సౌకర్యాలు కల్గిస్తున్నదా, గ్రామజీవితంలోని సామ రస్యాన్ని నాశనంచేయటం తప్ప? గ్రామపరిపాలనను తమ చేతు ల్లోకి తీసుకొనాలని తహతహతో కొందరు బైలుదేరి, ఓట్లకోసం ప్రజలను చీల్చటంలేదా? పార్టీలు పడి, వేలు క్రుమ్మరించి, సామాన్యప్రజలను, కూలి నాలి చేసుకొని బ్రతికేవారిని మోహ పెట్టి, అవినీతికి పాల్పడునట్లు చేయటంలేదా? కొన్ని చోట్లలోనైనా బ్బర లెగరట్టంలేదా? ఇదంతా ప్రజల్లో, ముఖ్యంగా గ్రామా దుల్లో ఐకమత్యానికి, సంఘీభావానికి, అందరికి న్యాయం జరగ టానికి తోడ్పడుతున్నదా? పూర్వంలో గ్రామపెద్దలు నిష్పాక్షి కంగా వ్యవహరించటం, సామరస్యంగా తగాదాలను తీర్చటం, గ్రామాభివృద్ధికి ఒక కట్టుగా వ్యవహరించటం జరుగుచుండేది. మన కిప్పుడు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, దానికి ముందున్న

శాంతి భద్రతలు గ్రామాల్లో వున్నాయా ? మనదేశం మా టటుంచి ప్రజాసందోహాలలో పాపభీతి, న్యాయాన్యాయవిచక్షణ జ్ఞానం, ఇతరులను హింసించకూడదు, ఒక తప్పుకు మరొక తప్పును చేయకూడదనే బుద్ధి క్షీణించిపోవటం లేదా ? సందుదొరికిందని కొన్ని దేశాలు పెట్రోలు, డీజెల్ ఆయిల్ వంటి ముఖ్యవస్తువుల ధరలను విపరీతంగా పెంచి, వర్ధమాన దేశప్రజలను బాధపెట్టటం లేదా ? ఏదో తమవారికి అపకారం జరిగిందని ఆకాశంలో ఎగురు చున్న విమానాలను స్వాధీనంచేసుకొని ప్రయాణంచేస్తున్న ఏ పాపం ఎరుగని వారిని, పిల్లలు స్త్రీలతో సహా, బాధించటం, చంప టం, విమానాలను నాశనంచేయటం చూస్తున్నాం కదా ! ఇది మానవ సాంఘికాభివృద్ధిని, సంక్షేమాన్ని తెలియబర్చేదేనా? 20-వ శతాబ్దం నాల్గవ పాదంలో మన మంతా స్వేచ్ఛాపరులమైనా మని, నాగరికుల మైనామని చెప్పుకొనుట కవకాశ మున్నదా ? శాస్త్రజ్ఞానంతో ప్రకృతిరహస్యాలు కొన్నిటిని భేదించి రైళ్ళు, విద్యుత్, టెలిగ్రాఫ్, టెలిఫోను, కార్లు, బస్సులు మొదలైన వాని నుపయోగంలోకి తెచ్చుకొని, విమానాలమీద ప్రయాణిస్తూ చంద్రమండలం కూడా చేరుకొన్నాం. నిజమే. ఈ అభివృద్ధికి తగినట్లు వ్యవహరించుచున్నామా ? స్వాతంత్ర్యం సంపాదించాం సరే, స్వాతంత్ర్యాన్ని ఇతరుల కందనిస్తున్నామా ?

ఇక దేశంవిషయం. దేశాన్ని తీర్చిదిద్దేది రాజ్యాంగం. ఈ రాజ్యాంగాన్ని ప్రజానాయకులమని చెప్పుకొనే రాజకీయ తంత్రజ్ఞులు తారుమారుచేయటం, రాజ్యాంగాన్ని కాపాడవలసిన బాధ్యతగల పెద్ద లుపేక్షించటం జరుగుచున్నదికదా ! తగినన్ని శక్తివంతమైన ఆయుధాలను సేకరించుకొని, తగిన సైనికసిబ్బందిని సమకూర్చుకొని వారిని బలాఢ్యులనుగా చేసే తరిఫీదిచ్చి, దేశ సరిహద్దులను సంరక్షించుకొనుటకు తగిన జాగ్రత్తలను తీసుకొనక పోవటంచేతనేకదా, 1962 లో మనం చైనాదేశస్థుల చేతుల్లో చావుదెబ్బతిన్నది ? శాసనాలు చేసి, ప్రజల నుచితమార్గాను వర్తులను గావించటానికి ఆదర్శప్రాయులుగా నడుచుకొనవలసిన శాసనసభ్యులు ముఠాలు పడి, తగాదాలు పెంచి, కొట్లాటకు దిగి

పార్టీలు మార్చటం, మంత్రివర్గాలను తారుమారుచేయటం, గవర్నర్ల పరిపాలనలు రావటం, అందువలన ప్రజాస్వామ్యం తాత్కాలికంగానైనా ఊడటం దేశక్షేమానికి దారితీస్తుందా? సాధారణ పరిపాలనలో శాసనసభ్యులు, రాజకీయ పెద్దలు, ముఠా నాయకులు జోక్యం కల్పించుకొని, ఉద్యోగులను బెదిరించి, తమ మద్దతుదారులకు అనుకూలంగా అన్యాయాలు చేయించటం, మరిన్ని, సహాయం చేస్తాము, లేక చేయించుతామని డబ్బు గుంజటం, లైసెన్సులు, కోటాలు బినామిదారుల పేరున తమ అధికారం చెలాయింపుతో సంపాదించి, నల్లబజారులో డబ్బు చేసుకొనటం దేశాభ్యుదయానికి కారకమౌతుందా? కేంద్రశాసన సభల్లోకూడా ఇట్టి తంతులు కొనసాగించటం, నిందలు మోపు కొనటం, అబద్ధప్రచారాలు చేయటం, చట్టవ్యతిరేకమైన, అపసవ్య మైన పద్ధతిలో ప్రభుత్వాన్ని పడగొట్టాలి, పడగొట్టితీర్తా మనటం, మంత్రులు డబ్బా వాయించుకొనుచు మే మింతచేశాం, ఇంకా చేస్తాం అని ప్రగల్భాలు పలకటం, ఏమీ చేయకపోవటం, చీటికి మాటికి వేలు ఖర్చుపెడుతూ పరదేశాల కేగటం, పిల్లి సమర్తాడిం దన్నా, ఆ సంబరానికి బోలెడంత ప్రభుత్వండబ్బు తగులపెట్టి, అంతకుమించిన ఖర్చును ఆహ్వానించినవారిచేత ఖర్చుపెట్టించటం, వేసిన పునాదిరాళ్లు (శంకుస్థాపనలు) గుర్తులేకుండా పోయేవరకు పనులు మొదలుపెట్టకనేపోవటం, ఆ ప్రాజెక్టు పెడ్తాం, ఈ ప్రణాళిక నేర్పాటుచేస్తాం అని ఆశపెట్టి ప్రజల నిరుత్సాహపెట్టటం దేశ సౌభాగ్యానికి తోడుపడుతుందా?

కంట్రోలను పేరున ముఖ్యావసరవస్తువులను అపరూపం చేయటం, పరపతి అనే నెపాన్న సదుపాయాలను తగ్గించటం, ఉత్పత్తి పంపక విధానాలు కొందరు ధనికుల చేతుల్లో మాత్రమే ఉండకూడదని ప్రభుత్వ కార్పొరేషన్ లేర్పరచి, దోపిడీలు చేయించి లంచగొండితనం పెంచటం, పెద్దల పేర్లమీద లక్షలు ప్రభుత్వ బాంకులనుండి వెలిదీయించి ప్రజలను మోసగించటానికి ప్రయ త్నించటం దేశాన్నుద్ధరించటానికేనా? వాక్ దిగ్బంధంచేసి, పత్రికా స్వాతంత్ర్యం హరించి, తోటివారిని జైళ్లలో నిర్బంధించటం దేశాని కేవిధంగా లాభం? విదేశద్రవ్యమారకం దగాకోరులు,

బంగారు, వెండి దొంగ రవాణాదారులు ఇతర దేశాలనుండి విలువ గల బట్టలు, గడియారాలు, రేడియోలు వగైరా వస్తువులను దొంగచాటుగా దిగుమతిచేసి, వానిమీద విధింపవలసిన సుంకాన్ని ఎగగొట్టటం దేశసంపదను పెంచుతుందా? "దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్" అని ఉద్ఘోషించిన గురజాడవారి సూక్తి గుర్తుంటే, తిండిగింజలను పండించే సామాన్యులమీద కూడా దాడిచేసి, ఉత్పత్తి ఆశావహంకాకుండాచేస్తే దేశ మధోగతి చెందదా?

ఈ అభిప్రాయాలు, అనుమానాలు పెల్లుబికి వస్తవి. మనం స్వతంత్రుల మయ్యాం, నాగరికుల మయ్యాం, ఆకాశంలోకి కృత్రిమ గ్రహాలను పంపగలుగుతున్నాం అనుకొని మన భుజాలను మనం చరచుకోవటం మన దేశ ఔన్నత్యాన్ని పెంపొందిస్తుందా?

మనకు కల్గిన స్వతంత్రత, స్వేచ్ఛ, నాగరికత ఇంచుమించు బూటకంకాదా? వాని మూల్య మిప్పు డెం తుంటుం దంటారు?

వర్ణాంతర వివాహం

ఇక్కడ వర్ణం అనగా శరీరం రంగు కాదు; కులం. మన దేశంలో ఇంచుమించు తెలుపు రంగు నుండి, మసిబొగ్గు రంగుగల దేహాలవారున్నా, మ నందరం భారతీయులమే కాబట్టి వర్ణభేదం లేదు. కాని, మనం కులానికి ప్రాధాన్య మిస్తాం. పాశ్చాత్య దేశాలలో శరీరవర్ణం హిమంవంటి తెలుపునుండి, దంతం (ఏనుగు) రంగు, అంతకంటె కూడా కొంత తక్కువ రంగుగల వా రుండినా, వా రందరూ శ్వేతజాతివారుగానే ఎంచబడుతారు. మరిన్ని, ఆ దేశాలలో కులం ప్రస్తావనే లేదు. ఏ దేశానికి చెందిన శ్వేత జాతీయుడైనా, ఇతర దేశాలకు చెందిన శ్వేతవర్ణ వ్యక్తిని పెండ్లిచేసుకొనవచ్చును. అయితే, ఆ దేశాలలో మన కులానికి ప్రతిగా, వర్ణభేద మున్నది. కూలి నాలి చేసుకునే

శ్రమజీవులకు, ధనికవర్గానికి చెందినవారికి పొత్తు కుదరదు. బొగ్గు గనుల్లో పనిచేసే వానిని, భూవసతిగల కుటుంబంలోని పిల్ల పెండ్లాడుట కిష్టపడదు. భూవసతిగాని, వ్యాపారంగాని, పరిశ్రమల యాజమాన్యంగాని వున్నకుటుంబం పిల్లను లేక పిల్లవానిని ప్రభువుల వంశంలోని వారు వివాహ మాడరు. ఇప్పటి పరిస్థితు లెట్లున్నా, ప్రేమికుల విషయ మెట్లున్నా ధనం, రాజకీయహోదా విషయ మటుంచి, ఇది సామాన్య మన స్థితి. మనలోకూడా బీ దింటి పిల్లను ధనిక యువకుడు చేసుకోడు. కాని, కుల నిషేధం లేకపోతే, అట్టి సంబంధం తప్పుగా ఎంచబడదు. ఇప్పుడు ధనికవర్గంలోని ఒక కులం వారైనా, కట్నాల హెచ్చు తగ్గులను బట్టి వివాహాలను నిశ్చయపరచుకొనుచున్నారు.

మన దేశ పద్ధతిని, వర్ణాంతర వివాహ మనగా కులం తప్పిన వివాహమే. దీనిని అనుచితంగా మనం భావిస్తాము. ఇట్టి భావమే, పాశ్చాత్యులలో వర్ణం తప్పటంవల్ల కలుగుతుంది. వర్ణం తప్పకపోయినా, విభిన్న దేశాల ప్రజల నడవడి, మనోప్రవృత్తి భేదాలవల్ల, ఒక దేశంవారు, మరొక దేశంవారిని వివాహ మాడటం అంత మంచిది కాదనే భావాన్ని సోమర్ సెట్ మామ్ తన నాటకం, "అవర్ బెటర్సు" లో సూచించాడు. ఒక అమెరికన్ యువతి, ఒక ఇంగ్లీషు ప్రభువును, అతని ప్రభుహోదా కొరకు పెండ్లాడా లనుకొంటుంది. ఇంగ్లీషు ప్రభువు ధనాని కాశించి డబ్బున్న అమెరికన్ యువతిని పెండ్లి చేసుకోవా లనుకొంటాడు. ఇద్దరూ చూపరులే. మంచి మన్ననలున్నవారే. సంస్కారం వున్నవారే. ఒకరి నొకరు ఆదరణతో, స్నేహభావంతో చూచుకొనువారే. స్నేహితులైనారుకూడా. కొన్ని అనుకోని సంఘటనలవలన ఆ యువతి, ఆ యువక ప్రభువును వివాహమాడే ఉద్దేశాన్ని మార్చుకొని, ప్రధానాన్ని తప్పించి, అమెరికాకు వెళ్లిపోతుంది. తన స్వదేశంలో, తన స్వదేశస్థుణ్ణి వీలును బట్టి వివాహమాడుతానని చెప్పి వెళ్లిపోతుంది. ఆమె వాక్యాలివి. (తెలుగులో)..."నీ జీవితంలో నేను స్థిరపడిపోగలనని నీవు ఊహించుచున్నావు. నీ జీవితం, హుందాతనం, బాధ్యతా దృష్టి, ప్రజాసేవానురక్తి కలది. పై గుణాలు నీ స్థాయి ఇంగ్లీషు

యువతులకు స్వాభావికముగా వుంటవి. వారు వీనిని చిన్నప్పటి నుండి తెలుసుకొని యుంటారు. వాని నాచరించుటకు తర్ఫీదును పొందియుంటారు. మా కట్టిది లేదు. మా కీ పద్ధతులు ఎంతో విసుగును కల్గిస్తవి. మీ హుందాతనం, మమ్ములను ఇబ్బందిలో పెడుతుంది. అందువలన మాకు చిరాకు కల్గుతుంది. మేము మా కానంద మిచ్చే వానిమీద మాత్రమే ఆధారపడతాము. నీ ప్రాసాదాన్ని గురించి నాతో చెప్పావు. నీ చిన్నతనంలో అక్కడ పెరిగావు. నీ పెద్దలందరు అందులో పుట్టి పెరిగారు. అందువలన ఆ భవనం నీకు సర్వస్వం. నేను నిన్ను గాఢంగా ప్రేమించినట్లైతే ఆ భవనం నాకు కూడా అర్ధవంత మయ్యేది. కాని నిన్ను నేను నిజంగా ప్రేమించటం లేదుకదా! మేము మీ ఇంగ్లీషు జీవిత విధానాన్ని తట్టుకోలేమని నీకు తోచటం లేదా? అది మా తలకు మించి ఎక్కించి మమ్ములను తారుమారు చేస్తుంది. మా పద్ధతులను విడనాడుతాం; మీ దేశ పద్ధతులకు మే మలవాటుపడం; చిందర వందరైపోతాం. మేము దిలాసాగా కాలంగడపటం తప్ప మాకు వేరే గత్యంతర ముండదు. అందువల్ల మేము ముక్కచెక్కలై పోతాం. మా అమెరికాలో అయితే మేము భద్రంగా వుంటాం" అని చెప్పి స్వదేశానికి వెళ్లిపోతుంది.

ఈ పై మనస్తత్వాన్ని, వివేకపూరిత దృష్టిని, యథార్థ పరిస్థితులను వర్ణాంతర వివాహ సమస్యలలో గుర్తించుకోవాలి. నామట్టుకు నాకు కులభేదవివాహాలు ప్రోత్సహించవలసినవనే చాలా సంవత్సరాలనుండి నమ్మకం, ఆశయం. దేశంలోని ఇతర ప్రదేశాలవారితో వివాహాలను, చివరకు పాశ్చాత్య స్త్రీలతో వివాహాలను నే నంగీకరిస్తాను. మా కుటుంబములో ఒక యువకునికి వర్ణాంతర వివాహం చేసుకొమ్మని, చాలా సంవత్సరాల క్రితం సలహా యిచ్చాను. ఈమధ్య మా కుటుంబంలోని దగ్గర యువకు డొకడు గుజరాతి అమ్మాయిని చేసుకొన్నాడు. ఇంకొకడు వెలమ అమ్మాయిని వివాహమాడాడు. నా సన్నిహితమిత్రుల కుటుంబంలోని యువకుడు ఒక అరవబ్రాహ్మణ యువతిని పెండ్లాడాడు. నా బంధువర్గంలోని ఒక విద్యావంతుడు ఒక జర్మన్

శ్వేతయువతిని వరించాడు. వారి చక్కని ముద్దుబిడ్డకు నీ కొడుకును చేసుకొమ్మని పెండ్లాడిన యువకుని సోదరికి చెప్పుతుంటాను. ఆవిధంగా స్వకులం కానివారి, స్వప్రాంతం కానివారి, స్వదేశం కానివారి మధ్య వివాహాలు జరుగకూడదని చెప్పేవాడనుకాను. అయితే, నా పుస్తకం, "మారినకాలం" లో గట్టిగా చెప్పినట్లు, ఏ కులంవారైనా, ఏ జాతివారైనా, సమానప్రతిపత్తి ఉన్నవారితోనైతే వివాహం కొంతవరకైనా చక్కగా నడుస్తుంది. ఏకులానికి చెందినా ఒకరి స్థితిగతులు మరొకరికి, ఒకరి మనస్తత్వాలు, దృక్పథాలు, అభిలాషలు, అభిరుచులు మరొకరికి అర్థమై, తృప్తియై, వాంఛనీయమైనట్లయితే, వివాహబంధం నిలవటాని కవకాశ మున్నది. ఇతర ప్రాంతాల, ఇతర దేశాల, చివరకు ఇతర భాషలవారి సంబంధాలకంటె, ఒకే భాష మాట్లాడేవారు సమానస్థాయిలోవున్న ఇతర కులాలవారితో పెండ్లియాడితే అది నిలుస్తుంది. నేనా గ్రంథంలో చెప్పినట్లు, వివిధశాఖల బ్రాహ్మణులలో, వైశ్యులలో వివాహం, వివిధరకాల రెడ్లలో పెండ్లి, వివిధప్రాంతాల హెచ్చు తగ్గుల హోదాల, కమ్మవారి మధ్య, అట్లే వెలమల మధ్య, తెలగ, కాపు, లేక బలిజ పేర్లతో వ్యవహరింపబడే విభిన్నశాఖలవారి మధ్య వివాహాలు సంతోషించవలసినవి. మరిన్ని, సమానప్రతిపత్తి పూర్తిగా లేకపోయినా అభ్యంతరంలేని సాలె, కుమ్మరి, గొల్ల వంటి కులాలవారితో కమ్మ, రెడ్డి, వెలమ, తెలగ లేక బలిజ కులాలవారు వివాహ మాడవచ్చును. బ్రాహ్మణేతరులలోని అగ్రకులాలు, వెలమ, కమ్మ, రెడ్డి, బలిజ కులాల మధ్య వర్ణాంతర వివాహాలు చాలా మెచ్చదగినవి. ఈ కులాలు సమానప్రతిపత్తి కలవి. ఆచార వ్యవహారాలలో పెండ్లి, వగైరా విధానాలలో ఇంచుమించు ఏకపంథాలోనివి. ముఖ్యంగా రెడ్డి, కమ్మ కులాల ఆచార వ్యవహారా లొకమాదిరివే. ముందు ఈ రెండు కులాలు సమన్వయం పొందటం కోరుకోవలసింది. ఈమధ్యనే శ్రీ బెజవాడ గోపాల రెడ్డిగారిట్టి అభిప్రాయాన్నే వెలిబుచ్చారు.

6x

కవిరాజు సాహిత్య విహారం

ఎ) కవిరాజు సాహిత్య విహార వార్షిక సభ

బి) 'విశిష్ట భారతి' అంకితం

సి) కవిరాజు స్మారక సభ

(కృష్ణాజిల్లా, గుడివాడలో 20-7-1975 తేదీ ఉదయం 10 గంటలనుండి.)

(ఎ) యుగపురుషుడుగా ఎంచదగిన కవిరాజుగారికి, వారి జనన ప్రాంతమైన గుడివాడలో, వారి స్మృతిచిహ్నంగా సాహిత్య విహారం, లేక పీఠం ఏర్పరచబడటం మిక్కిలి సముచితం. కవిరాజుగారు మహాకవియే గాక, సంఘసంస్కారి. సంఘంలోని కుళ్లును బైటబెట్టి, దానిని శుభ్రపరచుటకు తన కవితాప్రతిభ నుపయోగించారు. మూఢనమ్మకాలను పారద్రోలటానికి స్కూత పురాణాన్ని రచించారు. అన్యాయాలను ఖండించటానికి శంబువధ, ఖూనీ, కురుక్షేత్రసంగ్రామం నాటకాలను వ్రాశారు. హెచ్చరించ టానికి కుప్పుస్వామి శతకం, భూ ర్తమానవ శతకాలు చెప్పారు. అసంగతాలను వెలువరించటానికి హేళనకావ్యం భగవద్గీతను కూర్చారు. ఉద్బోధించటానికి, ప్రబోధించటానికి సూతాశ్రమ గీతాలను ఉద్ఘాటించారు. ఆయన పండితుడు, కవియేగాక, సంఘసంస్క ర్తయేగాక హేతువాది, మానవతావాది. అన్నిటిని మించి ప్రజాసామాన్యంలో ఆత్మాభిమానం పెంచడానికి శ్రమిం చారు. అగ్రకులజులమని చెప్పుకొనుచు ఇతర కులాలవారిని, వా రెంత విద్యావంతులైనా, సంస్కృతికలవారైనా, ధనవంతులై పదిమందిని పోషించేవారై నా హీనంగా చూడటం, ఆయన ఆత్మాభిమానాన్ని రేకెత్తించటమేగాక, సోదరమానవులను ఈ సాంఘిక భానిసత్వంనుండి తప్పించి, వారు తమ్ము తామే గౌర వించుకొనేలాగు చేయాలని వారికి దీక్ష కల్గించింది. ఇట్టి మహా భాగుణ్ణి, మహాశయుణ్ణి మనవారిలో కొందరైనా కొలదికాలం

క్రితం గుర్తించి, వారి గౌరవార్థం ఈ సాహిత్య పీఠాన్ని ఏర్పాటు చేసినందులకు మిక్కిలి సంతోషం. దీని స్థాపనలో, వసతి కల్పించే విషయంలో అధ్యక్షుడు శ్రీ త్రిపురనేని శివప్రసాదరావుగారిని, కోశాధిపతి డా. త్రిపురనేని వెంకటేశ్వరరావుగారిని అభినందించ వలసియున్నది. కార్యదర్శి శ్రీ ఆచార్య ఎట్లోజు మాధవాచార్యులు గారివంటివారి సాయంకూడా ఎక్కువగానే ఉండి ఉంటుంది. దీని వసతి నింకను విస్తృతపరచి, తగు సదుపాయాలను ఏర్పాటుచేసి, కార్యకలాపాలను వృద్ధిచేయవలసియున్నది. వీనికి గౌరవనీయులైన విద్యామంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు సానుభూతితో సహాయా లందజేస్తారని ఆశించుచున్నాను.

(బి) "విశిష్టభారతి" అంకితం

గ్రంథకర్త వైవిధ్యంగల సాహిత్యవేత్త. తన వైద్యవృత్తిని పెద్దస్థాయిలోనే నిర్వహిస్తు, నర్సింగు హోమ్‌ను కూడా నడుపుచు సాహిత్యసేవలను చేయటం గొప్ప విశేషం. ఆయన హేతువాది, తార్కికుడు. తన కవితాప్రభను, తన విజ్ఞాన సముదాయాన్ని పైజెప్పిన రెంటిని ప్రచారంచేయటానికి, అమలులో పెట్టటానికి నిరంతర కృషి చేస్తూ ఉంటారు. ఆయ నిప్పటికే కొన్ని పుస్తకా లను ప్రచురించారు. ఇప్పుడు 'విశిష్టభారతి' అనే గ్రంథాన్ని సమకూర్చి గౌరవనీయులైన విద్యామంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారికి అంకిత మిస్తున్నారు. ఈ కన్యాదానం సంతో షించవలసినది. అయితే, ఈ గ్రంథంలోని పద్యాలలో చాలా భాగమైనా ప్రథమ ప్రపంచయుద్ధానికి ముందు, దాని తర్వాత రచించినవి. మంత్రిగారేమో 50 ఏండ్లు లోపువారు. కాని, సీత రామునికంటె పెద్ద దంటారు. వారు ఆదర్శదంపతులు కదా! కాబట్టి ఫరవాలే దనుకోవాలి. ఇం కొకటి. ఈ కన్నియ వివిధ పోకడలు (వివిధాంశాలమీద 73 పద్యాలు) కలది. అయినా దత్తులగు వెంకట కృష్ణారావుగారు సంభాళించుకొనగలరనే నా ధైర్యం. ఈ నూత్నవధూవరులకు నా ఆశీస్సులు.

(సి) కవిరాజు రామస్వామి చౌదరిగారు

వారి హేతుదృష్టి, న్యాయదృష్టి, మానవతాదృష్టి, సంఘ సంస్కరణ వగైరాలను గురించి నే నిక్కడ చెప్పటం చర్విత

చరణమే అవుతుంది. వారి పాండిత్యప్రకర్ష, కవితావైభవాలను గురించి చెప్పటానికి నాకు శక్తిలేదు. అయితే, ఒక్కటి చెప్పవలచుకొన్నాను. అంత గొప్ప కవిని, సంఘసంస్కర్తను మన ఆంధ్రులు ఇప్పటికిని సరిగా ఎందుకు గుర్తించలేదా అను ప్రశ్నకు మనం సమాధానం చెప్పవలసి వున్నది. ముఖ్యకారణం, మనలోని కపటంతోకూడిన నీతిలేని బుద్ధి (ఇన్‌టలెక్చ్యుయల్ డిజానెస్టి) కారణమనుకుంటాను. బ్రాహ్మణేతరులు చదువుకోకూడదనే పంథాలో, అట్టివారు చదువుకుంటే ఓర్వలేనితనం కల్గవచ్చును. అగ్రజాతి అనేవారిలో కూడా వీరికి ఈర్ష్యాసూయలున్నా, అవి మామూలుగా ఉండేవే. బ్రాహ్మణేతరుడు ధనికుడైతే, యాచించి డబ్బు పట్టుకుపోతారు. ఉద్యోగి అయితే ప్రాధేయపడితమవాళ్లకు ఉద్యోగాలిప్పించుకుంటారు. కాని, అతడు విద్యాధికుడు, పండితుడు, కవి అంటే ఓర్వలేరు. వెంటనే అసూయపడతారు. వాళ్లసంగతెట్లున్నా, మనవాళ్లతప్పుకూడా వున్నది. ఫలానావాడు (బ్రాహ్మణేతరుడు) మంచి గ్రంథం వ్రాశాడంటే, ప్రక్కనున్న బ్రాహ్మణేతరుడు "అబ్బే ఏం బాగున్నది, వానికేం తెలుసు? ఫలానా శాస్త్రిగారువ్రాసిన గ్రంథం ఉత్కృష్టంగా వున్న" దంటాడు. అలాగనకపోతే అవతలాయన తాను కులాభిమానంతో చెప్పుచున్నాడనుకొంటాడేమో అని జంకు. తప్పకుండా ఇది తక్కువ స్థాయివాడననే భావం (ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సు). పైగా బ్రాహ్మణేతరకులాల్లో చుప్పనాతితనం హెచ్చు. ఇంకొక స్వకులస్థుడు గౌరవింపబడితే తన కవమానం జరిగినట్లు ఎంచుకుంటాడు. అగ్రజాతివాడు మావా డంతవాడు, ఇంతవాడని వీలున్నప్పుడు, వీలైనచోట్ల డబ్బావాయించుతాడు. బ్రాహ్మణేతరుడు సమయం దొరికినప్పుడల్లా తనవానిని నిరసిస్తాడు. ఈ మనస్తత్వం పోవాలి. "ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమిలో పెట్టిన పెద్దల ఫొటోలలో కవిరాజుగారి ఫొటో లేదేమి, మీ రేంచేస్తున్నా"రని ఈమధ్య హైదరాబాద్ పెద్దవకీలొకాయన నడిగాడు. అప్పటికి నా సభ్యత్వం అయిపోయి కొంతకాలమయింది. లేకపోతే బహుశా అధ్యక్షులుగారితో ఈ ప్రస్తావన తెచ్చేవాడనేమో. అంతవర కెందుకు, ఈమధ్య జరిగిన ప్రపంచ తెలుగు సభలలో ఎవ రెవరివో బొమ్మ

లున్నవిగాని కవిరాజుగారి బొమ్మలేదు. పెత్తనం బ్రాహ్మణే తరులదే అయినా, వారి కిట్టివి తోచవు కాబోలు!

ఆర్యులు - అనార్యులు

ఒకరు ఈమధ్య నా కొక పుస్తకం "ఆర్యుల రహస్యములను వెల్లడించిన ధీరులు" అనే దాన్ని అయాచితంగా పంపారు. దానిని చదివినమీదట నాకు కల్గిన భావాలను వారికి లేఖ పూర్వకంగా తెలిపాను. దానిలోని భాగాలను తెల్పుతున్నాను.

"మీపుస్తకం ఒకవిధముగా విలువైనదే. దీనిని1917-'18లో ప్రచురించియుంటే బాగుండేది. అప్పుడు బ్రాహ్మణేతరోద్యమం తీవ్రస్థాయిని పొంది, జస్టిస్ పార్టీ ఆవిర్భవానికి కారకమైంది కదా! ఇప్పుడా ఉద్యమ ప్రస్తి నిరర్థకం. ఆ వూసే ఎత్తేవాళ్లు లేరు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఒక కులంవారికి పోయిన ప్రాముఖ్యం తిరిగి చేకూరుతున్నది కాని, వ్యక్తుల ప్రాబల్యం ఎట్లున్నా, కులంగా వాళ్ల ప్రాబల్యం తగ్గిందని ఒప్పుకోవాలి. సాంఘికంగా రాజకీయంగా కూడా వాళ్లు కొంత దిగజారిపోయారు.

"మీ పుస్తకం బ్రాహ్మణులు ఆర్యులని, తతిమ్మా కులాల వారు అనార్యులని, ఆర్యులనే బ్రాహ్మణులు రహస్యంగా కుట్రజేసి అనార్యులనే ఇతర కులాలవారిని త్రొక్కివేస్తున్నారనే సిద్ధాంతం మీద ఆధారపడివుంది. రామాయణకాలంలో ఎట్లున్నా, వర్తమానకాలంలో ఈ సిద్ధాంతం చెల్లదు. కాబట్టి ఇప్పుడు ఆర్యులు, అనార్యులని భేదం చూపటం అనావశ్యకం. నిజానికి దేనినిబట్టి ఫలానావాడు ఆర్యుడని, ఫలనావాడు అనార్యుడని చెప్పగలుగుతాం? బ్రాహ్మణకులంలో పుట్టినవాడు ఆర్యుడని, బ్రాహ్మణేతరకులంలో బుట్టినవాడు అనార్యుడని ఈకాలంలో

బ్రాహ్మణుడు కూడా అనలేడు. రూప సంపదనుబట్టి అసలే నిర్ణయించలేము. ముక్కు మొగం తీరులేక, రక్కసిబొగ్గువంటి వర్ణంతో ఉండే బ్రాహ్మణకులస్థు లెంతమంది లేరు? మీవంటి మిక్కిలి ఆకర్షణీయమైన వ్యక్తులు బ్రాహ్మణేతర కులాల్లో ఉన్నారు కదా! పైన వర్ణించిన బ్రాహ్మణ కులస్థుడా, లేక మీరా నిజమైన ఆర్యుడు?

"ఇక మీ పుస్తకములో పేర్కొన్న రహస్యాలను వెల్లడించిన ధీరుల విషయం. కవిరాజుగారు, తాపీ ధర్మారావుగారు, ఆవుల గోపాల కృష్ణమూర్తిగారు, అన్నాదొరైగారు మీ రూహించిన కోవకు చెందినవారు కారని నా అభిప్రాయం. కవిరాజు త్రిపురనేని రామస్వామిచౌదరిగారు రామాయణకాలం, పురాణకాలం విషయాల నెత్తుకొన్నారు. తాపీ ధర్మారావుగారు హిందూసంఘం లోని ప్రాత సాంఘిక పోకడలను వివరించారు. గోపాలకృష్ణమూర్తి గారు వర్తమాన అసమానతల నెదిరించారు. అన్నాదొరైగారు రాజకీయంగా, సాంఘిక, ఆర్థికంగా వర్తమాన వ్యవస్థ మార్పును కోరారు. ఇక పెరియార్ రామస్వామి నాయకర్‌గారు విప్లవవాది. ఆయన మానవ సంఘాన్నే మార్చాలన్నారు. డా. అంబేద్కర్ సాంఘికంగా అవమానంపొంది అసహన శీలుడై మండుచున్న హృదయంతో, ప్రతివిషయాన్ని ఎదురించే హరిజననాయకుడైనాడు. గాంధిమహాత్ముడు హరిజన పిల్లలను తన బిడ్డలుగా పెంచాడు. పాకీపని చేశాడు. తన కొడుకుకు వర్ణాంతర వివాహం చేశాడు. అట్టి మహాత్ముని కుల, వర్ణతత్వం కలవానినిగా డా. అంబేద్కర్ వర్ణించటం క్షమించరాని విషయం. బుద్ధదేవుని ఇందులో చేర్చవలసిందికాదు. ఆయన ఆర్య, అనార్య సిద్ధాంతం కొరకుగాక, మానవోద్ధరణకు అవతరించిన మహాపురుషుడు."

రమణారావు వీధివెంట వెళ్లుతున్నాడు. చంద్రయ్య ఇంటిని సమీపించేటప్పటికి ధుమధుమలాడుతూ చంద్రయ్య వీధివాకిలికి

నచ్చాడు. ఆ ఇంటిని చేరకముందే, ఏవో కేక లింట్లోనుండి వచ్చి రమణారావు చెవులకు సోకాయి. చంద్రయ్య తరహా జూచి, ఏదో జరిగి వుంటుంది, తెలిసికొనాలని కుతూహలంతో ఆగి, "బాబాయీ, ఇంట్లో ఏదో జరిగినట్లున్నదే" అన్నాడు. రమణా రావు చంద్రయ్యకు బంధువు. కొడుకు వర సవుతాడు. "ఏమున్నదిరా రమణయ్యా, మా ముసలిదాని గోడే. చెప్పినట్లు వినదు. చేయ వద్దన్నది చేస్తుంది. మనం సామాన్య వైతులంకదా, బంధువులని, తెలిసినవాళ్లని, లేనివాళ్లని ఏవో కొద్దిగా ఇంట్లోవుంటే వాళ్లకు పంచిపెడతావేమిటే, నీ కెవ రిచ్చారీ బోడిపెత్తనం అంటే, నా కామాత్రం స్వతంత్రం ఇంట్లో లేదా అని ఎదురు తిరగటం నేర్చింది. మా పెళ్ళయి ఇప్పటికి 50 ఏళ్ళయింది. ఇదివరకు నా మాటే గురిగా, భయభక్తులతో వుండేది. ఇప్పు డేమి వచ్చిందో, ప్రక్కింటి పడుచువాళ్ళను చూచి నేర్చుకొన్నట్లున్నది. ఆడవాళ్ళకు అలుసిస్తే ఇంకేమైనా వున్నదా, ఇల్లు గుల్ల కాదూ? అరాచకం కాదూ? అందుకే మా పెళ్ళయిన క్రొత్తలో మా మామ, 'ఆడ పెత్తనం, పంబల దొరతనం' అనేవాడు" అంటూ, ఖాంద్రించి ఊసి ఇంట్లోకి వెళ్లిపోయాడు చంద్రయ్య. ఇంతలో వీధిగుండా వెళ్ళుచున్న జగన్నాధరావు సమీపించి, ఆగి, "ఏరా రమణా, ముసలాయనతో ఏవో వూసులు చెప్పుతున్నావే" అన్నాడు. రమణారావు "ఊసులు కావు గీసులు కావురా. ఆ ముసలాయన వరసకు నాకు బాబాయవుతాడు కదా! వాకిట్లో కనబడితే పలక రించాను. భార్యతో పోట్లాడిన గోడు చెప్పుకువచ్చాడు. ఆమె ఆయన మాట వినకుండా ఎదురు తిరుగుతున్నదట. తనమాట వినటంలేదని, చెప్పినది చేయటంలేదని ఆయన వ్యథ. ప్రాత కాలంవాడుకదా! భార్య తన చెప్పుచేతల్లో పడివుండాలనే పద్ధతి కలవాడైనవాడు. కాలం మారింది. పూర్వం ఆడవాళ్లు కారిప్పుడు. మధ్యవయస్సు స్త్రీ లొకవిధంగా పోతారుగాని, ఈ నవనాగరిక పడుచులు, తల్లిదండ్రులను కూడా లెక్కపెట్టరు. 'మే మిప్పుడు స్వతంత్రులం, డాక్టర్లు అయినాం, ఉద్యోగాలు చేస్తున్నాం, అధికారం చెలాయిస్తున్నాం, మేమెందుకొకరికి లోబడి ఉండాలి? మాకు పురుషులవలెనే సమానప్రతిపత్తి, హక్కులు, ఆర్థిక

స్వాతంత్ర్యం ఉండా' లని ఎదురుతిరుగుతున్నారు కదా! ఆ ముస లాయన నా పెళ్లాం నా మా కెందుకు వినదు, ఆడదానికి స్వేచ్ఛ యిచ్చి పెత్తనమిస్తే పంబల దొరతన మవదా?'' అంటున్నాడని చెప్పుతూ, ఇద్దరు కలసి సాగిపోయారు. జగన్నాధరావు చకితుడై, ''ఆడపెత్తనం పంబల దొరతన మంటే ఏమిటిరా? నే నెప్పు డీ మాట వినలేదే! పంబలవాళ్ళ కెక్కడైనా రాజ్యం వున్నదా? వాళ్ళ రాజ్యంలో ఆడవాళ్ళు పెత్తనం చేస్తారా?'' అని అడిగాడు. రమణారావు నవ్వి, ''ఓరి జగ్గూ, నీ వింత అమాయకుడవేమిరా? ముసలిచంద్రయ్య అభిప్రాయం, అడుక్కుతినే పంబలవాళ్లకు దొరతనం అనగా రాజ్యాధికారం వస్తే ఆ రాజ్యం ప్రజలు ఎంత అధోగతిపొంది, భ్రష్టు లౌతారో, అదేవిధంగా ఆడవాళ్ళ పెత్తనంచెలాయిస్తే గృహం, బిడ్డలు ఛిద్ర మవుతా'' రని. జగ్గారావు చకితుడై, ''ఏమిటీ, చంద్రయ్య నిజంగా అంత మూర్ఖుడా? ఆయనమాట లేమి చెలామణి అవుతా యిప్పుడు? ఆ ముసలాడు నిజంగా 19-వ శతాబ్దంలో వున్నాడు. కాలం ఎంత మారిందో, మనుషు లెంతమారారో, ప్రత్యేకించి స్త్రీ లెంత మారారో ఆయ నింకా గ్రహించలేదల్లే వున్నది. ఆయనకు కొడుకులు, కూతుళ్లు లేరా? వాళ్లను చూచి అయినా మార్పులను గమనించలేదా'' అన్నాడు. రమణారావు, ''చంద్రయ్య బాబాయికి 70 ఏళ్లైనా వుంటాయి. కొడుకు లున్నారనుకో. పెద్ద వాళ్లిద్దరు పంచుకొని వేరే వాళ్ళ కాపురాలను వాళ్ళు సాగించుకుంటున్నారు. తర్వాత కల్గిన ఒకరిద్దరు చనిపోయారు. ఇప్పుడున్న ముగ్గురు కొడుకుల్లో పెద్దవాడు వట్టి అమాయకుడు. ఎవరూ పిల్ల నివ్వకపోతే, చదువు సంధ్యలు లేని బీదపిల్లను చేశారు. తతిమ్మా ఇద్దరు చదువుకుంటున్న చిన్నవాళ్ళు. కూతుళ్లు లేరు. ఆయన కీచులాటంతా భార్యతోనే. ఘనీభవించిన భావాలతో పెరిగి వృద్ధుడైన చంద్రయ్య, మారమంటే మాత్రం ఇప్పుడు మారుతాడా?'' అని జవా బిచ్చాడు.

వీళ్ళిట్లు మాట్లాడుకొనుచుండగా దారిని వెళ్లే పద్మారావు, ''ఏమిటిరో, చాలా కబుర్లు చెప్పుకుంటున్నా'' రని ఆగాడు. వీళ్లు ముగ్గురూ యువకులు. తమ ఊళ్లోని హైస్కూలులో

పదోక్లాసువరకు చదివి కాలేజి చదువుకు స్తోమతలేక కొంత, చదువుమీది ధ్యాసలేక కొంత మానివేశారు. తమ కుటుంబాల వ్యవసాయం చూసుకొంటున్నా, అడపా దడపా కలుసుకొని, ఊళ్లోని కబుర్లు, ఊగంలోని కబుర్లు చెప్పుకుంటూ సర్దాపడతారు. పద్మారావు వీళ్ళలో పత్రికలు వగైరా చదువుతుంటాడు, ఎక్కడ లేని కబుర్లు తనకే కావాలంటాడు. రమణారావు చంద్రయ్య గోడు చెప్పుకు వచ్చాడు. 'ఆలాగా, చంద్రయ్య ఈనోజున కాదంటే పోతుందా? ఇప్పు డాడవాళ్లతో వాదించి నెగ్గగలమా? అసలు చదువుకొన్న పడుచులైతే చాలు, మనను డబాయించి నోళ్లు కట్టివేయించటానికి. ఇక ఉద్యోగాలు సద్యోగాలు చేస్తూ, అధికారం చెలాయించేవాళ్లను పట్టపగ్గాలున్నవా? చూడండిరా, మన మేమో, ఆడవాళ్లు ఇంటిపనులతో సతమతమైపోతారు, దమ్మిడీకికూడా మగనిపై ఆధారపడాలి, ఇక అబలులు కాక మరేమవుతారు అనుకుంటాం. కాని ఇంట్లో మాత్రం వాళ్లు తమకు తోచినట్లు పెత్తనం చెలాయించరా? పేరుకు మాత్రం మగడు ఇంటియజమాని గాని అసలు ఇంటిపెత్తనమంతా పెళ్లాని దేకదా! పెళ్లాన్ని కాదని ఎంతమంది మగవాళ్లు కాపరంచేయగలరు? పైకి డాబేగాని భార్య మాటకు జవదాటని భర్త లెంతమంది లేరు? ఎవరో కొందరు దుష్టులు, పశుబలంతో భార్యలను అణగద్రొక్కవచ్చునుగాని నూటికి 95-వ వంతైనా భార్య చెప్పినట్లు చేసేవారే. ఇదివరలో, కూతుళ్లకు తలిదండ్రు లే స్వల్పమో తప్ప ఏమీ ముట్టజెప్పేవారు కాదుగనుక, ఒకటి రెండు సంవత్సరాలైన తర్వాత, కట్టుకొనే చీరకు కూడా భర్తమీద ఆధారపడవలసిన భార్య, ఎక్కడ డబ్బివ్వడో అని కొంత వినయవిధేయతలు చూపించినా, ఇప్పుడు బోలెడు కట్నం, ఇతరాలు తెచ్చుకొంటున్న అమ్మాయిలు అణగి మణగి ఉండ నవసర మేమున్నది? పైగా తలిదండ్రుల పుణ్యమా అంటూ, బాగా చదువుకొని ఏ డాక్టరో, ఏ ఇంజనీరో, ఏ లెక్చరరో అయి స్వంతసంపాదన చేసుకొంటూన్నారాయె. ఉద్యోగాలలో ప్రవేశించి అధికారం చెలాయిస్తున్నారాయె. అంతకుమించి రాజకీయాల్లో ప్రవేశించి మంత్రులై కూర్చుంటున్నారాయె. మగవాళ్లు చేతులుగట్టుకొని వాళ్లముందు నిలబడి

విన్నపాలు చెప్పుకోవలసిన వాళ్లాయె. ఇక మగవాడంటే ఎందుకు భయపడాలి? భర్త మగవాడే అయినా, సాంగత్యావసరం తన కొక్కడానికేనా? అసలు భర్తేకదా దేవురించేది? అందులోకూడా తనది పైచెయ్యే కదా! ఇన్ని ధీమాలున్న స్త్రీ, ఎందుకు అబల అవుతుంది, సబలకాక?" అని ఒక చిన్న ఉపన్యాసమిచ్చాడు. ఈ మధ్య పద్మారావు మీటింగులకని వెళ్లుతున్నాడు. ఆ ధోరణి కొంత అలవర్చుకొన్నట్లున్నది. జగన్నాథరా వందుకొని, "ఏడ్చావులే నీ మాటలు నీవున్నూ. దేశంలో ఎంతమంది స్త్రీ డాక్టర్లు, ఇంజనీర్లున్నారు? ఎంతమంది ఉద్యోగం వెలిగిస్తున్నారు? మంత్రులెంతమం దయ్యారు? వాళ్లు మొత్తం జనాభాలో సగం వున్నారుకదా! ఒకవీసపాలైనా ఉద్యోగాలు, సద్యోగాల్లో ఉన్నారా? డాక్టర్లు, ఇంజనీయర్లు అయ్యారా? మంత్రులై కూర్చున్నారా?" అని ప్రశ్నించాడు. పద్మారావందుకొని, "ఒరే జగ్గూ, అంతా తెలిసినట్లు మాట్లాడతావేమిరా? కూపస్థమండూకంలాగున్నావు. ఈ విశాల భారతదేశాన్ని అప్రతిహతంగా పాలించే దెవరురా? వందమంది మగమంత్రులైనా ఆమె క్రింద బలాదూరేకదా! రాష్ట్రాలలోమట్టుకు స్త్రీలు ముఖ్యమంత్రులై యుండలేదా? మనదేశం మా టటుంచి ఇతరదేశాల్లోకూడా స్త్రీలు సాటిలేని, ఎదురులేని ప్రభుత్వాధికారాన్ని జమాయించటంలేదా? శ్రీలంక ప్రధాని ఎవరు, స్త్రీ కాదా? మొన్న మొన్నటివరకు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి స్త్రీయేకదా! అధికారమెట్లున్నా, ఇంగ్లండు రాజ్యాధిపతి రాణి ఎలిజబెతమ్మగారు కాదా? హాలెండులో రాజుకాక రాణికదా రాజ్యాధిపతి? ప్రస్తుతకాలాన మాత్రమే అంటావేమో. పూర్వకాలంలో మనదేశంలోకూడా తారా బాయి, అహల్యాబాయి, దుర్గాబాయి, ఛాంద్‌బీబీ, ఝాన్సీ లక్ష్మీబాయ్ వంటి స్త్రీ రత్నాలు సమర్థవంతంగా రాజ్య పాలనం చేయలేదా, వీరోచితంగా శత్రువులతో పోరాడలేదా? ఇతరదేశాలను చూద్దామా; రష్యా కాథరీన్, ఇంగ్లండు మొదటి ఎలిజబెత్‌లతో పోల్చగల, పోటీపడగల పురుష ప్రభుత్వాధినేత లున్నారా? స్కాట్లెండు రాణి మేరీని కూడా మనం తలచవలసి వున్నది. దూరప్రాచ్య, పాశ్చాత్య దేశాలసంగ తెట్లున్నా,

మనపురాణాలలో మాత్రం మగవాళ్లను లెక్క-పెట్టని ధీరనారీ మణులు లేరా? రామాయణంలోని కైక దశరథుని పూర్తిగా లోబరుచుకొని తనమాటను సాగించుకొనలేదా? భారతంలో కుంతి మాటను పాండవులు కాదనగలిగారా? ద్రౌపది చచ్చిన పామువలె పడియున్న యుధిష్ఠిరుని, అతని తమ్ములను తన నర్మ గర్భ వాక్యాలతో, పౌరుషపూరిత ప్రేరేపణలతో వాళ్లను యుద్ధంలోకి దింపి, తన శపథాలను సఫలంచేసుకొనలేదా? ఇటు వంటి ఉదాహరణ లింకెన్నో వుండవచ్చును. నేను చెప్పేదేమి టంటే, ఈ కాలంలోనేకాదు పూర్వ పురాణకాలంలో కూడా, సైకెట్లు నటించినా స్త్రీ అబల కానేకాదు, పూర్తిగా సబలయే అని."

బాగా ప్రొద్దెక్కిందని ఎవరింటికి వారు బైలుదేరి వెళ్లిపోయారు.

ఇల

జననీ జనకులు

జననీ జనకు లనగా సామాన్యార్థమున తలి దండ్రులు. నిజానికి, 'తల్లీ, తండ్రీ' అని సంబోధింపబడేవారు, సంబోధించినవారి కందరి జన్మకు కారకులా? బిచ్చగాడు 'అమ్మా, తల్లీ' అని స్త్రీని, 'అయ్యా, తండ్రీ' అని మగవానిని సంబోధించి బిచ్చం అడుగుతాడు. 'అమ్మలారా, అయ్యలారా గుడ్డివాణ్ణి, కుంటివాణ్ణి ఒక్క పైసా ధర్మంచేయం'డని బస్సుల్లో ప్రార్థేయపడటం మనకు తెలుసును. ఈవిధంగా సంబోధింపబడినవాళ్ళు, సంబోధించినవాళ్లకు తలి దండ్రులా? తల్లి అనగా అమ్మగదా! మనకు బాధకలినప్పుడు 'అమ్మా'అని దీనాలాపాలు చేస్తాము. అప్పుడు మన కన్నతల్లినే తలచుకొన్నామని చెప్పటకు వీలులేదు. కన్నతల్లి గుర్తుకు రాక పోవచ్చును. కన్నతల్లి గుర్తుకువచ్చి ఆమె రక్షణకొరకు ప్రార్థేయ పడటం వయస్సువచ్చినవారు చేయరు. బాధా సమయాన మన

ప్రయత్నంలేకనే బైటికి వచ్చిన దీనాలాపం మన బాధను పోగొట్టు నట్టిది మాతృశక్తి యున్నదని, మన అంతరాత్మలో ఇమిడిపోయిన భావమే ఈవిధంగా బహిర్గత మౌతుంది. ఈ విషయములో తండ్రికంటె తల్లే అధికురాలు. నిజానికి మానవ స్పృహలో, ఆరాధనలో సంరక్షించు శక్తిగా తల్లియే ముఖ్యం. అందువలననే మనం ఆదిశక్తి, పరాశక్తి, త్రిమూర్తులకు తల్లి, మూలవిరాట్టు అని చెప్పుతా మిూమెనే. ఇదిగాక, చాలా దేశస్థులు తమ మాతృభూమిని స్త్రీగా వర్ణించుతారు. మన భరతదేశానికే గాక ఇంగ్లండు, ఫ్రాన్సు మొదలైన దేశాలకు కూడా అధిదేవత స్త్రీస్వరూపిణియే. ఈమె శారీరకంగా కనకపోయినా, దేశరూపేణ జననియే. ఈ భావాన్నే "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అని పెద్దలు చెప్పుతారు. జనని సంస్కృతం, తల్లి తెలుగు. రెండు మాటలు సమానార్థకములేకదా అనవచ్చును. నిజమే. అయితే, ఉత్తరహిందూస్థానంలో బాధపడువారు, బిచ్చగాండ్రు మాతా అంటారు కాని, తల్లీ అని, జననీ అని అనరు. మాత అనేది తల్లిపరంగానే గాక లక్ష్మి, పార్వతి వంటి దేవతామూర్తులకు కూడా వర్తిస్తుంది. అందువల్ల ఆ మాట విశేషార్థంకలదిగానే ఎంచుకోవాలి. దక్షిణాదివారు మనుష్యులపరంగా తల్లి అని, దేవతాపరంగా జనని, మాత అని (జగజ్జనని, జగన్మాత) అంటారు. అందువలన జన్మకు కారకులైనవారు జననీజనకులైనా, భాషార్థమున తల్లిదండ్రులే అయినా, ఉపయోగార్థమున జనని, జనకుడు అనే మాటలు తల్లి దండ్రులు అనే మాటలకంటె హెచ్చుస్థాయిలోనివి. అవి బాధను, అవసరాన్ని ప్రతిబింబించేవే కాకుండా, భగవంతుని గుర్తుకు తెచ్చుకొనో, తెచ్చుకొనకనో పలికే ఆర్తనాదాలు.

౧౯

లలితకళలు

మనుష్యునకు ఆలోచనాశక్తి, మంచి చెడులు తెలుసు కొనే శక్తి, భగవత్ జ్ఞానం సహజంగా వుంటవని, చదువుకొనిన

జ్ఞాన, విజ్ఞానవంతు డౌతాడని మనం తలుస్తాం. ఆలోచనాశక్తి జంతుజాలం (కోతి, నక్క, కుక్క, గుర్రం ఎలుకవంటివి) లోనూ ఉంటుంది. నేర్పితే కోతి, కుక్క, చిలుక, ఎలుక, చివరకు గుర్రం, సింహం, ఏనుగు వంటివి కూడా నేర్చుకొంటవి (సర్కస్‌లో చూస్తాం). అయితే వానికి భగవత్ జ్ఞానం, మంచి చెడులు తెలుసు కొనే శక్తి లేదనే చెప్పాలి. కాబట్టి జీవరాసులలో మానవుని విశేషం మంచి చెడులు తెలుసుకొనే శక్తి, భగవంతుడున్నాడనే ఎరుక. ఆయనను పూజించటం, ఆయనయందు భయభక్తులు నెరపటం. ఈ రెండున్నా, సంస్కారం అనే సంస్కృతి లేకపోతే సగం మృగంగాను, సగం మనిషిగాను ఉంటాడు. కాబట్టి సంస్కృతి అవసరం. సంస్కృతి లేక సంస్కారంవల్ల మానవు నకు నేత్ర శ్రవణానందం, హృదయస్పందన వికాసం, బుద్ధి విలసితం, జీవిత సౌఖ్యం కలుగుతవి. వీనికి మూలం లలితకళలు, అనగా సంగీతం, నృత్యం, నాట్యం, చిత్రలేఖనం, శిల్పం. చప్పున హృదయాన్ని రంజింపజేసి హాయిని సమకూర్చేది సంగీతం. మనస్సును, శరీరాన్ని ఉప్పొంగించేది నృత్యం. మనోల్లాసాన్ని కలిగించేది నాట్యం. చిత్రలేఖనం, శిల్పం నేత్రానందం, భావ ప్రకటన చేస్తవి. మానవునకు హాయిని కల్పించే సంగీతం ప్రథమ స్థానాన్నాక్రమించుకుంటుంది. మనస్సు నుప్పొంగించి, ఆనంద కరమైన కోర్కెలను రేకెత్తించే నృత్యం రెండవ స్థానానికి వస్తుంది. నాట్యం, చిత్రలేఖనం, శిల్పం వరుసక్రమంగా మూడు, నాలుగు స్థానాలలో ఉంటవి.

దేవుడు

దేవుడు స్వయంభువు అంటాం. ఆ దేవుణ్ణే ఆదిపరాశక్తి అని, ఆమె త్రిమూర్తులగు విష్ణు, మహేశ్వర, బ్రహ్మలకు తల్లి అని చెప్పుతాం. దేవుడు తనంతటతానను పుట్టాడు. సరే, ఎక్కడ

ఏ విధంగా పుట్టాడు అన్న ప్రశ్న వస్తుంది. ఆదిశక్తి బ్రహ్మను కూడా కన్నదంటారుకదా! మరి ఆయన విష్ణువు నాభినుండి వెడలిన పద్మాన్నుండి జన్మించినా డంటారే, దాని కెట్లు సమాధానం చెప్పుతాం? ఈ ఆదిపరాశక్తి స్వయంభువు కావచ్చును. అయితే, ఆమె బిడ్డలను కన్నదికదా, ఎక్కడ కన్నది? మరి అధిష్ఠాన దేవతలగు విష్ణువు విష్ణులోకంలో వుంటాడని, మహేశ్వరుడు కైలాసంలో వుంటాడని, బ్రహ్మ బ్రహ్మ, లేక సత్య, లోకంలో వుంటాడని నమ్ముతాంకదా. మరి దేవుడు లేక భగవంతుడు సర్వవ్యాప్తి, విశ్వేశ్వరు డంటా రెందుకు? అట్లయితే సృష్టి, పాలన, లయం, ప్రవృత్తిగల మూడంశాలు మూర్తీభవించిన ఒక దేవుడో లేక ఆదిశక్తో, స్వయంభువేమోగాని, విశ్వవ్యాప్తి కలవాడు లేక కలది కాదన్నమాట. విశ్వవ్యాప్తుడు, నామరూపాలు లేనివాడు. ఆది మధ్యాంత రహితుడు. అవాఙ్మానస గోచరుడు. కడపటి నిజం (అల్టిమేట్ రియాలిటి). ఇంకొక మహామహత్తు ఉండాలన్నమాట. ఈ మహామహత్తే నిజమైన స్వయంభువు. అందుకనే భక్తపోతన్నగారు "ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీనమై ఎవ్వనియందు డిందు, పరమేశ్వరు డెవ్వడు, మూలకారణం బెవ్వ డనాదిమధ్యలయు డెవ్వడు" అని స్తోత్రం చేశాడు. త్రిపురనేని కవిరాజుగారు "ఏది చరాచరంబయిన సృష్టికి సర్వము మూలకారణం, బేది మునీశ్వర ప్రతతి కేని యగోచరమైన దొడ్డవెల్లు, ఏది లయాంతమందైన నించుక వైకృత మొందకుండు ఆ నిత్య, సత్య, పరతత్వ, మహాత్మము" అని కీర్తించారు.

అయితే ఈమధ్య ఒకరు ఒక బ్రహ్మాండమైన అగ్నిగోళం బ్రద్దలై విశ్వం జనించిందని, ఇది ఇంకనూ విస్తరించుతూ పోతున్నదని అభిప్రాయం వెలిబుచ్చారు. విశ్వంలో అనంతకోటి బ్రహ్మాండా లున్నా యంటున్నారు. ఎన్ని వేల కాంతివర్షాల దూరంలోనో కొన్ని గ్రహా లున్నవని ఆధునికశాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. అయితే అగ్నిగోళంనుండి ఉద్భవించిన విశ్వంలో, దాని చెక్కలు ముక్కలీ అనంతకోటి బ్రహ్మాండా లయ్యాయా? ఇదంతా గందర గోళాన్నే కలిగిస్తున్నది.

పోతే, అధిష్ఠానదేవుళ్లైన త్రిమూర్తుల నటుంచి శ్రీరామ, శ్రీకృష్ణులను ఏం చేద్దాం? వారు మనకు ప్రత్యక్ష దేవుళ్లుకదా! వారినేకదా మనం పూజించేది? అయితే శ్రీరాముడు, శ్రీకృష్ణుడు విష్ణువు అవతారా లంటారు. త్రిమూర్తులలో రెండవ వాడు మహేశ్వరుణ్ణి వివిధనామాలతో శివునిగానే పూజిస్తున్నాం. కుమారస్వామి, గణపతి రూపాల్లోకూడా పూజిస్తున్నాం. అయితే వీరిద్దరిని శంకరుని పుత్రులంటున్నాం. ఇక వీరభద్రుని కూడా పూజిస్తున్నాం. ఈయననుకూడా మహేశ్వరుని పుత్రుడే అంటున్నాం. కాని, ఒకవిధంగా చూస్తే ప్రశాంతతతో యోగధ్యానంలో వున్న శంకరుడు తన అర్ధాంగి సతీదేవి దక్షుని యాగగుండంలో పడి ఆత్మార్పణం చేసుకొన్నదన్న వార్త విని, మహోగ్రుడై వీరభద్రుడుగా పరిణమించాడని తోస్తున్నది. కాబట్టి, రుద్రుడే వీరభద్రుడు అనుకోవాలి. మూడోవాడగు బ్రహ్మ సృష్టిచేస్తూ ఉంటాడట. ఈయన కెక్కడోదప్ప పూజా పునస్కారాలు లేవు. పరిపాలించే విష్ణువు కుండటం సహజమే. నశింపజేసే రుద్రుడగు మహేశ్వరునకు ఆరాధన వున్నప్పుడు, పుట్టించే బ్రహ్మ కెందుకు లేదో అర్థంకావటంలేదు. అల్లిబిల్లిగా, మంచితోబాటు చెడును కూడా పుట్టిస్తున్నాడనేమో!

విష్ణ్వావతారంగా ఎంచబడే రాముడు చాలా అవకతవక పనులు చేశాడు. వరించి వచ్చిన శూర్పణఖ ముక్కు చెవులు కోయించాడు. ఆమె పులస్త్య బ్రహ్మ మనుమరాలు. దుష్టురాలు కాదు. దొంగచాటున భీరువువలె వాలిని హత్యచేశాడు. తపస్సు చేసుకొనుచున్న శంబుకుని అకారణంగా వధించాడు. తన సహచారిణి, తననే నమ్ముకొని అడవులలోని నికృష్టజీవనం గడపి, పగవాని చెరసాలలో బాధపడి, అగ్నిపరీక్షవలన తన పరిశుద్ధతను ప్రదర్శించిన నిండుచూలాలు సీతమ్మను నిర్దాక్షిణ్యంగా అడవిలో విడిపించాడు. తన తోడుగా వనవాసక్లేశా న్ననుభవించి, తనకు నానాసపర్యలు చేసిన లక్ష్మణుని తన రాజ్యంనుండి వెడల గొట్టాడు. ఆత్మహత్య పరమపాతకమని పెద్దలు చెప్పినా, సరయూ నదిలో పడి తనను తాను చంపుకొన్నాడు. ఈ రకం వ్యక్తి, దేవుడెట్లయ్యాడో అర్థంకావటంలేదు. ఇక శ్రీకృష్ణుని విషయంలో,

ఈయన కూడా విష్ణ్వావతారమేకదా! ఈయన రేపల్లెలో దొంగతనంగా వెన్నముద్దలు కాజేశాడు. స్నానంచేస్తున్న స్త్రీల వస్త్రాలను హరించాడు. మగనాలులతో రమించేవాడు. కన్య యైన గొల్లపిల్ల రాధ కన్యాత్వం హరించి విడిచిపెట్టి వెళ్లిపోయాడు. తన కార్యసాధనకై మాయమాటలు చెప్పి కుయుక్తి విధవతో, దాసీతో సంభోగించాడు. జరాసంధుని మోసంతో చంపించాడు. మిషతో శిశుపాలుని వధించాడు. ధర్మరాజుతో అబద్ధ మాడించి, గురుని మరణానికి కారకుడయ్యాడు. క్రుంగిన రథాన్ని లేవనెత్తుకొను చున్న కర్ణుని అన్యాయంగా చంపించాడు. దుర్యోధనతో దుర్యో ధనుని తొడలు విరుగగొట్టించాడు. కల్లబొల్లి మాటలతో రాయబారం నడిపి, అన్నదమ్ముల యుద్ధానికి కారకుడైనాడు. ఇట్టి అవినీతిపరుణ్ణి, మోసగాణ్ణి భగవదవతారంగా కొల్చుచున్నా రెందుకు?

కాని, శ్రీరాముణ్ణి భగవంతునిగా కబీరు, తులసీదాసు, త్యాగరాజు మొదలైనవారు కీర్తించారు. శ్రీకృష్ణుని మీరా బాయి, చైతన్యుడు, ఇతరులు భజించారు. వీ రందరు మహాను భావులు, గొప్ప భక్తులు. వీ రెందులకు ఈ ఇద్దరిని దేవుని అవతారాలని కీర్తించారు? ఈ ఇద్దరు మహాపురుషులలో భగవంతుని వారు చూడబట్టె కదా! పైగా అనేకమంది ఆళ్వారులు, నైనంవారు లుండినారు కదా వీ రందరి నెట్లు నిరసించగలం?

వాల్మీకి రఘురాముని ఆదర్శపురుషునిగా, ధర్మ స్వరూపునిగా, ఆర్తత్రాణపరాయణునిగా, దుష్టసంహారకునిగా తీర్చి దిద్దాడు. పితృవాక్యపరిపాలకుడు, భ్రాతృవత్సలుడు, పతితపావనుడు (అహల్య శాప విమోచనం), దుష్టసంహారుడు, ధర్మస్థాపకుడు, ప్రజారంజకుడు—ఈవిధంగా రాముడు మనకు ఆదర్శపురుషుడైనాడు. సీతమ్మ సహచారిణిగా, పతివ్రతగా, సహనశీలగా మనకు ప్రత్యక్ష మౌచున్నది. ఈ మహోత్తర గుణాలనుబట్టి ఈ భార్యా భర్తలకు దేవత్వం మన మాపా దించాము. ఆలాగే శ్రీకృష్ణుడు గోవర్ధనగిరి నెత్తి గోవులను కాపాడి, కాళింగీల మర్దనం వలన గోపాలకులను, గోవులను

విషసర్పాలనుండి రక్షించి, మద్దిచెట్లను విరుగగొట్టి, గంధర్వులకు శాప విమోచనం చేసి, ద్రౌపది మానసంరక్షణ చేసి ఆమె స్త్రీత్వం కాపాడి, దుష్టులగు కౌరవులను నాశనం చేయించి భగవదవతారంగా ఎంచబడుచున్నాడు.

విష్ణువు మహత్తు, శివుని శక్తి, శ్రీరాముని అస్త్ర శస్త్ర నైపుణ్యం, శ్రీకృష్ణుని మేధాసంపత్తి, రాజకీయచాతుర్యం, చక్రప్రయోగం ప్రజలను మభ్యపరచినవా? అసలు ప్రజలకు భగవంతుడనే పేరుతో ఒక పట్టుగొమ్మ వుండాలా, లేదా? తమ ఆపదకాలంలో ధైర్యం తెచ్చుకొనటానికి, తమ పనుల్లో జయం పొందటానికి, తమ సిరిసంపదల్లో అలంకరించటానికి, తమ హుషారులో ఊరేగించటానికి ఎవరైనా ఒక రుండవలెనా, లేదా? వానిని భగవంతుడనటంలో తప్పేమున్నది? అందువల్ల ఉన్నాడో లేడో. ఎవరినో ఒకరిని ఉన్నాడని అనుకోవద్దా?

కాబట్టి, భక్తులు లేనిదే భగవంతుడు లేడంటారు. అవగా భక్తుడు భగవంతుని సృజించుకొని, పూజించుకొని కీర్తించు కుంటాడు. ఈవిధంగా ఆత్మతృప్తి కలగటానికి, మనోధైర్యం పొందటానికి, మొరబెట్టుకొనటానికి, కన్నీళ్లుపెట్టుకొనటానికి, భక్తి చే చిందులుద్రొక్కి ఆనందించటానికి అవకాశం కలుగుతుంది. శూన్యంలో ఏ ముంటుంది? ఏదైనా వుంటేనే ఏ పని చేయటానికిని.

ఐతే భగవంతుడూహాజనితమే. కాని, ఇందరు దేవుళ్లు ఎందుకనవచ్చును. ఎవరి చిత్తవృత్తినిబట్టి వారు భగవంతుని రూపురేఖలను తీర్చిదిద్దుకుంటారు. గుణాలను, మహత్తును ఆపాదించుతారు. లేకపోతే శంకర భగవత్పాదులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు భిన్న భిన్న విధాలుగా భగవంతునికి నామ, రూప, గుణ, మహత్తుల నిచ్చి, స్తోత్రం చేయటం, పూజించటం చేయరు. తమ దేవుళ్లపేర భిన్న భిన్న మత స్వరూపాలను ఏర్పరచరు.

భగవంతుడు, అనగా పరమాత్మ, మనలోనే ఉన్నదంటారు. ఆ పరమాత్మ అనే దేవుణ్ణి మన మెట్లూహిస్తే అట్లు మనకు తోస్తాడు. బాహ్యదృష్టికి కాకపోయినా, అంతర్దృష్టికైనా

ప్రత్యక్ష మౌతాడు. అయితే, బాహ్యదృష్టికికూడా కనబడినా డనే గాథలు లేక కథ లున్నాయి. ఒకప్పు డొక గొప్ప చెరువుకు తుపాను వర్షాలవల్ల గండిపడే ప్రమాదం కల్గిందట. గండిపడితే చుట్టుప్రక్క- గ్రామాలన్నీ మునిగిపోతాయట. ప్రజలు భయాం దోళ్ళులై రామభజనలు సాగించారట. అధికారులకు విన్నపాలు పోగా, ఒక యూరపియన్ ఇంజనీయరు బైలుదేరి వచ్చి సాయంత్రమయ్యేటప్పటికి అక్కడకు చేరుకొన్నాడట. సాయంత్రం సంధ్య దాపురించబోవుచున్నదట. ఆ ఇంజనీయరు సరాసరి ఒంటరిగా చెరువును సమీపించాడట. చెరువు ఇవతల గట్టుకు చేరగానే, గండి పడవచ్చుననుకొనిన అవతలి గట్టున ఇద్దరు తేజోమూర్తులు ధనుర్బాణాలుధరించి గండిపడకుండా కాపాడు చున్న దృశ్యం అతనికి పొడగట్టినదట. ఇక గండి పడలేదు. గ్రామాలప్రజల రామభజనలు సఫలమైనవి. పూర్వజన్మ సుకృతంవల్ల ఆ పాశ్చాత్యునికి లక్ష్మణసమేతుడైన శ్రీరామ దర్శనం లభించింది. షిరిడీ సాయిబాబా భక్తు డొకడు శ్రీ బాబా దర్శనార్థం షిరిడీకి బైలుదేరుతూ తనకు సన్నిహితుడైన మిత్రుని"నీవుకూడా శ్రీబాబా దర్శనం చేసుకొనటానికి ర"మ్మన్నా డట. ఆ స్నేహితుడు శ్రీరామభక్తుడు. "చ, నేను రాను. నాకు శ్రీరాముడే దైవం. ఈ బాబా, గీబా నా కవసరంలే"దన్నాడట. బాబా భక్తుడు, "నీవు నాకు తోడు రావలసింది. నీవు బాబాను దర్శించవలసిన అవసరంకూడా లేదు. మనం షిరిడీ సమీపించిన తర్వాత నీ వెక్కడనైనా కాలంగడపవచ్చును. నేను బాబా దర్శనం చేసుకున్నతర్వాత, మనం తిరిగి కలసి వెళ్లిపోదాం" అని మిత్రుని సమ్మతింపజేశాడట. సరే అని ఇద్దరూ షిరిడీ చేరు కున్నారు. బాబా బైట ఒక రాయిమీద కూర్చుని వున్నాడు. భక్తులు ఆయనచుట్టూ నేలమీద కూర్చుని ఉండినారు. అల్లంత దూరంలో వుండగానే బాబాభక్త మిత్రునకు, శ్రీ సాయిబాబా స్వరూపం గాక, శ్రీరామచంద్రుని రూపం దృగ్గోచరమైనదట. అంతటితో మిత్రునకు భక్త్యావేశం పొంగుకువచ్చి, "మహాప్రభూ, శ్రీరామచంద్రా" అంటూ పరుగెత్తి వెళ్లి, బాబాపాదాలమీద

వాలాడట. అప్పుడు తెలిసికొన్నాడు, భగవంతుడు ఏదో ఒక నిలకడైన రూపంకలవాడు కాడని, భక్తుడు ఏ రూపంలో భగవంతుని భజిస్తాడో, ఆ రూపంలో భగవంతుడు దర్శనమిస్తాడని.

నామరూపాలులేని సర్వేశ్వరుడు భక్తుల కోర్కెలను వారు కోరుకున్న అనగా సృష్టించుకున్న రూపంలో తీరుస్తాడు. ఆనందాన్ని, తృప్తిని, రక్తిని ప్రసాదిస్తాడు. దేవుడు ఒక్కడే అయినా అన్ని మతాలవారికి ఏకైక భగవంతుడే అయినా వివిధ మతాలవారికి భిన్నభిన్న పేర్లతో, ఆదర్శాలతో, మహత్తులతో స్ఫురిస్తాడు.

ఏది

కులం, వర్గం ఒక్కటేనా?

ఈమధ్య విద్యావతొకరు వేదకాలంలోకూడా కులాలుండేవి, ఈమధ్య బ్రాహ్మణులు తెచ్చిపెట్టినవికావు, పాశ్చాత్య దేశాల్లోకూడా కులవివక్షత వున్నదని తమ సిద్ధాంతాన్ని వెలిబుచ్చారు. వేదాలు బహిర్గతంచేసినవారు ఆర్యులు. ఆర్యుల్లో కుల వివక్షత లేదు. వృత్తులనుబట్టి మూడు వర్గాలుగా ఏర్పడ్డారు. మతం, శాస్త్రం, కర్మకాండ బ్రాహ్మణులనే ఒక వర్గంవారి బాధ్యత. యుద్ధం, రాజ్యపాలన, దాని సంరక్షణ క్షత్రియులనే మరొకవర్గం వారు భరించేవారు. వ్యవసాయం, వ్యాపారం వైశ్యులనే ఇంకొక వర్గంవారు నడిపేవారు. ఈ మూడు వర్గాలు అప్పుడప్పుడు వివాహ రీత్యా మిశ్రమవుతుండేవి. ముఖ్యంగా బ్రాహ్మణులు, క్షత్రియులు వివాహ సంబంధాలు ఎక్కువగానే పెట్టుకొనేవారు.

విద్యావతి వేదాల్లో కులప్రస్తావన వుందంటారు. ఈ ప్రస్తావన ప్రక్షిప్తమనే అనుకోవాలి. కాకపోయినా, వర్ణం అన్నారు గాని, కులం అనలేదు. వర్ణానికి కులం అని ఇప్పుడు మనం అర్థంచెప్పుకున్నా, వర్ణం అంటే శరీరం రంగుకదా! ఆర్యులు పూర్వమొక జాతిగా శ్వేతవర్ణులట. మిశ్రమంచేత పీత, గౌర

వర్ణ ములద్భవించారు. బ్రాహ్మణులు శ్వేతులుగాను, క్షత్రియులు పీతవర్ణులుగాను, వైశ్యులు గౌరవర్ణులుగాను ఎంచబడ్డారు. కల్తీ లేని వర్ణప్రభావంవల్లనో, లేక మతాచార్యులుగా, గురువులుగా కర్మిష్ఠులుగానో బ్రాహ్మణుల కగ్రస్థానం లభించింది. వారి తర్వాత రాజ్యపాలకులు క్షత్రియులు. వారి తర్వాత వ్యవసాయం, వ్యాపారంచేసి ప్రజలకు జీవితావసరాల నందించిన వైశ్యులు హెచ్చు తగ్గు అంతస్తులు కలవారుగా ఆర్యసంఘంలో ఏర్పడ్డారు. యుద్ధంలో తాము జయించిన ఆర్యేతరులను బానిసలుగా చేసుకొని వారిచేత వెట్టిచాకిరి చేయించుకొన్నారు. ఈ అనార్యులు కృష్ణ వర్ణులట. వీరిని ఆర్యసంఘానికి వెలిగా వుంచినారు. ఆర్యు లొక వర్ణం కాగా, ఈ అనార్యు లింకొక వర్ణమైనారు. కాబట్టి ప్రాచీన కాలంలో, వేదకాలంలో భరతఖండంలో రెండు వర్ణా లుండేవి. కులాలు రూపొందలేదు.

అయితే యుద్ధనిపుణులు, నాగరికత అని చెప్పబడే విశేషం కలిగినవారు నిజానికి పట్టణాలను, నగరాలను నిర్మించుకొని సంఘ కట్టుబాట్లకు లోనై రాజ్యపాలనంచేసుకొనే అనార్యులు (వీరినే ద్రావిడులంటున్నాం) గాక ఆటవికులు, కొండజాతులవా రుండినారు కదా ! వాళ్లను ఏదో రూపంలో లోబరుచుకొని, వాళ్లచేతకూడా బానిససేవను చేయించుకొనేవారు. మన మిప్పు డెరిగియున్న పంచములు, అంటరానివాళ్లు ఆకాలంలో వున్నట్లులేరు. ఆర్య సంఘంనుండి బహిష్కరించబడినవా రుండేవారు. వాళ్లను చండాలు రనేవారు. ఈ చండాలురు హీనజాతు లనబడేవారినుండి వచ్చిన వారుకాదు. బ్రహ్మర్షియైన విశ్వ (విశ్వా) మిత్రుని కొడుకులుకూడా తండ్రి శాపంవలన చండాలురైనారట. వీళ్లు బహిష్కరింపబడ్డవాళ్లు కాబట్టి వేరుగా ఊరిబైట నివసించేవారు. వాళ్లకు, ఆర్యసంఘీయు లకు పొత్తు ఉండేది కాదట.

ఇక శ్రీకృష్ణభగవానుడు చెప్పిన దనుకొనే భగవద్గీతలో "చాతుర్వర్ణం మయా సృష్టం" అన్నదానిని, మనలో నాలుగు కులా లుండినవని సాక్ష్యం చూపిస్తారు. దీనికి కారణం లేకపోలేదు. బ్రాహ్మణులు భగవంతుని శిరస్సునుండి, క్షత్రియులు అతని

బాహువులనుండి, వైశ్యులు తొడలనుండి, శూద్రులు పాదముల నుండి పుట్టుకువచ్చారని భగవద్గీతలోనే వున్నది. అయితే భగవంతునికి, త్రిపురనేని కవిరాజుగారు చమత్కరించినట్లు, ఒడలంతా కాకపోయినా పైచెప్పిన నాలుగుచోట్లలో నాలుగు యోను లుండేవా అని సందేహం కలగటంలో ఆశ్చర్యంలేదు. మానవు లందరు భగవంతుని బిడ్డ లంటున్నాం. ఎవరెవరిని, ఎక్కడెక్కడనుండి ఆ భగవంతుడు కన్నాడో భగవద్గీతతప్ప మన కాధారమున్నట్లు కనబడదు.

ఇతర కులాల నటుంచి, శూద్రకులమనే దానిని తీసుకొనండి. వీళ్లలో సచ్ఛూద్రులు, శూద్రులు వగైరా వున్నారు. ఈ రెండు తరగతులలో ఇప్పుడనేక ఉపకులా లున్నవి. ఈ కులాల్లో కొన్ని ముఖ్యంగా సచ్ఛూద్రులనే అన్నికులాలూ ఒకప్పుడైనా భూపతులు, నరపతులై రాజ్యాలుచేసి, బ్రాహ్మణ కవి పండితులను పోషించినవారే. అన్ని శూద్రకులాలకు పురోహితులుగా కర్మకాండలు చేయించి దానధర్మాలు పొందేవారు బ్రాహ్మణులే.

కులాలే పోవాలనే ఈరోజుల్లో, వేదకాలంలో కూడా కులా లుండేవని చెప్పటం అవివేకమే అవుతుంది.

పైగా పాశ్చాత్యదేశాల్లో కూడా కులభేదా లున్నవని చెప్పటం ఆశ్చర్యకరమైన విషయం. అక్కడ కులాలు లేవు; వర్గాలున్నవి. ప్రభువులు, భూస్వాములు, వర్తకులు, వణిజులు, కార్మికులనే వర్గభేదాలున్నవి. కులానికి, వర్గానికి ముఖ్యభేదం, కులంలో పుట్టినవాడు ఆ కులంవాడుగానే వుండాలి. ప్రస్తుత జీవిత మార్పులవల్ల బ్రాహ్మణుడు వ్యాపారంచేయటం, లేక వ్యవసాయం చేయటం కలదు. ఆలాగే శూద్ర కులంలోనివారు ప్రభుత్వోద్యోగాలు చేయటం, పరిశ్రమలు స్థాపించటం, విజ్ఞానం, వైద్యుష్యం, సాంస్కృతిక కలాపాలు మొదలైనవానిలో పాల్గొనటం జరుగుచున్నది. అయినా, అసలు కులానికి పునాది కులవృత్తి ననుసరించి, కుల హెచ్చు తగ్గు స్థాయిలో బ్రతకటం. వర్గంలో క్రింది స్థాయివారు, పై స్థాయికి వ్యక్తిగత సామర్థ్యాన్ని బట్టి అత్యున్నతస్థానాన్ని పొందవచ్చును. చెప్పులు కుట్టుకొనే

వాని మనుమడు లాయడ్ జార్జి బ్రిటిషుసామ్రాజ్యానికి అధినే తయ్యాడు. ఇది సిసలైన భేదం.

గతిలేక వ్యవసాయం

ఒకప్పుడు తిండిగింజలు పండించే వ్యవసాయం భుక్తిని, తృప్తిని ఇచ్చేది. ప్రభువులనుండి, పరిపాలకులనుండి మన్ననలను పొందేది. "శరీరమాద్యం ఖలు ధర్మసాధనం" కదా! అందువల్ల శరీరాన్ని నిల్పుకొనటాని కవసరమైన ఆహారపదార్థాలు ముఖ్యం. కాబట్టి భూదేవిని, ఆమె నుండి ఉత్పత్తిచేయించే కృషీవలుని పెద్దలు, పిన్నలు ఆదరించేవారు. నరపతికంటె భూపతే ఎక్కువ గౌరవనీయుడుగా వుండేవాడు. రాజులు పండితులకు, కవులకు పారితోషికంగా ఇచ్చేది భూమినేకదా! పరిశ్రమలు పెరిగినా, వానిలో కొన్ని ప్రత్యక్షంగా ఆహారవస్తువుల ఉత్పత్తికి కాకపోయినా భోజనపదార్థాల విలువ తగ్గలేదు. పట్టణాలు విజృంభించి, నాగరికత బలిసి, మేడలు, మిద్దెలు వెలసి, రకరకాల దేహధారణాలు, జీవితానుకూలాలు, సౌఖ్యప్రదజీవనాలు వృద్ధిచెందినా ప్రాణాన్ని నిలబెట్టే తిండిగింజలు, వానికి తోడైన సరుకులు లభించేది వ్యవసాయంవల్లనేకదా! అందువల్లనే మహాశయుడు లాల్ బహదూర్ శాస్త్రి "జైకిసాన్" అని జేజేలు కొట్టాడు.

కాని ఇప్పుడు రైతు బ్రతుకు దురవస్థలో పడింది. కొంత ప్రకృతి లోపం, కొంత ప్రభుత్వ లోపం, కొంత రైతు లోపం, కొంత వ్యవసాయకూలీల లోపం. ఇవన్నీ కలిసి వ్యవసాయకుణ్ణి క్రుంగ దీస్తున్నాయి. అ వేమిటో నా మనస్సులో వున్నది దాచకుండా బైటబెడ్తాను.

వర్షాలు సకాలంలో ఒకప్పుడు పడవు. ఒకప్పుడు అధిక వర్షాలు కురుస్తవి. మ రొకప్పుడు వర్షా లసలే వుండవు. ఈ సంవత్సరం (1975) ఈ ప్రాంతంలో జూన్‌లో ఆరంభించిన తొలకరి

వాన నవంబరు మొదటి వారం వరకు కొనసాగింది. నైరుతి వర్షాలు మామూలుగా సెప్టెంబరు మొదటి రెండు వారాలతో అంతంకావాలి. కాని, ఈ సంవత్సరం మద్రాసు ప్రాంతాన అక్టోబరులో మొదలిడే ఈశాన్య వర్షాలు నైరుతి వర్షాలతో విలీనమందినవా అన్నట్లు ఈ రెండూ కలసి, నవంబరు ఇంచుమించు మధ్యవరకు కొనసాగాయి. వీనివల్ల మెట్టపంటలు నాశన మవటమే గాకుండా, వరిపంట వంటి మాగాణిపైరులకు దోమకాటువంటి తెగుళ్లు సంభవించి కొన్ని చేలు పూర్తిగా నాశనమయ్యాయి. మందులు చల్లినా నిరంతర వర్షాలవల్లనై తేనేమి, తూర్పు, ఈశాన్యగాలుల విషప్రభావం చేతనై తేనేమి మందుల ఫలితం కీసపాలే. చీడలు లేని పొలాలలో కూడా వరి పడిపోయి, ఊర కెక్కువయి, పంట తగ్గిపోయింది.

ప్రభుత్వంపరంగా కొన్నిచోట్ల కొంతమం దేవో సలహా లిచ్చినా, డెవలప్‌మెంటు బ్లాకుల విస్తరణాధికారులు వచ్చి ఆదుకోవటం నాదృష్టిలోకి రాలేదు. మురుగుకాల్వల పూడికలు తీయించకపోవటంవల్ల కొన్నిచోట్ల ముంపులు ప్రాప్తించాయి. వర్షాలు పడుతున్నాయని, నీళ్లు చేలలో నిల్వ ఉండకుండా బైటికి తెగ్గొట్టివేశారు రైతులు. వర్షాలు చప్పున ఆగిపోవటంతో, రెండో పైరు అనగా జనుము, మినుము, పెసర, కొన్నిచోట్ల ఉలవ చల్లటానికి పదును తగ్గిపోయింది. మామూలుగా కాల్వల ద్వారా వచ్చే నీరు రాకపోవటంచేత తడి ఉన్నదనో, కాల్వనీరు వస్తుందనో ఆశపడి, ధైర్యంచేసి విత్తనాలు చల్లితే అవి వట్టిపోయాయి. అప్పుడే మించుకుపోయింది లేదు, కాలవ నీటికోసం ఇంకా మూడు నాలుగు రోజులు ఆగుదాం అనుకొంటే, అధికవర్షాలవల్ల కాబోలు మామూలుకంటె వారంరోజులు ముందుగానే చేలు కోతకు సిద్ధమైనాయి. ఇంకా ఆగితే కంకిరెల్లు రాలిపోతుందని రైతు భయపడటం సహజం. సకాలంలో కాల్వనీరు అందక, రెండోపైరు విత్తనాలు చల్లటానికి వీలులేక, వరిపంట కుమిలిపోతున్నదే అనే దిగులుచేత రైతు సతమత మౌతున్నాడు. తగుసమయంలో నీరు అందించక పోవటం నీటిసరఫరా ఉద్యోగుల అశ్రద్ధగాని, మరొకటిగాని అయి వుండాలి.

వాతావరణ ప్రభావంవల్ల చేలన్నీ ఒకేసారి కోతకు వచ్చాయి. రైతు గాబరాపడి కోతకూలీలకు ప్రయత్నించాడు. ఊళ్లో కూలీలు చాలరు. మామూలుగా 'మేము వస్తాం, మేము వస్తాం' అని పోటీపడే మెట్టప్రాంతాల కూలీలు రాలేదు. మెట్ట పైరులు పోయినా, మెట్టప్రాంతాలలో వర్షాలవల్ల అక్కడక్కడ చెరువులు నిండి వరిపైరు పెట్టటం, కోతకు రావటం జరిగిందట. పైగా మామూలుగా వాళ్లు వచ్చేకాలానికంటె ముందు కావాలని రైతులు తహతహలాడి వాళ్లకోసం బెజవాడ మొదలైన చోట్లకు ఎగబడ్డారు. బైటనుండి వచ్చే కొత్త కూలీలకు బెజవాడ కూడలి. తెలంగాణా ఖమ్మం జిల్లా, కృష్ణా జిల్లా, గుంటూరు జిల్లా మెట్టప్రాంతాలనుండి వచ్చే కూలీలు అక్కడ గుమిగూడుతారు. ఇదివరకు వచ్చియుండిన కూలీలకు రైతులు ముందుగానే ప్రాసో, లేక ముఠానాయకులు 15 రోజులు ముందుగా వచ్చే ఏర్పాటుచేసుకొన్నవాళ్ళ గాక, ఇతర కూలీలను బెజవాడకు వెళ్లి బేరమాడి కుదుర్చుకొని తెచ్చుకుంటారు. ఈ సంవత్సరం ఎప్పుడు వర్షాలు పోతవో, ఎప్పుడు కోతలు ప్రారంభించాలో తెలియక పెద్దరైతులు ఉత్తరాలు ప్రాయలేదు. ఆ కారణంగానో, వాళ్లకు అంతు తెలియకనో, పైగా ఆ ప్రాంతాలలో ఈ సంవత్సరం చెరువులు నిండి వరిపైరు పెట్టటంచేతనో ముఠా నాయకులు రానే రాలేదు. అందువల్ల, పెద్దరైతులుకూడా బెజవాడకు పరుగెత్తవలసి వచ్చింది. ముందు వెళ్లినవాళ్లు బెజవాడలో దిగిన కొద్దిమందిని తీసుకొనిపోగా, రైతులు ఖమ్మం, మధిర, సత్తెనపల్లి, నర్సారావుపేట, గుంటూరులకు పరుగెత్తవలసి వచ్చింది. కనబడిన కూలీలకు రైతులు పోటీపడి వేలంపాట పాడినట్లు ధరలు పెంచి నిరుడు జోడా (1 పురుషుడు 1 స్త్రీ) కు 7 రూపాయ లివ్వగా ఇప్పుడు 12 రూపాయలు ఇస్తామని దొరికిన వాళ్లను తీసుకొనివెళ్లారు. అక్కడికీ దొరకని రైతులు 4, 5 రోజులు రైల్వే స్టేషనులలో, బస్సు స్టాండులలో పడిగాపులు కాస్తున్నారని రెండురోజులక్రితం సమాచారం. కూలీలకొరకు ఎదురు చూస్తున్న పదులకొలది రైతులు, వారిలోవారు సంప్రదించు

కొని మన కీ రేటు అయితే గిట్టుబాటు అవుతుందని నిర్ధారించుకొని ఆ రేటుమీద నిలబడి కూలీలను లభ్యపరచుకొంటే రేటు ఇంత విపరీతంగా పెరిగి యుండదు. ఈ సంవత్సరం రసాయన ఎరువుల ధర హెచ్చు. దోమకాటు మొదలైన తెగుళ్లనివారణ మందుల ఖర్చులు పెట్టవలసి వచ్చింది. తెగుళ్లవల్ల పంట కొన్నిచేలలో పూర్తిగా నాశనం అయింది. మొత్తం సగటు రాలుబడి ఎకరానికి 5,6 బస్తాలో అంతకంటె హెచ్చో, తక్కువ. రైతుల వద్ద మిగిలిన ప్రాతధాన్యం ధర బస్తా 1కి 20 రూపాయలైనా ఈ సంవత్సరం తక్కువ. అందువల్ల వ్యవసాయం ఖర్చులకు చేతి కందే డబ్బు తక్కువ. ఈ కారణాలవల్ల నిరుటికంటె రేటు తక్కువగా వుండవలసిన దానికి బదులుగా 60, 70 శాతం హెచ్చు పెట్టటం రైతుకు చాలా నష్టం. ఈ పరిస్థితులను ఆలోచనలోకి తీసుకొన కుండా కక్కుర్తితో ఎగబడి, పోటీపడి, వేలంపాడి కూలీలను తీసుకొని వెళ్లటం రైతు బుద్ధిలోపం అని చెప్పాలి. ఇక బైటనుండి కూలీలను తీసుకొనిరాని రైతుల సంగతి. చిన్న చిన్న ఆసామీలు కాల్వనీరు ఎప్పుడు వస్తుందో విత్తులు పడవేమో అని కొంత, పంట రాలిపోతుందేమో అని కొంత, త్వరగా పూర్తి చేసుకుని ఇతరపనులకో జల్సాలకో తిరుగవచ్చునని కొంత కారణాలవల్ల రేట్లు చాలా పెంచివేశారు. ఎకరం నుండి మూడు ఎకరాలున్నవాళ్లు అదనంఖర్చు రెట్టింపుఅయినా అయ్యేది కొంచెమేకాబట్టి తల కడుక్కుందాం అని రేట్లు, స్త్రీ ఒకరికి 7 రూపాయల వరకు పెంచివేశారు. వీళ్లిచ్చారు, ఇస్తున్నారనే సాకుమీద, మధ్యతరగతిరైతులు కూడా నలిగిపోయారు, పోతున్నారు. రైతుల్లో సంఘీభావం లేకపోవటమేగాకుండా విచక్షణాజ్ఞానం నశించిపోవటంవల్ల విపరీతంగా రేట్లు పెరిగాయి.

ఇక కూలీల విషయం. వీళ్లకు ఎంత హెచ్చుగా ఇస్తామన్నా ఇంకా హెచ్చు కోరుతారు. ఆశ కంతుండవచ్చునేమోగాని, దురాశ కుండదు. బైటి కూలీలు రైతులు ఎగబడటం, పోటీపడటం గమనించి రైలో, బస్సో దిగి మాట్లాడకుండా నిల్చుంటారట. రైతులు అంతిస్తాం, ఇంతిస్తాం అని పోటీలుపడి ఎవరు ఎక్కువ

ఇస్తామంటే వాళ్లపనికి మొదట వెళ్లారట. జనం పల్చబడ్డ తర్వాత అదివరకు పెంచియుండిన రేటు కంటె హెచ్చు అడగటం నేర్చు కొన్నారు. పైగా వసతులు ఎక్కువ కోరుకోవటం మొదలు పెట్టారు. మొదట జోడాకు 8 రూపాయలు లేక 9 రూపాయలు ఉండినది. 12 రూపాయలవరకు రైతులు పెట్టక తప్పలేదు. అది చాలక కొంతమంది కూలీలు 15 రూపాయలు అడుగగా కొందరు రైతులు నిస్పృహతో తిరిగి వచ్చారు. కొందరు చలిలో క్రుంగిపోతూ ఇం కెవరైనా దొరుకుతారేమో అని కాచుకొని యుండినారట. రెండుగోజులు రాత్రులు, మూడో మధ్యాహ్నం వరకు బెజవాడ, సత్తెనపల్లి, గుంటూరులలో కాచుకొనియుండి, గుంటూరు స్టేషను నుండి రైలులోను, బస్సులోను తీసుకొనివచ్చిన ముఠా ఇదివరలో బానలు, కుండలు మాత్రమే సరఫరాచేస్తున్న రైతును (ఇది అందరు రైతులకు వర్తిస్తుంది) "మాకు చట్టెలు వాని మూకుళ్లు కూడా కావా"లని కోరి, పొందారు. ఊళ్లోకూలీలు, ప్రక్కఊరు కూలీలు రెచ్చిపోయారు. మొదట రూ. 3-50 లేక రూ. 4-00 కూలి వుంటే రూ. 7-00 లకు గాని రానని పంతంబట్టి వేరే క్రోవలేనివాళ్ళనుండి స్త్రీ కూలి గుంజుకున్నది. మగ వానికి రూ. 7-50 లు అని చెప్పారు. మామూలుగా గం. 10 లేక 10-15 ని.లకు చేలో దిగవలసి వుండగా, మా యింటి ముందునుండి ప్రక్క వూరువాళ్ళు గం. 10-45 నుండి సుమారు 11 గంటల వరకు చేలముఖమై వెళ్ళారు. 20 నిమిషాలనుండి 40 నిమిషాలకుగాని దూరపొలాలకు చేరరు. 'ఇంత ఆలస్య మేమి'టంటే 'మీ వూరు (మైలు, మైలుబాతిక దూరం) రావద్దా' అన్నారు. రూ. 7 యిచ్చి రైతేంబావుకుంటాడంటే ఒకగడుసుస్త్రీ మరకం బియ్యం రూ. 7 అన్నది. అది అబద్ధం. ఇప్పుడు మరకం బియ్యం రూ. 5-60 లు మాత్రమే. చక్కగా శృంగారించుకొని, తలలో పూలు తురుముకొని బైలు దేరుతారు. ఆ పువ్వు రాలకుండా, ఒళ్ళు అలవకుండా, చేసి చేయనట్లు కోసి సాయంత్రం 4½ గంటలకే చేను విడిచిపెట్టి ఇంటిముఖ మౌతారు. 45 ని. లనుండి గంటవరకు మధ్యాహ్నభోజనాని కుపయోగించుకుంటారు. అనగా వాళ్ళు

చేసే పని 5 గంటలలోపు. కూలి రూ. 7, రూ. 7-50. ఈవిధంగా కూలీలు దురాశకు లోనై రైతు లొల్లితనాన్ని ఆసరా తీసుకొని, వ్యవసాయం గిట్టుబాటులేనిదానినిగా చేస్తున్నారు. ఇక వ్యవసాయం కొనసాగించటం, గతిలేకనే.

పల్లెటూరి పితలాటం

పితలాటం అనగా తగాదా పెట్టటం అని మనం సామాన్యంగా అనుకుంటాం. కాని, నిఘంటువు కక్కుర్తి, పిసినితనం అని అర్థం చెప్పుచున్నది. కక్కుర్తిని తీసుకుందాం. నేను "గతిలేక వ్యవసాయం" అన్న వ్యాసంలో వ్రాసినట్లు, కాలం మించిపోతున్న దేమో అని త్వరగా పనిపూర్తిచేసుకుని, తల కడుగుకున్నట్లు స్వేచ్ఛగా తిరుగవచ్చని కక్కుర్తిపడి, వేలంపాడినట్లు కోతకూలీల రేటును మిక్కిలి హెచ్చుగా పెంచి, తెచ్చుకొన్నారు. ఈ సంవత్సరం, కోతలువత్తిడిగాక, రైతులు వ్యవసాయవిషయంలో మామూలుగా కక్కుర్తి పడటం చూస్తుంటాం. కాలవలనుండి సేద్యపుభూములకు నీరు తెచ్చే పెద్దబోదుల పూడికలను వేసవిలో తీస్తారు. పూడికలను తీస్తుండగా ఆకుమళ్లు పోసుకోవాలని, కాల్వాలనుండి నీరు తీసుకొనివచ్చి త్రవ్వబోవుచున్న, లేక త్రవ్వుచుండిన బోదులను తడిపిన ఉదాహరణలను (ఇన్‌స్టెన్సెస్) నే నెరుగుదును. మామూలుగా కోత అయినతోడనే ఆకుమళ్ళను దున్నుకుంటారు. కాని, ఇప్పుడు రెండోపైరు ఆ కాస్తభూమిలో కూడా దక్కాలని కక్కుర్తిపడి, వేసవిలో బోదెలుత్రవ్వే కాలంలో తడుపుకొని దున్నుకుంటారు. ఈ కక్కుర్తివలన బోదెల పూడికను త్రవ్వి తీసివేయటానికి వీలులేక, ఊడ్పుల సమయంలో, సరిగా చేలల్లోకి, చేల బోదెలలోకి ప్రవహించక ఇబ్బంది ఆ బోది క్రింద సాగుచేసే వారి కందరికి కల్గుతుంది. ఊడ్చటానికి నీరు పెట్టుకొనే విషయంలో చాలా కక్కుర్తి పనులు జరుగుతాయి,

దొంగచాటుగా పైచేలకు నీరుపోకుండా అడ్డువేయటం, క్రిందికి పోకుండా తనచేను తర్వాతబోదిని ఏరేకో, రాయో కన్పడకుండా నీటిలోపెట్టి మెరకచేయటం, బోదికి దగ్గరగా తన చేనుంటే తన గండివరకు మెరకచేయటం, ఎవరైన రేపుదయం నారు లాగు కొనటానికి ఆకుమడిలో నీరు నిల్వాగట్టుకొంటే, దానిని చీకటిపడిన తర్వాత తన ఎండు గడ్డలకు మళ్లించుకోవటం, బోది మలుపు తిరిగివుంటే తనప్రక్క చేనుగట్టు నరికిసూటిగా నీరు తనచేనుకి ప్రవహించటానికి ఎదురుగా పెద్ద చీడి తీయటంవంటి కక్కుర్తి పనులు (అందరనికాదు) రైతు చేస్తుంటాడు. మరిన్ని, సరిహద్దు గట్టును తనప్రక్కనరికి రెండోప్రక్క వేయటం, తనప్రక్కగట్టు మీద తొండంగి వంటి వానిని నాటి, రెండోప్రక్క నడుస్తూ, ఆ ప్రక్కను నడచి, దిగబ్రొక్కి, గట్లుపెట్టుకొనే సమయంలో గట్టు తనప్రక్క విరిచిన గడ్డను రెండోప్రక్క వేర్చి, రెండోవాని భూమిని కుంచింపజేయటం దుష్ట బుద్ధిగల రైతు చేస్తాడు. నూర్పుడు కాలంలో, తనచేలగుండా వీలున్నా పశువులను బైటికి తోలు నప్పుడు, ప్రక్కవాని చేలోగుండా తోలటం, అదను చూచుకొని, ధాన్యం తీసుకుని వెళ్లటానికి, తన చేలోగుండా తోలితే రెండో పైరు దెబ్బతింటుందని, ప్రక్కవాని చేలోగుండా బండిని తోలటం కక్కుర్తికి ఉదాహరణలు.

పిసినితనం చాలాగ్రామాల్లో చాలామంది రైతుల్లో ప్రస్ఫుటంగా కనబడుతుంటుంది. పదిమంది కుపయోగపడే బోదుల త్రవ్వకానికి, తమవంతు తబిరీకు కొంతమంది ఎగగొడ్తారు. ఒకతను ఎన్నిసార్లడిగినా, అదుగో ఇదుగో అని కాలంగడిపి, ఒక సారి కనబడినప్పుడు గట్టిగా అడిగితే, "నే నెగగొట్టుతానా, ఎందుకు తొందర పెడ్తావు" అని పోట్లాడాడు. చివరకు ఇవ్వనేలేదు. మొత్తం స్వల్పమే అయినా పిసినాసితనంచేత ఎగగొట్టాడు. ఇదిగో ఇస్తామని పదిసార్లు త్రిప్పించుకొంటే, విసుగుపుట్టి త్రవ్వించినవాడు ఇక అడగటం మానివేస్తాడు. అంతటితో సరి. ఎవరైనా పూనుకొని గ్రామ మంతటికి ఉపయోగపడే పనిచేస్తూ "మూడు వంతుల ఖర్చు నేను పెట్టుకొంటాను, మీరు నాల్గోవంతు నివ్వం"

డంటే, సరే అని తలూపి, ఎగగొట్టినవాళ్లు, "నీ గొప్పకోసం చేశావు. నీవు, నీవాళ్లు పెట్టుకొనండి, మాకు పనిలే" దని ఎగగొట్టినవాళ్లు ఉంటారు. ఈ రెండు రకాల ఎగగొట్టువాళ్లు, చేసినపని లాభంపొందటానికి, అందరికంటె ముందుగానె తయారవుతారు. గ్రామాని కంతటికీ ఉపయోగపడుతుందని చేసినపని కాబట్టి, డబ్బివ్వనివాళ్లను ఆ పనిని ఉపయోగించుకొనవద్దని చెప్పటం వీలు కాదు, ధర్మంకూడా కాదు. డబ్బు కాశపడి పాలలో నీళ్లు కలపటం, రేగడపాలనుపోసి ఇతర పాలను పాడుచేయటం, పాలు కొనుగోలు చేసే పాలకేంద్రానికి తగినన్ని పాలడబ్బాలులేక తెచ్చిన పాల నన్నిటిని ఆ పూట తీసుకొనకపోతే, మిగిలిన పాలను కాచి, మీగడను తీసివేసి, సాయంత్రం పోసే పాలలో కలిపి కేంద్రానికి పోయటం, ఇటువంటి కక్కుర్తి లాభం పనులు చేయటం పరిపాటై పోతున్నది. దానధర్మాలమా టటుంచి, బ్రతిమాలి బామాలి నాలుగైదు రోజుల్లో ఇస్తానని తీసుకొని వెళ్లిన చేబదుళ్ళు ఎగగొట్టిన ప్రబుద్ధులున్నారు. చేయించుకొన్న పనికి ఇవ్వవలసిన డబ్బంతా ఇవ్వనివాళ్ళు, కూలి కివ్వవలసిన గింజలను పిచ్చికుంచాలతో కొలిచిన వాళ్ళు, లోభులున్నారు గైతుల్లో. నౌకరిచేస్తూ రావలసిన ధాన్యంకంటె ఎక్కువ పట్టుకొనివెళ్లి, చెప్పకుండా పెట్టకుండా నౌకరి మానుకొన్న పాలేళ్ళున్నారు.

పితలాటం అంటే సామాన్యార్థమున తగాదాపెట్టటం అని పైన చెప్పాను. బేరంచేసి కుదుర్చుకొన్న ధర నంతా ఇవ్వక, కొనిన సరుకు బాగాలేదని పోట్లాడేవారున్నారు. ఇవ్వవలసిన డబ్బడిగితే, ఫలానా అప్పుడు, నాకు ఫలానావిధంగా నష్టంచేశారు అనో, నీవది చేయలేదు, ఇదిచేయలేదనో తగాదా పెట్టే వాళ్ళున్నారు.

ఈవిధంగా పల్లెటూరు పితలాటం సాగుతూ వుంటుంది.

Blank Page

84

శ్రీ లింగం వీరభద్రయ్య చౌదరి

బి. ఎ. (ఆక్జన్) ఐ. ఆర్. ఎన్., బ్యారిస్టర్-ఎట్-లా
రిటైర్డ్ ఇన్‌కమ్‌టాక్స్ అసిస్టెంట్ కమిషనర్

వీరు 1898 జూన్ 25-వ తారీఖున మాతామహస్థాన మగు కృష్ణాజిల్లా, గుడివాడ తాలూకా, అంగలూరు గ్రామమున జన్మించారు. వీరి తండ్రి సమీప గ్రామ మగు బొమ్ములూరు వాస్తవ్యులు లింగం వెంకటరత్నంగారు. తల్లి త్రిపురనేని వెంకటాద్రిగారి కుమార్తె పున్నమ్మగారు. వీరు చిన్ననాట స్వగ్రామమగు బొమ్ములూరులోను, తరువాత బందరు, నోబుల్ హైస్కూల్, కాలేజీల లోను చదివి 1920 ఆగస్టులో ఇంగ్లండుకు ఉన్నత విద్యాభ్యాసంకొరకు వెళ్ళినారు. 1926 జూన్‌లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయమునుండి బి. ఎ. (ఆనర్సు) డిగ్రీని, 1927 జనవరిలో లండన్ లిన్‌కల్న్స్ ఇన్ నుండి బ్యారిస్టర్ పట్టాను పొందినారు. కొలదికాలం 1927-'28 లో మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా నుండి, 1929 ఏప్రిల్‌లో ఇన్‌కమ్‌టాక్స్ డిపార్టుమెంటులో చేరారు. 1953 జూన్ మాసాంతమున ఉద్యోగవిరమణ చేసి, అప్పటినుండి దివితాలూకా, పెడసనగల్లు గ్రామములో స్థిరనివాస మొనర్చుకొని, వ్యవసాయం చూచుకొనుచున్నారు.

వీరికి లలిత కళలయందు, సాహిత్యమునందు అభిమానము. 1961 సెప్టెంబరునుండి ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమి కార్యవర్గ సభ్యులు. 1963 నుండి 1968 వరకు 5 సంవత్సరముల పాటు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమిలో సభ్యులుగా నుండిరి.

వీరి యితర రచనలు — " తాంబూలం - నైవేద్యం ", " మారిన కాలం ", " Reflections on the West ", " స్వవిషయం " - 3 సంపుటాలు, " అభిప్రాయాలు - అనుభవాలు. "

c

ఆదర్శాలు అనుమానాలు



లింగం వీరభద్రయ్యచౌదరి

Blank Page

ఆదర్శాలు -

అనుమానాలు



లింగం పీరభద్రయ్య చౌదరి

ప్రథమ ముద్రణ : మార్చి 1976

స్వామ్యములు గ్రంథకర్తవి

ముద్రణ : త్రివేణి ప్రెస్, మచిలీపట్నం - 1

మూల్యము : 6 రూపాయలు


Sole Distributors :

త్రివేణి పబ్లిషర్సు

మచిలీపట్టణము - 1

Blank Page

IV



శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు

కృతి భర్త

V

అంకితం

సహాధ్యాయి, ఆబాల్యమిత్రుడు, బహుగ్రంథకర్త,

సాధుస్వభావుడు, సజ్జనవర్తనుడు

పండిత

శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారికి

ఆప్యాయతతో

— లింగం వీరభద్రయ్య చౌదరి

1 - 3 - 1976

Blank Page



లింగం వీరభద్రయ్య చౌదరి

గ్రంథకర్త

(మార్చి 1975)

Blank Page

విషయసూచిక

		పుటలు
	ప్రస్తావన	
1.	శ్రీ. శ్రీ. శ్రీమతి భారతీదేవిగారు	1 — 3
2.	సహధర్మచారిణి	3 — 5
3.	ఉత్తమ ఇల్లాలు	5 — 9
4.	వజ్రాల హారం	9 —13
5.	ఆ తండ్రి - ఈ కొడుకు	13—16
6.	పోరపాటు - తప్పిదము	16—18
7.	భార్యాభర్తలు	18—22
8.	వృద్ధాప్యం	23—27
9.	కృతజ్ఞత	27—31
10.	నా ఇంట్లో నేను దొంగనైపోయాను	31—35
11.	ఇట్టిది సంస్కారమా ?	35—36
12.	ప్రపంచ తెలుగు సభలు	37—43
13.	స్వేచ్ఛా స్వాతంత్ర్యాల మూల్యమెంత ?	43—51
14.	వర్ణాంతర వివాహం	51—54
15.	కవిరాజు సాహిత్య విహారం	55—58
16.	ఆర్యులు - అనార్యులు	58—59
17.	అబలకాదు, సబల	59—64
18.	జననీ జనకులు	64—65
19.	లలితకళలు	65—66
20.	దేవుడు	66—72
21.	కులం, వర్ణం ఒక్కటేనా ?	72—75
22.	గతిలేక వ్యవసాయం	75—80
23.	పల్లెటూరి పితలాటం	80—82

Blank Page

ప్రస్తావన

ఈ చిన్న పుస్తకానికి ఉపోద్ఘాతం లేక పీఠిక అనవసర మనిపిస్తున్నది. 1974 మార్చిలో నేను 1250 పేజీలుగల నా "స్వవిషయం" మూడవభాగం పూర్తిచేసినప్పుడు, ఇంకను వ్రాయటాని కవకాశముంటుందని అనుకోలేదు. అప్పటికే నాకు 76 సంవత్సరాలు నిండవచ్చుచున్నవి. వృద్ధాప్యంవల్ల, అనారోగ్యం వల్ల నా జీవితం క్షీణదశలో పడింది. కాని ఈశ్వరేచ్ఛవల్ల, శ్రీ షిరిడీ సాయిబాబా కరుణవల్ల కొంతతగ్గు స్థాయిలోనైనా, జీవితం ఇప్పటికినీ కొనసాగుచున్నది. అవీ ఇవీ పుస్తకాలు కొంటున్నాను. వానిని కొంతనరకైనా చదువుచున్నాను. అయితే ఎక్కువసేపు చదువలేకపోవుచున్నాను. విసుగెత్తి, ఏదైనా వ్రాస్తే విసుగు తగ్గిపోతుందనే ఊహకులోనౌచున్నాను. పైగా, విశ్రాంతిగా కూర్చున్నప్పుడు, పడుకున్నప్పుడు, పుస్తకాల్లోని విషయాలు, రేడియోలో విన్న సంగతులు గుర్తుకు, మననానికి వస్తుంటవి. ఆలోచనలు రగుల్తుంటవి. ఊహలు రేకెత్తుచుంటవి. భావవికాసం కల్గుచుంటుంది. అందువల్ల ఏవో గిల్కటం జరిగింది. ఆ గిల్కినవే ఇందులోని రచనలు. గొప్పగా చెప్పుకోవలసినవికావు.

అయినా, సామాన్యపాఠకులు కొందరికైనా నచ్చవచ్చును. కథావస్తువులు చాలావరకు హెచ్చుస్థాయిలోనివి కాకపోయినా, భావపటిమ తక్కువైనా, ప్రబోధాలు, ధార్మికచింతనలు, సాంఘికప్రయోజనాలు లేకపోయినా, ఉబుసుపోకకు చదివే సామాన్యపాఠకులకు కొంతకాలక్షేపానికైనా ఉపకరించవచ్చని అభిప్రాయం కొంత, బొత్తిగా నీరసించిపోలేదని నాకు నేను ధైర్యం చెప్పుకొనుటకు ముఖ్యంగా, ఈ పుస్తకంలోని రచనలను, బహిర్గతం చేయించుచున్నాను.


పాఠకలోకం సానుభూతితో గ్రహించెదరు గాక!

దివితాలూకా, పెడపనగల్లు
కృష్ణాజిల్లా
1-3-1976

లింగం వీరభద్రయ్య చౌదరి

Blank Page

Blank Page



శ్రీమతి భారతీదేవి రంగాగారు

కీ. శే. శ్రీమతి భారతీదేవిగారు

శ్రీమతి భారతీదేవిగారిని మొదటిసారి 1924-వ సం. లో ఆక్స్‌ఫర్డ్‌లో చూచాను. రంగాగారు, శ్రీకృష్ణగారు, నేను 1920-'21 నుండి 1922 వరకు కలసి ఆక్స్‌ఫర్డ్ శివారు బాట్‌లేలో ఒక యింటిలో ఉండేవారం. 1923 లో రంగాగారు ఆర్థిక శాస్త్రంలో అత్యున్నతంగా పరీక్షలో నెగ్గి, పరిశోధన డిగ్రీ నిమిత్తం వస్తుసంచయం కొరకు ఇండియాకు వెళ్లి, తిరిగి వస్తూ శ్రీమతి భారతీదేవిగారిని తీసుకొని వచ్చారు. ఆమెగారు కొంత కాలం ఆక్స్‌ఫర్డ్‌లోను, కొంతకాలం లండన్‌లోను ఉండేవారు. ఆకాలంలో వారి నప్పుడప్పుడు చూచుట తటస్థించింది. 1926 లో ఆచార్య సర్వేపల్లి రాధాకృష్ణగారు ఆక్స్‌ఫర్డ్‌లో అప్టన్ ఫౌండేషన్ ఉపన్యాసా లిచ్చినప్పుడు, అప్పు డాక్స్‌ఫర్డ్‌లో వున్న ఆంధ్ర విద్యార్థులం వారితో కలసి ఫోటో తీయించుకొన్నాం. ఆ ఫోటోలో శ్రీమతి భారతీదేవి ముఖ్యస్థానం అలంకరించారు. అప్పటి కింకను చిన్నవారైనా, అనుభవం తక్కువవారైనా ఆమె సహజ గంభీరం అందులో ప్రస్ఫుటమైనది. తర్వాత, 1927 ఫిబ్రవరిలో నేను స్వదేశానికి తిరిగి వచ్చినప్పుడు స్వాగత మివ్వటం, నేను వారి ఇంట 1928 లో మూడు మాసాలు అతిథిగా గడపటం జరిగాయి. తర్వాత అప్పుడప్పుడు కలుసు కోవటం, నా సంసారం చక్కబడటానికి నా భార్యకు సలహా లివ్వటం వంటి ఆత్మీయతలు పాటించారు. 1938 వేసవిలో నా పెద్ద కుమారుడు వారి మదనపల్లి వేసవి శైతుశిక్షణ కేంద్రంలో చేరినప్పుడు కన్నతల్లికంటె ఎక్కువ ఆదరణతో, ప్రేమతో వానిని చూచి

వాని హృదయాన్ని చూరగొని మా కానందం కల్గించి మరింత దగ్గరైనారు. ఆ యువకుడు కొలది మాసములకే అకాలమృత్యువు వాత బడగా ఆమె కన్నతల్లివలె శోకవ్యథను పొంది మాకు కొంతకు గొంత ఊరట కల్గించారు. ఈవిధముగా శ్రీ రంగాయేగాక, శ్రీమతి భారతీదేవిగారు కూడా మాకు ఆప్తబాంధవులై మిక్కిలి దగ్గరకు వచ్చారు.

నేను ప్రభుత్వోద్యోగములో ప్రవేశించి ఆ రభసలో మున్గినాను ; వారు రాజకీయాలలో ప్రవేశించి తమ సర్వస్వమును ప్రజాసేవకు ఉపయోగించారు. అందువల్ల మేము తరుచు కలసి కొనలేదు. కాని, హృదయాలు కలసిన గాఢమిత్రుల మైనాము.

శ్రీమతి భారతీదేవిగారి విశిష్టత, ఆమె సమన్వయ సమపాళ్లు వ్యక్తిత్వం, ఆమె సహజ వివేకం ఆమె పాదాలు భూమిని విడిచి పైకెగర లేదు. ప్రపూర్ణదేశభక్తి, మానవసేవాపరత, కారుణ్య దృష్టి కలవారైనను, ఊహాజనిత ఆదర్శలోకంలో విహరించేవారు కాదు. ఇంగితజ్ఞత, లౌకికం, ఉచితానుచిత జ్ఞానం కలవారు. ఎవరితో నెట్లు మెలగవలెనో, ఎవరి నెట్లూహరించవలెనో, ఎవరి నెట్లు సముదాయించవలెనో బాగుగా ఎరిగి మెత్తగా, మర్యాదగా వ్యవహరించేవారు. అందుకనే వారి గ్రామశిక్షణ పాఠశాలలో తయారైన అసంఖ్యాక యువకులు వారిని మాతృమూర్తిగా పూజించేవారు. వారి దేశసేవ, ప్రజాసేవ జగమెరిగినవే.

ఈ కొద్దిపాటి ఆమె వ్యక్తిత్వ చిత్రణను ముగించేముందు ఒకటి రెండు విషయాలు చెప్పాలి. వారు ఆచార్య రంగాగారి సతీమణి కాకపోయినట్లయితే, తాను లండన్ స్లేడ్ చిత్రకళాశాలలో నేర్చుకొన్న చిత్రకళను అభివృద్ధి నొందించుకొని, ప్రఖ్యాత చిత్రకారిణి అయ్యేవారు. తన సహజ చాతుర్య వైదగ్ధ్య సంపదతో మంచి రచయిత్రిగా రూపొందేవారు. వారి కంఠధ్వని జిలుగు కల్గినది. మాధుర్యాన్ని వెదజల్లే గాయనిగా పేరుప్రతిష్ఠలు సంపాదించేవారు. రంగాగారి అదృష్టమంటూ వారి అర్ధాంగి

అయ్యారు. ఇంగ్లీషులో బెటర్ హాఫ్ అంటామే ఆ విధంగా సరిణమించారు, రంగాగారికి ధృవనక్షత్రమైనారు. వారి స్థాయికి పునాదులు గట్టిపరచారు, వారిని తీర్చి దిద్దే శేముషీధురంధరులైనారు.

వారు 64 సంవత్సరములు నిండుతూనే పరలోకప్రాప్తి చెందటం శ్రీ రంగాగారితోబాటు మన కందరికీ తీరరాని లోటు. వారు పుణ్యలోకంలో భగవత్సాన్నిధ్యం చేరుకొనియుందురు, వారి ఆత్మకు శాశ్వత శాంతి కల్లుగాక!

౨

సహధర్మచారిణి

శ్రీమతి భారతీదేవి రంగాగారు సిసలైన సహధర్మచారిణి. పల్లెటూరిపిల్లగా విద్యాగంధంలేని రైతు కుటుంబంలో పుట్టి, అప్పటి పద్ధతి ప్రకారం ఏదో కొద్దిగా చదివి, ఇంకను పిన్నవయస్సులోనే ఆచార్య రంగాగారి భార్య అయినారు. ఇతర కమ్మ కుటుంబాలలో వలెనే, తలిదండ్రులు ఏర్పాటుచేసిన దాంపత్యం వీరిది కూడా. అయినా, ఏదో విశిష్టత ఉండబట్టే, ఆ చిన్నతనంలో భర్త "నీవు నాతోకూడ ఇంగ్లండుకు రావలసిన" దనగా, వెంటనే బయలుదేరారు. "దూరదేశం, చలిదేశం, పైగా చదువు సరిగా రాదు, నే నెట్లు రాగలను?" అని సందేహంగాని, బెదురుగాని, భీతిగాని చూపలేదు. ఆయన తన భర్త, తన సర్వస్వం, ఆయన రమ్మంటున్నారు. అదే తన కర్తవ్యం, తన ధర్మం అనే నమ్మకంతో బయలుదేరారు. శ్రీమతి భారతీదేవిగారు సహజ ధీరులు. చురుకుదనం, ఇంగితజ్ఞత, విచక్షణ, విషయగ్రహణ, ఉత్సుకత గలవారే గాక, భర్తతోబాటే తనలోకం అనుకునేవారు. కాబట్టి మారు మాట్లాడక ఇంగ్లండుకు బయలుదేరారు. రంగాగారు ఆమె అలివేలు మంగమ్మ పేరును భారతీదేవిగా మార్చటంతోనే, ఆమె వ్యక్తిత్వం అకస్మాత్తుగా పెరిగిందేమో అన్నట్లు ఆమె నిజంగా రంగాగారి

జీవిత భాగస్వామిని అయినారు. (శ్రీ) రంగాగారి మాటలలో, చేతలలో తనకర్ధభాగం వున్నట్లు రూపొందారు. నిజమైన అర్ధాంగి అయినారు. వారి ధర్మాచరణలో సహధర్మచారిణి అయినారు.

నేను 1927 ఫిబ్రవరి 27-వ తేదీన స్వదేశానికి తిరిగివచ్చి మద్రాసు హార్బరులో కాలుపెట్టాను. అప్పుడు నన్నాహ్వానించిన కొలదిమందిలో శ్రీమతి భారతీదేవిగా రుండినారు. సోదరీ ప్రేమతో హాసవదనంతో, పూలగుచ్ఛముతో మొదట కుశలప్రశ్నలువేసి, స్వదేశానికి నన్నాహ్వానించారు. ఆ ఆప్యాయత, ఉత్సాహపూరిత స్వాగతం నా హృదయంలో హత్తుకొనిపోయినవి.

నాకు కొన్ని ఇబ్బందులు తటస్థించి, వారి అతిథిగా మూడు మాసాలైనా, వారి మద్రాసు నివాసగృహంలో గడిపాను. ఆకాలంలో వారు తల్లివలె నన్నాదరించి, నాకెట్టి లోటు లేకుండా కన్నబిడ్డను చూచుకొన్నట్లు జాగ్రత్తపడ్డారు. సహజంగా భోజన మజ్జనాదుల సమర్చటలో నేర్పుగలవారు. రంగాగారి పలువిధ వ్యాసంగాలపేర్లు చెప్పి, ఏదోనెపంగా వచ్చే అతిథి అభ్యాగతులకు మర్యాద మన్ననల చేయడం వారివిధిగా ఎంచుకునేవారు. వారి ఆర్ద్రహృదయం, సౌజన్యం, సహజ ఔదార్యం, వచ్చినవారికి తృప్తిగా భోజన మమర్చవలెననే సుస్వభావం, వారి కెట్టి శ్రమను కల్గించినా సరకుచేయనిచ్చేవి కావు.

ఆమె సంతరించుకొన్న వ్యక్తిత్వాన్ని, పెంపొందించుకొన్న ఔన్నత్యాన్ని మహామేధావి, తంత్రజ్ఞుడు, మూర్తీభవించిన లౌకికుడు శ్రీ రాజాజీ, పాత్రికేయుడుగా, రచయితగా, విషయజ్ఞాన సంపన్నుడుగా, వ్యాఖ్యాన దక్షుడుగా పేరుప్రతిష్ఠలు సంపాదించుకొన్న శ్రీ నార్ల వెంకటేశ్వరరావు ఆమె పరలోకప్రాప్తి సందర్భంగా పంపిన సంతాప సందేశాలలోని ప్రశంసావాక్యాలు తెల్పుచున్నవి. శ్రీ రాజాజీ "భారతదేశంలో ప్రతిభాశాలిను లైన మహిళలలో శ్రీమతి భారతీదేవిగా రొక" రన్నారు. శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారు "ఆమె అసాధారణ ప్రతిభాశాలిని. ఆమె ఏమి చెప్పినా, ఏమి చేసినా దానిలో హుందాతనం ఉండేది,

Blank Page



శ్రీమతి చల్లగళ్ల రామాయమ్మగారు

దయ, సహకారం అందించేది. దూరదృష్టిగల సలహాలు నీయటం, మర్యాద మన్ననలతో మెలగటం ఆమెకు బాగా తెలుసు. మాధుర్యానికీ, కాంతికీ ఆధారంగా నిలిచిన మహిళ ఆమె" అని శ్లాఘించారు. శ్రీ నార్లవారి వాక్యాలు ఆమె ఇంగితజ్ఞతను, దక్షతను, ఔదార్యాన్ని, సూక్ష్మదృక్కులను ప్రస్ఫుటం చేస్తున్నవి.

శ్రీ రంగాజీకి భార్యగా నచ్చి, అర్ధాంగిగా మారి, వారి ధర్మానుచారిణిగా రూపొందిన, వారితోబాటు దేశస్వాతంత్ర్య సమరంలో ప్రజాహితకార్యాల్లో పాల్గొని, కారాగారశిక్ష అనుభవించారు. ఈవిధంగా వారు నిజంగా సహధర్మచారిణి అయ్యారు.

వారి ఆత్మ భౌతిక దేహాన్ని విడిచి, ఈ నెల 27-న తారీఖున కొక సంవత్సరం నిండుతుంది. పుణ్యనీయగు ఆమె ఆత్మ పుణ్యలోకంలో భగవత్సాన్నిధ్యాన్ని పొందివుంటుంది. ఆమె స్మృతికి అందరితోబాటు ఇవే నా జోహారులు.

(21-9-'73-వ తేదీనాటి 'వాహిని' పత్రిక సౌజన్యంతో)

3

ఉత్తమ ఇల్లాలు

ఆమెను మొదటిసారిగా 1933 లో చూచాను. నేను గంజాం జిల్లా (ఇప్పుడు ఒరిస్సా రాష్ట్రం) బరంపురంలో 1932 అక్టోబరు ఆఖరున ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసరు పదవిని స్వీకరించిన తర్వాత, శ్రీ సి. (చల్లగళ్ల) నరసింహం మా యింటికి వచ్చి చూచి వెళ్లారు. వారప్పుడు గంజాం జిల్లా అధికార ముఖ్యపట్టణం చత్రపూర్‌లో జిల్లా పంచాయతి ఆఫీసరుగా ఉంటుండేవారు. నేను చత్రపూర్‌కు క్యాంపుకు వెళ్లినప్పు డొకరాత్రి విందుకు పిల్చారు. వంటచేసి వడ్డించినవారు శ్రీ నరసింహంగారి భార్య శ్రీమతి

రామాయమ్మగారు. ఆమె వంటకాల రుచిని గురించి నా 'స్వవిషయం' రెండో భాగంలో ప్రస్తావించాను. ఆమె కప్పటికే నలుగురు చిన్నపిల్లలు. అయినా ఏ తోడు లేకుండా, ఎన్నో రకాల వంటకాలు అమర్చారు. శ్రమించినా అలసట, విసుగు ఆమెకు కల్గినట్లులేదు. క్రొత్తవారి ఎదుట కమ్మవారి గృహిణుల కుండే సహజ బిడియంతో, చిరునవ్వుతో మర్యాద మన్ననలను చేసి నన్ను భుజింపజేశారు. ఆమె పాకాల రుచులేగాక, ఆమె సౌజన్యం నాపై చెరగని ముద్ర వేసింది.

తర్వాత కొలది కాలానికి (1934 సంవత్సరం) శ్రీ నరసింహం బరంపురం మ్యునిసిపాలిటీకి కమిషనర్‌గా వచ్చారు. అప్పుడు మా కుటుంబానికి, వారి కుటుంబానికి సన్నిహితత్వం ఏర్పడింది. తరుచు నేను, శ్రీ నరసింహం కలుసుకోవటం, నా భార్య వారింటికి వెళ్లటం, శ్రీమతి రామాయమ్మ మా యింటికి రావటం వంటి మర్యాదలు జరుపుకున్నాం. వారి 5-వ బిడ్డ అన్నప్రాశనకు ఉయ్యాలవేసి పేరుపెట్టినప్పుడు పేరంటానికి వెళ్లిన నా భార్య బిడ్డ ముద్దువస్తున్నదని సంతోషపడ్డది. నే నొకసారి వెళ్లి బిడ్డను చూచి ఆనందించాను.

1935 వేసవిలోనో, తర్వాత వెంటనో శ్రీ నరసింహం బదిలీయై వెళ్లిపోయారు. 1936 మధ్యలో నేను అనంతపూరు జిల్లా ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసరుగా అనంతపూరుకు బదిలీ అయ్యాను. నేను హిందూపురం మొదటి (1937) క్యాంపునకు వెళ్లినప్పుడక్కడ శ్రీ నరసింహం మ్యునిసిపల్ కమిషనర్‌గా వుండినారు. తిరిగి మా స్నేహం కొనసాగింది. శ్రీమతి రామాయమ్మగారి నల భీమ పాకం రుచి నన్ను తిరిగి సంతృప్తుణ్ణి జేసింది. నేను 1940 లో బెజవాడకు ఆఫీసరుగా వెళ్లి 1943 జూన్ వరకక్కడుండినాను. హిందూపురం తర్వాత శ్రీ నరసింహం నెల్లూరుకు మ్యునిసిపల్ కమిషనర్‌గా వెళ్లి, బెజవాడ మ్యునిసిపాలిటీకి స్పెషల్ ఆఫీసరుగా వచ్చారు. సరే, తిరిగి వారి కుటుంబానికి, మా కుటుంబానికి రాకపోకలు, మర్యాద మన్ననలు కొనసాగాయి. వారు బెజవాడలో నున్నప్పుడు వారి పెద్ద బిడ్డ సౌభాగ్యవతి సుభద్రమ్మకు

వివాహం జరిగింది. మా కుటుంబం ముఖ్య అతిథులలో ప్రముఖులం. ఆ వివాహానికి పెండ్లికొడుకు ఊరు ముదునూరుకు శ్రీ నరసింహం వగైరాతో నేను వెళ్లి వియ్యపువా రందించిన మర్యాదలను పొందాను. గృహిణి మనస్తత్వం కూతురు పెండ్లిలో కొంతవర కైనా బైట బడుతుంది. మొదటి వివాహమైనా, శ్రీమతి రామాయమ్మ అలజడి చెందటం గాని, తత్తరపడటం గాని నే నెరుగను.

బెజవాడ ఉద్యోగానంతరం శ్రీ నరసింహం మద్రాసు కార్పొరేషన్ ఉద్యోగిగా వెళ్లిపోయారు. నేను 1949 లో బదిలీ మీద మద్రాసుకు వెళ్లినప్పుడు మా ప్రాత సన్నిహితత్వం మరింత పెరిగి, దృఢపడింది. ఆదృఢ సంబంధం ఇప్పటికిని కొనసాగు చున్నది. దురదృష్టవశాత్తు శ్రీమతి రామాయమ్మగారు 1971 డిసెంబరులో దివంగతులైనారు.

ఆమెకు ఆరుగురు కుమార్లు, ఆరుగురు కుమార్తెలు — మొత్తం పండ్రెండుమంది సంతానం కల్గారు. ఈపండ్రెండుమందిని ఆమె మిక్కిలి సహనంతో, ఆదరణతో, ప్రేమతో తన ఒక్కచేతిమీద పెంచి పెద్దవారిని జేశారు. చాలాకాలం ఆమె నంటివాని సాయం కోరు కొనలేదు. క్రమేపీ మద్రాసులో భర్త కార్పొరేషన్ కమిషనర్ పదవి నధిష్ఠించిన తర్వాత వంటవానిని పెట్టుకొన్నా, ఆమె చేతి మీదుగానే వంటకాలకు పూర్ణత్వం వచ్చేది. పిల్లలకు, భర్తకు భోజన మమర్చటం జరిగేది. వీ రందరికి ఉదయం, సాయంత్రం ఉపాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఆమె తన చేతిమీదుగానే జరిపారు. చదువుకునే పిల్లలకు పాఠశాలల వేళ ఇంచుమించుగా ఒకటైనా భిన్న భిన్న పాఠశాలలు, కాలేజీలు వేరువేరు చోట్ల ఉండటంవల్ల, పైగా అవసరాలనుబట్టి పిల్లలు వెనుకాముందు బైలుదేరటంవల్ల, వాళ్లను సర్దటం, వాళ్ల అవసరాలను తీర్చటం కాలాన్ని హరించేవి. మరిన్ని భర్తకు మధ్యాహ్న భోజనం కార్పొరేషన్ రిప్పన్ బిల్డింగుకు క్రమం తప్పకుండా పంపాలి. భర్త యింటికి తిరిగి వచ్చినప్పుడు, ఏదైనా ఉపాహారం చేసి వుంచాలి. పిల్లలు సరే సరి,

ఎప్పుడూ ఏదో నెమరువేయాలని కోర్తారుకదా ! వాళ్లను తృప్తి పరచాలి. అందువల్ల ఆమె కెప్పుడూ తీరికఅనేది ఉండేది కాదు. కించిత్తైనా విసుక్కొనక ఓపికతో రోజంతా ఈ పనులన్నీ నెరవేర్చుకొనేవారు. పిల్లల బట్టల నుండి, భర్త దుస్తుల వరకు ఆమె ఎంచవలసిందే. దుకాణాలలో ఏరటమేగాక, కుట్టుపనివానికి పని అప్పగించి తయారు ఆమె చేయించవలసిందే. (శ్రీ) నరసింహం తన ఉద్యోగనిర్వహణలో తలమున్కలై ఇంటివిషయ మేమీ పట్టించుకొనేవారు కాదు. ఆ పెద్దసంసారం సాఫీగా జరిగిపోవటానికి కావలసిన హంగులన్నీ, సంభారాలు యావత్తూ ఆమె అధ్వర్యంక్రింద సమకూడవలసినవే, పర్యవేక్షణక్రింద అమలులోకి రావలసినవే. (శ్రీ) నరసింహం కుటుంబ యజమానిగా తలంచబడటం, సంసారం నడవటానికి ధన మందించటం—అంతటితో ఆయన ధర్మంసరి. ఇతర బాధ్యతలన్నీ (శ్రీమతి) రామాయమ్మే భరించేది.

నిజానికి (శ్రీ) నరసింహంగారికి అన్నివిధాలా చేదోడు వాదోడుగా వుండటమేగాక, ఆయన అలికినా, ఉలికినా, అర్ధరాత్రి యైనా ఈమె వెంటనే చేయూత నివ్వవలసిందే. నేను ప్రత్యేకించి తెలుసుకోలేదుగాని, (శ్రీ) నరసింహంగారికి మొదటిలో చీకటంటే భయంగా వుండేదని, నీరుడు విసర్జించటానికి బైటికి వెళ్లినవలసివచ్చినప్పుడు, ఈమెగారు తోడుండేవారని విన్నాను. అంతగా (శ్రీ) నరసింహం రామాయమ్మగారిమీద ఆధారపడియుండేవారు.

(శ్రీమతి) రామాయమ్మ తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి తాలూకా కోటికేసవరం అనే చిన్నగ్రామంలో రైతుకుటుంబంలో ముండ్రు వెంకట్రామయ్య, అబ్బాయమ్మగార్లకు 1908 జనవరిలో జన్మించారు. తలిదండ్రు లంతగా చదువుకొన్నవారు కాదు. ఈమెగారి చదువు కూడా సామాన్యమే. అయితే సహజ సుగుణాలవల్ల ఆదర్శగృహిణిగా రూపొందారు. చూచినవారు, వినినవారు ఎంత ఆదర్శగృహిణి, ఎంత ఉత్తమ ఇల్లాలు అని ప్రశంసించకుండా ఉండలేకపోయేవారు. తెలిసినవారందరకూ కల్గిన పెద్ద విచారం, వారికను వయస్సుండగనే వెళ్లిపోయారే అని, పిల్లలు పెద్దవాళ్లైనా, వయస్సు మీరుచున్న (శ్రీ) నరసింహం

గారి కుడిచేయి పడిపోయినట్లయిందికదా అని, భగవంతు డిచ్చిన ఆయువును పొడిగించటాని కెవరికీ సాధ్యంకాదు. ఆమెకు ప్రాప్తించిన జీవితాన్ని మిక్కిలి సార్థకం చేసుకొన్నారు కదా అని కొంతకు గొంత ఊరట పొందాలి.

ఆమె ఉత్తమ సాధ్వియే గాక, సహధర్మచారిణియే గాక, ఉత్తమ ఇల్లాలు. ఆమె ప్రేమపూరిత దృష్టిలో భర్త, ఆమె ఆర్ద్రమాతృహృదయంనుండి పొంగి పొరలిన అమృత వీచికలలో బిడ్డలు దినదినాభివృద్ధిని పొందారు. ఆమె నిజంగా ధన్యురాలు. ఆమె 1971 డిసెంబరు 8-వ తారీఖున పుణ్యలోకప్రాప్తిని పొందారు. తన జీవిత సర్వస్వం భర్త కొరకు, బిడ్డల కొరకు ధారపోసిన ఆ ఉత్తమ ఇల్లాలు, పుణ్యమూర్తులు చేరే పుణ్యలోకం చేరుకొని శాశ్వత శాంతిని, అనిర్వచనీయానందమును పొందుచుంటారు.

ఆమె పూజ్య సంస్కృతి కివే నా జోహారులు.

5

వజ్రాలహారం

ఆమె అందమైన యువతి. సుందర వస్తువు లన్నా, చక్కని గృహ మన్నా, శోభాయమానమైన ప్రాంగణ మన్నా ప్రాణ మిస్తుంది. విశాలమైన గదులు, గదుల నిండా రత్నకంబళ్ళు, మెత్తని సోఫాలు, కుర్చీలు, నిగనిగలాడే మేజాబల్లలు, రంగు లీనే తెరలు, చూడగానే ఆకర్షించే చిత్రపటాలు ఆమె కోరుకుంటుంది. రకరకాల చిత్రాన్నాలు, గుబాళించే రుచికరమైన కూరలు, నోరూరించే ఉపాహారాలకు కలలు కంటుంది. పైగా సంగీతమంటే చెవికోసుకుంటుంది. నాట్యమంటే పరవశమైపోతుంది. స్వర్గ భోగా లనుభవించాలని ఉవ్విళ్లూరుతుంది. అయితే ఏమి లాభం? భర్త సామాన్య గుమాస్తా, వచ్చే జీతం స్వల్పం. తన తండ్రి ఇచ్చింది కొద్ది నగదున్నా, ఏ కష్టకాలంలోనైనా ఆదు

కొనటానికి దానిని కదపకూడదు. కాబట్టి, ఆమె వాంఛలు ఎండమావులుగా ఉండిపోయాయి. ఒక సాయంత్రం భర్త సంతోషంతో ఇంటిలో అడుగు పెట్టాడు. "ఎక్కడున్నావ్, వసుంధరా, ఒక శుభవార్త తెచ్చా" నన్నాడు, "ఏమి"టని భర్త మేం ద్రు నడిగింది. "ఇదిగో చూడు, ఫలానా రోజు రాత్రి మా మంత్రిగారు గొప్ప విందు చేస్తున్నారు, పెద్ద పెద్దవాళ్లు వస్తారు. సామాన్యంగా గుమాస్తాలకు ఆహ్వాన ముండదు. ఎంతో శ్రమపడి ఈ రెండు ఆహ్వానాలు తెచ్చాను. నీకు సంతోషంగా లేదా ?" అన్నాడు. "లేదు, నేను రాను" అన్నది. "ఏం ఎందుకు?" అన్నాడు. "నాకు సరియైన దుస్తులు లేవు. ఎట్లా వెళ్లేది ? భార్యకు తగిన దుస్తులున్న ఏ స్నేహితునికో ఇవ్వం" డన్నది. "దేనికో అని మిగుల్చుకొన్నవి 200 రూపాయలున్నవి, ఇస్తాను. నీ కిష్టమైన చీర వగైరా కొనుక్కో" అన్నాడు. కొనుక్కొన్నది. కాని మెడ బోసి అనిపించింది. ఈ బోసిమెడతో ఎలా వెళ్లేదని గునిసింది. మేం ద్రుడు కొంచె మాలోచించి, "నీ స్నేహితురాలు భాగ్యలక్ష్మి ఉన్నదికదా, ఆమె మిక్కిలి సంపన్నురాలుకదా, నీ వడిగితే ఏదైనా హారం ఇవ్వకపోతుందా" అన్నాడు. "అవును నిజమే, మంచి జ్ఞాపక మే చేశారు" అని వెళ్ళి, భాగ్యలక్ష్మినుండి ఒక వజ్రాల హారాన్ని తెచ్చుకొంది. ఆ మంత్రిగారి గొప్ప విందుకు వెళ్లారు. ఎందరో పెద్దలు వచ్చారు. విలువైన దుస్తులతో, కన్నులు మిరుమిట్లు గొలిపే ఆభరణాలతో అందకత్తెలు, విలాసవతులు వచ్చారు. మృష్టాన్నాలతో విందు గొప్పగా జరిగింది. పైగా హృదయాన్ని రంజింపజేసే సంగీతవాద్యాలు, శరీరాన్ని పులకరింపజేసే నృత్యాలు. వసుంధర ఉప్పొంగి పోయింది. స్వర్గలోకంలో వలె స్వేచ్ఛావిహారిణి అయింది. గొప్ప అంతస్తువారు, నవయౌవనులు, మన్మథరూపులు ఈమె హావభావాలకు, చమత్కారాలకు పరవశులైనారు. తోటి సుందరాంగులు అసూయాపరులైనారు. వసుంధ రారాత్రి తెల్లవారుఝామువరకు స్వప్నలోకములో కడుపార బంగారు ఆనందాన్ని జుర్రుకొన్నది. భర్తతో బైలుదేరి, అద్దె జట్కామీద ఇంటికి చేరుకున్నది. గదిలోకి వెళ్ళి అద్దంలో తన ప్రతిబింబం చూచుకోగా, మెడలోని

వజ్రాలహారం కన్పడలేదు. గగ్గోలుపడి దుస్తులు వగైరా విడదీసి చూచారు. కన్పడలేదు. త్రోవలో పడిపోయిందేమో అని వచ్చిన త్రోవంతా వెదుక్కుంటూ డ్రైవరందరు తెల్లవారిందాకా గడిపాడు. ఎక్కి వచ్చిన జట్కా జాడలేదు. అన్ని జట్కాలను విచారించాడు. పోలీసుకు రిపోర్టిచ్చాడు. ఎంత వెదికినా, ఎన్ని చోట్ల విచారించినా, ఎవరికి చెప్పినా, లాభంలేకపోయింది. భాగ్యలక్ష్మి హారం భాగ్యలక్ష్మి కందజేయాలి. ఏమి గత్యంతరం? చీల ఊడిందని వ్యవధిని కోరి, తన తండ్రి ఇచ్చిన పదివేల రూపాయలు, తన భర్త వారి వద్ద వీరి వద్ద ప్రోనోట్లుద్వారా తెచ్చిన పదివేల రూపాయలు, రొక్కంపెట్టి పోయినదాని వంటి వజ్రాల హారం కొని, వసుంధర పట్టుకొనివెళ్ళి భాగ్యలక్ష్మి కిచ్చి వచ్చింది. పది పండ్రెండు సంవత్సరాలు, భార్యా భర్తలు నికృష్టజీవనం గడిపి, ఎట్టకేలకు అప్పులభారంనుండి విముక్తి అయ్యారు. ఈ పది పండ్రెండు ఏళ్లు అన్ని వెట్టిచాకిరీలు వసుంధర జేసుకుని, దమ్మిడి రూపాయిగా వాడుకునే టప్పటికి అందమైన, నాజూకైన వసుంధర చింపిరి జుట్టుతో, చినిగిన బట్టలతో, మోటైన ముఖం, ప్రవేళ్లతో శుద్ధ పల్లెటూరు స్త్రీగా తయారైంది. ఒకనాడు బజారువెంట వెళ్లుచుండగా, భాగ్యలక్ష్మి ఎదురుగుండా వచ్చింది. పలకరిస్తేగాని, భాగ్యలక్ష్మి గుర్తుపట్టలేకపోయింది. 'నేను ఫలానా' అని చెప్పగా, నివ్వెరపోయి, "ఎందు కిలా అయ్యావు?" అని అడిగింది. వసుంధర సంగతి చెప్పగా, భాగ్యలక్ష్మి నిర్ఘాంతపోయి వసుంధర రెండుచేతులు పట్టుకుని, "అయ్యో పాపం, ఎంతపని జరిగింది! నా హారం నిజమైన వజ్రాలహారం కాదు. నకిలీ (పేస్టు) వజ్రాలు. దాని ఖరీదు తరిమి కట్టితే 300 రూపాయల కంటె ఎక్కువ ఉండదు" అని చెప్పింది.

పాపం వసుంధరకు ఎక్కడలేని దుఃఖం పొంగి వచ్చింది. పది పండ్రెండు సంవత్సరాలు అనవసరంగా నికృష్టజీవనం గడపి, ఇలా అయిపోయానే, ఎంత దురదృష్టరాలినని వాపోయింది. భాగ్యలక్ష్మి ధైర్యంచెప్పి ఊరడించి, తన యింటికి తీసుకొనివెళ్లి వజ్రాల్లహారాన్నిచ్చి, "దీనిని అమ్మి సొమ్ముజేసుకొని, ఇకనైనా సుఖజీవనం

చెయ్యండి. నా పోయిన నకిలీ హారాన్ని కొని తెచ్చి యివ్వవలసిన అవసరం లేదు. మీరు పడిన కష్టాలకు ఈపరిహారం మిక్కిలిస్వల్పం. నేను మొదటిలోనే చెప్పియుంటే మీ కీకష్టం రాకపోయివుండే'' దని చెప్పి పంపివేసింది. వజ్రాలధర పెరగటంవల్ల ఆ హారాన్ని అమ్మగా నలభై వేల రూపాయలు వచ్చాయి. పెద్ద వడ్డీ లివ్వాటం చేత, చేతికి వచ్చి నట్లున్నది ఇరవై అయిదువేలు మాత్రమే. అయినా, అసలు పొదుపు చేయవలసిన అవసరం లేకపోతే, తన మూలధనం పోను ఏపదిహేనువేలో మిగిలిం దనిపిస్తున్నది. కాబట్టి గ్రుడ్డిలో మెల్లన్నట్లు ప్రస్తుతం చేతి కందిన పెద్దమొత్తం కొంత సంతోషకారకమే. అయితే, స్త్రీ అందానికి, నాజూకుతనానికి, యౌవనాతిశయానికి విలువకట్టగలమా ? మోటుబారి, అనాకారి అయి, ముసలి రూపు, మనస్సు ఏర్పడినప్పుడు, నలభై వేల రూపాయలు కాదుకదా నలభైలక్షలైనా నష్టపరిహార మౌతవా ? యౌవనదశలోని పది పండ్రెండేళ్ల నష్టానికి పది పండ్రెండు లక్షల రూపాయలైనా చాలుతవా ? అసలు స్త్రీ అందానికి డబ్బు బదులా ? ఇక ఆ మేండ్రుడు చివికి, చివికి దిగులుతో వృద్ధుడైనాడు. మనిషి జీవితంలో మామూలుగా గడిపే జీవితంలో పది పండ్రెండేళ్లు లెక్కలోనివికావు. అయితే, దిగులుతో నిరాశతో, పెద్దబండ నెత్తిమీదనున్న భారంతో చావలేని బ్రతుకు బ్రతికేవానికి పది పండ్రెండేళ్లు పది పండ్రెండు యుగాలుగా వుండవా? డబ్బు వచ్చిందని ఎంత దిలాసా తెచ్చుకొన్నా, పూర్వంవలె హుషారుగా, స్వేచ్ఛాపరుడుగా సుఖజీవనం చేయగలడా ?

అయితే, వెధవ గుమాస్తాగిరికి స్వస్తి చెప్పి, పూర్తి విశ్రాంతి తీసుకొనవచ్చును. తన కిష్టమైనపనిని, తన కిష్టమైనప్పుడు చేసుకొన వచ్చును. నిర్భీతిగా, శిరస్సు ఎత్తి ప్రవర్తించవచ్చును. ఎవరి కెట్టి సలాములు చేయ నక్కరలేదు. మరిన్ని, సుఖజీవనం చేయ వచ్చును. క్రీడలకు, వినోదాలకు, క్లబ్బులకు పోవచ్చును.

ఇక వసుంధర, అడ్డమైన చాకిరి చేయవలసిన పనిలేదు. స్వయంగా మార్కెట్టుకు వెళ్లి కాసుకు, దమ్మిడీకి బేరమాడటం, సామానును స్వయంగా మోసుకొని తెచ్చుకోవటం ఇక అవసరం

లేదు. చీకటి కోణాల చింపిరి ఇల్లు, కుక్కి-మంచం, చినిగిన బట్టలు, చాలీ చాలని కూడు, కటికిబీద స్థితి ఇక అవసరం లేదు. మంచి ఇల్లు, తగిన సామానులు, నౌకరు, వంటకత్తె, మంచి దుస్తులు, మంచి భోజనం, విశ్రాంతి, షికారు వగైరాలు లభిస్తవి. అందం, నాజూకు పోయినా, వయస్సు కొంత మళ్లినా, మిగిలిన జీవితం సుఖంగా గడచి పోతుంది. ఎంత గొప్పగా పుట్టినా, ఎంత భోగ భాగ్యాలనుభవించినా, ఎంత అంద చందాలున్నా మానవ దేహానికి ముసలితనం రాకపోదు. ఇవి సంభవించేటప్పుడు భాగ్యవంతులు, అదృష్టవంతులు, గొప్ప హోదాగలవారు పేదవారితో, నికృష్ట జీవులతో, అనాకారులతో సమానమై పోతారు. ఇక చింత ఎందుకు? వజ్రాల హారాన్ని నిందించట మెందుకు? భాగ్యలక్ష్మిని దూషించట మెందుకు?

ఖించి సుప్రసిద్ధ కథానికుడు మొపాసా "హారం" అనే ప్రఖ్యాత విషాదాంత కథానిక వ్రాశాడు. నా కా కథానిక కల్గించిన భావాల నిందు పొందుపరచుచున్నాను. పాఠకులు చదివి సమ్మతినో, అసమ్మతినో పొందుదురుగాక!

తండ్రి-కొడుకు

బైబిల్‌లో ఒక కథ ఉన్నది. పూర్వకాలంలో ఒక సంపన్న గృహస్థునకు కుమారులు, కుమార్తెలు పెద్ద సంతానం ఉండినది. వారిలో చిన్నకొడుకు, తండ్రితో తగవులాడి తన వాటాను తీసుకొని దేశాంతరం వెళ్లిపోయాడు. కొన్ని సంవత్సరాలక్కడక్కడ తిరిగి, చేతనున్న డబ్బంతా పోగొట్టుకొని, దీనుడై ఒకరి వద్ద సేవకు కుదిరి, ఆ సేవాభారాన్ని భరించలేక, దుఃఖితుడై "నా తండ్రి వద్ద ఎందరో నౌకరులున్నారు. వారు సుఖజీవనం చేయుచున్నారు. నే నీ యజమానివద్ద బానిసవలె బాధ లనుభవించుచున్నాను. నా తండ్రి వద్ద నౌకరీ చేసుకొంటే, ఇంతకంటె మెరు"గని

బైలుదేరి ఇంటికి చేరుకొన్నాడు. దూరాన్నుండి తన కొడుకును గుర్తుపట్టిన తండ్రి, పరుగు పరుగున వచ్చి అతనిని కౌగిలించుకొని, ముద్దాడి ఆనందబాష్పనయనాలతో ఇంట్లోకి తీసుకొనివెళ్లి, సద్యోపచారాలను చేయించి, మంచి దుస్తుల నిచ్చి, కడుపునిండా భోజనం చేయించాడు. అంతేకాదు, తన బంధువులకు, స్నేహితులకు క్రొవ్వుపట్టిన గొఱ్ఱెపోతుల మాంసంతో పెద్ద విందు చేశాడు. ఒక స్నేహితుడు, "నీ మాటలు వినక, నీతో తగాదాపడి, తన వాటాను తీసుకొనిపోయి, పాడుచేసి, బికారియై వచ్చిన కొడుకు కింత అట్టహాసం చేస్తున్నావేమి?" అని అడిగాడు. తండ్రి ఈ విధంగా జవాబు చెప్పాడు. "మందల గొఱ్ఱెలను కాచుచున్న గొఱ్ఱెల కాపరి, ఏదైనా ఒక గొఱ్ఱె తప్పిపోతే, మందను విడిచిపెట్టి ఆ తప్పిపోయిన గొఱ్ఱెకొరకే తపిస్తూ, అన్వేషించడా? నాకు కాకుండా పోయిన నా బిడ్డ, నాకు తిరిగి దక్కినందుకు నేను గొప్పగా ఆనందించుచున్నాను. ఇందులో వింతేమున్న" దని సమాధానం చెప్పాడు.

ఫ్రెంచి రచయిత బర్నియేర్ "సగభాగం చేసిన గుర్రం మీద గుడ్డి" అనే కథానికను రచించాడు. ఇది తండ్రికి కొడుకు తలపెట్టిన ద్రోహం, దానిని మనుమడెట్లు మాపు చేయించింది తెలిపే, హృదయాన్ని కదిలించే కథ.

పారిస్ నగరంలో కష్టపడి సంపాదించిన ధనికవర్తకుడొక డుండేవాడు. అతని కొకే పుత్రుడు. పుత్రునకు వివాహం చేయదగు వయస్సు వచ్చింది. దగ్గరలో ఒక జమీందారు కూతురుండింది. ఆమె అందగత్తెయే గాక, జమీందారు కూతురాయె. అందువల్ల ఆ యువతిని తన కొడుకుకు చేసుకోవాలని ఉద్దేశించాడా వర్తకుడు. రాయబారాలలో పిల్ల తండ్రి, "నీ కొడుకు కేమిస్తా"వని అడుగగా, "నా సంపదలో సగభాగమిస్తా"నన్నాడు. 'కాదుకూడదు, నీ ఆస్తి నంతా నీ కొడుకుకు వ్రాసియిస్తేనే, సంబంధం కుదురుతుం'దని గట్టిగా చెప్పాడు. ఈ గొప్ప సంబంధాన్ని వదులుకోవటాని కిష్టంలేక, తన సంతాన మంతా ఈ ఒక్కకొడుకే కదా, తన జీవితాని కే లోటుండదని తలంచి, సంబంధాని కొప్పుకొని తన యావదాస్తిని

కొడుకుకు వ్రాసియిచ్చి, పెండ్లి జరిపించాడు. కొన్ని సంవత్సరాలకు వయస్సు మళ్లినందునను, చిన్నప్పటినుండి కష్టపడి యుండినందు వల్లను, ఓపిక ఉత్సాహం తగ్గినందువల్లను, ఆయన తన కొడుకు అండను విశ్రాంతిగా సుఖజీవనం చేయటానికి తలపెట్టాడు. కొంత కాలం సుఖంగానే జరిగింది. కోడలు ముసలాయన పనిపాటలు లేక, హాయిగా తిని ఇంట్లో కూర్చొనటం సహించలేదు. తండ్రిని పంపివేయండని భర్తను వేధించటం మొదలుపెట్టింది. భార్యపోరు పడలేక, కొడుకు తండ్రి నింట్లోనుండి వెళ్ళిపొమ్మన్నాడు. "ఈ వృద్ధాప్యంలో ఎక్కడకు వెళ్లేలే"దనగా, "ఎక్కడికైనా వెళ్లు, ఏ స్నేహితుని పంచనైనా చేరు, ఇక్కడుండటానికి వీల్లేలే"దని చెప్పి వేశాడు. తండ్రి దిగాలుపడి, "నా ఆస్తి నంతను నీ కిచ్చానుకదా నా ఆస్తినంతా తీసుకొన్న కొడుకువు నీవే కాదంటే, పరాయివాళ్లు ఆదరిస్తారా?" అని మొత్తుకున్నాడు. 'అదంతా నాకు తెలియదు. నీ వేమిచేస్తావో నా కెందుకు? నీవు ఇక్కడనుండి కదలవలసిందే 'అని నిష్కర్షగా చెప్పాడు. ఇక లాభంలేదని, ఏదైనా భత్యాని కిమ్మంటే లేదన్నాడు. "బాబూ, నీ గుర్రాలమీద కప్పే గుడ్డోకటైనా ఇప్పిస్తే చలిలో బిగుసుకుపోయి చావకుండా ఉంటా"నని బ్రతిమాలాడు. సరే అని, తన 12 ఏండ్ల కొడుకును పిలిచి గుర్రాల సాలలో ఒకగుర్రంమీద కప్పిన గుడ్డ నివ్వవలసిందని ఆజ్ఞాపించాడు. కుర్రవాడు సరే అని, తాతను గుర్రాల సాలకు తీసుకొనివెళ్ళి, ఒక మంచిగుడ్డను గుర్రంనుండి తీసి, దానిని పర్రున రెండుగా చీల్చి, ఒకముక్కను తాత కిచ్చాడు. 'ఇదేమిటి, నీ తండ్రి గుడ్డనంతా ఇవ్వమంటే, నీవు సగమే ఇచ్చావేమి'టని అడుగగా 'నేనిచ్చే దింతే' అని మొండి సమాధానం చెప్పాడు. ముసలితండ్రి తనకొడుకు వద్దకు వెళ్ళి, "చూచావా, నీ కొడుకు నీమాటను అవిధేయతతో త్రోసి వేసి, నాకు సగం గుడ్డే ఇచ్చా"డని చెప్పుకొన్నాడు. కుర్రవాని తండ్రి కొడుకును ప్రశ్నించగా 'అంతా ఇస్తే ఎట్లా? సగం నీకోసం ఉంచాను. ముసలివాని ఆస్తి నంతను తీసుకొని ఇంటినుండి వెడలదోలినట్లే, నేను పెద్దవాడనయిన తర్వాత, నీ ఆస్తినంతా నేను లాక్కొని, నిన్ను ఇంటినుండి వెడలగొడ్తాను. అప్పుడు ఈ సగం ముక్క

నీ కిస్తాను. ముసలాయన దీనావస్థలో చనిపోయేటట్లు నీవు చేస్తే, ఆవిధంగానే నీవు చనిపోవటానికి నే నెదురు చూస్తాను' అని సమాధాన మిచ్చాడు. అంతటితో ముసలాయన కొడుకుకు జ్ఞానోదయమై, పశ్చాత్తాపపడి, తండ్రిని ప్రాధేయపడి, ఇంట్లోకి తీసుకొనివెళ్ళి, సకలసౌఖ్యాల నమర్చాడు.

బైబిలులోని తండ్రి, తనను ఎదిరించి విడిచి వెళ్ళిపోయిన కొడుకు దీనావస్థలో తనదగ్గరకు చేరగా, హృదయానికి హత్తుకొని, ఆదరించి దగ్గరకు తీసుకొన్నాడు. బర్నియేర్ కథలోనికొడుకు, తనయందు గాఢప్రేమతో తండ్రి తన యావదాస్తిని తనకు సంక్రమింప జేయగా, అసహాయ జీర్ణస్థితిలోవున్న తండ్రిని బైటకు వెళ్ళగొట్టటానికి సిద్ధమైనాడు. దీనినిబట్టి, తండ్రిది సహజమైన అవ్యాజ ప్రేమ, కొడుకుది స్వంతపెత్తనం వెలిగించుకొనాలనే అధికారదాహం. దీనిని పురుషసోటీ లేక స్పర్ధ (మేల్ రైవల్రీ) అన వచ్చును. కోతుల తండాలో యువక మగకోతి, వృద్ధాప్యం వచ్చిన నాయక కోతిని తరిమివేసి, తండాకు తాను నాయకత్వం వహించి నట్లు.

మనుమని పాత్ర వంశానుగతమైన అభిమానం, ముసలి తనంలో నిస్సహాయుడైనాడనే సానుభూతి, ఆయన ఆస్తి నంతను తీసుకొని ఆయనను ఆకలితో, చలితో చావమనటం అధర్మం అనే భావం, ఇవన్నీ కలసి ఆ పిన్నవానిని ఉత్తేజితం చేసి, అంత చక్కటి ఉపాయాన్ని తోపింపజేశాయి. నిజంగా ఈ బాలుడు ధన్యుడు, ఆదర్శపాత్రుడు.

ఓ

పొరపాటు - తప్పిదము

పొరపాటు, అనాలోచితం; తప్పిదం, కావాలని చేసింది. మొదటిది భ్రమ పూర్వకం, రెండోది వాంఛించేది. పొరపాటు బాహ్య లేక దేహ సంబంధమైతే, తప్పిదం మనస్సు, బుద్ధి

సంజాతం. మొదటిది తలవనితలంపుగా జరిగే దైతే, రెండోది దీక్షతో ఆచరణపూర్వకమైనది.

తలవనితలంపుగా అకస్మాత్తుగా జరిగిపోయే సంఘటనలు, ఒకప్పుడు ప్రమాదానికి దారితీసినా, అవి పొరపాట్లే. నే నొకప్పు డొక కథ చదివాను. ఇద్దరు నూత్నదంపతులు ఒకే కాలమందు తమ ప్రథమ సమాగమానికి (హనీమూన్) ఒక హోటల్‌లో చెరియొక గది నద్దెకు తీసుకొన్నారట. మొదటి సంగమం, కునుకు అయినతర్వాత, భర్త లిరువురు మూత్రవిసర్జనకు బైటికివచ్చి, తిరిగి వెళ్లేటప్పుడు పొరపాటున ఒకరిగదిలోకి ఇంకొకరు ప్రవేశించారట. దీపాలు లేనందున, మంచాలుచేరి, అందులో మగత నిద్రలో వున్న యువతులను తమ భార్యలే అనుకొన్నారట. కామేచ్ఛ వలన వాళ్లను కౌగిలించుకొని రతోన్ముఖులవగా, ఆ యువతులు తమ భర్తలే అనుకొని మగత పూర్తిగా పోకున్నా సంభోగించనిచ్చారట. సంగమ బడలికతో భర్తలు మైమరచి నిద్రించుచుండగా తెల్లవారగట్ల యువతులు లేచి తమ ప్రక్కనున్నవారిని తమ భర్తలుగారని తెలిసికొని, ఒకరి గదినుండి మరొకరి గదికి, తెచ్చుకొన్న కొలది సామానును జేరవేసి, ఎవరి భర్త వద్ద వారు చేరుకొన్నారట. మనం చేరిన గదిది గానట్లున్నదే అని భర్తలనగా, ఇదేనని బుకాయించి బైటబడ్డారట. ఈ పరపురుష లేక పరస్త్రీ సంగమం కావాలని చేసిందికాదు. ప్రక్కప్రక్కనున్న గదులు, చీకటిరాత్రి, పురుషులిద్ద రేక కాలమందు బైటికి వెళ్లివలసి రావటం—ఈ పొరపాటుకు కారణమైనది.

ఇంకొక కథ. ఇద్దరు కవల యువకులలో ఒకనికి పెండ్లి అయింది. రెండోవానికి, పెండ్లి అయిన మొదటివాని భార్యమీద గాఢవాంఛ ఏర్పడియుండింది. తానే ఆ యువతిని చేసుకోవాలను కొన్నాడటగాని, ఆమె రెండోవానినే వరించి వివాహమాడింది. వాళ్లిద్దరు సమాన రూపురేఖలు, ఒడ్డుపొడుగులు, నడక, మాటతీరు కలవారు. అలవాట్ల భేదం వల్ల కల్గిన కించిత్తు మార్పును కామోద్రేకుడు సమపరచుకొని అచ్చం రెండోవానివలె తయారై,

అప్పుడు తలిదండ్రుల వద్ద నున్న ఆ యువతి వద్దకు వెళ్లాడు. ఆ యువతేగాక, ఆమె తలిదండ్రులు కూడా ఆ పిల్ల భర్తే అనుకొని సకల మర్యాద మన్ననలు చేశారు. రాత్రంతా తన ఇచ్చ వచ్చినట్లు ఆ యువతితో భోగించి, తెల్లవారిన తర్వాత పని ఉన్నదని వెళ్లిపోయాడు. కొన్నిరోజులకు భర్త రాగా మాటల సందర్భంలో, తనతో ఆ రాత్రి సంభోగించినవాడు తనభర్త కాదని తెలుసుకొని ఆయువతి ఆత్మహత్య చేసుకొన్నదట! తాను తెలిసి ఏ తప్పు చేయలేదు. నిజంగా తన భర్తయే అని నమ్మింది. తన తలిదండ్రులుకూడా అల్లుడే అని నమ్మారు. మరి ఎందుకీవనిత తనను తాను చంపుకొన్నది? వట్టి మూర్ఖత్వం, అవివేకం, పాతివ్రత్యం అనే భ్రమ, లైంగికానికి అనవసర ప్రాముఖ్య మివ్వటం అనుకోవాలి.

మనస్సు, బుద్ధి, జ్ఞానం, ఆత్మ లేనిదే శరీరం వట్టి కట్టె. ప్రాణం ఉండినా ప్రాణ మున్న కట్టె మాత్రమే. శరీరానికి మాలిన్యం, మనస్సు, బుద్ధిమీద ఆధారపడి యుంటుంది. వాని ప్రభావం లేనప్పుడు, ఏ క్రియకాని, ప్రక్రియకాని, లైంగికంకాని శరీరాని కంటవు. పైగా, స్త్రీ నెల నెలా పరిశుద్ధ మౌతుంది, నూత్న జీవిత అవుతుంది, పునర్జన్మ నొందుతుంది. తనకు తెలియకుండా తన శరీరాన్ని ఎవరో ఉపయోగించుకున్నారని, ప్రాణత్యాగం చేయటం శుద్ధ వెర్రితనం, దురహంకారం. శరీరానికి, దానికి సంబంధించిన లైంగికానికి అనవసర ఆధిక్య మివ్వటం.

భార్యాభర్తలు

స్త్రీ వేరు, భార్యవేరు. పురుషుడు వేరు, భర్తవేరు. స్త్రీ, భార్య ఒకజాతి (సెక్సు) వారైనా, ప్రవర్తనలో భిన్నమైనవారు. స్త్రీ, స్త్రీగా, వంట వార్పు చేసేది, లైంగికంగా మగవాని

కుపయోగపడేది. బిడ్డలను కనేది. ఆదిలో, సంఘం ఏర్పడనప్పుడు సంఘ నియమాలు రాకముందు, స్త్రీ ఒకరిసొత్తు కానప్పుడు, ఆమె సార్థకమే అంత. వివాహ విధి స్థిరస్థాయి అయినప్పుడు, స్త్రీ భార్యగా రూపొందింది. గృహిణి అయింది. భర్త సహచరిణి, సహధర్మచారిణి అయింది. అతని వంశం కొనసాగటానికి కారణమైంది. మరిన్ని లైంగికంగా, అతనిసొత్తు అయింది. పురుషుడు పురుషుడుగా బైటబడినప్పుడు, ఏ సంసార బాధ్యతను వహించలేదు. ఏ వావి వరసలు పాటించి యుండలేదు. ఆహారం సేకరించటం, లైంగికపొంగును తీర్చుకొనటం, ఏ చెట్టుక్రిందో, ఏ పుట్టక్రిందో నిద్రించటం వాని జీవితాచరణ. పురుషుడు భర్తగా మారినప్పుడు, తన భార్య, తన బిడ్డలు, తన గృహం, తమ సుఖ జీవనం అతని ధ్యేయమైనవి. తాను జీవనోపాధికి సంపాదించటం, భార్యతో లైంగిక బాధను తీర్చుకొనటం, బిడ్డలను పోషించటం, వారి అభివృద్ధికి పాటుబడటం అతని ధర్మమైనది. భార్య తన వంశాభివృద్ధికి మూలస్తంభం. ఆమె తనవీర్యాన్నే ధరించి, తన రక్తాన్నే ప్రసరింపజేసి, తన ప్రతిబింబాలనే పెంపొందించటం అతని ఆశయం. ఆమె ఇతర పురుషులను దరిచేరనీయకూడ దనేది అతని సిద్ధాంతం.

నాగరికతను పొందిన పురుషుడు భార్యతో దప్ప ఇతర స్త్రీలతో సంగమించ కూడదు. స్త్రీ భర్తను తప్ప ఇతరపురుషులతో సంపర్కంలేని పతివ్రత అయియుండాలి. ఇదీ ధర్మం. అయితే, ఏకపతివ్రతం స్త్రీకి విధిగా ఎంచబడినా, ఏకపత్నీత్వం పురుషుని కట్టివేయలేదు. వివాహవిధి ప్రకారం 'నాతిచరామి' మొదలైన ప్రమాణా లతడు చేసినా, అతని సహజస్వభావాని కవి లోబడలేదు. పురుషుడు లైంగికంగా చంచల స్వభావుడు. భిన్న భిన్న లైంగికానుభవాలను కోరుకుంటాడు. స్త్రీ సహజంగా ఏక పురుషారాధకురాలు. పురుషులలో ఒక స్త్రీతోనే సరిపెట్టుకొనేవారున్నారు. స్త్రీలలో బహు పురుష సంగమంకోరేవారున్నారు. అయితే, స్త్రీ లైంగిక స్వేచ్ఛ పురుష లైంగిక స్వేచ్ఛ వంటిదగునా? స్త్రీ, బిడ్డలను కనేది. వంశాన్నికొనసాగించేది. పురుషుడు కుటుంబ

యజమాని. దాని మూల స్తంభం. సంఘ వ్యవస్థలో కుటుంబం ఒక అంగం (యూనిట్). ఆ వ్యవస్థను ప్రతిబింబించటం, దానికి ప్రాతినిధ్యం వహించటం కుటుంబ యజమానిగా అతని ప్రత్యేకత.

అందువలన పురుషుడు భర్తగా వ్యభిచరించడం వేరు, స్త్రీ భార్యగా వ్యభిచరించటం వేరు. భర్త వ్యభిచరించినా, తన బిడ్డలకు, తన సంసారానికి ఇబ్బంది వుండదు. భార్య వ్యభిచరిస్తే వంశం కల్తీ అవటమే గాకుండా గృహం దెబ్బతింటుంది, సంసారం చెడిపోతుంది. బిడ్డలు దిక్కు-లేనివారవుతారు. భర్త పరస్త్రీని కామించి, ఆమెతో సాంగత్యం పెట్టుకొన్నా, తనకు భార్య వున్నదని, ఆమె తన సంసారాన్ని ఈదుకొనివస్తున్న దని, తన బిడ్డలను పెంచుతున్నదని, సంసారం గడవటానికి, బిడ్డల పోషణ, విద్య నిమిత్తం, తన సంపాదనలో చాలా భాగాన్నైనా వాళ్లకు చెందచేయాలని కోరుకుంటాడు, ఆచరణలో పెడ్తాడు. కాబట్టి లైంగికంగా, ప్రేమపూర్వకంగా భార్యకు తగిన సహకార మివ్వక పోయినా, తన గృహాన్ని, సంసారాన్ని, బిడ్డలను కనిపెట్టుకొనే యుంటాడు. భార్య విషయ మట్లు కాదు. తాను వ్యభిచరించటం తన సహజ స్వభావాన్ని, సంఘ ధర్మాలు, నియమాలను బట్టి, ఒక పాతకంగా ఆమెకు తెలుసును. దానిని లెక్క-పెట్టకుండా పర పురుష సాంగత్యానికి లోనైతే, బరితెగించిందన్నమాట. అప్పుడు తనగృహ మెట్లు క్షీణించినా, తన సంసార మెట్లు ఛిన్నాభిన్నమైనా, తన బిడ్డ లెట్లు దిక్కు-లేనివాళ్లైనా లక్ష్యపెట్టదు. తన కామతృప్తే ఆమెకు కావలసింది. అందువల్ల భర్త వ్యభిచరించటం, కుటుంబాని కంత చెరుపు కలగచేయకపోవచ్చును కాని, భార్య వ్యభిచరిస్తే కుటుంబం సర్వనాశన మౌతుంది. పరపురుషుడు జ్ఞాతివర్గంలోని వాడు కాకపోతే అతని వలన బిడ్డలను కని మందలో కలిపితే, వ్యక్తిగత రక్తపారంపర్యం లేకపోవు టటుంచి, భర్తవంశం సంకర మౌతుంది. ఇది వివాహ వ్యవస్థకే గొడ్డలిపెట్టు. సర్వసామాన్యంగా స్త్రీ వ్యభిచరించేది, జ్ఞాతివర్గంలోనివాడు కానివానితోనే. చాలా వరకు ఇతరకులంవానితోనే.

అపరిమితంగా ప్రాగి, జూదంలో డబ్బంతా తగులబెట్టి, ఇల్లు వాకిలి పట్టించుకోనకుండా, భార్యను చావగొట్టి, బిడ్డలు ఆకలితో మాడుతున్నా పట్టించుకొనక, ఏ లంజతోనో కాలంగడిపే భర్తలున్నారు. అట్టి వారిని మనం గర్హించేది, వారి వ్యభిచారానికి కాదు. స్త్రీలలో కూడా మితిమీరి ప్రాగేవారున్నారు. అట్టివారు గృహాన్ని చిందర వందర చేయటం, బిడ్డలను సరిగా చూడక పోవటం, ఏదీ పట్టించుకొనక పోవటం మన మంతగా తెక్కపెట్టం. మనం గమనించే దల్లా వారు వ్యభిచరిస్తున్నారా అని. వ్యభిచరించకపోతే, భర్తవంశం సంకరంకాదు. కాబట్టి, మనకు సహజంగా తోచేది, భర్తవ్యభిచారం సహింప దగినది. భార్య వ్యభిచారం వ్యతిరేకించ వలసినది అని. అయితే, మన భారతీయ దృక్పథానికి, మన స్వాతంత్ర్యానికి పాశ్చాత్యుల మన స్తత్వానికి, దృక్పథానికి స్త్రీ పురుష సంబంధంలో కొంత వ్యత్యాస మున్నది. ఈ వ్యత్యాసం భార్యాభర్తల సంబంధంలో కూడా ప్రతిఫలిస్తుంది. మనశాస్త్రాలు, ధర్మాలు భార్య ఒకే పురుషునికి యావజ్జీవం కట్టుబడి యుండా లంటవి. ఈ ధర్మాలను జీర్ణించుకొన్న మనభార్యలు, పతివ్రతలుగా కీర్తిగడించాలని తహ తహ లాడుతారు. పాశ్చాత్య స్త్రీ వివాహ బంధం యావజ్జీవం కాదు. అది తెగిపోవచ్చును. ఆమె ఇం కొక పురుషుని భర్తగా సాంగత్యం పొందవచ్చును. అందువల్ల పతివ్రత ధర్మానికి పాశ్చాత్యుడు అంత విలువ నివ్వ నవసరం లేదు.

సుప్రసిద్ధ కథానికుడు, నవలా రచయిత, నాటక కర్త సోమర్ సెట్ మామ్ "శాశ్వతమైన భార్య" అనే నాటకాన్ని ప్రాశాడు. దానిలో భర్త, ఒక ప్రియురాలితో ప్రేమకలాపం పెట్టుకుంటాడు. భార్యకు తెలిసినా గృహసామరస్యం కోసం, ఏమీ ఎరగనట్లు వ్యవహరిస్తుంది. భర్త సంపర్కం లేకపోయినా, సహించి యథాప్రకారం భర్తయం దాదరణతో నడుచుకుంటుంది. ఇట్లుండగా, చాలా సంవత్సరాలకు పూర్వం పరదేశానికేగి అక్కడ స్థిరపడిపోయిన ప్రియబాల్యస్నేహితుడు తనింటికి వస్తాడు. ఆదరిస్తుంది. అతడు కొన్నాళ్లామె ఇంట్లో గడిపి ఆ పట్టణంలోనే నివాస

మేర్పరచుకుంటాడు. వాళ్ళిద్దరు తరుచు కలుసుకోవటం, వినోదాలకు, ఆటపాటలకు కలసి తిరగటం జరుగుతుంది. అతడు ఆరు వారాలలో తిరిగి తన స్థిరనివాస దేశానికి వెళ్లిపోతాడు. తనను ప్రేమించి, ఆరాధిస్తున్న అతనితో ఈ ఆరు వారాలైనా సుఖ సంతోషాలతో, కామలీలా పరవశత్వంతో గడపాలని ఆమెకు బుద్ధిపుట్టి అతని అభ్యర్థన నంగీకరించి, భర్తతో "నేను, అతడు ఈ ఆరు వారాలు ప్రేమికులంగా గడుపుతాం. ఎండుబారియుండిన నా జీవితంలో నవవసంతం ప్రవేశించి, నా జీవితాన్ని చిగురింపజేసి, నన్ను సౌఖ్యంలో ఓలలాడిస్తుంది. వెళ్లివస్తా" నంటుంది. పిడుగుపడిన చందమైనభర్త, వెళ్లవద్దని ప్రాధేయపడతాడు. "నీ విప్పుడు వెళ్లితే తిరిగి ఈ ఇంటికి రానీయను. ఇక నీకు నాకు తెగతెంపులే" అని బెదిరిస్తాడు. "నీవు నీ ప్రియురాలితో పది సంవత్సరాల నుండి కులుకుతున్నావు, నే నొక్క ఆరు వారాల సౌఖ్య మనుభవించ కూడదా? ఆరు వారాలైన తర్వాత అత డెట్లును వెళ్లిపోతాడు. నేను మామూలు భార్యగానే ఉంటాను. ఇంటికి తిరిగి వచ్చి యథాప్రకారం, గృహం నడుపుతాను. నీ కిష్టమైతే సంసారం కొనసాగిద్దాం మామూలుగా. నేను వెళ్లకతప్ప" దంటుంది. భర్త ఆలోచించాడు. విడాకులిచ్చిన స్త్రీని, పురుషుడు భార్యనుగా చేసుకొనటం లేదా! ఒకసారి విడిపోయి ఇతరులను చేసుకొన్నవాళ్లు, వాళ్లనుండి విడిపోయి తిరిగి భార్యా భర్తలు కానటం లేదా! కాబట్టి ఆరు వారాలు పరపురుషునితో లైంగిక మాచరించిందని తప్పుపట్టట మేమిటని నిశ్చయించుకొని, "వెళ్లిరా, నీవంటి సాగసుకత్తెను, ఉల్లాసపరచేదాన్ని, మోహపరచేదాన్ని ఎలా వద్దంటా" నన్నాడు. ఈ దృక్పథం సముచిత మనే నాకు తోస్తున్నది. మన భారతీయుల్లో కూడా పతివ్రతా ధర్మం సన్నగిల్లుచున్నది. భార్యా భర్తల అనుబంధం, ఒకరి నొక రవగాహన చేసుకొనటం, స్నేహ పూర్వకంగా మెలగటం, సామరస్యం పెంపొందించుకొని సుఖ సంసారం గడుపుకొనటం ముఖ్యంగా ఎంచుకొంటున్నారు. ఇది చాలా మంచి పరిణామం.

వృద్ధాప్యం

మానవులే కాదు, సమస్త జంతుజాలం కూడా పుట్టినది గిట్టుట కొరకే. పుట్టిన క్షణం నుండి జీవి మృత్యుముఖమునకు ప్రయాణించుతాడు. నెలరోజుల పసికందు ఆయువులో, ఆ నెల రోజులు క్షీణించినవన్నమాట. అలాగే అన్నిజీవులకు తా మెదుగు చున్న రోజులు, జీవించుచున్న సంవత్సరాలు తమకు నిర్ణయించిన (భగవంతుడుగాని మరేదేని మహత్తరశక్తిగాని) ఆయువునుండి తరిగిపోతవి. ఇది ప్రకృతి సహజం.

అయితే, బాల మరణాలు, యువ మరణాలు, మధ్యవయస్సు మరణాలు మనోవేదనను కలిగిస్తవి. బంధువులు, ఆత్మీయులు లబో దిబో అని గోలపెట్టగా, ఇతరులు అయ్యోపాపం అని విచారిస్తారు. వయస్సుమళ్లిన వారి విషయంలో విచారాలు, మనోభావాలు కొంతవరకైనా మిశ్రమంగా వుంటవి. వృద్ధులు అనగా 80 ఏళ్లు నిండిన వారంటారు గాని, నిజానికి 70 ఏళ్లు దాటిన వా రందరు వృద్ధులే. అట్టివారి మరణం విషయంలో వ్యక్తుల అంతస్తులనుబట్టి భేదాలున్నా, మొత్తంమీద మొగ మాటానికో బులపాటానికో కొంతసానుభూతి వెలువరించటం తప్ప, విచార ముండదు.

నవయౌవనుడు గాని, మధ్యవయస్కుడు గాని, వయస్సు మళ్లినవాడు గాని, విశిష్ట వ్యక్తిత్వం కలిగియుండి, తనకుటుంబాన్ని గాని, సంఘాన్ని గాని, రాష్ట్రాన్ని గాని, దేశాన్ని గాని ఏదో ఒకవిధంగా ప్రభావితంజేసి తన జీవితం ఉపయోగ పడునట్లు వ్యవహరిస్తే, అయ్యో చనిపోయాడే అని వాపోవటం, సంతాపం చెందటం జరుగుతుంది. ఎవరికీ ఏవిధంగానూ ఉపయోగపడని వ్యర్థ జీవి చావు భార్యా బిడ్డలకు, రక్త బంధువులకు తప్ప ఇతరు లెవ్వరికి ఎట్టి చలనం, విచార భావం కలుగజేయదు. పైగా మరణించినజీవి దుష్టుడైతే, "పీడవదిలింది, ఇంకా దుర్మార్గాలు

చేయకుండా చచ్చా''డని నిందిస్తారు. ననయశావన యోధులు అభిమన్యుని, బాలచంద్రుని అకాలమరణం ఇప్పటికి మనకు మనస్తాపం కల్గిస్తుంది. వారు బ్రతికియుంటే, ఎట్టి సాహసాలు చేసేవారో, ఘనకార్యాలు ఆచరించేవారో అని పరితపిస్తాం. ఝాన్సీలక్ష్మీబాయి శౌర్యప్రతాపాలు, మనకళ్లెదుట పొడగట్టి ఆమె యవ్వనమందలి మరణానికి మనస్సు వేధిస్తుంది. కవిబ్రహ్మ ఏటుకూరి నరసయ్య, కవయిత్రి తొమ్మిదవత్తుగార్ల యవ్వనదశ మరణం మనలను విచారగ్రస్తులను చేస్తుంది. కవికోకిల దుప్పూరి రామిరెడ్డి, కవిరాజు త్రిపురనేని రామస్వామిచౌదరి మధ్య నయస్సు మరణాలు మనలను సంతప్త హృదయులను చేస్తవి. ఆవిధంగానే మహామహుడు రాజా రామమోహనరాయి పరలోకప్రాప్తికూడా. మహాశయుడగు సుభాష్‌చంద్రబోసు అకాలమరణం దేశ వ్యాప్తంగా సంతాపాన్ని కలుగచేస్తున్నది. దుష్టుల మరణాలు సంతోషదాయకంకాగా,నిరంకుశులు,మానవతాహీనులు, దేశాలను ప్రజలను మారణహోమంచేసిన మానవరూపపిశాచులు హిట్లర్, ముసోలిని దిక్కులేని చావులకు ప్రపంచం హర్షించి సంతోషంతో ఊగిపోయింది. స్టాలిన్‌కూడా ఇంచు మించు ఈ కోవకు చెందిన వాడే. ప్రజాబాహుళ్యం అతని చావుకు చింతింపలేదు.

పోతే పూర్తివృద్ధులు కాకపోయినా, వయస్సుమళ్లిన తర్వాత పరమేశ్వరుని సాన్నిధ్యం చేరిన మహాత్మాగాంధీ, సర్దార్ పటేల్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మరణాలు మనకెప్పుడూ సంతాప కారణాలే. వారి స్మృతి మనకెల్లప్పుడూ స్మరణీయమే. బ్రహ్మర్షి వెంకటరత్నంనాయుడు, కందుకూరి వీరేశలింగం పంతులు మన కెప్పుడూ ఆరాధ్యులే. వారింకా కొన్ని సంవత్సరాలు బ్రతికి ఉంటే బాగుండేది అనుకుంటాం.

ఇక పూర్ణవృద్ధుల విషయంలో విశ్వేశ్వరయ్య, రాజగోపాలా చారి, సర్వేపల్లి రాధాకృష్ణ, మొదలైన మహాభాగులు, మహా పురుషులు మనను విడిచిపోవటం మనకు కొంతవరకైనా విచారాన్ని కల్గిస్తుంది. అయితే, వారు పూర్ణజీవులు. మొత్తం దేశానికి అఖండసేవజేసి, అంతర్జాతీయంగా మనదేశానికి పేరు ప్రతిష్ఠలు

కల్గజేసినవారు కాబట్టి, ప్రకృతి సహజమైన వారి మరణం మన కంతగా బాధ కల్గించదు.

బాలురు, యువకులు, మధ్యవయస్కులు మంచిగా జీవించినా, చెడుగా జీవించినా వారు శారీరకంగా శక్తిహీనులు కారు. తమ పనులను తాము చేసుకొనుటకు జవసత్వాలను కల్గియుంటారు. వారి బుద్ధి, మనస్సు సక్రమంగా నడిస్తే పదిమందీ సంతోషిస్తారు, చెడు నడవడుల కలవాలై దుష్టులైతే నిరసిస్తారు. వృద్ధుల విషయం వేరు.

వృద్ధాప్యంవల్ల కొన్ని లాభా లున్నాయి. ఇంట్లోవారు, కొడుకులు కోడళ్లు గాని, మనుమలు మనుమరాండ్రు గాని పెద్ద వాడనే గౌరవభావ మేగాక, ముసలివాడయ్యాడు, అశక్తుడయ్యాడని తలచి, అవి, ఇవి అందించి తోడుపడతారు. భోజన మజ్జనాదులలో ఏమి అనుకూలమో, ఆవిధంగా నడుచుకుంటారు. బైటకు వెళ్తే తెలియనివారైనా బస్సుగాని, రైలుగాని ఎక్కటానికి, దిగటానికి చేయూత నిస్తారు. దారి క్లిష్టంగావున్నా, జనం రద్దీగావున్నా చేయి బట్టుకొని నడిపించుకొని తీసుకువెళ్తారు. ఏదైనా అవసరం వస్తే సాయపడతారు. సానుభూతి చూపుతారు. ఎందుకు మీ కీ శ్రమ అంటే, " పెద్దవారు, మీకు సరిగా కనబడటం లేనట్లున్నది, మీ కీ కొంచెం సాయపడలేమా " అంటారు. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ తెలుగు సభలకు వెళ్లినప్పుడు నా వృద్ధాప్యం, నాకు రెండు సార్లు సాయం నిప్పించింది. మొదటి రోజున ఎక్కువసేపు కాకతీయనగరంలో ఉండలేక, జనసందోహం నుండి బైటపడాలని క్రిక్కిరిసిన గేటునుండి ప్రయత్నించగా వెనుక, ముందు త్రోపుడువల్ల ఉక్కిరిబిక్కిరై పడటానికి సిద్ధంగావుండగా, అక్కడున్న జవానొకడు నన్నాదుకొని వాటువేసుకొని బైటికి లాగి కొంతదూరం సాగనంపాడు. రెండోసారి, లోపలికి పోవాలని ప్రయత్నిస్తుండగా లాఠీఛార్జి తోపుడులో చెప్పాకటి పోగొట్టుకొని కుంటుకుంటూ బైటపడి మూకల మధ్యనుండి ఎట్లు ఆవరణ దాట గలనా అని సందేహించుచుండగా, నా ఆందోళన చూచిన యువకు డొకడు రెక్క బట్టుకొని గుంపుల గుండా నెమ్మదిగా

నడిపించుకొని వెళ్లి రిక్షా ఎక్కించి నా హోటల్‌కు సాగనంపాడు. ఇంకొక విశేషం. నేనొక వేళ తీవ్రంగా, అసమంజసంగా మాట్లాడినా వృద్ధుడ నని సహించి ఊరుకొంటారు. రసికత్వం పూర్తిగా వడిలి పోక, ఏ బంధువుల పడుచుపిల్లనైనా, ఏ పరిచితుల యువతినైనా కొంచెం కొంటెగా పలుకరించినా, వేళాకోళంగా మాట్లాడినా, అందచందాలు వర్ణించినా ముసలివాడనే భావంతో తప్పుపట్టరు. రెండు మూడు సంవత్సరాల క్రితం నేను ఒక స్నేహితుని బంధువుల పెండ్లికి హాజరయ్యాను. ఆ వధువు చాలా అందంగా కన్పడింది. నేను పెళ్లిపందిరినుండి ఇతరులతో బైటికి వెళ్లుచూ, వెనుకకు తిరిగి తిరిగి ఆ పెండ్లికూతురును చూచాను. మరిన్ని బైటకు వచ్చిన తర్వాత ఆమె మిక్కిలి చక్కనిది వగైరా అని మెచ్చులు పలాకును. అక్కడున్న మిత్రులు వగైరా ఆయన వృద్ధుడు గనుక, ఆవిధంగా ధైర్యంగా అంటున్నాడు. తప్పు పట్టవలసినది కాదను కొన్నారు. ఈవిధంగా ముసిలితనం కొన్ని సదుపాయాలను, స్వేచ్ఛను, సానుభూతిని, గౌరవాన్ని సమకూరుస్తుంది.

అయితే వృద్ధత్వం లాభాలకంటె అనర్థాలనే ఎక్కువ తెస్తుంది. ముఖ్యంగా వృద్ధుడు అవయవాలు, ఇంద్రియాలు సరిగా పనిచేయక నిస్సహాయుడవుతాడు. శక్తిహీనుడవుతాడు. కాళ్లు చేతులు సవ్యంగా పనిచేయక వడిగా నడువలేడు. బరువు ఎత్తలేడు, దింపలేడు. నడుము పట్టుతుంది. మోకాళ్లు వంగవు, కీళ్లనొప్పులు రావచ్చును. కళ్లు సరిగా కనపడక పోవచ్చును. వ్రాయుటకుగాని చదువుటకుగాని ఓపిక యుండదు. అలసట ఎక్కువౌతుంది. పురుషత్వం పూర్తిగా దిగజారిపోయి, జీవనసారస్యం నశించిపోతుంది. ఇక జీవించటం వ్యర్థ మనిపిస్తుంది.

మంచి బుద్ధి, అభిమానం, ఆప్యాయతగల కోడలు లేక మనుమరాలు భోజనం వగైరాలలో తగినట్లు, తృప్తికలుగునట్లు వర్తిస్తుంది. పై సుగుణాలు తక్కువై తే విసుక్కోవటం, ఏదో ఒకటి ముఖాన పారవేయటం, ఎందుకు వచ్చిన పీడరా అని గొణుక్కోవటం వగైరాతో ముసలివాని జీవితం దుర్భరం చేస్తుంది. కొడుకులు గాని, మనుమలు గాని నిరత్యం చేయటం, పడివుండనీ ముసలి

వాడిని అని అనుకోవటం, గగ్గోలుపెట్టినా మందు మాకు సరిగాగాని, సకాలంలోగాని తెచ్చి ఇవ్వకపోవటం, తగిన వైద్యం చేయించక పోవటం, తండ్రి అని గాని తాత అని గాని అభిమానించక, ఏ ఇంటి వ్యవహారంలోను లేనట్లే వ్యవహరించటం వంటివి జరిగి వృద్ధుడు మరణాని కెదురుచూచునట్లు చేస్తవి.

బంధువులు అతనిని చచ్చినవానిక్రిందే జమకడ్తారు. కూతుళ్లు స్వార్థపరులైతే, ఈయనవల్ల మనకికలాభించే దేమున్నదని, అజా పజా కనుక్కోరు. ఇంటిపెత్తనం పూర్తిగాపోయి, ఇంటిలో కించిత్తైనా పలుకుబడిలేని ముసలివానిని, బైటవాళ్లు ఎందుకు ఖాతరుచేస్తారు? పలుకరింపుకూడా వుండదు. ఏదైనా ముసలి వాడు అడిగితే ఇంట్లోవారినుండికూడా సమాధానం రాదు. రెండో సారి అడిగితే, "అన్నివూసులు నీకే కావాలా" అని కసురుకుంటారు.

పై విధంగా జీవితం నిస్సారం, నిరర్థకమైనదై వృద్ధాప్యాన్ని నరకప్రాయం చేస్తుంది. ఈమధ్యనే ఒకదానిలో చదివాను. ఒక బాలుడు నోడ్డు అంచుమీద కూర్చుండి ఏడుస్తున్నాడట. దారిని పోయే ముసలివా డొకడు జాలిగొని, "కుర్రవాడా, ఎందుకు ఏడు స్తున్నా"వని అడిగాడట. వాడు "నేను పెద్దకుర్రవాళ్లు చేసే పనులను చేయలేకపోతున్నాను, అందువలన ఏడుస్తున్నా" నన్నాడట. చప్పున ముసలివాడు ఆబాలుని ప్రక్కన చదికిలబడి, తానుకూడా ఏడ్వటం ఆరంభించాడట. ఆ చిన్నపిల్లవాని నిస్సహాయత ఈ ముసలివానికి తన అశక్తిని, అసహాయతను జ్ఞప్తికి తెచ్చాయి.

కృతజ్ఞత

రామచంద్రరావు బజారువెంట వెళ్లుతున్నాడు. ఎవరో పిల్చినట్లు వినబడి, ఎవరా అని వెనక్కు తిరిగి చూస్తే, బాల్య మిత్రుడు జోగారావు వడిగా నడచి వస్తున్నాడు. వీ డెప్పుడు

వచ్చాడురా, ఎందుకు వచ్చాడో అనుకొనుచుండగా జోగారావు రానే వచ్చాడు. రావటంతోనే "నీ వెప్పుడు వచ్చావురా? ఇంటి వద్ద అంతాక్షేమంగా వున్నారా?" అని అడిగాడు. "మే మందరం కులాసాగానే వున్నాం. నీ వెప్పు డూడిపడ్డావు? ఏం పనిమీదవచ్చావు? మీవాళ్లంతా కులాసాగా వున్నారా?" అని ఎదురడిగాడు. "ఆ, మేం ఫరవాలేదులే, యథాప్రకారం. మా కొక చిన్నదావా వచ్చింది. మా వకీలుతో మాట్లాడిపోదామని వచ్చాను, నీవో" అన్నాడు. "ఆ కమిషన్ వర్తకుడు సరుకులు పంపిస్తే, సరిగా జవాబు చెప్పడు. అదేదో కనుక్కొందామని వచ్చా"ననాడు రామచంద్రరావు. "దగ్గిరలోనే మంచి చల్లని పానీయాల దుకాణం వున్నది. కోకోకోలా ఐనా తీసుకుందాం, ఎండలప్పుడేముదిరాయి"అని రామచంద్రరావు దారితీశాడు. లోపలికివెళ్ళి, రెండు కోకోకోలాలకు ఆర్డ రిచ్చారు. చప్పున జ్ఞాపకం వచ్చినట్లు జోగారావు, "ఒరే రామూ, నీ వా రెండు పుస్తకాలు పంపినందుకు చాలా సంతోషం, కృతజ్ఞుణ్ణి" అన్నాడు. రామచంద్రరావు నవ్వి, "ఏడ్చావులే, నీ పుస్తకాలు నీకు పంపినందుకే కృతజ్ఞతా"అన్నాడు. జోగారావు ముసిముసినవ్వు నవ్వుచూ, "పూర్వం ఒకాయన చెప్పలేదటరా 'పుస్తకం, వనితా, విత్తం పరహస్తం గతం గతం' అని. నీవు స్నేహితుడవే అనుకో. నీకు మతిమరుపు ఎక్కువ. ఎక్కడైనా పెట్టి మరచిపోయావేమో, లేదా, ఎవరైనా పట్టుకొనిపోయి ఎక్కడైనా పారవేశా నన్నారేమో అని దిగులుపడ్డాను మొన్నటివర కవి తిరిగి రాక పోతే. వస్తే, కొత్తపెళ్లాం వచ్చినట్లు సంబరపడ్డాను. ఇక రావని నిశ్చయించుకొంటే, తలవని తలంపుగా నాకు మిక్కిలి ఇష్టమైన ఆరెండు పుస్తకాలు వస్తే కృతజ్ఞత వుండదూ?" అని వెకిలి నవ్వు నవ్వాడు. రామచంద్రరావుకు నవ్వొచ్చింది. "ఒరే, ఈ కృతజ్ఞత మిక్కిలి గడుసుదిరా. అనేక రకాల పోకడలు పోతుంది. రకరకాల రూపాల్లో బహిర్గత మౌతుంది. దీని స్వభావం అతి చతురత కలది. చూడు, నీవు నీ పుస్తకాలు నీకు తిరిగి పంపితే కృతజ్ఞత చెప్తున్నావు. ఈమధ్య ఒక బంధువుతో, 'నీవు మంచిపని చేశా' వంటే, కృతజ్ఞత తెల్పాడు. తెలిసిన గ్రంథకర్తకు, 'మీ పుస్తకం

చదివాను, బాగున్న' దంటే, కృతజ్ఞతాపూర్వకవందనాలని వ్రాశాడు. ఇంకొకరికి ఏదో పనుండి వ్రాస్తూ, 'మీ భార్యా పిల్లలు క్షేమంగా వున్నారా? మీ ఆరోగ్యం బాగున్నదా' అని మామూలు కుశలప్రశ్నలు వేస్తే, మీరు మా క్షేమాన్ని తెలుసుకోవాలని శ్రద్ధ వహించినందులకు మా కృతజ్ఞతాభివందనా లని జవాబిచ్చాడు. ఈవిధంగా రకరకాల వ్యక్తులనుండి వివిధ పరిస్థితుల్లో కృతజ్ఞత ప్రత్యక్ష మౌతుంది. మన తాతల తండ్రుల హయాంలో ఈ విధంగా కృతజ్ఞతలు ప్రకటించేవారు కాదు. ఏదైనా, ఎవరివల్లనైనా, ఉపకారమో, సహకారమో జరిగితే మనస్సులో వుంచుకొనేవారు. అవతలివారి కవసరం వచ్చినప్పుడు తగిన తోడ్పడందించేవారు" అన్నాడు తాపీగా. జోగారా వందుకొని, "అదిసరే లేరా, ఒకప్పుడుమాత్రం కృతజ్ఞత అనేది లేకుండా పోయిందంటావా? పొందిన సహాయానికి సంతోషం వెలిబుచ్చటమో, ప్రతిగా ఉపకారం చేయటమో పూర్వకాలంలోనూ ఉండేది పైకి చెప్పకపోయినా. భారతం తీసుకో, కర్ణుడు దుర్యోధనుణ్ణి అంటకాగి చచ్చేవరకుండటం, సూతకులస్థుడైన తనను అంగదేశానికి రాజునుగా చేసి ఆదరించాడనే కృతజ్ఞతవల్ల కాదా? అంతెందుకు, అశ్వత్థామ దుర్యోధనునికి జరిగిన అపచారానికి ప్రతిచేయటం, చిన్నప్పటినుండి ఆదరించి స్నేహం నెరపాడని కృతజ్ఞతచేతనేకదా? రామాయణంలో సుగ్రీవుడు రాముని కిచ్చిన యుద్ధసహాయం, కొంతకుగొంతైనా, తనకు కిష్కింధారాజ్య మబ్బజేసినందులకు కృతజ్ఞతాపూర్వకమైనదే. సాయం చేయకపోతే వాలిని చంపినట్లు తనను కూడా ఎక్కడ చంపుతాడో అని భయం సుగ్రీవుని కుండి యుంటుం దనుకొందాం. అయినా, కొంతవరకైనా కృతజ్ఞత ఉండకపోలేదు. విభీషణుని విషయంలో అట్లు కాదనుకొనవచ్చునేమో. తన అన్న రావణుని రహస్యాలన్నీ చెప్పి అతని అంతానికి తోడ్పడటం పూర్తిగా రాజ్యకాంక్షతో చేసివుంటాడని తోచవచ్చును. అయితే, రామునకు విభీషణుని సహాయానికి కృతజ్ఞత ఉండాలికదా! లంకకు పట్టం గట్టాడని అనవచ్చును. తా నెట్లును కోసలదేశం రాజౌ

తాడు. ఎక్కడో దక్షిణాన సముద్రం అవతలనున్న లంకారాజ్యం తా నెట్లు పాలించగలడు? లక్ష్మణుడు తనను విడిచి వుండడాయె. భరతునికి రాజ్యకాంక్ష లేదు. తన తండ్రి భరతుని తాత కేకయ రాజు కిచ్చిన వాగ్దానం ప్రకారం కోసలదేశానికి భరతుడే రాజై వుండవలసి వుండగా, 'నాకు వద్దు మొర్రో' అని తన చెప్పులను సింహాసనంమీద పెట్టి, తన ప్రతినిధిగా వుంటున్నాడాయె. శత్రుఘ్ను డేదీ పట్టించుకోవటంలేదు. భరతుని చాటున కాలక్షేపం చేస్తున్నట్లున్నాడు. తనకు, తన తమ్ములకు పనికిరాని రాజ్యాన్ని, అందులో హనుమంతుడు దహించడంతో, యుద్ధంతో సర్వనాశనమైన ఆ లంకారాజ్యాన్ని, ఏడ్పు మొత్తుకోళ్ల పరిస్థితుల్లో విభీషణున్నే ఏలుకోనిద్దాం, అతడు నాకు సామంతుడుగా వుంటాడు. అంగబలం, ధనబలం ఉండి, మొక్కవోని కిష్కింధారాజ్యాన్ని ఏలుకొనుచున్న సుగ్రీవుడే చచ్చినట్లు తనకు లోబడి సామాంతుడుగా వున్నప్పుడు, విభీషణు డెట్లునూ తనకు లోబడి తన అదుపాజ్ఞల్లోనే వుంటాడు. సుగ్రీవుని ముఖ్యమంత్రి హనుమంతుడు తన బానిసై పోయాడు. హనుమంతు డంటే సుగ్రీవునకు అభిమానమే గాక, ఆ మహాబలశాలి, ఉపాయశాలి ఎక్కడెదురు తిరుగు తాడో అని భయం కూడా. కాబట్టి సుగ్రీవు డెట్లును తన వాడే. వాలిని చంపి సుగ్రీవునకు కిష్కింధరాజ్య మిచ్చినట్లు, రావణుని జంపి, విభీషణుని లంక ఏలుకోనివ్వటం సబబే. రాజ్యం తనకు దక్కించాానని విభీషణు డెప్పుడూ కృతజ్ఞుడుగానే వుంటాడు. ఈ దూరాలోచనతోనే, విభీషణునకు లంకారాజ్యం పట్టం గట్టాడు గాని, రాముడు కృతజ్ఞతతో చేయలేదు. కాని, విభీషణునకు కొంచెమో గొప్పో ఉండియుండకపోదు. ఐతే, రామాయణంలో కృతజ్ఞతను తెల్పే ఇతర ఘట్టాలు లేకపోలేదు. ఉదాహరణకు, ఆటవికుడైన జటాయువు తన నాదరిస్తావచ్చాడని సీతను రావణు డెత్తుకు పోవుచున్నప్పుడు విడిపించాలని, అడ్డగించి మరణం పొందాడు. ఇటువంటివి మన పురాణాల్లో అక్కడక్కడ కనబడతవి. కాబట్టి కృతజ్ఞతనేది ఇప్పుడు కొత్తగా మొలిచింది కాదు" అని జోగారావు ఉద్ఘాటించాడు. "సరే, నీవు చెప్పింది బాగానే

వున్నది. ఇక మన పనులమీద మనం వెళ్దాం'' అని రామచంద్ర రావు లేచాడు. ''మళ్లీ ఎన్నాళ్లకు కలసికొంటామో'' అని జోగా రావుకూడా లేచాడు. బైటకు వచ్చి ఎవరిదారిని వారు వెళ్ళి పోయారు.

౧౦

నా ఇంట్లో నేను దొంగనైపోయాను

నా ఇంట్లో నేను దొంగనైపోయా నంటే, నా ఇంట్లోవాళ్ల డబ్బు నేను దొంగిలించానని కాదు. నా చిన్నతనంలో మా అమ్మ దాచుకొన్న చిల్లరడబ్బు లెత్తుకొనిపోయి శనగపప్పు, బఠాణీలు కొనుక్కొన్న మాట నిజమే. అయితే, చిన్నపిల్లవాణ్ణి కాబట్టి దానిని దొంగతనంగా ఎంచుకోకూడదు. పైగా మా అమ్మ డబ్బు మా పిల్లలకు కాకపోతే మరెవరికి? మా అమ్మకు చెప్పకపోయినా, తల్లి ఎక్కడైనా తన చిన్నబిడ్డలకు దొంగరికం కట్టుతుందా? ఏ తల్లి అయినా మరీ చిన్నవాళ్లు కాకపోతే, ''దొంగచచ్చినాడా'' అని తిట్టవచ్చును గాని, ''నా బిడ్డలు దొంగ''లని ఇతరులతో చెప్పుకుంటుందా? అయితే, చిన్నతనంలో చిల్లరడబ్బులు చెప్పకుండా తీసుకొని పోయేవాళ్లు, ఆ అలవాటును పెద్దవాళ్లైన తర్వాతకూడా కొనసాగిస్తే, ఇంట్లో అమ్మ నాన్న డబ్బులు, అన్న అక్క దాచుకొన్నవి గాక, బైటవాళ్ల డబ్బులుకూడా సంగ్రహిస్తే, ఏ మంచి నీళ్లకో అని పొరుగింటికి వెళ్లి, వాళ్లు చూడకుండా చేతికి దొరికింది ఎత్తుకొనిపోతే దొంగతన మనాలి. బైటవాళ్ల డబ్బుల సంగతటుంచి, ఏ అవసరం కలిగో, సమయానికి భార్య చేతిసంచిలో డబ్బు కనబడి, ఆమెతో చెప్పకుండా తీసుకొనిపోతే, దొంగతనం చేశాడని అనవచ్చునా? ఈమధ్య నేనొక కథ చదివాను. ఒకాయన, బాగా చదువుకొన్నవాడు ఉద్యోగం చేస్తున్నవాడే, ఏదో అవసరంవచ్చి తన జేబుసంచిలో (పర్సు) డబ్బు లేకపోగా, తలదువ్వుకొనే మేజాబల్లమీద భార్య చేతిసంచి కనపడగా,

దానిలో వున్న డబ్బులో కొంత తీసి, పట్టుకుపోయాడు. వంట యింటిలోనే వున్న భార్యకు చెప్పనేలేదు. తర్వాత భార్య, డబ్బవసరం వుండి, చేతిసంచిని తెరవగా, డబ్బంతా కన్పడలేదు. ఏమైనదా అనుకొని, సాయంత్రం తిరిగి వచ్చిన భర్తను "డబ్బు తీశారా?" అని అడిగింది. భర్త తెల్లబోయి, గుటకలు మ్రింగుతూ, "తీశా" నన్నాడు. భార్య నవ్వుతూ, పరిహాసంగా, "అట్లయితే మీరు దొంగ" అన్నది. అతనికి తలపైన పిడుగుపడిన ట్లయింది. తత్తరపాటుతో వివర్ణుడైనాడు. చాలా సిగ్గుపడిపోయాడు. భార్య అతని దురవస్థను చూచి, "అయ్యో, మీ రట్లా అయిపోయా రేమిటి? నేను సరదాగా అపహాస్యంచేశాను, అంతే. నా డబ్బుకు మీ రెలా దొంగ అవుతారు? మీ డబ్బన్నా, నా డబ్బన్నా మన డబ్బే కదా!" అని అనునయం మాటలతో దగ్గరకు చేరి లాలించి, అతడు తేరుకొనేటట్లు చేసింది. తేరుకొని, భర్త "నేను చిన్నప్పుడు మా అమ్మ డబ్బు లెత్తుకొనిపోయి చిరుతిండ్లు కొను క్కొనే వాడను. ఆ అలవాటో, ఆ బుద్ధో, నాలో జీర్ణించి, ఇంకా వున్నది కాబోలు. నీవద్ద వున్న డబ్బును నీకు చెప్పకుండా తీయవలసింది కాదు. దొంగతనం కాకపోయినా, తప్పే. నన్ను క్షమించు" అన్నాడు.

నేను చెప్పే 'నా ఇంట్లో నేను దొంగనైపోయా'నన్న దిట్టిది కాదు. అస లది నా దొంగతనం కానేకాదు. ధాన్యం, లేక అపరాలు అమ్మినపాపతు పెద్దమొత్తాలు వస్తే, వానిని క్రింది ఇనుపపెట్టెలో భద్రపరుస్తాను. దానిలోనుండికాని, ఇతర్తా చిల్లర మొత్తాలు వస్తే వానినికాని, నిత్యవాడకానికి మేడపైని నేను వ్రాసుకొనే మేజాబల్ల సొరుగులో పెడ్తాను. నే నేదో వ్రాస్తు న్నప్పుడో, చదువుకుంటున్నప్పుడో ఇంట్లో నౌకరు వచ్చి, "కూలి వాడు డబ్బుకు వచ్చాడు, కాపలావాడు జీతానికి వచ్చాడు, నౌకరు కవసరం అట, 10 రూపాయలు కావా లంటున్నాడు"అని చెప్పితే, చప్పున ప్రక్కనున్న సొరుగు తీసి డబ్బుంచిన కవరుతీసి వాని చేతి కిచ్చి పంపటం మామూలు. ఎక్కడనుండి, ఎందులోనుండి డబ్బు తీసింది, ప్రక్కనున్న నౌకరుకి తెలుసును. డబ్బిచ్చినవెంటనే లెక్క-

పుస్తకంలో వ్రాస్తాను. కాని, లెక్క పుస్తకంలో జమా ఖర్చు తేల్చను. సొరుగులో ఎం తుండవలసింది తెలుసుకోను. ఇట్లు జరుగు చుండగా, సొరుగులో మిగిలిన డబ్బు ఒకనా డెవరికో ఇచ్చివేశాను. ఇక ఇనుపపెట్టెలోనుండి తీయా లనుకొనుచుండగా, ఎవరో 30 రూపాయలు తెచ్చి యిచ్చారు. దానిని మామూలు కవరులో పెట్టాను. మూడోనా డెవరికో ఇవ్వవలసి కవరు తెరవగా అందులో 20 రూపాయలే ఉండినవి. ఎవరి కన్నా ఇచ్చి మరచిపోయానేమో అనుకొన్నాను. ఇట్లాగే ఇం కొకసారి గమ నించి, ఇక జాగ్రత్తపడాలనుకొని సొకరు ముందు కవరుతీసిడబ్బు తీయటం మానానుగాని, సొరుగు మార్చలేదు. పెట్టెచోటు మార్చలేదు. తిరిగి, డబ్బు తక్కువ కనపడటం గమనించి, ఇం కొక సొరుగులోకి మార్చి మామూలు కవరుగా కనబడే కవరులో డబ్బును పెట్టి చప్పున కనపడని మారుమూల పెట్టుతున్నాను. ఇంతవరకు ఎవరైనా డబ్బుతీసుకొన్నట్లు కనపడదు. సామాన్యంగా సొకరు నడిగా ననుకోండి. వాడు తీసినా ఒప్పుకుంటాడా? చూడనిదే "నీవే తీశా" వని ఎట్లు అనగలను? అనే సోజులేనా? పూర్వమైతే అనుమానముంటే చావదన్నేవాళ్లం. ఈనోజుల్లో చేస్తుండగా చూచినా సాహసించి వండించలేకున్నాం. "దొంగ తనం చేస్తే పోలీసుకు రిపోర్టివ్వాలిగాని నీవే న్యాయాధికారివలె, దండిస్తావా" అని వాళ్లూ వీళ్లూ జగడానికి వస్తారు. ఒక సందర్భ ములో పట్టుకొన్న దొంగ కొన్ని సోజులు గడచిన తర్వాత "నేను దొంగతనం చేయలేదు, నీవు పట్టుకొనలే" దని డబాయించాడు. మా దొడ్లో సొక రొకడు పిండిన పాలు, పాలలోటానుండి వ్రాగు చుండగా, మా వాడు చూచాడు. "తప్పైంది, క్షమించండి. కుదుర్చుకొన్న సంవత్సరం ఇంకా రెండునెలల్లో నిండుతుందికదా, అంతవరకు దయతలచం" డని ప్రాధేయపడగా, గట్టిగా చివాట్లు పెట్టి ఊరుకొన్నాం. కొన్నిసోజులు గడచిన తర్వాత, వాడు పని సరిగా చేయకపోవటం, నాగాలుండటం మొదలుపెట్టాడు. "ఇదేమిటిరా, చేసినతప్పు క్షమించి, పోనిలే ఈ రెండునెలలు ఉంచుకొందాం అని సమాధానపరుచుకొంటే ఈ నాగా లేమిటి,

పని సరిగా చేయకపోవట మేమి " టని అడిగాను. వా డెదురు తిరిగి " నేను పాలు త్రాగానా, మీరు చూచారా, పట్టుకొన్నారా " అని గద్దించాడు. నేను నిర్ఘాంతపోవటంలో ఆశ్చర్య మేముంటుంది? ఈ విషమించిన పరిస్థితుల్లో, దొంగిలించిన వారిని దొంగలనటానికి వీల్లేదు కాబట్టి ఎత్తుకుపోతారేమో అని నేనే జాగ్రత్తపడుతున్నాను. నౌకరు పైకివచ్చి చెప్పితే ఇస్తాలే అని చెప్పి, వానిని క్రిందకి పంపించి, వా డింకా ఇక్కడే వున్నాడేమో అని ప్రక్కచూపులు చూచి, దొంగచాటుగా డబ్బు తీసి, వానిని పైకి రమ్మని పిల్చి, లేక నేనే క్రిందకి దిగివెళ్లి అడిగిన వాళ్లకిస్తున్నాను. ఇది, నేను దొంగనైనా నని తెలపటం లేదా?

మనుష్యులే కాదు, పిచ్చుకలు, ఎలుకలు, ఉడుతలు నన్ను దొంగను చేస్తున్నవి. కిటికీలనుండి, ద్వారాలనుండి పిచ్చుకలు నా పడకగదిలోకి వచ్చి, సీలింగుఫాను అరలో గూడు పెట్టుకొని, డ్రెస్సింగు టేబుల్ పెద్దనిలువుటద్దం మీద, దానిమీది చిన్న అద్దంమీద ముక్కులతో పొడిచి, చికాకుచేస్తుండేవి. కొంతకాలం కిటికీ తలుపులను మూసి వుంచాను. తర్వాత, కిటికీలకు జల్లెడ తడికల నమర్చాను. కిటికీచువ్వల ద్వారా రానటానికి వీలులేక ద్వారాలగుండా రానటం మొదలుపెట్టాయి. ఇక, ద్వారాల తలుపులను నేను గదినుండి బైటికి వచ్చినపుడు వేసుకొని రావలసి వస్తున్నది. లోపలికి వెళ్లేటప్పుడు తలుపులు తీసి, వెంటనే తలుపులు వేసుకొని, తిరిగి బైటికి అడుగిడిన వెంటనే వానిని మూయవలసివస్తున్నది. ఎవరు దొంగైనట్లు? నేనా, పిచ్చుకలా?

రాత్రిళ్లు ఎలుకలు నా పడకగదిలోకి వచ్చి గందరగోళం చేస్తుంటాయి. అందుకని, పడుకోబోయేటప్పుడు ద్వారం తలుపులు గట్టిగా బిగించుకోవలసి వస్తున్నది. నేను పుస్తకాలు పెట్టుకొనటానికి గ్రాడ్రెజ్ ఇనుప రాక్సు కొన్నాను. ఉడుతలు, పుస్తకాల వెనుకసందులో గూళ్లుపెట్టుకొని పిల్లలను కనటం మొదలుపెట్టాయి. బాగా సందుచేసుకొనటానికి పుస్తకాలను కొంత కొరికివేశాయి. చచ్చినట్లు వానికి కొయ్యరెక్క లమర్చి తాళాలు వేయవలసివచ్చింది. నా పుస్తకాల కొయ్యబీరువాపై

దొన్నెవంటి పైభాగంలో ఏవో అట్ట లవి వుంచగా వానిని పాడు చేసి గూడు పెట్టుకొని పిల్లలను కన్నాయి. అట్టలు వగైరాను తీసివేసి పై దొన్నెను ఖాళీగా వుంచవలసివచ్చింది. ఇంతకంటె ఎక్కువ బాధ, నా రెండు పెద్ద తైలవర్ణచిత్రాల వెనుకభాగంలో గోడ మధ్య ఖాళీలో గూళ్లు కట్టుకొన్నాయి. వాని ఆదుర్దాలో, చిత్రాల క్రిందిభాగాన్ని పెద్ద తూట్లుపరచాయి. చిత్రపటాలను హాలులోనుండి తీసి, నా పడకగదిలో గోడకంటేటట్లు అమర్చవలసి వచ్చింది. ఎలుకలు, ఉడుతలు దొరలు కాగా, నేను దొంగనై పోలేదా ? నా ఇంట్లో నేను దొంగనై నానని చెప్పటం సబబుగా లేదా ?

ఇట్టిది సంస్కారమా ?

ఎక్కడో ఒక కథ చదివాను. కాలేజి లెక్చరరొకరు డబ్బివ్వని విద్యార్థులను తప్పించేవాడు. ఫస్టుక్లాసు రావలసిన వాళ్లకు థర్డుక్లాసు మార్కులు వేసేవాడు. అందువల్ల ఉద్యోగస్థులు కావలసినవాళ్లు గుమాస్తాలుగా నౌకరి చేస్తుండేవారు. మరిన్ని, అందమైన ఆడపిల్లల కన్యాత్వాన్ని బలవంతంగా హరించే వాడు. ఈ రెండు బాధలకు గురియైన వ్యక్తి, తరువాతికాలంలో పెద్ద హోదాగలకంపెని మానేజింగు డైరెక్టరయ్యాడు. ఈ లెక్చరర్ కొడుకు, ఆ కంపెని ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకొన్నాడు. కొడుకు తెలివితేటలు, మంచితనం కలవాడు. ఫస్టుక్లాసులో ఉత్తీర్ణుడైనవాడు. ఇంటర్వ్యూకిరాగా, కొడుకు పోలికలను బట్టి మానేజింగ్ డైరెక్టరు అనుమానపడి, అడిగి, ఆ లెక్చరర్ కొడుకని తెలుసుకొన్నాడు. "నీ తండ్రిని వచ్చి నా యింటివద్ద నన్ను కలసికొమ్మని చెప్పు"మని కొడుక్కు చెప్పాడు. తండ్రి మానేజింగ్ డైరెక్టర్ ఇంటికి వెళ్ళగా, టిఫిన్ వగైరా ఇచ్చి

లెక్చరర్‌తో, ఆయనను తాను గుర్తు పట్టానని, తనను పరీక్షలో తప్పించి, అపకారం చేసినాడని జ్ఞాపివున్నదని, తన పినతల్లి కూతురు కన్యాత్వాన్ని బలవంతంగా అపహరించిన సంగతి మరచి పోలేదని మానేజింగ్ డైరెక్టరు మొదట నిష్ఠూరా లాడాడు. అయినా, ఆ మాటలను మెత్తగా మాట్లాడి, ఆయన మనస్సును తాను నొప్పించానేమో, దానికి పరిహారం చేద్దామన్నట్లు, తన కాడిలాక్ కారులో ఆయనను ఇంటికి పంపిస్తూ "మీ రప్పుడప్పుడు వస్తుండం"డని ఆహ్వానించాడు. ఆ తెలివిగల లెక్చరర్, "నా కొడుకు అమాయకుడు. నా రూపురేఖలున్నా నా దుర్గుణా లతనికి రాలేదు. సద్గుణవంతురాలగు వాని తల్లి సుగుణాలు అతని కబ్బినవి. కాబట్టి మీ క్రోధం నామీద చూపాలిగాని, అతని కన్యాయం చేయకూడ" దని విజ్ఞప్తి చేసుకొన్నాడు. మానేజింగ్ డైరెక్టరుకు ఇది సమంజసమేనని తోచింది. ఆ యువకునికి ఉద్యోగ మిచ్చాడు.

అయితే, ఆ దుష్టుడు, తనను పరీక్షలో అన్యాయంగా తప్పించటమేగాక, తన చెల్లెలిని మానభంగం చేసి ఆమె ఆత్మహత్యకు కారకుడైన నీచుడు, హంతకుడు కదా! అతనికి మర్యాద చేయటం, టిఫిన్ నగైరా ఇవ్వటమేగాక, తన గొప్ప కారులో పంపటం, పైగా, అప్పుడప్పుడు వస్తుండమని ఆహ్వా నించటం, సంస్కారమా? ఇది మానవ సహజమా? అసహజం, అనుచితంకాదా? ఈవిధంగా ప్రవర్తించేవాడు మూర్ఖుడు, దురహంకారి, స్వోత్కర్షకలిగినవాడు అయియుంటాడు. తానేమో ఘనకార్యాన్ని చేసినట్లు, తనను తాను మెచ్చుకొనే వాడయివుంటాడు. కన్నుకు బదులు కన్నూడగొట్టమని కాదు గాని, ఒక చెంప ఛెళ్లు మనిపిస్తే, చిరునవ్వుతో రెండో చెంప అందించటం మిక్కిలి తెలివితక్కువపని. అంతేకాదు, చెంప పగుల గొట్టినవానిని ప్రోత్సహించట మవుతుంది. అందుకే, కృష్ణభగ వానుడు "వినాశాయచ దుష్కృతాం" అని చాటాడు.

౧౫

ప్రపంచ తెలుగుసభలు

అరవై ఏళ్ళ బసవయ్య తన యింటి వీధి అరుగుమీద కూర్చుని, చుట్టకాల్చుకొనుచున్నాడు. దారిని పోతున్న 25 ఏండ్ల సుబ్బారావును చూచి, "ఏరా సుబ్బారావూ, ఎప్పుడు వచ్చావు? హైదరాబాదుకు ప్రపంచ తెలుగుసభలకని వెళ్లావటగా" అన్నాడు. సుబ్బారావు " ఈ ఉదయమే వచ్చాను, పెద్దయ్యా" అంటూ దగ్గరకు వచ్చాడు. "కూర్చో, సభల వింతలు, విశేషాలేమిటి? రేడియోలో వింటున్నాను, పత్రికల్లో చదువుచున్నాను. కాని, ప్రత్యక్షంగా నీవన్నీ చూచినచ్చావు కదా! నీ అనుభవం నా కెందుకు కల్లుతుంది? వినాలని వుంది" అన్నాడు. "ఏమి అనుభవమో, ఏమో. చచ్చి చాయంగల విన్నపాలైంది. చావు దప్పి కన్ను లొట్టపోయినట్లుగా ఇంటికి చేరుకొన్నా" నన్నాడు సుబ్బారావు. "అదేమిటి! పత్రికలవాళ్ళు, రేడియోవాళ్లు దిగ్విజయంగా జరిగాయి, ముఖ్యమంత్రిగారికి, రెండోపక్షంలో విద్యామంత్రిగారికి జేజేలు కొట్టాలి, బిరుదు లివ్వాలి, ఘనంగా సన్మానించా లంటుంటే, నీ వేమో చప్పరిస్తా వేమిటి?" అని అడిగాడు బసవయ్య. సుబ్బారావు కొంత ఊసిరి తీసుకొని, "కాదు పెద్దయ్యా, సభలు బాగ్రిగా నీరసంగా జరిగాయనికాదు నా గోడు. నావంటి యువకులుకూడా సరిగా చూడటానికి, వినటానికి పూర్తి అవకాశం కలగలేదు. సభలు, సన్మానాలు, నృత్య ప్రదర్శనాలు, నాటకాలు వగైరా, ఆ పెద్ద ఖైదానంవంటి లాల్ బహదూర్ అనే క్రొత్త పేరుగల ఫతే మైదాన్ స్టేడియంలో 'కాకతీయనగర్' అని సభలకోసం నామకరణం చేసి, జరిపారు. ఉపన్యాసాలు, సన్మానాలు, సాంస్కృతిక కలాపాలు జరిపే వేదిక ఒక మూల ఏర్పరచబడింది. 'ముఖ్యమంత్రిగారు మిమ్మలను ఆహ్వాన సంఘంలో చేర్చారు, 25 రూపాయలు రుసుం మాత్రం కట్టి, డెలిగేట్ గా మీరు రండహో, అన్ని సదుపాయాలు ఏర్పాటు

చేస్తాం' అని విద్యామంత్రిగారుప్రాస్తే ఉబలాటపడి వెళ్ళానుకదా! న్యాయప్రయాసల కోర్చి వెళ్లిన నావంటి డెలిగేట్లు నందరిని వేదికకు 100 గజాల పైచిలుకు దూరంలో కటికనేలమీద కూర్చో మన్నారు. మైకుల పుణ్యమా అని మా కేదో కొంత వినబడిందిగాని, వేదికమీది మనుష్యులు, చర్యలు మాకు కనబడనేలేదు. పైగా బ్రహ్మాండమైన చుట్టుగాలరీలకు ప్రవేశం ఎవరికైనా ఉచితం. ఇక చూచుకో, హైదరాబాదీయులు, చుట్టుప్రక్కలవాళ్ళు తండాలు తండాలుగా, వేలమీద వేలు, లక్షకుమించి, అన్నిరకాలవాళ్ళు, ఎగబడి త్రోసుకొని వచ్చి గాలరీల నన్నిటిని ఒకరిమీద ఒకరు పడి ఆక్రమించుకొనటమే గాక, ఇంకా చోటు చాలక, ద్వారాల మీద పడ్డారు. పోలీసులు లాఠీలతో త్రోసివేయవలసి వచ్చింది. టేర్ గాస్ బాంబు లుపయోగిద్దామా అనుకొని, బాగుండదని మానివేశారని కూడా విన్నాను. ఈ స్థితిలో నావంటి పడుచువాళ్ళకే ప్రాణం ఉక్కిరి బిక్కిరయింది. మరిన్ని, సంగీతాలు, నృత్యాలు, నాటకాలు, ఆటలు, పాటలు ఒకదానిమీద ఒకటి ఏర్పాటు చేశారు. తెల్లవార్లూ జరుగుతూనే వున్నాయట. తీరా వెళ్లాను కదా సన్మానాలన్నా చూద్దామనుకొన్నాను. అవీ సరిగా చూడనేలేదు. సన్మానాలతోనే రాత్రి భోజనంవేళ అయితే ఇక ఇతర సాంస్కృతిక కలాపాలన్నవానికి ఎక్కడ వకాశముంటుంది? ఒకవేళ భోజనం మాని కూర్చుందామా అనుకొంటే, సరిగా కనపడకపోవటమేగాక, మంచినీళ్లకుకూడా గతిలేకపోయె. అధికాచమటుంచి అల్పాచమానానికి నసతిలేకపోయె. ఇక సుఖ మెట్లు ఉంటుంది" అని వాపోయినట్లు చెప్పుకుపోయాడు.

ఇంతలో అటుప్రక్కనుండి 75 ఏళ్ల రామారావు దారిని వెళ్లుచూ, ఈ మాటలు విని ఆయనా దగ్గరకువచ్చాడు. "రా, అన్నా" అని బసవయ్య తనప్రక్క చోటు చూపించాడు. "నీవు కూడా హైదరాబాద్‌కు ప్రపంచ తెలుగు సభలకని వెళ్లావని విన్నాను. నే నేదో గొప్పగా జరిగింది, వెళ్లి చూచినవాళ్ళు అదృష్టవంతు లనుకొనుచుండగా, ఈ సుబ్బారావు ఏదో గొడవ

చెప్పుకొని వస్తున్నాడు. నీవు పెద్దవాడవు, ఎక్కువ అనుభవం కలవాడవు, కొంత హెచ్చుస్థాయి కలవాడవు కదా, నీ నోటినుండి వినాలని వున్నది చెప్పుతావా" అన్నాడు. రామారావు నవ్వి, "కుర్రవాళ్ళకేం, ఎట్లైనా నెగ్గుకువస్తారు. నావంటి వయస్సు మళ్ళిన వారికే ఇట్టి తిరునాళ్ళు, జాతరలు ప్రాణసంకటం. సభలుబాగా విఫలమైన వనలేనుగాని, పూర్తిగా జయప్రదమైన వని, పత్రికల్లో, రేడియోలో డబ్బావాయించుచున్నట్లు, చెప్పలేను. నా స్వంత అనుభవం చెప్పాలంటే, కొంత నిరుత్సాహమే కలిగింది. మొదటిది, జిల్లాలనుండి ప్రతినిధులుగా వెళ్లినవారికి, జరిగే కార్యకలాపాలలో పాల్గొనటానికిగాని, చూచిసంతోషించటానికిగాని తగిన వసతులు, అవకాశాలు లేకుండాపోయాయి. వారికి కార్యకలాపాలు జరిగే వేదికకు సమీపాన ఏర్పాటుచేసేదానికిబదులు, దూరంగా కనబడటానికి వీలులేనట్లుగా, కటిక నేలమీద కూర్చోమన్నారు. మోకాళ్లు వంగక క్రిందకూర్చోలేని నావంటివాళ్లు, కొంచెంసేపు నిలబడి వెళ్లిపోవలసివచ్చింది. వేలకువేలు పట్టే చుట్టుగాలరీలకు ఉచిత ప్రవేశం అనుమతించటంవల్ల, రెండోరోజున ఎంత తస్కుకొన్నా నావంటి ఇతర ప్రదేశాలనుండి వచ్చిన ప్రతినిధులకు స్టేడియంలోకి ప్రవేశమే దొరకలేదు. పైగా ఒక గేటువద్ద త్రోపుడులో నా చెప్పుపోయింది. ఇంకా నయం నేను క్రిందపడి పచ్చడి పచ్చడి కాలేదు. 'బ్రతుకుదేవుడా' అంటూ గుంపునుండి బైటపడ్డాను. నా దురవస్థనుచూచిన యువకుడొకడు పల్చబడిన జనంనుండి నెమ్మదిగా నడిపించుకొనివెళ్లి రిక్షా ఎక్కించాడు, ప్రాణం కుదుటబడి హోటల్‌కు చేరుకొన్నాను. మొదటి రోజునకూడా డెలిగేట్సుకు నియమించిన ప్రదేశంలో నేలమీద కూర్చోలేక బైటికి వెళ్ళాలని ప్రయత్నిస్తే గేటుముందు వందలుండి వెనక్కు నెట్టగా పడిపోయే స్థితిలో ఒక ముస్లిమ్ పోలీసు ఆదుకొని ఎట్లో బైటికి చేర్చాడు. మొదటిరోజునైనా ఎంతో అవస్థపడితేనేగాని నాకు పాస్ దొరకలేదు. నా డెలిగేటు రుసుము రశీదు చూపిస్తే చాలదు, పాస్‌బుక్ ఇస్తారు తెచ్చుకోండన్నారు. ఎక్కడిస్తారని అడిగితే, ఒకరు ఆప్రక్క, ఇంకొకరు ఈప్రక్క, మరొకరు స్టేడియం వెనుకప్రక్క

అన్నారు. ఆప్రక్క, ఈప్రక్క తిరిగి నెనుకప్రక్కకు వెళ్ళి కొంత శ్రమతో ఇచ్చేచోటుకు చేరుకొంటే అక్కడ పెద్దగుంపు ఉండింది. ఎవరినో బ్రతిమాలి, ఎలాగో పాసుబుక్కు సంపాదించాను. ఒకరోజు ఆలస్యంగా వచ్చిన భీమవరంవారికి తన్నుకు చచ్చినా, పాసులు దొరకలేదు. నేను వారితోనే వెళ్ళి చూస్తే మొదటి రోజున ఇచ్చినగదికి తాళం వేసి వున్నది. ఎవరి నడిగినా, సానుభూతి చూపించిన ఒక పోలీసు ఇన్‌స్పెక్టరు సాయంకూడా, ఉపయోగం లేకపోయింది. భీమవరంవారు ఆరోజుకు ఆశ వదులుకొని, 'నాత్రవాహన నగరం' అని పేరుపెట్టిన ఎగ్జిబిషన్ గ్రౌండ్సుకు పోవలసివచ్చింది.

"వచ్చిన చిక్కల్లా, ఏర్పాటులు సకాలంలో మొదలు పెట్టలేదు, సకాలంలో జరుపలేదు. వయస్సు మళ్ళినవాడ ననటం చేతను, హోటల్ వాళ్లు నా కవసరమైన వసతులతో గది నిస్తారనే నమ్మకం లేకపోవటం చేతను, ఎందుకైనా మంచిదని 4 రోజులు ముందుగానే హైదరాబాద్ చేరాను. మొదటిరోజునే స్టేడియంకు వెళ్లాను. అప్పటికి వేదికతోసహా అన్ని పనులు ప్రారంభదశలోనే వున్నవి. మర్నాడు ఆ కార్యకలాపాలలో ముఖ్యపాత్ర వహించు చున్న వారిలో నొకరైన మిత్రుడొకరు తన కారులో అక్కడికు తీసుకొనివెళ్లారు. ఎక్కడి గోతులకక్కడే, ఎక్కడి కుప్పలక్కడే, దూలాలు, వాసాలు వగైరా చిందర వందరగా పడవేసి వున్నాయి. వేదికకు తగురూపం అప్పుడే ఇస్తున్నారు. ఎర్రఇటుక, ఎర్ర మట్టితో వేదిక నాక ప్రక్కన అప్పుడే కట్టిన మెట్లు, అప్పుడే తగిలిన గాయాల పుండ్లను గుర్తుచేస్తూ ఎంతో నూతనగా వుండినవి. చివరకు సభాప్రారంభదినం ఉదయానికికూడా పనులు జరుగుచునే వున్నవి. ఆ ఉదయం 9-30 గంటలకు ముఖ్యమంత్రిగారు జాతీయ పతాకావిష్కరణ చేయవలసివున్నది. నేనా రోజు 9 గంటలకు ముందే పతాక వేదికను చూడటానికి వెళ్లగా, దాని కింకను సిమెంటు ఎర్రరంగు పూస్తూనే వున్నారు. ఇంత అధ్వాన్నంగా పనులు జరిగాయి. ఏవో కారణాలవల్ల పనులు వారం రోజులు మాత్రమే ముందుగా మొదలుపెట్టారట. నెలల క్రితమే పత్రికల్లోను, రేడియోలోను ప్రచారం మొదలుపెట్టిన వాళ్ళు ఎంత

తొందరపను లితరాలున్నా, బాధ్యత కలవారిని కొద్దిమందినైనా ముందుగా ఏర్పాటుచేసి సభాప్రారంభానికి రెండు రోజులైనా ముందుగా అన్నిపనులూ పూర్తిచేయించవలసింది.

"జరిగిన గందరగోళానికి ముఖ్యకారణం సినిమా నటుకుల, గాయకుల సన్మానం, వారి కార్యకలాపాలు. వారిని చూడాలని ప్రజాసందోహాలు రెండో రోజున, తర్వాత గాలరీలకు ఎగబడి, నేల ఖాళీలంతా నిండి త్రొక్కిసలాడారు. మూసివున్న గేట్లమీద విరుచుకుబడ్డారు. అందువల్ల రభసైంది.

"అయితే, వివిధ అంశాలమీద జరిగిన గోష్ఠులకు స్టేడియం వెనుక ప్రక్కన అమర్చిన పెద్ద డేరాలో, 'నాగార్జునపీఠం' అను పేరుతో వేదికనమర్చారు. అక్కడ ఈ త్రొక్కిసలాట లేదు. సావకాశంగా ఉపన్యాసాలు వినటాని కనుకూలంగా వుండినది. నావంటి మోకాళ్లు వంగని కొలదిమందికి కుర్చీలు దొరికాయి. ఈ ప్రసంగాలు ఉదయం కనుక ఊరిజనం పైబడటాని కవకాశం లేకపోయింది. పైగా సాంస్కృతిక సంబంధంగా వుండిన ఈ ఉపన్యాసాలకు ప్రజాసామాన్యం ఎగబడరు కదా! ఇందులో ముఖ్యవిశేషం, ఇతర రాష్ట్రాలు, దేశాలనుండి వచ్చిన పెద్దలు, ప్రతినిధులు తమ ఉత్సాహాన్ని, అభిమానాన్ని, అభిప్రాయాలను చక్కగా తెల్పగలిగారు. కాకతీయనగరంలో వేదికవద్ద వారికి కొన్ని కుర్చీల నమర్చినా, అక్కడి గందరగోళంకంటె ఇక్కడనే వారికి సావకాశం కలిగిందని నా అభిప్రాయం.

"రెండోది శాతవాహన నగరం. ఇది ఎగ్జిబిషన్ గ్రౌండ్సులో ఏర్పాటుచేసిన మన ఆంధ్ర విజ్ఞాన, సాంస్కృతిక, వస్తుసంపదల ప్రదర్శనం. ఇక్కడ మన లలితకళలు, చేతిపనులు, పుస్తకాలు, ఖనిజాలు, అటవీసంపద వగైరా ప్రదర్శింపబడ్డవి. దీనిలో జనసందోహాల త్రోపుడులు లేవనే చెప్పాలి. ప్రదర్శనం మొత్తంమీద బాగున్నా, ముఖ్యంగా చిత్రలేఖనాలు కొన్ని అయినా హెచ్చుస్థాయి కలవి కావు. కొన్ని మరీ అధ్వాన్నంగా వున్నవి. చిత్రలేఖకులు ప్రతిమాలో, బొమ్మాలో వానిని

పెట్టించుకొన్నట్లున్నది. నన్నయవంటి ప్రముఖుల చిత్రపటాలు లేవు. ఖనిజాలు, కొయ్యరకాలు మామూలేగాని, ఒకచోట శిల్పసంపదను చూచాను. దానిలో ప్రదర్శించిన గరుడాళ్వారు మొదలైన విగ్రహాలు గొప్పగా నుండినవి. పుస్తకాలు కొంత విరివిగానే వుండినవిగాని, కొందరు ప్రచురణకర్తలు పాల్గొననే లేదు. మొత్తంమీద నాకు కాకతీయ నగరంలోని గలాభాకంటె, శాతవాహన నగరంలోని సావకాశమే ఎక్కువగా తృప్తినిచ్చింది.

"ప్రభుత్వం, సభలను జయప్రదంచేయాలని గట్టిగా సంకల్పించింది. శాయశక్తులా ప్రయత్నించింది. అయితే, సరియైన వ్యవధిలేకుండా కార్యకలాపాలను ప్రారంభించటంచేత, కొందరు పెద్ద స్థాయిగల పెద్దలనే మొదట ఆహ్వానించలేదట. ఒకప్రముఖ హైదరాబాదీయుని మాటసందర్భంలో 'మీరు గొప్పగా పాల్గొనియుంటా'రనగా, 'అబ్బే, అసలు నా కాహ్వానమే లేనిదే' అన్నారు. నేను ఆశ్చర్యచకితుడనైనాను. ఆయనకంటె హెచ్చుస్థాయిగల హైదరాబాద్ ప్రముఖునికి కూడా మొదట ఆహ్వానం లేదట. రోజులు గడుస్తుండగా గుర్తుకు వచ్చో, ఇతరులు చెప్పటంచేతనో కొందరి పెద్దల కప్పటి కప్పుడు ఆహ్వానాలు వెళ్లినవట. పత్రికల్లో కొంత చలనం కల్గించిన ఒక పెద్దమనిషికి చివరిదశలో ఆహ్వానం రాగా తిరస్కరించాడట. ఆయన 'ఇది దొడ్డి సంభావనా' అని అభిప్రాయపడినట్లు తెలిసింది. పండితసన్మానాల విషయంలో తమంతట తాము జ్ఞాపకంచేసుకొన్నవారికి చివరిక్షణంలో ఓదార్పు సన్మానాలు జరిగాయి. ఒక విజయవాడ పండిత కవి, శతావధానిగారిని 'మీ కెప్పు'డని ప్రశ్నించగా, 'నా కిక్కడ గాదు, విజయవాడలో' నన్నారు. అడిగిన మూడోనాడు ఆయన సన్మాన వేదికమీదకు రాగా, ముఖ్యమంత్రిగారు ఒక పైపంచె మెడలో వేశారు. ఇంకొకాయన 'ఇంతకు ముందు పాడిన గీతం వ్రాసింది నేనే' అని చెప్పుకోగా ఆయన కొక పైపంచె సత్కారం. ఆ విధంగానే ఇంకొక గీతం వ్రాసినవారికి అదేవిధమైన సత్కారం. సత్కరించాలని మొదటను వ్రాసుకొన్న పేర్లవారిని ఘనంగానే, చక్కని పెట్టెలో పెట్టిన వెండి షీల్డు, శాలువా, విలువైన

బట్టలతో సత్కరించారు. తర్వాత వారిని పోనీలే అన్నట్లు కక్కుర్తి తీర్చారు.

"పైగా, కోస్తా జిల్లాల పండితులను, కవులను, సాహితీ పరులను, కళాకారులను కొంతవరకైనా విస్మరించారు. ప్రభుత్వోద్యోగులు, పోలీసు ఆఫీసర్లు, సభలు ఏర్పాటుచేసిన కార్యకర్తలు, అభిమానించినవారికి సన్మానాలు, పారితోషికాలు, బహుమతులు జరిగినవని, ఎదుట కన్పడనివారిని విడిచిపెట్టటం జరిగిందని నాకు తట్టింది. నేను పోరపాటుపడి యుండవచ్చునుకాని, నాతోబాటు కొంతమందైనా ఈ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ముఖ్యమంత్రి, విద్యామంత్రి వగైరా నిష్పక్షపాతంగా, సర్వసమానత్వభావంతో, నిజాయతీగా, సభలు పూర్తి జయప్రదంకావాలనే దీక్షతో, కార్యం జరిపారనే అనుకోవాలి. అయితే పై లోపాలు సంభవించినవి. ఇవి దురదృష్టం." అన్నారు.

స్వేచ్ఛా స్వాతంత్ర్యాల మూల్యమెంత ?

పరతంత్రరాజ్యం పోయి మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ప్రజాస్వామ్యం వచ్చింది. వ్యక్తిగత స్వేచ్ఛలు వచ్చాయి. ఇరవయ్యో శతాబ్దంలో విజ్ఞానశాస్త్రజ్ఞానం, సాంకేతికజ్ఞానం చాలా విస్తృతాన్ని పొందిన పాశ్చాత్య దేశాలతోబాటు మనం కొంతకుకొంత పురోభివృద్ధి చెందాం. ఆ దేశాల ప్రజలు నాగరికతలో పురోగమించినట్లే మనం కొంత వరకైనా పురోగమించాం. మన ప్రాచీన నాగరికతను తిరిగి తోడుకొనుచున్నాం. మనకూ, బలమైన త్రివిధ యుద్ధనిపుణులు, సేనావాహినులు, ఆయుధా లున్నాయి. మనప్రతినిధులే, మన రాజ్యాంగాన్ని నిర్మించుకొన్నారు. మనమే శాసననిర్మాతలను ఎన్నుకొన్నాం, వారు మన ప్రతినిధులుగా పరిపాలకులను ఎన్నుకొన్నారు. ప్రజలందరు ఏకజాతైనారు. దేశం బలపడింది,

సామర్థ్యాన్ని పెంచుకొన్నది. ఇతర దేశాలలో మన ప్రతినిధులుగా రాయబారు లున్నారు. నానాజాతులసంస్థలో మనకు తగిన ప్రాతినిధ్యమున్నది. మనకు మౌలిక హక్కు లున్నాయి. ఆలోచనా స్వాతంత్ర్యం, వాక్స్వాతంత్ర్యం, వ్రాతస్వాతంత్ర్యం, మత స్వాతంత్ర్యం, నడవడిస్వాతంత్ర్యం వున్నది. కాబట్టి సలక్షణమైన దేశ జాతి, వ్యక్తులముగా మనం రూపొందాం. మన ఆత్మతృప్తి ప్రపూర్ణమైంది.

అయితే, వీనిని మనం చక్కగా, సవ్యంగా ఉపయోగించుకుంటున్నామా? మన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు తగిన పంథాలలో ఉచితరీతిని కొనసాగుచున్నవా? కొనసాగకపోతే, ఆచరణలోకి రాకపోతే, వాని లాభం మనం పొందకపోతే వానివలన మనకేం ఉపయోగం కల్గుచున్నది? వాని మూల్య మెంతనుకోవాలి?

స్వేచ్ఛ వ్యక్తిగతం, సంఘపరం. దేశవ్యాప్తం. వ్యక్తిగా తాను చెప్పగలుగునది చెప్పటం, చేయగలిగినది చేయటం, అనుభవించగలది అనుభవించటం. భావస్వాతంత్రత, కార్యాచరణ స్వేచ్ఛ, జీవనస్వాతంత్ర్యం, తాను నమ్మిన దేవుని కొల్చుట, తానాచరించదలచుకొన్న ధర్మాన్ని నెరవేర్చటం, తన జీవితాన్ని తన కిష్టం వచ్చినట్లు మలచుకొనటం, తనకు తోచింది బహిరంగ పరచటం, తన కిష్టమైన పనిని తన కిష్టమైనచోట ఆచరించటం, తన బ్రతుకును వివిధరంగాలలో, రకరకాలుగా నడిపించుకొనటం ఇవన్నీ వ్యక్తిస్వేచ్ఛను వ్యక్తీకరిస్తవి. బాగానే వున్నది. అయితే, ఈ వ్యక్తిగతస్వేచ్ఛలను మనం సరిగా ఉపయోగించుకుంటున్నామా? వీనిని మనం కొంత తరచిచూద్దాం. మొదట భావస్వాతంత్ర్యాన్ని తీసుకుందాం. దీని నిప్పుడు వికృతపరచటం లేదా? చూడండి, దేవుడు లేడనటం నుంచి, లైంగికాన్ని ప్రేరేపించు వరకు, తలిదండ్రులకు తమ బిడ్డలందుండు ప్రేమ బిడ్డల కొరకు కాదు, తలి దండ్రుల తృప్తి కొరకే, బిడ్డలను కన్నది, తమ స్వార్థానికే యనువరకు; పిన్నలు పూజ్యులైన పెద్దలకే కాదు, తలిదండ్రుల కేమాత్రం భయభక్తులుగాని, విధేయతలను గాని చూపించ నవసరం లేదనటంవరకు; ఇతరుల అభి

ప్రాయాలు మా కనవసరం, మా కిష్టమైనట్లు, అప్పటి కప్పుడు తోచినట్లు మాట్లాడుతాం, మమ్మల్నివ్వ రడ్డగించగలరనడంనుంచి, ఇతరులను దుమ్మెత్తిపోయువరకు; అధ్యాపకులనేవారు విద్యార్థుల ఇష్టప్రకారం బోధించాలి, నడవాలనటంనుంచి, మేము పాఠాలు చదువకపోయినా, విషయాలు నేర్చుకొనకపోయినా, పరీక్షల్లో కాపీకొట్టినా, అసలు పరీక్షపత్రాలను ప్రాయకపోయినా, మేము పాసైనట్లు ఎంచాలనేవరకు ఈ భావస్వాతంత్ర్యం వెళ్ళింది.

ఇక కార్యాచరణస్వేచ్ఛ విషయం. మే మేమి చేసినా ఒప్పుకోవాలి. మొండిమొలతో తిరిగితేనేం, జుట్టు పెంచుకొంటే ఏం, గడ్డం పెరిగితేనేం, మాబట్ట లవకతవకలుగా ఉంటే ఏం, మీ కేం నష్టం? మేము బహిరంగ పార్కుల్లో, స్నానఘట్టాల్లో లైంగికాల్ని సాగిస్తే మీకు వచ్చిన ఇబ్బం దేమి? మేము ఆసనాలే వేస్తామో, ఒంటినిండా బూడిద పూసుకొని, గోచీలు పెట్టుకొని తిరుగుతామో మీ కెందుకు? పంతుళ్లను కొట్తామో, స్త్రీలను హింసిస్తామో, తలిదండ్రులను వాళ్లగతికి వాళ్లను విడిచిపెట్తామో, భార్యా బిడ్డలను విసర్జిస్తామో మీ కే విధంగా సంబంధం? దొంగ తనాలు, దోపిళ్లు చేస్తామో, వాళ్లని వీళ్లని చంపుతామో మీ కనవసరం అంటున్న దీ కార్యాచరణస్వేచ్ఛ.

మిగిలింది జీవనస్వేచ్ఛ. మే మెక్కడనో, ఏ విధంగానో జీవనం గడుపుకొంటుంటే మీ కేవిధంగా ఇబ్బంది కల్గుతుంది? కొండగుహల్లోనో, కొండజాతులతోనో నివసిస్తాం. ఏ స్త్రీతోనో, ఏ జంతువుతోనో కాలంగడుపుకొంటాం. మే మేవిధంగా జీవిస్తే మీ కేం? జుట్టు విరబోసుకొని, ఏ సారంగమో చేత బుచ్చుకొని, పాటలు పాడుచూ, గంతులేస్తూ, భిక్షం అడుక్కుంటే మీ పుట్టేమి మునిగింది? గడ్డాలు పెంచుకొని, చింపిరిబట్టలు వేసుకొని, లేక దిగంబరులమై, ఆడ మగ భేదం లేక, సామూహికంగా లైంగిక వ్యాసంగం కొనసాగించుకొంటాం, ప్రాగి తందనాలాడతాం, జట్టుగా స్త్రీ పురుషులం క్రింద మీద పడుతూ నాట్యాం చేసుకొంటాం మీ రెందుకు పట్టించుకోవాలి? అవసరంవస్తే,

వీరిది వారి దనే భేదంలేక వస్తువులను, డబ్బును వాడుకొంటూం, మోసంచేసో, దొంగతనంచేసో డబ్బు సంపాదించుకొంటూం, వీలు లేకపోతే ఎక్కడకైనా ఉడాయిస్తాం మీ రెందుకు బాధపడాలి? మమ్మల్ని బీట్‌నిక్కులని, హిప్పీలని ఎందుకు నిరసించాలి? మా శరీరానికి మేము యజమానులం, దాని నిష్టం వచ్చినట్లు తినిపిస్తాం, వాడుకొంటూం, ఇష్టమైనవాళ్లతో సంఘంగా ఏర్పడతాం, సంఘంగా జీవితం కొనసాగిస్తాం. మీరు జోక్యం పెట్టుకో కూడదు. ఇట్టి ధోరణులతో ఈకాలంవారు వ్యక్తిగతస్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్నారు కదా!

ఇక సంఘస్వేచ్ఛ. అవును, మా దేవుని మే మిష్టం వచ్చిన రీతిని పూజించుకుంటూం, ఊరేగించుకుంటూం. మీ రెవరు అడ్డం చెప్పటానికి? తెలివితక్కువవల్ల మీ దేవుడే మీకిష్టమైతే, మా కేమీ అభ్యంతరంలేదు. కిమ్మనకుండా, మీ కిష్టంవచ్చినట్లు మీ ప్రార్థనలు, పూజలు సల్పుకోండి. అంతేగాని మీ రవి చేయ గూడదు, ఇవి చేయగూడదనే హక్కు మీ కెక్కడున్నది? ఇక, ఆచార వ్యవహారాల్లో, మా స్వంతపద్ధతులప్రకారం మేము నడుచుకుంటూం. మీ రెవరు, అన్నిమతాలవారు సమానపద్ధతుల్లో వ్యవహరించాలని చెప్పటానికి? మీ సంఘజీవన మిట్లుండాలి, మీ స్త్రీల నిట్లు చూడాలి, పరస్త్రీలతో వ్యభిచరించకూడదు అని నీతులు చెప్పటానికి హక్కు మీ కెవరిచ్చారు? సాంఘిక వ్యవ హారాల్లో అగ్రకులం, శూద్రకులం, అంటరానికులం భేదాలు సమసిపోయాయా? గాంధిమహాత్ముని పుణ్యమా అంటూ, కాలమార్పుల ప్రభావంవల్ల, ఓటు రాజకీయనీతిగా, వ్యక్తుల దీక్షాఫలితంగా అన్ని కులాలు సమానమే అని చట్టాలు కూడా వచ్చాయికదా! నేను భూదేవుణ్ణి, నేను ఆర్యవైశ్యుణ్ణి, మేము చాలా గొప్పవాళ్లం, మీరు శూద్రులు, మాక్రిందివాళ్లు, మీరు అంటరానివాళ్లు, మీరు దూరంగా వుండాలి అని బహిరంగంగా చెప్పకపోయినా, శాసనభయంవల్ల అభిప్రాయాలను బైటబెట్టక పోయినా, ఇదంతా గూడుపుఠాణికాదా? సందుదొరికినప్పుడల్లా ఒక అగ్రజాతివాడు ఇంకొక కులంవానికి ఉద్యోగాల్లోగాని,

పరిశ్రమల్లోగాని, రాజకీయాల్లోగాని సమానావకాశం ఇస్తున్నాడా? సచ్ఛూద్రులమో, వర్ణాలమో అని బడాయిపోయేవాళ్లు కూలి నాలి జనాన్ని, పంచములనే వారినే కాదు, ఇతర వెనుకబడిన సంఘాలవారిని సమానంగా చూస్తున్నారా? దేవుని విషయంలో కూడా కులవ్యత్యాస ముండుచున్నదికదా! గర్భగుడిలోకి జొరబడటానికి అగ్రజాతివాడు తన హక్కుగా ఎంచుకుంటూ, ఇతరులను బైట వుంచటంలేదా! మఠాలలోకూడా ఈ వ్యత్యాస మున్నది కదా! పెండ్లి పేరంటాలలో, భోజనమజ్జనాదులలో ఈ వ్యత్యాసం మనం చూడటంలేదా? ఇది సంఘ మోసం, ద్రోహం కాదా? ఇతర దేశాల్లో నల్లరంగు, తెల్లరంగు అని భేదం లేదా? తెల్లరంగువాళ్లు నల్లరంగువాళ్లని హీనంగా చూడటంలేదా? వాళ్లకు తగిన అవకాశాలు, వసతులు లేకుండా చేయడంలేదా? మరిన్నో, జీతం ఎక్కువచెయ్యండనో, బోనస్ ఎక్కువియ్యండనో, లాభాలు పంచిపెట్టండనో, మాటిమాటికి సమ్మెలు చేయటం, రైళ్లాపటం, పట్టాలు వగైరా తప్పించి, రైళ్లు పడిపోయేటట్లుచేసి, పదులకొద్ది మానవ జీవితాంతాలకు కారకులు కావటం, మన సాంఘిక పురోభివృద్ధికి చిహ్నమంటారా? యజమాని, పెద్ద కార్యకర్తలు పెద్దపెద్ద జీతాలు తీసుకుంటున్నారు. మంచిభవంతుల్లో నివసిస్తున్నారు. మోటారుకార్లలో తిరుగుచున్నారు. మాకుకూడా సమాన జీతాలు, సౌఖ్యాలు కావాలని సామాన్య కార్మికులు, తాత్కాలికంగా పనికివచ్చిన కూలీలు కోరటం, తగాదాపెట్టటం, సాధ్యంకాదంటే సమ్మె చేయటం, లేక రూల్సుప్రకారం పనిచేస్తామని వంకబెట్టి రూల్సు ప్రకారం నిండుపని చేయకుండా సగం పని చేయటం, దానినికూడా సవ్యంగా చేయకపోవటం, ఈ పనులవల్ల కంపెనీకి నష్టంరాగా, నచ్చిందోచచ్చిందో, అదంతా మాకెందుకు, మాజీతం పెంచాలి, బోనసు పెంచాలి, మావసతులు, సౌఖ్యాలు పెంచాలని కుమ్మ్లాడటం పరిపాటైపోవటంలేదా? పని సరిగా చేయక, కాలం అటూఇటూ వృథాపుచ్చి, అయ్యో పని పూర్తి కావాలికదా, ఇంకా చాలా పని మిగిలిపోయిందని దిగులుపడే

యాజమాన్యం, సరే, మీరు ప్రొద్దుపోయినా పని కొనసాగించండి, అధిక కాలానికి రెట్టిం పిస్తాం అనేటట్లు చేయటానికి కాదా వీళ్ల ప్రయత్నం? ఈ అధిక కాలం పేరు చెప్పుకొని జేబులు నింపు కొనటానికి కాదా, తాము న్యాయంగా రూల్సు ప్రకారం చేయ వలసిన పనిని మందకొడిగా సాగించి, కాలం వృథాచేయటం? పైగా కార్మికసంఘాలని ముఠాల నేర్పరిచిన కార్మికనాయకు లనేవారు, తాము దమ్మిడీ పనిచేయకుండా నోటి బోంకరింపుతో, మొసలి కన్నీళ్ల సానుభూతితో కార్మికులను మోసంచేస్తూ, సంఘ సభ్యుల జీతాలనుండి తీసుకొన్న డబ్బు, కక్కుర్తిపడి యజమానులు చాటుగా లంచాలిచ్చిన ఫాక్టరి సొమ్ముతో, తాము నిరసిస్తున్న ధనికులకంటే భోగభాగ్యా లనుభవించటం, ప్రజాసముదాయాల అభివృద్ధికి తోడ్పడుతుందా? వర్తకులు, వ్యాపారస్తులు అవసరాలు వచ్చాయని, అవసరాలను సృష్టించి, వస్తువుల ధరలను, జీవిత వ్యయాన్ని అపరిమితంగా పెంచివేయటం, నల్లబజారులో వేలు, లక్షలు సంపాదించటం ప్రజాసంక్షేమానికేనా?

ప్రజాభ్యుదయంకోసం, ముఖ్యంగా గ్రామీణులకోసం, అమలులోనికి వచ్చిన పంచాయతి పరిపాలన, బీద బిక్కి మీటుంచి, మామూలు జీవితం గడిపే సామాన్యప్రజలకైనా వసతులు, సౌకర్యాలు కల్గిస్తున్నదా, గ్రామజీవితంలోని సామరస్యాన్ని నాశనంచేయటం తప్ప? గ్రామపరిపాలనను తమ చేతుల్లోకి తీసుకొనాలని తహతహతో కొందరు బైలుదేరి, ఓట్లకోసం ప్రజలను చీల్చటంలేదా? పార్టీలు పడి, వేలు క్రుమ్మరించి, సామాన్యప్రజలను, కూలి నాలి చేసుకొని బ్రతికేవారిని మోహ పెట్టి, అవినీతికి పాల్పడునట్లు చేయటంలేదా? కొన్ని చోట్లలోనైనా బ్రుష్ట లెగరటంలేదా? ఇదంతా ప్రజల్లో, ముఖ్యంగా గ్రామా దుల్లో ఐకమత్యానికి, సంఘీభావానికి, అందరికి న్యాయం జరగ టానికి తోడ్పడుతున్నదా? పూర్వంలో గ్రామపెద్దలు నిష్పాక్షి కంగా వ్యవహరించటం, సామరస్యంగా తగాదాలను తీర్చటం, గ్రామాభివృద్ధికి ఒక కట్టుగా వ్యవహరించటం జరుగుచుండేది. మన కిప్పుడు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, దానికి ముందున్న

శాంతి భద్రతలు గ్రామాల్లో వున్నాయా ? మనదేశం మా టటుంచి ప్రజాసందోహాలలో పాపభీతి, న్యాయాన్యాయవిచక్షణ జ్ఞానం, ఇతరులను హింసించకూడదు, ఒక తప్పుకు మరొక తప్పును చేయకూడదనే బుద్ధి క్షీణించిపోవటంలేదా ? సందుదొరికిందని కొన్ని దేశాలు పెట్రోలు, డీజెల్ ఆయిల్ వంటి ముఖ్యవస్తువుల ధరలను విపరీతంగా పెంచి, వర్ధమానదేశప్రజలను బాధపెట్టటం లేదా ? ఏదో తమవారికి అపకారం జరిగిందని ఆకాశంలో ఎగురు చున్న విమానాలను స్వాధీనంచేసుకొని ప్రయాణంచేస్తున్న ఏ పాపం ఎరుగని వారిని, పిల్లలు స్త్రీలతో సహా, బాధించటం, చంప టం, విమానాలను నాశనంచేయటం చూస్తున్నాం కదా ! ఇది మానవ సాంఘికాభివృద్ధిని, సంక్షేమాన్ని తెలియబర్చేదేనా? 20-వ శతాబ్దం నాల్గవ పాదంలో మన మంతా స్వేచ్ఛాపరులమైనా మని, నాగరికుల మైనామని చెప్పుకొనుట కవకాశ మున్నదా ? శాస్త్రజ్ఞానంతో ప్రకృతిరహస్యాలు కొన్నిటిని భేదించి రైళ్ళు, విద్యుత్, టెలిగ్రాఫ్, టెలిఫోను, కార్లు, బస్సులు మొదలైన వాని నుపయోగంలోకి తెచ్చుకొని, విమానాలమీద ప్రయాణిస్తూ చంద్రమండలం కూడా చేరుకొన్నాం. నిజమే. ఈ అభివృద్ధికి తగినట్లు వ్యవహరించుచున్నామా ? స్వాతంత్ర్యం సంపాదించాం సరే, స్వాతంత్ర్యాన్ని ఇతరుల కందనిస్తున్నామా ?

ఇక దేశంవిషయం. దేశాన్ని తీర్చిదిద్దేది రాజ్యాంగం. ఈ రాజ్యాంగాన్ని ప్రజానాయకులమని చెప్పుకొనే రాజకీయ తంత్రజ్ఞులు తారుమారుచేయటం, రాజ్యాంగాన్ని కాపాడవలసిన బాధ్యతగల పెద్ద లుపేక్షించటం జరుగుచున్నదికదా ! తగినన్ని శక్తివంతమైన ఆయుధాలను సేకరించుకొని, తగిన సైనికసిబ్బందిని సమకూర్చుకొని వారిని బలాఢ్యులనుగా చేసే తరిఫీదిచ్చి, దేశ సరిహద్దులను సంరక్షించుకొనుటకు తగిన జాగ్రత్తలను తీసుకొనక పోవటంచేతనేకదా, 1962 లో మనం చైనాదేశస్థుల చేతుల్లో చావుదెబ్బతిన్నది ? శాసనాలు చేసి, ప్రజల నుచితమార్గాను వర్తులను గావించటానికి ఆదర్శప్రాయులుగా నడుచుకొనవలసిన శాసనసభ్యులు ముఠాలు పడి, తగాదాలు పెంచి, కొట్లాటకు దిగి

పార్టీలు మార్చటం, మంత్రివర్గాలను తారుమారుచేయటం, గవర్నర్ల పరిపాలనలు రావటం, అందువలన ప్రజాస్వామ్యం తాత్కాలికంగానైనా ఊడటం దేశక్షేమానికి దారితీస్తుందా? సాధారణ పరిపాలనలో శాసనసభ్యులు, రాజకీయ పెద్దలు, ముఠా నాయకులు జోక్యం కల్పించుకొని, ఉద్యోగులను బెదిరించి, తమ మద్దతుదారులకు అనుకూలంగా అన్యాయాలు చేయించటం, మరిన్ని, సహాయం చేస్తాము, లేక చేయించుతామని డబ్బు గుంజటం, లైసెన్సులు, కోటాలు బినామిదారుల పేరున తమ అధికారం చెలాయింపుతో సంపాదించి, నల్లబజారులో డబ్బు చేసుకొనటం దేశాభ్యుదయానికి కారకమౌతుందా? కేంద్రశాసన సభల్లోకూడా ఇట్టి తంతులు కొనసాగించటం, నిందలు మోపు కొనటం, అబద్ధప్రచారాలు చేయటం, చట్టవ్యతిరేకమైన, అపసవ్య మైన పద్ధతిలో ప్రభుత్వాన్ని పడగొట్టాలి, పడగొట్టితీర్తా మనటం, మంత్రులు డబ్బా వాయించుకొనుచు మే మింతచేశాం, ఇంకా చేస్తాం అని ప్రగల్భాలు పలకటం, ఏమీ చేయకపోవటం, చీటికే మాటికి వేలు ఖర్చుపెడుతూ పరదేశాల కేగటం, పిల్లి సమర్తాడిం దన్నా, ఆ సంబరానికి బోలెడంత ప్రభుత్వండబ్బు తగులపెట్టి, అంతకుమించిన ఖర్చును ఆహ్వానించినవారిచేత ఖర్చుపెట్టించటం, వేసిన పునాదిరాళ్లు (శంకుస్థాపనలు) గుర్తులేకుండా పోయేవరకు పనులు మొదలుపెట్టకనేపోవటం, ఆ ప్రాజెక్టు పెడ్తాం, ఈ ప్రణాళిక నేర్పాటుచేస్తాం అని ఆశపెట్టి ప్రజల నిరుత్సాహపెట్టటం దేశ సౌభాగ్యానికి తోడుపడుతుందా?

కంట్రోలను పేరున ముఖ్యావసరవస్తువులను అపరూపం చేయటం, పరపతి అనే నెపాన్న సదుపాయాలను తగ్గించటం, ఉత్పత్తి పంపక విధానాలు కొందరు ధనికుల చేతుల్లో మాత్రమే ఉండకూడదని ప్రభుత్వ కార్పొరేషన్ లేర్పరచి, దోపిడీలు చేయించి లంచగొండితనం పెంచటం, పెద్దల పేర్లమీద లక్షలు ప్రభుత్వ బాంకులనుండి వెలిదీయించి ప్రజలను మోసగించటానికి ప్రయ త్నించటం దేశా న్నుద్ధరించటానికేనా? వాక్ దిగ్బంధంచేసి, పత్రికా స్వాతంత్ర్యం హరించి, తోటివారిని జైళ్లలో నిర్బంధించటం దేశాని కేవిధంగా లాభం? విదేశద్రవ్యమారకం దగాకోరులు,

బంగారు, వెండి దొంగ రవాణాదారులు ఇతర దేశాలనుండి విలువ గల బట్టలు, గడియారాలు, రేడియోలు వగైరా వస్తువులను దొంగచాటుగా దిగుమతిచేసి, వానిమీద విధింపవలసిన సుంకాన్ని ఎగగొట్టటం దేశసంపదను పెంచుతుందా? "దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్" అని ఉద్ఘోషించిన గురజాడవారి సూక్తి గుర్తుంటే, తిండిగింజలను పండించే సామాన్యులమీద కూడా దాడిచేసి, ఉత్పత్తి ఆశావహంకాకుండాచేస్తే దేశ మధ్యోగతి చెందదా?

ఈ అభిప్రాయాలు, అనుమానాలు పెల్లుబికి వస్తవి. మనం స్వతంత్రుల మయ్యాం, నాగరికుల మయ్యాం, ఆకాశంలోకి కృత్రిమ గ్రహాలను పంపగలుగుతున్నాం అనుకొని మన భుజాలను మనం చరచుకోవటం మన దేశ ఔన్నత్యాన్ని పెంపొందిస్తుందా?

మనకు కల్గిన స్వతంత్రత, స్వేచ్ఛ, నాగరికత ఇంచుమించు బూటకంకాదా? వాని మూల్య మిప్పు డెం తుంటుం దంటారు?

వర్ణాంతర వివాహం

ఇక్కడ వర్ణం అనగా శరీరం రంగు కాదు; కులం. మన దేశంలో ఇంచుమించు తెలుపు రంగు నుండి, మసిబొగ్గు రంగుగల దేహాలవారున్నా, మ నందరం భారతీయులమే కాబట్టి వర్ణభేదం లేదు. కాని, మనం కులానికి ప్రాధాన్య మిస్తాం. పాశ్చాత్య దేశాలలో శరీరవర్ణం హిమంవంటి తెలుపునుండి, దంతం (ఏనుగు) రంగు, అంతకంటె కూడా కొంత తక్కువ రంగుగల వా రుండినా, వా రందరూ శ్వేతజాతివారుగానే ఎంచబడుతారు. మరిన్ని, ఆ దేశాలలో కులం ప్రస్తావనే లేదు. ఏ దేశానికి చెందిన శ్వేత జాతీయుడైనా, ఇతర దేశాలకు చెందిన శ్వేతవర్ణ వ్యక్తిని పెండ్లిచేసుకొనవచ్చును. అయితే, ఆ దేశాలలో మన కులానికి ప్రతిగా, వర్ణభేద మున్నది. కూలి నాలి చేసుకునే

శ్రమజీవులకు, ధనికవర్గానికి చెందినవారికి పొత్తు కుదరదు. బొగ్గు గనుల్లో పనిచేసే వానిని, భూవసతిగల కుటుంబంలోని పిల్ల పెండ్లాడుట కిష్టపడదు. భూవసతిగాని, వ్యాపారంగాని, పరిశ్రమల యాజమాన్యంగాని వున్నకుటుంబం పిల్లను లేక పిల్లవానిని ప్రభువుల వంశంలోని వారు వివాహ మాడరు. ఇప్పటి పరిస్థితు లెట్లున్నా, ప్రేమికుల విషయ మెట్లున్నా ధనం, రాజకీయహోదా విషయ మటుంచి, ఇది సామాన్య మన స్థితి. మనలోకూడా బీ దింటి పిల్లను ధనిక యువకుడు చేసుకోడు. కాని, కుల నిషేధం లేకపోతే, అట్టి సంబంధం తప్పుగా ఎంచబడదు. ఇప్పుడు ధనికవర్గంలోని ఒక కులం వారైనా, కట్నాల హెచ్చు తగ్గులను బట్టి వివాహాలను నిశ్చయపరచుకొనుచున్నారు.

మవదేశ పద్ధతిని, వర్ణాంతర వివాహ మనగా కులం తప్పిన వివాహమే. దీనిని అనుచితంగా మనం భావిస్తాము. ఇట్టి భావమే, పాశ్చాత్యులలో వర్ణం తప్పటంవల్ల కలుగుతుంది. వర్ణం తప్పకపోయినా, విభిన్న దేశాల ప్రజల నడవడి, మనోప్రవృత్తి భేదాలవల్ల, ఒక దేశంవారు, మరొక దేశంవారిని వివాహ మాడటం అంత మంచిది కాదనే భావాన్ని సోమర్ సెట్ మామ్ తన నాటకం, "అవర్ బెటర్సు" లో సూచించాడు. ఒక అమెరికన్ యువతి, ఒక ఇంగ్లీషు ప్రభువును, అతని ప్రభుహోదా కొరకు పెండ్లాడా లనుకొంటుంది. ఇంగ్లీషు ప్రభువు ధనాని కాశించి డబ్బున్న అమెరికన్ యువతిని పెండ్లి చేసుకోవా లనుకొంటాడు. ఇద్దరూ చూపరులే. మంచి మన్ననలున్నవారే. సంస్కారం వున్నవారే. ఒకరి నొకరు ఆదరణతో, స్నేహభావంతో చూచుకొనువారే. స్నేహితులైనారుకూడా. కొన్ని అనుకోని సంఘటనలవలన ఆ యువతి, ఆ యువక ప్రభువును వివాహమాడే ఉద్దేశాన్ని మార్చుకొని, ప్రధానాన్ని తప్పించి, అమెరికాకు వెళ్లిపోతుంది. తన స్వదేశంలో, తన స్వదేశస్థుణ్ణి వీలును బట్టి వివాహమాడుతానని చెప్పి వెళ్లిపోతుంది. ఆమె వాక్యాలివి. (తెలుగులో)..."నీ జీవితంలో నేను స్థిరపడిపోగలనని నీవు ఊహించుచున్నావు. నీ జీవితం, హుందాతనం, బాధ్యతా దృష్టి, ప్రజాసేవానురక్తి కలది. పై గుణాలు నీ స్థాయి ఇంగ్లీషు

యువతులకు స్వాభావికముగా వుంటవి. వారు వీనిని చిన్నప్పటి నుండి తెలుసుకొని యుంటారు. వాని నాచరించుటకు తర్ఫీదును పొందియుంటారు. మా కట్టిది లేదు. మా కీ పద్ధతులు ఎంతో విసుగును కల్గిస్తవి. మీ హుందాతనం, మమ్ములను ఇబ్బందిలో పెడుతుంది. అందువలన మాకు చిరాకు కల్గుతుంది. మేము మా కానంద మిచ్చే వానిమీద మాత్రమే ఆధారపడతాము. నీ ప్రాసాదాన్ని గురించి నాతో చెప్పావు. నీ చిన్నతనంలో అక్కడ పెరిగావు. నీ పెద్దలందరు అందులో పుట్టి పెరిగారు. అందువలన ఆ భవనం నీకు సర్వస్వం. నేను నిన్ను గాఢంగా ప్రేమించినట్లైతే ఆ భవనం నాకు కూడా అర్ధవంత మయ్యేది. కాని నిన్ను నేను నిజంగా ప్రేమించటం లేదుకదా! మేము మీ ఇంగ్లీషు జీవిత విధానాన్ని తట్టుకోలేమని నీకు తోచటం లేదా? అది మా తలకు మించి ఎక్కించి మమ్ములను తారుమారు చేస్తుంది. మా పద్ధతులను విడనాడుతాం; మీ దేశ పద్ధతులకు మే మలవాటుపడం; చిందర వందరైపోతాం. మేము దిలాసాగా కాలంగడపటం తప్ప మాకు వేరే గత్యంతర ముండదు. అందువల్ల మేము ముక్కచెక్కలై పోతాం. మా అమెరికాలో అయితే మేము భద్రంగా వుంటాం" అని చెప్పి స్వదేశానికి వెళ్లిపోతుంది.

ఈ పై మనస్తత్వాన్ని, వివేకపూరిత దృష్టిని, యథార్థ పరిస్థితులను వర్ణాంతర వివాహ సమస్యలలో గుర్తించుకోవాలి. నామట్టుకు నాకు కులభేదవివాహాలు ప్రోత్సహించవలసినవనే చాలా సంవత్సరాలనుండి నమ్మకం, ఆశయం. దేశంలోని ఇతర ప్రదేశాలవారితో వివాహాలను, చివరకు పాశ్చాత్య స్త్రీలతో వివాహాలను నే నంగీకరిస్తాను. మా కుటుంబములో ఒక యువకునికి వర్ణాంతర వివాహం చేసుకొమ్మని, చాలా సంవత్సరాల క్రితం సలహా యిచ్చాను. ఈమధ్య మా కుటుంబంలోని దగ్గర యువకు డొకడు గుజరాతి అమ్మాయిని చేసుకొన్నాడు. ఇంకొకడు వెలమ అమ్మాయిని వివాహమాడాడు. నా సన్నిహితమిత్రుల కుటుంబంలోని యువకుడు ఒక అరవబ్రాహ్మణ యువతిని పెండ్లాడాడు. నా బంధువర్గంలోని ఒక విద్యావంతుడు ఒక జర్మన్

శ్వేతయువతిని వరించాడు. వారి చక్కని ముద్దుబిడ్డకు నీ కొడుకును చేసుకొమ్మని పెండ్లాడిన యువకుని సోదరికి చెప్పుతుంటాను. ఆవిధంగా స్వకులం కానివారి, స్వప్రాంతం కానివారి, స్వదేశం కానివారి మధ్య వివాహాలు జరుగకూడదని చెప్పేవాడనుకాను. అయితే, నా పుస్తకం, "మారినకాలం" లో గట్టిగా చెప్పినట్లు, ఏ కులంవారైనా, ఏ జాతివారైనా, సమానప్రతిపత్తి ఉన్నవారితోనైతే వివాహం కొంతవరకైనా చక్కగా నడుస్తుంది. ఏకులానికి చెందినా ఒకరి స్థితిగతులు మరొకరికి, ఒకరి మనస్తత్వాలు, దృక్పథాలు, అభిలాషలు, అభిరుచులు మరొకరికి అర్థమై, తృప్తియై, వాంఛనీయమైనట్లయితే, వివాహబంధం నిలవటాని కవకాశ మున్నది. ఇతర ప్రాంతాల, ఇతర దేశాల, చివరకు ఇతర భాషలవారి సంబంధాలకంటె, ఒకే భాష మాట్లాడేవారు సమానస్థాయిలోవున్న ఇతర కులాలవారితో పెండ్లియాడితే అది నిలుస్తుంది. నేనా గ్రంథంలో చెప్పినట్లు, వివిధశాఖల బ్రాహ్మణులలో, వైశ్యులలో వివాహం, వివిధరకాల రెడ్లలో పెండ్లి, వివిధప్రాంతాల హెచ్చు తగ్గుల హోదాల, కమ్మవారి మధ్య, అట్లే వెలమల మధ్య, తెలగ, కాపు, లేక బలిజ పేర్లతో వ్యవహరింపబడే విభిన్నశాఖలవారి మధ్య వివాహాలు సంతోషించవలసినవి. మరిన్ని, సమానప్రతిపత్తి పూర్తిగా లేకపోయినా అభ్యంతరంలేని సాలె, కుమ్మరి, గొల్ల వంటి కులాలవారితో కమ్మ, రెడ్డి, వెలమ, తెలగ లేక బలిజ కులాలవారు వివాహ మాడవచ్చును. బ్రాహ్మణేతరులలోని అగ్రకులాలు, వెలమ, కమ్మ, రెడ్డి, బలిజ కులాల మధ్య వర్ణాంతర వివాహాలు చాలా మెచ్చదగినవి. ఈ కులాలు సమానప్రతిపత్తి కలవి. ఆచార వ్యవహారాలలో పెండ్లి, వగైరా విధానాలలో ఇంచుమించు ఏకపంథాలోనివి. ముఖ్యంగా రెడ్డి, కమ్మ కులాల ఆచార వ్యవహారా లొకమాదిరివే. ముందు ఈ రెండు కులాలు సమన్వయం పొందటం కోరుకోవలసింది. ఈమధ్యనే శ్రీ బెజవాడ గోపాల రెడ్డిగారి పట్టి అభిప్రాయాన్నే వెలిబుచ్చారు.

కవిరాజు సాహిత్య విహారం

ఎ) కవిరాజు సాహిత్య విహార వార్షిక సభ

బి) 'విశిష్ట భారతి' అంకితం

సి) కవిరాజు స్మారక సభ

(కృష్ణాజిల్లా, గుడివాడలో 20-7-1975 తేదీ ఉదయం 10 గంటలనుండి.)

(ఎ) యుగపురుషుడుగా ఎంచదగిన కవిరాజుగారికి, వారి జనన ప్రాంతమైన గుడివాడలో, వారి స్మృతిచిహ్నంగా సాహిత్య విహారం, లేక పీఠం ఏర్పరచబడటం మిక్కిలి సముచితం. కవిరాజుగారు మహాకవియే గాక, సంఘసంస్కారి. సంఘంలోని కుళ్లును బైటబెట్టి, దానిని శుభ్రపరచుటకు తన కవితాప్రతిభ నుపయోగించారు. మూఢనమ్మకాలను పారద్రోలటానికి స్కూత పురాణాన్ని రచించారు. అన్యాయాలను ఖండించటానికి శంబువధ, ఖూనీ, కురుక్షేత్రసంగ్రామం నాటకాలను వ్రాశారు. హెచ్చరించ టానికి కుప్పుస్వామి శతకం, ధూర్తమానవ శతకాలు చెప్పారు. అసంగతాలను వెలువరించటానికి హేళనకావ్యం భగవద్గీతను కూర్చారు. ఉద్బోధించటానికి, ప్రబోధించటానికి సూక్తాశ్రమ గీతాలను ఉద్ఘాటించారు. ఆయన పండితుడు, కవియేగాక, సంఘసంస్కర్తయేగాక హేతువాది, మానవతావాది. అన్నిటిని మించి ప్రజాసామాన్యంలో ఆత్మాభిమానం పెంచడానికి శ్రమిం చారు. అగ్రకులజులమని చెప్పుకొనుచు ఇతర కులాలవారిని, వా రెంత విద్యావంతులైనా, సంస్కృతికలవారైనా, ధనవంతులై పదిమందిని పోషించేవారైనా హీనంగా చూడటం, ఆయన ఆత్మాభిమానాన్ని రేకెత్తించటమేగాక, సోదరమానవులను ఈ సాంఘిక భానిసత్వంనుండి తప్పించి, వారు తమ్ము తామే గౌర వించుకొనేలాగు చేయాలని వారికి దీక్ష కల్గించింది. ఇట్టి మహా భాగుణ్ణి, మహాశయుణ్ణి మనవారిలో కొందరైనా కొలదికాలం

క్రితం గుర్తించి, వారి గౌరవార్థం ఈ సాహిత్య పీఠాన్ని ఏర్పాటు చేసినందులకు మిక్కిలి సంతోషం. దీని స్థాపనలో, వసతి కల్పించే విషయంలో అధ్యక్షుడు శ్రీ త్రిపురనేని శివప్రసాదరావుగారిని, కోశాధిపతి డా. త్రిపురనేని వెంకటేశ్వరరావుగారిని అభినందించ వలసియున్నది. కార్యదర్శి శ్రీ ఆచార్య ఎట్లోజు మాధవాచార్యులు గారివంటివారి సాయంకూడా ఎక్కువగానే ఉండి ఉంటుంది. దీని వసతి నింకను విస్తృతపరచి, తగు సదుపాయాలను ఏర్పాటుచేసి, కార్యకలాపాలను వృద్ధిచేయవలసియున్నది. వీనికి గౌరవనీయులైన విద్యామంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు సానుభూతితో సహాయా లందజేస్తారని ఆశించుచున్నాను.

(బి) "విశిష్టభారతి" అంకితం

గ్రంథకర్త వైవిధ్యంగల సాహిత్యవేత్త. తన వైద్యవృత్తిని పెద్దస్థాయిలోనే నిర్వహిస్తు, నర్సింగు హోమ్‌ను కూడా నడుపుచు సాహిత్యసేవలను చేయటం గొప్ప విశేషం. ఆయన హేతువాది, తార్కికుడు. తన కవితాప్రభను, తన విజ్ఞాన సముదాయాన్ని పైజెప్పిన రెంటిని ప్రచారంచేయటానికి, అమలులో పెట్టటానికి నిరంతర కృషి చేస్తూ ఉంటారు. ఆయ నిప్పటికే కొన్ని పుస్తకా లను ప్రచురించారు. ఇప్పుడు 'విశిష్టభారతి' అనే గ్రంథాన్ని సమకూర్చి గౌరవనీయులైన విద్యామంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారికి అంకిత మిస్తున్నారు. ఈ కన్యాదానం సంతో షించవలసినది. అయితే, ఈ గ్రంథంలోని పద్యాలలో చాలా భాగమైనా ప్రథమ ప్రపంచయుద్ధానికి ముందు, దాని తర్వాత రచించినవి. మంత్రిగారేమో 50 ఏండ్లు లోపువారు. కాని, సీత రామునికంటె పెద్ద దంటారు. వారు ఆదర్శదంపతులు కదా! కాబట్టి ఫరవాలే దనుకోవాలి. ఇం కొకటి. ఈ కన్నియ వివిధ పోకడలు (వివిధాంశాలమీద 73 పద్యాలు) కలది. అయినా దక్షులగు వెంకట కృష్ణారావుగారు సంభాళించుకొనగలరనే నా ధైర్యం. ఈ నూత్నవధూవరులకు నా ఆశీస్సులు.

(సి) కవిరాజు రామస్వామి చౌదరిగారు

వారి హేతుదృష్టి, న్యాయదృష్టి, మానవతాదృష్టి, సంఘ సంస్కరణ వగైరాలను గురించి నే నిక్కడ చెప్పటం చర్విత

చరణమే అవుతుంది. వారి పాండిత్యప్రకర్ష, కవితావైభవాలను గురించి చెప్పటానికి నాకు శక్తిలేదు. అయితే, ఒక్కటి చెప్ప దలచుకొన్నాను. అంత గొప్ప కవిని, సంఘసంస్కర్తను మన ఆంధ్రులు ఇప్పటికిని సరిగా ఎందుకు గుర్తించలేదా అను ప్రశ్నకు మనం సమాధానం చెప్పవలసి వున్నది. ముఖ్యకారణం, మనలోని కపటంతోకూడిన నీతిలేని బుద్ధి (ఇన్‌టలెక్చ్యుయల్ డిజానెస్టి) కారణమనుకుంటాను. బ్రాహ్మణేతరులు చదువుకోకూడ దనే పంథాలో, అట్టివారు చదువుకుంటే ఓర్వలేనితనం కల్గ వచ్చును. అగ్రజాతి అనేవారిలో కూడా వీరికి ఈర్ష్యాసూయ లున్నా, అవి మామూలుగా ఉండేవే. బ్రాహ్మణేతరుడు ధనికుడైతే, యాచించి డబ్బు పట్టుకుపోతారు. ఉద్యోగి అయితే ప్రాధేయపడితమవాళ్లకు ఉద్యోగాలిప్పించుకుంటారు. కాని, అతడు విద్యాధికుడు, పండితుడు, కవి అంటే ఓర్వలేరు. వెంటనే అసూయ పడతారు. వాళ్లసంగతెట్లున్నా, మనవాళ్లతప్పుకూడా వున్నది. ఫలానావాడు (బ్రాహ్మణేతరుడు) మంచి గ్రంథం వ్రాశాడంటే, ప్రక్కనున్న బ్రాహ్మణేతరుడు "అబ్బే ఏం బాగున్నది, వానికేం తెలుసు? ఫలానా శాస్త్రిగారువ్రాసిన గ్రంథం ఉత్కృష్టంగా వున్న" దంటాడు. అలాగనకపోతే అవతలాయన తాను కులాభిమానంతో చెప్పుచున్నాడనుకొంటాడేమో అని జంకు. తప్పకుండా ఇది తక్కువ స్థాయివాడననే భావం (ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సు). పైగా బ్రాహ్మణేతరకులాల్లో చుప్పనాతితనం హెచ్చు. ఇంకొక స్వ కులస్థుడు గౌరవింపబడితే తన కవమానం జరిగినట్లు ఎంచుకుంటాడు. అగ్రజాతివాడు మావా డంతవాడు, ఇంతవాడని వీలున్నప్పుడు, వీలైనచోట్ల డబ్బావాయించుతాడు. బ్రాహ్మణేతరుడు సమయం దొరికినప్పుడల్లా తనవానిని నిరసిస్తాడు. ఈ మనస్తత్వం పోవాలి. "ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమిలో పెట్టిన పెద్దల ఫొటోలలో కవిరాజుగారి ఫొటో లేదేమి, మీరా రేంచేస్తున్నా"రని ఈమధ్య హైదరాబాద్ పెద్దవకీలొకాయనడిగాడు. అప్పటికినా సభ్యత్వం అయిపోయి కొంతకాలమయింది. లేకపోతే బహుశా అధ్యక్షులు గారితో ఈ ప్రస్తావన తెచ్చేవాడనేమో. అంతవర కెందుకు, ఈమధ్య జరిగిన ప్రపంచ తెలుగు సభలలో ఎవ రెవరివో బొమ్మ

లున్నవిగాని కవిరాజుగారి బొమ్మలేదు. పెత్తనం బ్రాహ్మణే తరులదే అయినా, వారి కిట్టివి తోచవు కాబోలు!

ఆర్యులు - అనార్యులు

ఒకరు ఈమధ్య నా కొక పుస్తకం "ఆర్యుల రహస్యములను వెల్లడించిన ధీరులు" అనే దాన్ని అయాచితంగా పంపారు. దానిని చదివినమీదట నాకు కల్గిన భావాలను వారికి లేఖ పూర్వకంగా తెలిపాను. దానిలోని భాగాలను తెల్పుతున్నాను.

"మీపుస్తకం ఒకవిధముగా విలువైనదే. దీనిని1917-'18లో ప్రచురించియుంటే బాగుండేది. అప్పుడు బ్రాహ్మణేతరోద్యమం తీవ్రస్థాయిని పొంది, జస్టిస్ పార్టీ ఆవిర్భవానికి కారకమైంది కదా! ఇప్పుడా ఉద్యమ ప్రస క్తి నిరర్థకం. ఆ వ్యూసే ఎత్తేవాళ్లు లేరు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఒక కులంవారికి పోయిన ప్రాముఖ్యం తిరిగి చేకూరుతున్నది కాని, వ్యక్తుల ప్రాబల్యం ఎట్లున్నా, కులంగా వాళ్ల ప్రాబల్యం తగ్గిందని ఒప్పుకోవాలి. సాంఘికంగా రాజకీయంగా కూడా వాళ్లు కొంత దిగజారిపోయారు.

"మీ పుస్తకం బ్రాహ్మణులు ఆర్యులని, తతిమ్మా కులాల వారు అనార్యులని, ఆర్యులనే బ్రాహ్మణులు రహస్యంగా కుట్రజేసి అనార్యులనే ఇతర కులాలవారిని త్రోక్కివేస్తున్నారనే సిద్ధాంతం మీద ఆధారపడివుంది. రామాయణకాలంలో ఎట్లున్నా, వర్తమానకాలంలో ఈ సిద్ధాంతం చెల్లదు. కాబట్టి ఇప్పుడు ఆర్యులు, అనార్యులని భేదం చూపటం అనావశ్యకం. నిజానికి దేనినిబట్టి ఫలానావాడు ఆర్యుడని, ఫలనావాడు అనార్యుడని చెప్ప గలుగుతాం? బ్రాహ్మణకులంలో పుట్టినవాడు ఆర్యుడని, బ్రాహ్మణేతరకులంలో బుట్టినవాడు అనార్యుడని ఈకాలంలో

బ్రాహ్మణుడు కూడా అనలేడు. రూప సంపదనుబట్టి అసలే నిర్ణయించలేము. ముక్కు మొగం తీరులేక, రక్కసిబొగ్గువంటి వర్ణంతో ఉండే బ్రాహ్మణకులస్థు లెంతమంది లేరు? మీవంటి మిక్కిలి ఆకర్షణీయమైన వ్యక్తులు బ్రాహ్మణేతర కులాల్లో ఉన్నారు కదా! పైన వర్ణించిన బ్రాహ్మణ కులస్థుడా, లేక మీరా నిజమైన ఆర్యుడు?

"ఇక మీ పుస్తకములో పేర్కొన్న రహస్యాలను వెల్లడించిన ధీరుల విషయం. కవిరాజుగారు, తాపీ ధర్మారావుగారు, ఆవుల గోపాల కృష్ణమూర్తిగారు, అన్నాదొరైగారు మీ రూహించిన కోవకు చెందినవారు కారని నా అభిప్రాయం. కవిరాజు త్రిపురనేని రామస్వామిచౌదరిగారు రామాయణకాలం, పురాణకాలం విషయాల నెత్తుకొన్నారు. తాపీ ధర్మారావుగారు హిందూసంఘం లోని ప్రాత సాంఘిక పోకడలను వివరించారు. గోపాలకృష్ణమూర్తి గారు వర్తమాన అసమానతల నెదిరించారు. అన్నాదొరైగారు రాజకీయంగా, సాంఘిక, ఆర్థికంగా వర్తమాన వ్యవస్థ మార్పును కోరారు. ఇక పెరియార్ రామస్వామి నాయకర్‌గారు విప్లవవాది. ఆయన మానవ సంఘాన్నే మార్చాలన్నారు. డా. అంబేద్కర్ సాంఘికంగా అవమానంపొంది అసహన శీలుడై మండుచున్న హృదయంతో, ప్రతివిషయాన్ని ఎదురించే హరిజననాయకుడైనాడు. గాంధిమహాత్ముడు హరిజన పిల్లలను తన బిడ్డలుగా పెంచాడు. పాకీపని చేశాడు. తన కొడుకుకు వర్ణాంతర వివాహం చేశాడు. అట్టి మహాత్ముని కుల, వర్ణతత్వం కలవానినిగా డా. అంబేద్కర్ వర్ణించటం క్షమించరాని విషయం. బుద్ధదేవుని ఇందులో చేర్చవలసిందికాదు. ఆయన ఆర్య, అనార్య సిద్ధాంతం కొరకుగాక, మానవోద్ధరణకు అవతరించిన మహాపురుషుడు."

అబలకాదు, సబల

రమణారావు వీధివెంట వెళ్లుతున్నాడు. చంద్రయ్య ఇంటిని సమీపించేటప్పటికి ధుమధుమలాడుతూ చంద్రయ్య వీధివాకిలికి

నచ్చాడు. ఆ ఇంటిని చేరకముందే, ఏవో కేక లింట్లోనుండి వచ్చి రమణారావు చెవులకు సోకాయి. చంద్రయ్య తరహా జూచి, ఏదో జరిగి వుంటుంది, తెలిసికొనాలని కుతూహలంతో ఆగి, "బాబాయీ, ఇంట్లో ఏదో జరిగినట్లున్నదే" అన్నాడు. రమణా రావు చంద్రయ్యకు బంధువు. కొడుకు వర సవుతాడు. "ఏమున్నదిరా రమణయ్యా, మా ముసలిదాని గోడే. చెప్పినట్లు వినదు. చేయ వద్దన్నది చేస్తుంది. మనం సామాన్య వైతులంకదా, బంధువులని, తెలిసినవాళ్లని, లేనివాళ్లని ఏవో కొద్దిగా ఇంట్లోవుంటే వాళ్లకు పంచిపెడతావేమిటే, నీ కెవ రిచ్చారీ బోడిపెత్తనం అంటే, నా కామాత్రం స్వతంత్రం ఇంట్లో లేదా అని ఎదురు తిరగటం నేర్చింది. మా పెళ్ళయి ఇప్పటికి 50 ఏళ్ళయింది. ఇదివరకు నా మాటే గురిగా, భయభక్తులతో వుండేది. ఇప్పు డేమి వచ్చిందో, ప్రక్కింటి పడుచువాళ్ళను చూచి నేర్చుకొన్నట్లున్నది. ఆడవాళ్ళకు అలుసిస్తే ఇంకేమైనా వున్నదా, ఇల్లు గుల్ల కాదూ? అరాచకం కాదూ? అందుకే మా పెళ్ళయిన క్రొత్తలో మా మామ, 'ఆడ పెత్తనం, పంబల దొరతనం' అనేవాడు" అంటూ, ఖాండ్రించి ఊసి ఇంట్లోకి వెళ్లిపోయాడు చంద్రయ్య. ఇంతలో వీధిగుండా వెళ్ళుచున్న జగన్నాధరావు సమీపించి, ఆగి, "ఏరా రమణా, ముసలాయనతో ఏవో వూసులు చెప్పుతున్నావే" అన్నాడు. రమణారావు "ఊసులు కావు గీసులు కావురా. ఆ ముసలాయన వరసకు నాకు బాబాయవుతాడు కదా! వాకిట్లో కనబడితే పలక రించాను. భార్యతో పోట్లాడిన గోడు చెప్పుకువచ్చాడు. ఆమె ఆయన మాట వినకుండా ఎదురు తిరుగుతున్నదట. తనమాట వినటంలేదని, చెప్పినది చేయటంలేదని ఆయన వ్యథ. ప్రాత కాలంవాడుకదా! భార్య తన చెప్పుచేతల్లో పడివుండాలనే పద్ధతి కలవాడైనవాడు. కాలం మారింది. పూర్వం ఆడవాళ్లు కారిప్పుడు. మధ్యవయస్సు స్త్రీ లొకవిధంగా పోతారుగాని, ఈ నవనాగరిక పడుచులు, తల్లిదండ్రులను కూడా లెక్కపెట్టరు. 'మే మిప్పుడు స్వతంత్రులం, డాక్టర్లు అయినాం, ఉద్యోగాలు చేస్తున్నాం, అధికారం చెలాయిస్తున్నాం, మేమెందుకొకరికి లోబడి ఉండాలి? మాకు పురుషులవలెనే సమానప్రతిపత్తి, హక్కులు, ఆర్థిక

స్వాతంత్ర్యం ఉండా' లని ఎదురుతిరుగుతున్నారు కదా! ఆ ముస లాయన నా పెళ్లాం నా మా కెందుకు వినదు, ఆడదానికి స్వేచ్ఛ యిచ్చి పెత్తనమిస్తే పంబల దొరతన మవదా?'' అంటున్నాడని చెప్పుతూ, ఇద్దరు కలసి సాగిపోయారు. జగన్నాధరావు చకితుడై, '' ఆడపెత్తనం పంబల దొరతన మంటే ఏమిటిరా? నే నెప్పు డీ మాట వినలేదే! పంబలవాళ్ళ కెక్కడైనా రాజ్యం వున్నదా? వాళ్ళ రాజ్యంలో ఆడవాళ్ళు పెత్తనం చేస్తారా?'' అని అడిగాడు. రమణారావు నవ్వి, '' ఓరి జగ్గూ, నీ వింత అమాయకుడవేమిరా? ముసలిచంద్రయ్య అభిప్రాయం, అడుక్కుతినే పంబలవాళ్లకు దొరతనం అనగా రాజ్యాధికారం వస్తే ఆ రాజ్యం ప్రజలు ఎంత అధోగతిపొంది, భ్రష్టు లౌతారో, అదేవిధంగా ఆడవాళ్ళు పెత్తనంచెలాయిస్తే గృహం, బిడ్డలు ఛిద్ర మవుతా'' రని. జగ్గారావు చకితుడై, '' ఏమిటీ, చంద్రయ్య నిజంగా అంత మూర్ఖుడా? ఆయనమాట లేమి చెలామణి అవుతా యిప్పుడు? ఆ ముసలాడు నిజంగా 19-వ శతాబ్దంలో వున్నాడు. కాలం ఎంత మారిందో, మనుషు లెంతమారారో, ప్రత్యేకించి స్త్రీ లెంత మారారో ఆయ నింకా గ్రహించలేదల్లే వున్నది. ఆయనకు కొడుకులు, కూతుళ్లు లేరా? వాళ్లను చూచి అయినా మార్పులను గమనించలేదా '' అన్నాడు. రమణారావు, '' చంద్రయ్య బాబాయికి 70 ఏళ్లైనా వుంటాయి. కొడుకు లున్నారనుకో. పెద్ద వాళ్లిద్దరు పంచుకొని వేరే వాళ్ళ కాపురాలను వాళ్ళు సాగించుకుంటున్నారు. తర్వాత కల్గిన ఒకరిద్దరు చనిపోయారు. ఇవ్వాడున్న ముగ్గురు కొడుకుల్లో పెద్దవాడు వట్టి అమాయకుడు. ఎవరూ పిల్ల నివ్వకపోతే, చదువు సంధ్యలు లేని బీదపిల్లను చేశారు. తతిమ్మా ఇద్దరు చదువుకుంటున్న చిన్నవాళ్ళు. కూతుళ్లు లేరు. ఆయన కీచులాటంతా భార్యతోనే. ఘనీభవించిన భావాలతో పెరిగి వృద్ధుడైన చంద్రయ్య, మారమంటే మాత్రం ఇప్పుడు మారుతాడా?'' అని జవాబిచ్చాడు.

వీళ్ళిట్లు మాట్లాడుకొనుచుండగా దారిని వెళ్లే పద్మారావు, '' ఏమిటిరో, చాలా కబుర్లు చెప్పుకుంటున్నా'' రని ఆగాడు. వీళ్లు ముగ్గురూ యువకులు. తమ ఊళ్లోని హైస్కూలులో

పదోక్లాసువరకు చదివి కాలేజి చదువుకు స్తోమతలేక కొంత, చదువుమీది ధ్యాసలేక కొంత మానివేశారు. తమ కుటుంబాల వ్యవసాయం చూసుకొంటున్నా, అడపా దడపా కలుసుకొని, ఊళ్లోని కబుర్లు, ఉగంలోని కబుర్లు చెప్పుకుంటూ సర్దాపడతారు. పద్మారావు వీళ్ళలో పత్రికలు నగైరా చదువుతుంటాడు, ఎక్కడ లేని కబుర్లు తనకే కావాలంటాడు. రమణారావు చంద్రయ్య గోడు చెప్పుకు వచ్చాడు. 'ఆలాగా, చంద్రయ్య ఈనోజున కాదంటే పోతుందా? ఇప్పు డాడవాళ్లతో వాదించి నెగ్గగలమా? అసలు చదువుకొన్న పడుచులైతే చాలు, మనను డబాయించి నోళ్లు కట్టివేయించటానికి. ఇక ఉద్యోగాలు సద్యోగాలు చేస్తూ, అధికారం చెలాయించేవాళ్లను పట్టపగ్గాలున్నవా? చూడండిరా, మనమేమో, ఆడవాళ్లు ఇంటిపనులతో సతమతమైపోతారు, దమ్మిడీకికూడా మగనిపై ఆధారపడాలి, ఇక అబలులు కాక మరేమవుతారు అనుకుంటాం. కాని ఇంట్లో మాత్రం వాళ్లు తమకు తోచినట్లు పెత్తనం చెలాయించరా? పేరుకు మాత్రం మగడు ఇంటియజమాని గాని అసలు ఇంటిపెత్తనమంతా పెళ్లానిదేకదా! పెళ్లాన్ని కాదని ఎంతమంది మగవాళ్లు కాపరంచేయగలరు? పైకి డాబేగాని భార్య మాటకు జవదాటని భర్త లెంతమంది లేరు? ఎవరో కొందరు దుష్టులు, పశుబలంతో భార్యలను అణగద్రొక్కవచ్చునుగాని నూటికి 95-వవంతైనా భార్య చెప్పినట్లు చేసేవారే. ఇదివరలో, కూతుళ్లకు తలిదండ్రు లే స్వల్పమో తప్ప ఏమీ నుట్టజెప్పేవారు కాదుగనుక, ఒకటి రెండు సంవత్సరాలైన తర్వాత, కట్టుకొనే చీరకు కూడా భర్తమీద ఆధారపడవలసిన భార్య, ఎక్కడ డబ్బివ్వడో అని కొంత వినయవిధేయతలు చూపించినా, ఇప్పుడు బోలెడు కట్నం, ఇతరాలు తెచ్చుకొంటున్న అమ్మాయిలు అణగి మణగి ఉండ నవసరమేమున్నది? పైగా తలిదండ్రుల పుణ్యమా అంటూ, బాగా చదువుకొని ఏ డాక్టరో, ఏ ఇంజనీరో, ఏ లెక్చరరో అయి స్వంతసంపాదన చేసుకొంటూన్నారాయె. ఉద్యోగాలలో ప్రవేశించి అధికారం చెలాయిస్తున్నారాయె. అంతకుమించి రాజకీయాల్లో ప్రవేశించి మంత్రులై కూర్చుంటున్నారాయె. మగవాళ్లు చేతులుగట్టుకొని వాళ్లముందు నిలబడి

విన్నపాలు చెప్పుకోవలసిన వాళ్లాయె. ఇక మగవాడంటే ఎందుకు భయపడాలి? భర్త మగవాడే అయినా, సాంగత్యావసరం తన కొక్కడానికేనా? అసలు భర్తేకదా దేవురించేది? అందులోకూడా తనది పైచెయ్యే కదా! ఇన్ని ధీమాలున్న స్త్రీ, ఎందుకు అబల అవుతుంది, సబలకాక?'' అని ఒక చిన్న ఉపన్యాసమిచ్చాడు. ఈ మధ్య పద్మారావు మీటింగులకని వెళ్లుతున్నాడు. ఆ ధోరణి కొంత అలవర్చుకొన్నట్లున్నది. జగన్నాథరా వందుకొని, ''ఏడ్చావులే నీ మాటలు నీవున్నూ. దేశంలో ఎంతమంది స్త్రీ డాక్టర్లు, ఇంజనీర్లున్నారు? ఎంతమంది ఉద్యోగం వెలిగిస్తున్నారు? మంత్రులెంతమం దయ్యారు? వాళ్లు మొత్తం జనాభాలో సగం వున్నారుకదా! ఒక వీసపాలైనా ఉద్యోగాలు, సద్యోగాల్లో ఉన్నారా? డాక్టర్లు, ఇంజనీయర్లు అయ్యారా? మంత్రులై కూర్చున్నారా?'' అని ప్రశ్నించాడు. పద్మారావందుకొని, ''ఒరే జగ్గూ, అంతా తెలిసినట్లు మాట్లాడతావేమిరా? కూపస్థమండూకంలాగున్నావు. ఈ విశాల భారతదేశాన్ని అప్రతిహతంగా పాలించే దెవరురా? వందమంది మగమంత్రులైనా ఆమె క్రింద బలాదూరేకదా! రాష్ట్రాలలోమట్టుకు స్త్రీలు ముఖ్యమంత్రులై యుండలేదా? మనదేశం మా టటుంచి ఇతర దేశాల్లోకూడా స్త్రీలు సాటిలేని, ఎదురులేని ప్రభుత్వాధికారాన్ని జమాయించటంలేదా? శ్రీలంక ప్రధాని ఎవరు, స్త్రీ కాదా? మొన్న మొన్నటివరకు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి స్త్రీయేకదా! అధికారమెట్లున్నా, ఇంగ్లండు రాజ్యాధిపతి రాణి ఎలిజబెతమ్మగారు కాదా? హాలెండులో రాజుకాక రాణికదా రాజ్యాధిపతి? ప్రస్తుతకాలాన మాత్రమే అంటావేమో. పూర్వకాలంలో మనదేశంలోకూడా తారా బాయి, అహల్యాబాయి, దుర్గాబాయి, ఛాంద్‌బీబీ, ఝాన్సీ లక్ష్మీబాయ్ వంటి స్త్రీ రత్నాలు సమర్థవంతంగా రాజ్య పాలనం చేయలేదా, వీరోచితంగా శత్రువులతో పోరాడలేదా? ఇతర దేశాలను చూద్దామా; రష్యా కాథరీన్, ఇంగ్లండు మొదటి ఎలిజబెత్‌లతో పోల్చగల, పోటీపడగల పురుష ప్రభుత్వాధినేత లున్నారా? స్కాట్లెండు రాణి మేరీని కూడా మనం తలచవలసి వున్నది. దూరప్రాచ్య, పాశ్చాత్య దేశాలసంగ తెట్లున్నా,

మనపురాణాలలో మాత్రం మగవాళ్లను లెక్క-పెట్టని ధీరనారీ మణులు లేరా? రామాయణంలోని కైక దశరథుని పూర్తిగా లోబరుచుకొని తనమాటను సాగించుకొనలేదా? భారతంలో కుంతి మాటను పాండవులు కాదనగలిగారా? ద్రౌపది చచ్చిన పామువలె పడియున్న యుధిష్ఠిరుని, అతని తమ్ములను తన నర్మ గర్భ వాక్యాలతో, పౌరుషపూరిత ప్రేరేపణలతో వాళ్లను యుద్ధంలోకి దింపి, తన శపథాలను సఫలంచేసుకొనలేదా? ఇటు వంటి ఉదాహరణ లింకెన్నో వుండవచ్చును. నేను చెప్పేదేమి టంటే, ఈ కాలంలోనేకాదు పూర్వ పురాణకాలంలో కూడా, పైకెట్లు నటించినా స్త్రీ అబల కానేకాదు, పూర్తిగా సబలయే అని."

బాగా ప్రొద్దెక్కింవని ఎవరింటికి వారు బైలుదేరి వెళ్లిపోయారు.

౧౮

జననీ జనకులు

జననీ జనకు లనగా సామాన్యార్థమున తలి దండ్రులు. నిజానికి, 'తల్లీ, తండ్రీ' అని సంబోధింపబడేవారు, సంబోధించినవారి కందరి జన్మకు కారకులా? బిచ్చగాడు 'అమ్మా, తల్లీ' అని స్త్రీని, 'అయ్యా, తండ్రీ' అని మగవానిని సంబోధించి బిచ్చం అడుగుతాడు. 'అమ్మలారా, అయ్యలారా గ్రుడ్డివాణ్ణి, కుంటివాణ్ణి ఒక్క పైసా ధర్మంచేయం'డని బస్సుల్లో ప్రాధేయపడటం మనకు తెలుసును. ఈవిధంగా సంబోధింపబడినవాళ్ళు, సంబోధించినవాళ్లకు తలి దండ్రులా? తల్లి అనగా అమ్మగదా! మనకు బాధకలినప్పుడు 'అమ్మా'అని దీనాలాపాలు చేస్తాము. అప్పుడు మన కన్నతల్లినే తలచుకొన్నామని చెప్పటకు వీలులేదు. కన్నతల్లి గుర్తుకు రాక పోవచ్చును. కన్నతల్లి గుర్తుకువచ్చి ఆమె రక్షణకొరకు ప్రాధేయ పడటం వయస్సువచ్చినవారు చేయరు. బాధా సమయాన మన

ప్రయత్నంలేకనే బైటికి వచ్చిన దీనాలాపం మన బాధను పోగొట్టునట్టిది మాతృశక్తి యున్నదని, మన అంతరాత్మలో ఇమిడిపోయిన భావమే ఈవిధంగా బహిర్గత మౌతుంది. ఈ విషయములో తండ్రికంటె తల్లే అధికురాలు. నిజానికి మానవ స్పృహలో, ఆరాధనలో సంరక్షించు శక్తిగా తల్లియే ముఖ్యం. అందువలననే మనం ఆదిశక్తి, పరాశక్తి, త్రిమూర్తులకు తల్లి, మూలవిరాట్టు అని చెప్పుతా మిూమెనే. ఇదిగాక, చాలా దేశస్థులు తమ మాతృభూమిని స్త్రీగా వర్ణించుతారు. మన భరతదేశానికే గాక ఇంగ్లండు, ఫ్రాన్సు మొదలైన దేశాలకు కూడా అధిదేవత స్త్రీస్వరూపిణియే. ఈమె శారీరకంగా కనకపోయినా, దేశరూపేణ జననియే. ఈ భావాన్నే "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అని పెద్దలు చెప్పుతారు. జనని సంస్కృతం, తల్లి తెలుగు. రెండు మాటలు సమానార్థకములేకదా అనవచ్చును. నిజమే. అయితే, ఉత్తరహిందూస్థానంలో బాధపడువారు, బిచ్చగాండ్రు మాతా అంటారు కాని, తల్లీ అని, జననీ అని అనరు. మాత అనేది తల్లిపరంగానే గాక లక్ష్మి, పార్వతి వంటి దేవతామూర్తులకు కూడా వర్తిస్తుంది. అందువల్ల ఆ మాట విశేషార్థంకలదిగానే ఎంచుకోవాలి. దక్షిణాదివారు మనుష్యులపరంగా తల్లి అని, దేవతాపరంగా జనని, మాత అని (జగజ్జనని, జగన్మాత) అంటారు. అందువలన జన్మకు కారకులైనవారు జననీజనకులైనా, భాషార్థమున తల్లిదండ్రులే అయినా, ఉపయోగార్థమున జనని, జనకుడు అనే మాటలు తల్లి దండ్రులు అనే మాటలకంటె హెచ్చుస్థాయిలోనివి. అవి బాధను, అవసరాన్ని ప్రతిబింబించేవే కాకుండా, భగవంతుని గుర్తుకు తెచ్చుకొనో, తెచ్చుకొనకనో పలికే ఆర్తనాదాలు.

౧౯

లలితకళలు

మనుష్యునకు ఆలోచనాశక్తి, మంచి చెడులు తెలుసుకొనే శక్తి, భగవత్ జ్ఞానం సహజంగా వుంటవని, చదువుకొనిన

జ్ఞాన, విజ్ఞానవంతు డౌతాడని మనం తలుస్తాం. ఆలోచనాశక్తి జంతుజాలం (కోతి, నక్క, కుక్క, గుర్రం ఎలుకవంటివి) లోనూ ఉంటుంది. నేర్పితే కోతి, కుక్క, చిలుక, ఎలుక, చివరకు గుర్రం, సింహం, ఏనుగు వంటివి కూడా నేర్చుకొంటవి (సర్కస్‌లో చూస్తాం). అయితే వానికి భగవత్ జ్ఞానం, మంచి చెడులు తెలుసుకొనే శక్తి లేదనే చెప్పాలి. కాబట్టి జీవరాసులలో మానవుని విశేషం మంచి చెడులు తెలుసుకొనే శక్తి, భగవంతుడున్నాడనే ఎరుక. ఆయనను పూజించటం, ఆయనయందు భయభక్తులు నెరపటం. ఈ రెండున్నా, సంస్కారం అనే సంస్కృతి లేకపోతే సగం మృగంగాను, సగం మనిషిగాను ఉంటాడు. కాబట్టి సంస్కృతి అవసరం. సంస్కృతి లేక సంస్కారంవల్ల మానవునకు నేత్ర శ్రవణానందం, హృదయస్పందన వికాసం, బుద్ధి విలసితం, జీవిత సౌఖ్యం కలుగుతవి. వీనికి మూలం లలితకళలు, అనగా సంగీతం, నృత్యం, నాట్యం, చిత్రలేఖనం, శిల్పం. చప్పున హృదయాన్ని రంజింపజేసి హాయిని సమకూర్చేది సంగీతం. మనస్సును, శరీరాన్ని ఉప్పొంగించేది నృత్యం. మనోల్లాసాన్ని కలిగించేది నాట్యం. చిత్రలేఖనం, శిల్పం నేత్రానందం, భావ ప్రపేరేపణ చేస్తవి. మానవునకు హాయిని కల్పించే సంగీతం ప్రథమ స్థానాన్నాక్రమించుకుంటుంది. మనస్సునుప్పొంగించి, ఆనంద కరమైన కోర్కెలను రేకెత్తించే నృత్యం రెండవ స్థానానికి వస్తుంది. నాట్యం, చిత్రలేఖనం, శిల్పం వరుసక్రమంగా మూడు, నాలుగు స్థానాలలో ఉంటవి.

దేవుడు

దేవుడు స్వయంభువు అంటాం. ఆ దేవుణ్ణే ఆదిపరాశక్తి అని, ఆమె త్రిమూర్తులగు విష్ణు, మహేశ్వర, బ్రహ్మలకు తల్లి అని చెప్పుతాం. దేవుడు తనంతటతానను పుట్టాడు. సరే, ఎక్కడ

ఏ విధంగా పుట్టాడు అన్న ప్రశ్న వస్తుంది. ఆదిశక్తి బ్రహ్మను కూడా కన్నదంటారుకదా! మరి ఆయన విష్ణువు నాభినుండి వెడలిన పద్మాన్నుండి జన్మించినా డంటారే, దాని కెట్లు సమాధానం చెప్పుతాం? ఈ ఆదిపరాశక్తి స్వయంభువు కావచ్చును. అయితే, ఆమె బిడ్డలను కన్నదికదా, ఎక్కడ కన్నది? మరి అధిష్ఠాన దేవతలగు విష్ణువు విష్ణులోకంలో వుంటూడని, మహేశ్వరుడు కైలాసంలో వుంటూడని, బ్రహ్మ బ్రహ్మ, లేక సత్య, లోకంలో వుంటూడని నమ్ముతాంకదా. మరి దేవుడు లేక భగవంతుడు సర్వవ్యాప్తి, విశ్వేశ్వరు డంటూ రెందుకు? అట్లయితే సృష్టి, పాలన, లయం, ప్రవృత్తిగల మూడంశాలు మూర్తీభవించిన ఒక దేవుడో లేక ఆదిశక్తో, స్వయంభువేమోగాని, విశ్వవ్యాప్తి కలవాడు లేక కలది కాదన్నమాట. విశ్వవ్యాప్తుడు, నామరూపాలు లేనివాడు. ఆది మధ్యాంత రహితుడు. అవాఙ్మానస గోచరుడు. కడపటి నిజం (అల్టిమేట్ రియాలిటి). ఇంకొక మహామహత్తు ఉండాలన్నమాట. ఈ మహామహత్తే నిజమైన స్వయంభువు. అందుకనే భక్తపోతన్నగారు "ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీనమై ఎవ్వనియందు డిందు, పరమేశ్వరు డెవ్వడు, మూలకారణం బెవ్వ డనాదిమధ్యలయు డెవ్వడు" అని స్తోత్రం చేశాడు. త్రిపురనేని కవిరాజుగారు "ఏది చరాచరంబయిన సృష్టికి సర్వము మూలకారణం, బేది మునీశ్వర ప్రతతి కేని యగోచరమైన దొడ్డవెల్లు, ఏది లయాంతమండైన నించుక వైకృత మొందకుండు ఆ నిత్య, సత్య, పరతత్వ, మహత్యము" అని కీర్తించారు.

అయితే ఈమధ్య ఒకరు ఒక బ్రహ్మాండమైన అగ్నిగోళం బ్రద్దలై విశ్వం జనించిందని, ఇది ఇంకనూ విస్తరించుతూ పోతున్నదని అభిప్రాయం వెలిబుచ్చారు. విశ్వంలో అనంతకోటి బ్రహ్మాండా లున్నా యంటున్నారు. ఎన్ని వేల కాంతివర్షాల దూరంలోనో కొన్ని గ్రహా లున్నవని ఆధునికశాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. అయితే అగ్నిగోళంనుండి ఉద్భవించిన విశ్వంలో, దాని చెక్కలు ముక్కలీ అనంతకోటి బ్రహ్మాండా లయ్యాయా? ఇదంతా గందర గోళాన్నే కలిగిస్తున్నది.

పోతే, అధిష్ఠానదేవుళ్లైన త్రిమూర్తుల నుంచి శ్రీరామ, శ్రీకృష్ణులను ఏం చేద్దాం? వారు మనకు ప్రత్యక్ష దేవుళ్లుకదా! వారినేకదా మనం పూజించేది? అయితే శ్రీరాముడు, శ్రీకృష్ణుడు విష్ణువు అవతారా లంటారు. త్రిమూర్తులలో రెండవ వాడు మహేశ్వరుణ్ణి వివిధనామాలతో శివునిగానే పూజిస్తున్నాం. కుమారస్వామి, గణపతి రూపాల్లోకూడా పూజిస్తున్నాం. అయితే వీరిద్దరిని శంకరుని పుత్రులంటున్నాం. ఇక వీరభద్రుని కూడా పూజిస్తున్నాం. ఈయననుకూడా మహేశ్వరుని పుత్రుడే అంటున్నాం. కాని, ఒకవిధంగా చూస్తే ప్రశాంతతతో యోగధ్యానంలో వున్న శంకరుడు తన అర్ధాంగి సతీదేవి దక్షుని యాగగుండంలో పడి ఆత్మార్పణం చేసుకొన్నదన్న వార్త విని, మహోగ్రుడై వీరభద్రుడుగా పరిణమించాడని తోస్తున్నది. కాబట్టి, రుద్రుడే వీరభద్రుడు అనుకోవాలి. మూడోవాడగు బ్రహ్మ సృష్టిచేస్తూ ఉంటాడట. ఈయన కెక్కడోదప్ప పూజా పునస్కారాలు లేవు. పరిపాలించే విష్ణువు కుండటం సహజమే. నశింపజేసే రుద్రుడగు మహేశ్వరునకు ఆరాధన వున్నప్పుడు, పుట్టించే బ్రహ్మ కెందుకు లేదో అర్థంకావటంలేదు. అల్లిబిల్లిగా, మంచితోబాటు చెడును కూడా పుట్టిస్తున్నాడనేమో!

విష్ణ్వావతారంగా ఎంచబడే రాముడు చాలా అవకతవక పనులు చేశాడు. వరించి వచ్చిన శూర్పణఖ ముక్కు చెవులు కోయించాడు. ఆమె పులస్త్య బ్రహ్మ మనుమరాలు. దుష్టురాలు కాదు. దొంగచాటున భీరువువలె వాలిని హత్యచేశాడు. తపస్సు చేసుకొనుచున్న శంబుకుని అకారణంగా వధించాడు. తన సహచారిణి, తననే నమ్ముకొని అడవులలోని నికృష్టజీవనం గడపి, పగవాని చెరసాలలో బాధపడి, అగ్నిపరీక్షవలన తన పరిశుద్ధతను ప్రదర్శించిన నిండుచూలాలు సీతమ్మను నిర్దాక్షిణ్యంగా అడవిలో నిడిపించాడు. తన తోడుగా వనవాసక్లేశా న్ననుభవించి, తనకు నానాసపర్యలు చేసిన లక్ష్మణుని తన రాజ్యంనుండి వెడల గొట్టాడు. ఆత్మహత్య పరమపాతకమని పెద్దలు చెప్పినా, సరయూ నదిలో పడి తనను తాను చంపుకొన్నాడు. ఈ రకం వ్యక్తి, దేవుడెట్లయ్యాడో అర్థంకావటంలేదు. ఇక శ్రీకృష్ణుని విషయంలో,

ఈయన కూడా విష్ణ్వావతారమేకదా! ఈయన రేపల్లెలో దొంగతనంగా వెన్నముద్దలు కాజేశాడు. స్నానంచేస్తున్న స్త్రీల వస్త్రాలను హరించాడు. మగనాలులతో రమించేవాడు. కన్య యైన గొల్లపిల్ల రాధ కన్యాత్వం హరించి విడిచిపెట్టి వెళ్లిపోయాడు. తన కార్యసాధనకై మాయమాటలు చెప్పి కురూపి విధవతో, దాసీతో సంభోగించాడు. జరాసంధుని మోసంతో చంపించాడు. మిషతో శిశుపాలుని వధించాడు. ధర్మరాజుతో అబద్ధ మాడించి, గురుని మరణానికి కారకుడయ్యాడు. క్రుంగిన రథాన్ని లేవనెత్తుకొను చున్న కర్ణుని అన్యాయంగా చంపించాడు. దుర్యోధనతో దుర్యో ధనుని తొడలు విరుగగొట్టించాడు. కల్లబొల్లి మాటలతో రాయబారం నడిపి, అన్నదమ్ముల యుద్ధానికి కారకుడైనాడు. ఇట్టి అవినీతిపరుణ్ణి, మోసగాణ్ణి భగవదవతారంగా కొల్చుచున్నా రెందుకు?

కాని, శ్రీరాముణ్ణి భగవంతునిగా కబీరు, తులసీదాసు, త్యాగరాజు మొదలైనవారు కీర్తించారు. శ్రీకృష్ణుని మీరా బాయి, చైతన్యుడు, ఇతరులు భజించారు. వీ రందరు మహానుభావులు, గొప్ప భక్తులు. వీ రెందులకు ఈ ఇద్దరిని దేవుని అవతారాలని కీర్తించారు? ఈ ఇద్దరు మహాపురుషులలో భగవంతుని వారు చూడబట్టె కదా! పైగా అనేకమంది ఆళ్వారులు, నైనంవారు లుండినారు కదా వీ రందరి నెట్లు నిరసించగలం?

వాల్మీకి రఘురాముని ఆదర్శపురుషునిగా, ధర్మ స్వరూపునిగా, ఆర్తత్రాణపరాయణునిగా, దుష్టసంహారకునిగా తీర్చి దిద్దాడు. పితృవాక్యపరిపాలకుడు, భ్రాతృవత్సలుడు, పతితపావనుడు (అహల్య శాప విమోచనం), దుష్టసంహారుడు, ధర్మస్థాపకుడు, ప్రజారంజకుడు—ఈవిధంగా రాముడు మనకు ఆదర్శపురుషుడైనాడు. సీతమ్మ సహచారిణిగా, పతివ్రతగా, సహనశీలగా మనకు ప్రత్యక్ష మౌచున్నది. ఈ మహోత్తర గుణాలనుబట్టి ఈ భార్యా భర్తలకు దేవత్వం మన మాపాదించాము. ఆలాగే శ్రీకృష్ణుడు గోవర్ధనగిరి నెత్తి గోవులను కాపాడి, కాళింగీల మర్దనం వలన గోపాలకులను, గోవులను

విషసర్పాలనుండి రక్షించి, మద్దిచెట్లను విరుగగొట్టి, గంధర్వులకు శాప విమోచనం చేసి, ద్రౌపది మానసంరక్షణ చేసి ఆమె స్త్రీత్వం కాపాడి, దుష్టులగు కౌరవులను నాశనం చేయించి భగవదవతారంగా ఎంచబడుచున్నాడు.

విష్ణువు మహత్తు, శివుని శక్తి, శ్రీరాముని అస్త్ర శస్త్ర నైపుణ్యం, శ్రీకృష్ణుని మేధాసంపత్తి, రాజకీయచాతుర్యం, చక్రప్రయోగం ప్రజలను మభ్యపరచినవా? అసలు ప్రజలకు భగవంతుడనే పేరుతో ఒక పట్టుగొమ్మ వుండాలా, లేదా? తమ ఆపదకాలంలో ధైర్యం తెచ్చుకొనటానికి, తమ పనుల్లో జయం పొందటానికి, తమ సిరిసంపదల్లో అలంకరించటానికి, తమ హుషారులో ఊరేగించటానికి ఎవరైనా ఒక రుండవలెనా, లేదా? వానిని భగవంతుడనటంలో తప్పేమున్నది? అందువల్ల ఉన్నాడో లేడో. ఎవరినో ఒకరిని ఉన్నాడని అనుకోవద్దా?

కాబట్టి, భక్తులు లేనిదే భగవంతుడు లేడంటారు. అవగా భక్తుడు భగవంతుని సృజించుకొని, పూజించుకొని కీర్తించు కుంటాడు. ఈవిధంగా ఆత్మతృప్తి కలగటానికి, మనోధైర్యం పొందటానికి, మొరబెట్టుకొనటానికి, కన్నీళ్లుపెట్టుకొనటానికి, భక్తి చే చిందులుద్రొక్కి ఆనందించటానికి అవకాశం కలుగుతుంది. శూన్యంలో ఏ ముంటుంది? ఏదైనా వుంటేనే ఏ పని చేయటానికిని.

ఐతే భగవంతుడూహాజనితమే. కాని, ఇందరు దేవుళ్లు ఎందుకనవచ్చును. ఎవరి చిత్తవృత్తినిబట్టి వారు భగవంతుని రూపురేఖలను తీర్చిదిద్దుకుంటారు. గుణాలను, మహత్తును ఆపాదించుతారు. లేకపోతే శంకర భగవత్పాదులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు భిన్న భిన్న విధాలుగా భగవంతునికి నామ, రూప, గుణ, మహత్తుల నిచ్చి, స్తోత్రం చేయటం, పూజించటం చేయరు. తమ దేవుళ్లపేర భిన్న భిన్న మత స్వరూపాలను ఏర్పరచరు.

భగవంతుడు, అనగా పరమాత్మ, మనలోనే ఉన్నదంటారు. ఆ పరమాత్మ అనే దేవుణ్ణి మన మెట్లూహిస్తే అట్లు మనకు తోస్తాడు. బాహ్యదృష్టికి కాకపోయినా, అంతర్దృష్టికైనా

ప్రత్యక్ష మౌతాడు. అయితే, బాహ్యదృష్టికికూడా కనబడినా డనే గాథలు లేక కథ లున్నాయి. ఒకప్పు డొక గొప్ప చెరువుకు తుపాను వర్షాలవల్ల గండిపడే ప్రమాదం కల్గిందట. గండిపడితే చుట్టుప్రక్క- గ్రామాలన్నీ మునిగిపోతాయట. ప్రజలు భయాం దోళ్ళులై రామభజనలు సాగించారట. అధికారులకు విన్నపాలు పోగా, ఒక యూరపియన్ ఇంజనీయరు బైలుదేరి వచ్చి సాయంత్రమయ్యేటప్పటికి అక్కడకు చేరుకొన్నాడట. సాయంత్రం సంధ్య దాపురించబోవుచున్నదట. ఆ ఇంజనీయరు సరాసరి ఒంటరిగా చెరువును సమీపించాడట. చెరువు ఇవతల గట్టుకు చేరగానే, గండి పడవచ్చుననుకొనిన అవతలి గట్టున ఇద్దరు తేజోమూర్తులు ధనుర్బాణాలుధరించి గండిపడకుండా కాపాడు చున్న దృశ్యం అతనికి పొడగట్టినదట. ఇక గండి పడలేదు. గ్రామాలప్రజల రామభజనలు సఫలమైనవి. పూర్వజన్మ సుకృతంవల్ల ఆ పాశ్చాత్యునికి లక్ష్మణసమేతుడైన శ్రీరామ దర్శనం లభించింది. షిరిడీ సాయిబాబా భక్తు డొకడు శ్రీ బాబా దర్శనార్థం షిరిడీకి బైలుదేరుతూ తనకు సన్నిహితుడైన మిత్రుని"నీవుకూడా శ్రీబాబా దర్శనం చేసుకొనటానికి ర"మ్మన్నా డట. ఆ స్నేహితుడు శ్రీరామభక్తుడు. "చ, నేను రాను. నాకు శ్రీరాముడే దైవం. ఈ బాబా, గీబా నా కవసరంలే"దన్నాడట. బాబా భక్తుడు, "నీవు నాకు తోడు రావలసింది. నీవు బాబాను దర్శించవలసిన అవసరంకూడా లేదు. మనం షిరిడీ సమీపించిన తర్వాత నీ వెక్కడనైనా కాలంగడపవచ్చును. నేను బాబా దర్శనం చేసుకున్నతర్వాత, మనం తిరిగి కలసి వెళ్లిపోదాం" అని మిత్రుని సమ్మతింపజేశాడట. సరే అని ఇద్దరూ షిరిడీ చేరు కున్నారు. బాబా బైట ఒక రాయిమీద కూర్చుని వున్నాడు. భక్తులు ఆయనచుట్టూ నేలమీద కూర్చుని ఉండినారు. అల్లంత దూరంలో వుండగానే బాబాభక్త మిత్రునకు, శ్రీ సాయిబాబా స్వరూపం గాక, శ్రీరామచంద్రుని రూపం దృగ్గోచరమైనదట. అంతటితో మిత్రునకు భక్త్యావేశం పొంగుకువచ్చి, "మహాప్రభూ, శ్రీరామచంద్రా" అంటూ పరుగెత్తి వెళ్లి, బాబాపాదాలమీద

—

వాలాడట. అప్పుడు తెలిసికొన్నాడు, భగవంతుడు ఏదో ఒక నిలకడైన రూపంకలవాడు కాడని, భక్తుడు ఏ రూపంలో భగవంతుని భజిస్తాడో, ఆ రూపంలో భగవంతుడు దర్శనమిస్తాడని.

నామరూపాలు లేని సర్వేశ్వరుడు భక్తుల కోర్కెలను వారు కోరుకున్న అనగా సృష్టించుకున్న రూపంలో తీరుస్తాడు. ఆనందాన్ని, తృప్తిని, రక్తిని ప్రసాదిస్తాడు. దేవుడు ఒక్కడే అయినా అన్ని మతాలవారికి ఏకైక భగవంతుడే అయినా వివిధ మతాలవారికి భిన్నభిన్న పేర్లతో, ఆదర్శాలతో, మహత్తులతో స్ఫురిస్తాడు.

—ం

కులం, వర్గం ఒక్కటేనా?

ఈమధ్య విద్యావతొకరు వేదకాలంలోకూడా కులాలుండేవి, ఈమధ్య బ్రాహ్మణులు తెచ్చిపెట్టినవికావు, పాశ్చాత్య దేశాల్లోకూడా కులవివక్షత వున్నదని తమ సిద్ధాంతాన్ని వెలిబుచ్చారు. వేదాలు బహిర్గతంచేసినవారు ఆర్యులు. ఆర్యుల్లో కుల వివక్షత లేదు. వృత్తులనుబట్టి మూడు వర్గాలుగా ఏర్పడ్డారు. మతం, శాస్త్రం, కర్మకాండ బ్రాహ్మణులనే ఒక వర్గంవారి బాధ్యత. యుద్ధం, రాజ్యపాలన, దాని సంరక్షణ క్షత్రియులనే మరొకవర్గం వారు భరించేవారు. వ్యవసాయం, వ్యాపారం వైశ్యులనే ఇంకొక వర్గంవారు నడిపేవారు. ఈ మూడు వర్గాలు అప్పుడప్పుడు వివాహ రీత్యా మిశ్రమవుతుండేవి. ముఖ్యంగా బ్రాహ్మణులు, క్షత్రియులు వివాహ సంబంధాలు ఎక్కువగానే పెట్టుకొనేవారు.

విద్యావతి వేదాల్లో కులప్రస్తావన వుందంటారు. ఈ ప్రస్తావన ప్రక్షిప్తమనే అనుకోవాలి. కాకపోయినా, వర్ణం అన్నారు గాని, కులం అనలేదు. వర్ణానికి కులం అని ఇప్పుడు మనం అర్థంచెప్పుకున్నా, వర్ణం అంటే శరీరం రంగుకదా! ఆర్యులు పూర్వమొక జాతిగా శ్వేతవర్ణులట. మిశ్రమంచేత పీత, గౌర

వర్ణ ములద్భవించారు. బ్రాహ్మణులు శ్వేతులుగాను, క్షత్రియులు పీతవర్ణులుగాను, వైశ్యులు గౌరవర్ణులుగాను ఎంచబడ్డారు. కల్తీ లేని వర్ణప్రభావంవల్లనో, లేక మతాచార్యులుగా, గురువులుగా కర్మిష్ఠులుగానో బ్రాహ్మణుల కగ్రస్థానం లభించింది. వారి తర్వాత రాజ్యపాలకులు క్షత్రియులు. వారి తర్వాత వ్యవసాయం, వ్యాపారంచేసి ప్రజలకు జీవితావసరాల నందించిన వైశ్యులు హెచ్చు తగ్గు అంతస్తులు కలవారుగా ఆర్యసంఘంలో ఏర్పడ్డారు. యుద్ధంలో తాము జయించిన ఆర్యేతరులను బానిసలుగా చేసుకొని వారిచేత వెట్టిచాకిరి చేయించుకొన్నారు. ఈ అనార్యులు కృష్ణ వర్ణులట. వీరిని ఆర్యసంఘానికి వెలిగా వుంచినారు. ఆర్య లోక వర్ణం కాగా, ఈ అనార్య లింకొక వర్ణమైనారు. కాబట్టి ప్రాచీన కాలంలో, వేదకాలంలో భరతఖండంలో రెండు వర్ణా లుండేవి. కులాలు రూపొందలేదు.

అయితే యుద్ధనిపుణులు, నాగరికత అని చెప్పబడే విశేషం కలిగినవారు నిజానికి పట్టణాలను, నగరాలను నిర్మించుకొని సంఘ కట్టుబాట్లకు లోనై రాజ్యపాలనంచేసుకొనే అనార్యులు (వీరినే ద్రావిడులంటున్నాం) గాక ఆటవికులు, కొండజాతులవారుండినారు కదా ! వాళ్లను ఏదో రూపంలో లోబరుచుకొని, వాళ్లచేతకూడా బానిససేవను చేయించుకొనేవారు. మన మిప్పు డెరిగియున్న పంచములు, అంటరానివాళ్లు ఆకాలంలో వున్నట్లులేరు. ఆర్య సంఘంనుండి బహిష్కరించబడినవారుండేవారు. వాళ్లను చండాలు రనేవారు. ఈ చండాలురు హీనజాతు లనబడేవారినుండి వచ్చిన వారుకాదు. బ్రహ్మర్షియైన విశ్వ (విశ్వా) మిత్రుని కొడుకులుకూడా తండ్రి శాపంవలన చండాలురైనారట. వీళ్లు బహిష్కరింపబడ్డవాళ్లు కాబట్టి వేరుగా ఊరిబైట నివసించేవారు. వాళ్లకు, ఆర్యసంఘీయులకు పొత్తు ఉండేది కాదట.

ఇక శ్రీకృష్ణభగవానుడు చెప్పిన దనుకొనే భగవద్గీతలో "చాతుర్వర్ణం మయా సృష్టం" అన్నదానిని, మనలో నాలుగు కులా లుండినవని సాక్ష్యం చూపిస్తారు. దీనికి కారణం లేకపోలేదు. బ్రాహ్మణులు భగవంతుని శిరస్సునుండి, క్షత్రియులు అతని

బాహువులనుండి, వైశ్యులు తొడలనుండి, శూద్రులు పాదముల నుండి పుట్టుకువచ్చారని భగవద్గీతలోనే వున్నది. అయితే భగవంతునికి, త్రిపురనేని కవిరాజుగారు చమత్కరించినట్లు, ఒడలంతా కాకపోయినా పైచెప్పిన నాలుగుచోట్లలో నాలుగు యోనులుండేవా అని సందేహం కలగటంలో ఆశ్చర్యంలేదు. మానవులందరు భగవంతుని బిడ్డలంటున్నాం. ఎవరెవరిని, ఎక్కడెక్కడనుండి ఆ భగవంతుడు కన్నాడో భగవద్గీతతప్ప మనకాధారమున్నట్లు కనబడదు.

ఇతర కులాల నటుంచి, శూద్రకులమనే దానిని తీసుకొనండి. ప్రిళ్లలో సచ్ఛూద్రులు, శూద్రులు వగైరా వున్నారు. ఈ రెండు తరగతులలో ఇప్పుడనేక ఉపకులాలున్నవి. ఈ కులాల్లో కొన్ని ముఖ్యంగా సచ్ఛూద్రులనే అన్నికులాలూ ఒకప్పుడైనా భూపతులు, నరపతులై రాజ్యాలుచేసి, బ్రాహ్మణ కవి పండితులను పోషించినవారే. అన్ని శూద్రకులాలకు పురోహితులుగా కర్మకాండలు చేయించి దానధర్మాలు పొందేవారు బ్రాహ్మణులే.

కులాలే పోవాలనే ఈరోజుల్లో, వేదకాలంలో కూడా కులాలుండేవని చెప్పటం అవివేకమే అవుతుంది.

పైగా పాశ్చాత్యదేశాల్లో కూడా కులభేదాలున్నవని చెప్పటం ఆశ్చర్యకరమైన విషయం. అక్కడ కులాలు లేవు; వర్గాలున్నవి. ప్రభువులు, భూస్వాములు, వర్తకులు, వణిజులు, కార్మికులనే వర్గభేదాలున్నవి. కులానికి, వర్గానికి ముఖ్యభేదం, కులంలో పుట్టినవాడు ఆ కులంవాడుగానే వుండాలి. ప్రస్తుత జీవిత మార్పులవల్ల బ్రాహ్మణుడు వ్యాపారంచేయటం, లేక వ్యవసాయం చేయటం కలదు. ఆలాగే శూద్ర కులంలోనివారు ప్రభుత్వోద్యోగాలు చేయటం, పరిశ్రమలు స్థాపించటం, విజ్ఞానం, వైద్యుష్యం, సాంస్కృతిక కలాపాలు మొదలైనవానిలో పాల్గొనటం జరుగుచున్నది. అయినా, అసలు కులానికి పునాది కులవృత్తి ననుసరించి, కుల హెచ్చు తగ్గు స్థాయిలో బ్రతకటం. వర్గంలో క్రింది స్థాయివారు, పై స్థాయికి వ్యక్తిగత సామర్థ్యాన్ని బట్టి అత్యున్నతస్థానాన్ని పొందవచ్చును. చెప్పులు కుట్టుకొనే

వాని మనుమడు లాయడ్ జార్జి బ్రిటిషుసామ్రాజ్యానికి అధినేతయ్యాడు. ఇది సిసలైన భేదం.

గతిలేక వ్యవసాయం

ఒకప్పుడు తిండిగింజలు పండించే వ్యవసాయం భుక్తిని, తృప్తిని ఇచ్చేది. ప్రభువులనుండి, పరిపాలకులనుండి మన్ననలను పొందేది. "శరీరమాద్యం ఖలు ధర్మసాధనం" కదా! అందువల్ల శరీరాన్ని నిల్పుకొనటాని కవసరమైన ఆహారపదార్థాలు ముఖ్యం. కాబట్టి భూదేవిని, ఆమె నుండి ఉత్పత్తిచేయించే కృషీవలుని పెద్దలు, పిన్నలు ఆదరించేవారు. నరపతికంటె భూపతే ఎక్కువ గౌరవనీయుడుగా వుండేవాడు. రాజులు పండితులకు, కవులకు పారితోషికంగా ఇచ్చేది భూమినేకదా! పరిశ్రమలు పెరిగినా, వానిలోకొన్ని ప్రత్యక్షంగా ఆహారవస్తువుల ఉత్పత్తికి కాకపోయినా భోజనపదార్థాల విలువ తగ్గలేదు. పట్టణాలు విజృంభించి, నాగరికత బలిసి, మేడలు, మిద్దెలు వెలసి, రకరకాల దేహధారణాలు, జీవితానుకూలాలు, సౌఖ్యప్రదజీవనాలు వృద్ధిచెందినా ప్రాణాన్ని నిలబెట్టే తిండిగింజలు, వానికి తోడైన సరుకులు లభించేది వ్యవసాయంవల్లనేకదా! అందువల్లనే మహాశయుడు లాల్ బహదూర్ శాస్త్రి "జైకిసాన్" అని జేజేలు కొట్టాడు.

కాని ఇప్పుడు రైతు బ్రతుకు దురవస్థలో పడింది. కొంత ప్రకృతి లోపం, కొంత ప్రభుత్వ లోపం, కొంత రైతు లోపం, కొంత వ్యవసాయకూలీల లోపం. ఇవన్నీ కలిసి వ్యవసాయకుణ్ణి క్రుంగ దీస్తున్నాయి. అ వేమిటో నా మనస్సులో వున్నది దాచకుండా బైటబెడ్తాను.

వర్షాలు సకాలంలో ఒకప్పుడు పడవు. ఒకప్పుడు అధిక వర్షాలు కురుస్తవి. మ రొకప్పుడు వర్షా లసలే వుండవు. ఈ సంవత్సరం (1975) ఈ ప్రాంతంలో జూన్‌లో ఆరంభించిన తొలకరి

వాన నవంబరు మొదటి వారం వరకు కొనసాగింది. నైరుతి వర్షాలు మామూలుగా సెప్టెంబరు మొదటి రెండు వారాలతో అంతంకావాలి. కాని, ఈ సంవత్సరం మద్రాసు ప్రాంతాన అక్టోబరులో మొదలిడే ఈశాన్య వర్షాలు నైరుతి వర్షాలతో విలీనమందినవా అన్నట్లు ఈ రెండూ కలసి, నవంబరు ఇంచుమించు మధ్యవరకు కొనసాగాయి. వీనివల్ల మెట్టపంటలు నాశన మవటమే గాకుండా, వరిపంట వంటి మాగాణిపైరులకు దోమకాటువంటి తెగుళ్లు సంభవించి కొన్ని చేలు పూర్తిగా నాశనమయ్యాయి. మందులు చల్లినా నిరంతర వర్షాలవల్లనై తేనేమి, తూర్పు, ఈశాన్యగాలుల విషప్రభావం చేతనై తేనేమి మందుల ఫలితం కీసపాలే. చీడలులేని పొలాలలో కూడా వరి పడిపోయి, ఊర కెక్కువయి, పంట తగ్గిపోయింది.

ప్రభుత్వంపరంగా కొన్నిచోట్ల కొంతమం దేవో సలహా లిచ్చినా, డెవలప్‌మెంటు బ్లాకుల విస్తరణాధికారులు వచ్చి ఆదుకోవటం నాదృష్టిలోకి రాలేదు. మురుగుకాల్వల పూడికలు తీయించకపోవటంవల్ల కొన్నిచోట్ల ముంపులు ప్రాప్తించాయి. వర్షాలు పడుతున్నాయని, నీళ్లు చేలలో నిల్వ ఉండకుండా బైటికి తెగ్గొట్టివేశారు రైతులు. వర్షాలు చప్పున ఆగిపోవటంతో, రెండో పైరు అనగా జనుము, మినుము, పెసర, కొన్నిచోట్ల ఉలవ చల్లటానికి పదును తగ్గిపోయింది. మామూలుగా కాల్వల ద్వారా వచ్చే నీరు రాకపోవటంచేత తడి ఉన్నదనో, కాల్వనీరు వస్తుందనో ఆశపడి, ధైర్యంచేసి విత్తనాలు చల్లితే అవి వట్టిపోయాయి. అప్పుడే మించుకుపోయింది లేదు, కాలవ నీటికోసం ఇంకా మూడు నాలుగు రోజులు ఆగుదాం అనుకొంటే, అధికవర్షాలవల్ల కాబోలు మామూలుకంటె వారంరోజులు ముందుగానే చేలు కోతకు సిద్ధమైనాయి. ఇంకా ఆగితే కంకిరెల్లు రాలిపోతుందని రైతు భయపడటం సహజం. సకాలంలో కాల్వనీరు అందక, రెండోపైరు విత్తనాలు చల్లటానికి వీలులేక, వరిపంట కుమిలిపోతున్నదే అనే దిగులుచేత రైతు సతమత మౌతున్నాడు. తగుసమయంలో నీరు అందించక పోవటం నీటిసరఫరా ఉద్యోగుల అశ్రద్ధగాని, మరొకటిగాని అయి వుండాలి.

వాతావరణ ప్రభావంవల్ల చేలన్నీ ఒకేసారి కోతకు వచ్చాయి. రైతు గాబరాపడి కోతకూలీలకు ప్రయత్నించాడు. ఊళ్లో కూలీలు చాలరు. మామూలుగా 'మేము వస్తాం, మేము వస్తాం' అని పోటీపడే మెట్టప్రాంతాల కూలీలు రాలేదు. మెట్ట పైరులు పోయినా, మెట్టప్రాంతాలలో వర్షాలవల్ల అక్కడక్కడ చెరువులు నిండి నరిపైరు పెట్టటం, కోతకు రానటం జరిగిందట. పైగా మామూలుగా వాళ్లు వచ్చేకాలానికంటె ముందు కావాలని రైతులు తహతహలాడి వాళ్లకోసం బెజవాడ మొదలైన చోట్లకు ఎగబడ్డారు. బైటనుండి వచ్చే కొత్త కూలీలకు బెజవాడ కూడలి. తెలంగాణా ఖమ్మం జిల్లా, కృష్ణా జిల్లా, గుంటూరు జిల్లా మెట్టప్రాంతాలనుండి వచ్చే కూలీలు అక్కడ గుమిగూడుతారు. ఇదివరకు వచ్చియుండిన కూలీలకు రైతులు ముందుగానే ప్రాసో, లేక ముఠానాయకులు 15 రోజులు ముందుగా వచ్చే ఏర్పాటుచేసుకొన్నవాళ్ళ గాక, ఇతర కూలీలను బెజవాడకు వెళ్లి బేరమాడి కుదుర్చుకొని తెచ్చుకుంటారు. ఈ సంవత్సరం ఎప్పుడు వర్షాలు పోతవో, ఎప్పుడు కోతలు ప్రారంభించాలో తెలియక పెద్దరైతులు ఉత్తరాలు ప్రాయలేదు. ఆ కారణంగానో, వాళ్లకు అంతు తెలియకనో, పైగా ఆ ప్రాంతాలలో ఈ సంవత్సరం చెరువులు నిండి వరిపైరు పెట్టటంచేతనో ముఠా నాయకులు రానే రాలేదు. అందువల్ల, పెద్దరైతులుకూడా బెజవాడకు పరుగెత్తవలసి వచ్చింది. ముందు వెళ్లినవాళ్లు బెజవాడలో దిగిన కొద్దిమందిని తీసుకొనిపోగా, రైతులు ఖమ్మం, మధిర, సత్తెనపల్లి, నర్సారావుపేట, గుంటూరులకు పరుగెత్తవలసి వచ్చింది. కనబడిన కూలీలకు రైతులు పోటీపడి వేలంపాట పాడినట్లు ధరలు పెంచి నిరుడు జోడా (1 పురుషుడు 1 స్త్రీ) కు 7 రూపాయ లివ్వగా ఇప్పుడు 12 రూపాయలు ఇస్తామని దొరికిన వాళ్లను తీసుకొనివెళ్లారు. అక్కడికీ దొరకని రైతులు 4, 5 రోజులు రైల్వే స్టేషనులలో, బస్సు స్టాండులలో పడిగాపులు కాస్తున్నా రని రెండురోజులక్రితం సమాచారం. కూలీలకొరకు ఎదురు చూస్తున్న పదులకొలది రైతులు, వారిలోవారు సంప్రదించు

కొని మన కి రేటు అయితే గిట్టుబాటు అవుతుందని నిర్ధారించుకొని ఆ రేటుమీద నిలబడి కూలీలను లభ్యపరచుకొంటే రేటు ఇంత విపరీతంగా పెరిగి యుండదు. ఈ సంవత్సరం రసాయన ఎరువుల ధర హెచ్చు. దోమకాటు మొదలైన తెగుళ్లనివారణ మందుల ఖర్చులు పెట్టవలసి వచ్చింది. తెగుళ్లవల్ల పంట కొన్నిచేలలో పూర్తిగా నాశనం అయింది. మొత్తం సగటు రాలుబడి ఎకరానికి 5,6 బస్తాలో అంతకంటె హెచ్చో, తక్కువ. రైతుల వద్ద మిగిలిన ప్రాతధాన్యం ధర బస్తా 1కి 20 రూపాయలైనా ఈ సంవత్సరం తక్కువ. అందువల్ల వ్యవసాయం ఖర్చులకు చేతి కందే డబ్బు తక్కువ. ఈ కారణాలవల్ల నిరుటికంటె రేటు తక్కువగా వుండవలసిన దానికి బదులుగా 60, 70 శాతం హెచ్చు పెట్టటం రైతుకు చాలా నష్టం. ఈ పరిస్థితులను ఆలోచనలోకి తీసుకొనకుండా కక్కుర్తితో ఎగబడి, పోటీపడి, వేలంపాడి కూలీలను తీసుకొని వెళ్లటం రైతు బుద్ధిలోపం అని చెప్పాలి. ఇక బైటనుండి కూలీలను తీసుకొనిరాని రైతుల సంగతి. చిన్న చిన్న ఆసామీలు కాల్వనీరు ఎప్పుడు వస్తుందో విత్తులు పడవేమో అని కొంత, పంట రాలిపోతుందేమో అని కొంత, త్వరగా పూర్తి చేసుకుని ఇతరపనులకో జల్సాలకో తిరుగవచ్చునని కొంత కారణాలవల్ల రేట్లు చాలా పెంచివేశారు. ఎకరం నుండి మూడు ఎకరాలున్నవాళ్లు అదనంఖర్చు రెట్టింపుఅయినా అయ్యేది కొంచెమేకాబట్టి తల కడుక్కుందాం అని రేట్లు, స్త్రీ ఒకరికి 7 రూపాయల వరకు పెంచివేశారు. వీళ్లిచ్చారు, ఇస్తున్నారనే సాకుమీద, మధ్యతరగతిరైతులు కూడా నలిగిపోయారు, పోతున్నారు. రైతుల్లో సంఘీభావం లేకపోవటమేగాకుండా విచక్షణాజ్ఞానం నశించిపోవటంవల్ల విపరీతంగా రేట్లు పెరిగాయి.

ఇక కూలీల విషయం. వీళ్లకు ఎంత హెచ్చుగా ఇస్తామన్నా ఇంకా హెచ్చు కోరుతారు. ఆశ కంతుండవచ్చునేమోగాని, దురాశ కుండదు. బైటి కూలీలు రైతులు ఎగబడటం, పోటీపడటం గమనించి రైలో, బస్సో దిగి మాట్లాడకుండా నిల్చుంటారట. రైతులు అంతిస్తాం, ఇంతిస్తాం అని పోటీలుపడి ఎవరు ఎక్కువ

ఇస్తామంటే వాళ్లపనికి మొదట వెళ్లారట. జనం పల్చబడ్డ తర్వాత అదివరకు పెంచియుండిన రేటు కంటె హెచ్చు అడగటం నేర్చు కొన్నారు. పైగా వసతులు ఎక్కువ కోరుకోవటం మొదలు పెట్టారు. మొదట జోడాకు 8 రూపాయలు లేక 9 రూపాయలు ఉండినది. 12 రూపాయలవరకు రైతులు పెట్టక తప్పలేదు. అది చాలక కొంతమంది కూలీలు 15 రూపాయలు అడుగగా కొందరు రైతులు నిస్పృహతో తిరిగి వచ్చారు. కొందరు చలిలో క్రుంగిపోతూ ఇం కెవరైనా దొరుకుతారేమో అని కాచుకొని యుండినారట. రెండుగోజులు రాత్రులు, మూడో మధ్యాహ్నం వరకు బెజవాడ, సత్తెనపల్లి, గుంటూరులలో కాచుకొనియుండి, గుంటూరు స్టేషను నుండి రైలులోను, బస్సులోను తీసుకొనివచ్చిన ముఠా ఇదివరలో బానలు, కుండలు మాత్రమే సరఫరాచేస్తున్న రైతును (ఇది అందరు రైతులకు వర్తిస్తుంది) "మాకు చట్టెలు వాని మూకుళ్లు కూడా కావా"లని కోరి, పొందారు. ఊళ్లోకూలీలు, ప్రక్కఊరు కూలీలు రెచ్చిపోయారు. మొదట రూ. 3-50 లేక రూ. 4-00 కూలి వుంటే రూ. 7-00 లకు గాని రానని పంతంబట్టి వేరే క్రోవలేనివాళ్ళనుండి స్త్రీ కూలి గుంజుకున్నది. మగ వానికి రూ. 7-50 లు అని చెప్పారు. మామూలుగా గం. 10 లేక 10-15 ని.లకు చేలో దిగవలసి వుండగా, మా యింటి ముందునుండి ప్రక్క వూరువాళ్ళు గం. 10-45 నుండి సుమారు 11 గంటల వరకు చేలముఖమై వెళ్ళారు. 20 నిమిషాలనుండి 40 నిమిషాలకుగాని దూరపొలాలకు చేరరు. 'ఇంత ఆలస్యమేమి'టంటే 'మీ వూరు (మైలు, మైలుబాతిక దూరం) రావద్దా' అన్నారు. రూ. 7 యిచ్చి రైతేంబావుకుంటాడంటే ఒకగడుసుస్త్రీ మరకం బియ్యం రూ. 7 అన్నది. అది అబద్ధం. ఇప్పుడు మరకం బియ్యం రూ. 5-60 లు మాత్రమే. చక్కగా శృంగారించుకొని, తలలో పూలు తురుముకొని బైలు దేరుతారు. ఆ పువ్వు రాలకుండా, ఒళ్ళు అలవకుండా, చేసి చేయనట్లు కోసి సాయంత్రం 4½ గంటలకే చేను విడిచిపెట్టి ఇంటిముఖం మళ్తారు. 45 ని. లనుండి గంటవరకు మధ్యాహ్నభోజనాని కుపయోగించుకుంటారు. అనగా వాళ్ళు

చేసే పని 5 గంటలలోపు. కూలి రూ. 7, రూ. 7-50. ఈవిధంగా కూలీలు దురాశకు లోనై రైతు లొల్లితనాన్ని ఆసరా తీసుకొని, వ్యవసాయం గిట్టుబాటు లేనిదానినిగా చేస్తున్నారు. ఇక వ్యవసాయం కొనసాగించటం, గతి లేకనే.

పల్లెటూరి పితలాటం

పితలాటం అనగా తగాదా పెట్టటం అని మనం సామాన్యంగా అనుకుంటాం. కాని, నిఘంటువు కక్కుర్తి, పిసినితనం అని అర్థం చెప్పుచున్నది. కక్కుర్తిని తీసుకుందాం. నేను "గతిలేక వ్యవసాయం" అన్న వ్యాసంలో/వ్రాసినట్లు, కాలం మించిపోతున్న దేమో అని త్వరగా పనిపూర్తిచేసుకుని, తల కడుగుకున్నట్లు స్వేచ్ఛగా తిరుగవచ్చని కక్కుర్తిపడి, వేలంపాడినట్లు కోతకూలీల రేటును మిక్కిలి హెచ్చుగా పెంచి, తెచ్చుకొన్నారు. ఈ సంవత్సరం, కోతలున్న తిడిగాక, రైతులు వ్యవసాయవిషయంలో మామూలుగా కక్కుర్తి పడటం చూస్తుంటాం. కాలవలనుండి సేద్యపుభూములకు నీరు తెచ్చే పెద్దబోదుల పూడికలను వేసవిలో తీస్తారు. పూడికలను తీస్తుండగా ఆకుమళ్లు పోసుకోవాలని, కాల్వాలనుండి నీరు తీసుకొనివచ్చి త్రవ్వబోవుచున్న, లేక త్రవ్వు చుండిన బోదులను తడిపిన ఉదాహరణలను (ఇన్‌స్టెన్సెస్) నే నెరుగుదును. మామూలుగా కోత అయినతోడనే ఆకుమళ్ళను దున్నుకుంటారు. కాని, ఇప్పుడు రెండోపైరు ఆ కాస్తభూమిలో కూడా దక్కాలని కక్కుర్తిపడి, వేసవిలో బోదెలుత్రవ్వే కాలంలో తడుపుకొని దున్నుకుంటారు. ఈ కక్కుర్తివలన బోదెల పూడికను త్రవ్వి తీసివేయటానికి వీలులేక, ఊడ్పుల సమయంలో, సరిగా చేలల్లోకి, చేల బోదెలలోకి ప్రవహించక ఇబ్బంది ఆ బోది క్రింద సాగుచేసే వారి కందరికి కల్గుతుంది. ఊడ్చటానికి నీరు పెట్టుకొనే విషయంలో చాలా కక్కుర్తి పనులు జరుగుతాయి,

దొంగచాటుగా పైచేలకు నీరుపోకుండా అడ్డువేయటం, క్రిందికి పోకుండా తనచేను తర్వాతబోదిని ఏ రేకో, రాయో కన్పడకుండా నీటిలోపెట్టి మెరక చేయటం, బోదికి దగ్గరగా తన చేనుంటే తన గండివరకు మెరక చేయటం, ఎవరైన రే పుదయం నారు లాగు కొనటానికి ఆకుమడిలో నీరు నిల్వగట్టుకొంటే, దానిని చీకటిపడిన తర్వాత తన ఎండు గడ్డలకు మళ్లించుకోవటం, బోది మలుపు తిరిగివుంటే తనప్రక్క చేనుగట్టు నరికిగాసూటిగా నీరు తనచేనుకి ప్రవహించటానికి ఎదురుగా పెద్ద చీడి తీయటంవంటి కక్కుర్తి పనులు (అందరనికాదు) రైతు చేస్తుంటాడు. మరిన్ని, సరిహద్దు గట్టును తనప్రక్కనరికి రెండోప్రక్క వేయటం, తనప్రక్కగట్టు మీద తొండంగి వంటి వానిని నాటి, రెండోప్రక్క నడుస్తూ, ఆ ప్రక్కను నడచి, దిగబ్రొక్కి, గట్లుపెట్టుకొనే సమయంలో గట్టు తనప్రక్క విరిచిన గడ్డను రెండోప్రక్క పేర్చి, రెండోవాని భూమిని కుంచింపజేయటం దుష్ట బుద్ధిగల రైతు చేస్తాడు. నూర్పుడు కాలంలో, తనచేలగుండా వీలున్నా పశువులను బైటికి తోలు నప్పుడు, ప్రక్కవాని చేలోగుండా తోలటం, అదను చూచుకొని, ధాన్యం తీసుకుని వెళ్లటానికి, తన చేలోగుండా తోలితే రెండో పైరు దెబ్బతింటుందని, ప్రక్కవాని చేలోగుండా బండిని తోలటం కక్కుర్తికి ఉదాహరణలు.

పిసినితనం చాలాగ్రామాల్లో చాలామంది రైతుల్లో ప్రస్ఫుటంగా కనబడుతుంటుంది. పదిమంది కుపయోగపడే బోదుల త్రవ్వకానికి, తమవంతు తబిరీకు కొంతమంది ఎగగొడ్తారు. ఒకతను ఎన్నిసార్లడిగినా, అదుగో ఇదుగో అని కాలంగడిపి, ఒక సారి కనబడినప్పుడు గట్టిగా అడిగితే, "నే నెగగొట్టుతానా, ఎందుకు తొందర పెడ్తావు" అని పోట్లాడాడు. చివరకు ఇవ్వనేలేదు. మొత్తం స్వల్పమే అయినా పిసినాసితనంచేత ఎగగొట్టాడు. ఇదిగో ఇస్తామని పదిసార్లు త్రిప్పించుకొంటే, విసుగుపుట్టి త్రవ్వించినవాడు ఇక అడగటం మానివేస్తాడు. అంతటితో సరి. ఎవరైనా పూనుకొని గ్రామ మంతటికి ఉపయోగపడే పనిచేస్తూ "మూడు వంతుల ఖర్చు నేను పెట్టుకొంటాను, మీరు నాల్గోవంతు నివ్వం"

డంటే, సరే అని తలూపి, ఎగగొట్టినవాళ్లు, "నీ గొప్పకోసం చేశావు. నీవు, నీవాళ్లు పెట్టుకొనండి, మాకు పనిలే" దని ఎగగొట్టినవాళ్లు ఉంటారు. ఈ రెండు రకాల ఎగగొట్టువాళ్లు, చేసినపని లాభంపొందటానికి, అందరికంటె ముందుగానె తయారవుతారు. గ్రామాని కంతటికీ ఉపయోగపడుతుందని చేసినపని కాబట్టి, డబ్బివ్వనివాళ్లను ఆ పనిని ఉపయోగించుకొనవద్దని చెప్పటం వీలు కాదు, ధర్మంకూడా కాదు. డబ్బుకాశపడి పాలలో నీళ్లు కలపటం, రేగడపాలనుపోసి ఇతర పాలను పాడుచేయటం, పాలు కొనుగోలు చేసే పాలకేంద్రానికి తగినన్ని పాలడబ్బాలులేక తెచ్చిన పాల నన్నిటిని ఆ పూట తీసుకొనకపోతే, మిగిలిన పాలను కాచి, మీగడను తీసివేసి, సాయంత్రం పోసే పాలలో కలిపి కేంద్రానికి పోయటం, ఇటువంటి కక్కుర్తి లాభం పనులు చేయటం పరిపాటై పోతున్నది. దానధర్మాలమా టటుంచి, బ్రతిమాలి బామాలి నాలుగైదు రోజుల్లో ఇస్తానని తీసుకొని వెళ్లిన చేబదుళ్ళు ఎగగొట్టిన ప్రబుద్ధులున్నారు. చేయించుకొన్న పనికి ఇవ్వవలసిన డబ్బంతా ఇవ్వనివాళ్ళు, కూలి కివ్వవలసిన గింజలను పిచ్చికుంచాలతో కొలిచిన వాళ్ళు, లోభులున్నారు వైతుల్లో. సాకరిచేస్తూ రావలసిన ధాన్యంకంటె ఎక్కువ పట్టుకొనివెళ్లి, చెప్పకుండా పెట్టకుండా సాకరి మానుకొన్న పాలేళ్ళున్నారు.

పితలాటం అంటే సామాన్యార్థమున తగాదాపెట్టటం అని పైన చెప్పాను. బేరంచేసి కుదుర్చుకొన్న ధర నంతా ఇవ్వక, కొనిన సరుకు బాగాలేదని పోట్లాడేవారున్నారు. ఇవ్వవలసిన డబ్బడిగితే, ఫలానా అప్పుడు, నాకు ఫలానావిధంగా నష్టంచేశారు అనో, నీవది చేయలేదు, ఇదిచేయలేదనో తగాదా పెట్టే వాళ్ళున్నారు.

ఈవిధంగా పల్లెటూరు పితలాటం సాగుతూ వుంటుంది.

Blank Page

శ్రీ లింగం వీరభద్రయ్య చౌదరి

బి. ఎ. (ఆక్జన్) ఐ. ఆర్. ఎన్., బ్యారిస్టర్-ఎట్-లా
రిటైర్డ్ ఇన్‌కమ్‌టాక్స్ అసిస్టెంట్ కమిషనర్

వీరు 1898 జూన్ 25-వ తారీఖున మాతామహస్థాన మగు కృష్ణాజిల్లా, గుడివాడ తాలూకా, అంగలూరు గ్రామమున జన్మించారు. వీరి తండ్రి సమీప గ్రామ మగు బొమ్ములూరు వాస్తవ్యులు లింగం వెంకటరత్నంగారు. తల్లి త్రిపురనేని వెంకటాద్రిగారి కుమార్తె పున్నమ్మగారు. వీరు చిన్ననాట స్వగ్రామమగు బొమ్ములూరులోను, తరువాత బందరు, నోబుల్ హైస్కూల్, కాలేజీల లోను చదివి 1920 ఆగస్టులో ఇంగ్లండుకు ఉన్నత విద్యాభ్యాసంకొరకు వెళ్ళినారు. 1926 జూన్‌లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయమునుండి బి. ఎ. (ఆనర్సు) డిగ్రీని, 1927 జనవరిలో లండన్ లిన్‌కల్న్స్ ఇన్ నుండి బ్యారిస్టర్ పట్టాను పొందినారు. కొలదికాలం 1927-'28 లో మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా నుండి, 1929 ఏప్రిల్‌లో ఇన్‌కమ్‌టాక్స్ డిపార్టుమెంటులో చేరారు. 1953 జూన్ మాసాంతమున ఉద్యోగవిరమణ చేసి, అప్పటినుండి దివితాలూకా, పెడసనగల్లు గ్రామములో స్థిరనివాస మొనర్చుకొని, వ్యవసాయం చూచుకొనుచున్నారు.

వీరికి లలిత కళలయందు, సాహిత్యమునందు అభిమానము. 1961 సెప్టెంబరునుండి ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమి కార్యవర్గ సభ్యులు. 1963 నుండి 1968 వరకు 5 సంవత్సరముల పాటు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమిలో సభ్యులుగా నుండిరి.

వీరి యితర రచనలు — "తాంబూలం - నైవేద్యం", "మారిన కాలం", "Reflections on the West", "స్వవిషయం" - 3 సంపుటాలు, "అభిప్రాయాలు - అనుభవాలు."